ఈనాడు

విజయవాడ 4-2-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 175
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, సింఘాల్
కల్తీ పాపం వీరిదే

వారు మా దృష్టిలో నేరస్థులే

వారికి 2022లోనే కల్తీ నెయ్యి గురించి తెలుసు

తెదేపా ప్రభుత్వం తెచ్చిన కఠిన నిబంధనల్ని ధర్మారెడ్డి నీరుగార్చారు

దీని వెనుక నేరపూరిత కుట్ర

- బాధ్యుల అభిప్రాయం తెలుసుకునేందుకు ప్రత్యేక కమిటీ
- వాటికి అనుగుణంగా తదుపరి చర్యలు
- మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, పార్థసారథి, సత్యకుమార్ వెల్లడి


సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో మంత్రులు, అధికారులు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో తితిదే అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ఏఈవో ధర్మారెడ్డితోపాటు కొనుగోలు కమిటీలోని సభ్యులందరినీ నేరస్థులుగానే ప్రభుత్వం పరిగణిస్తోందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా దోషుల్ని చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు. 'ప్రభుత్వానికి ఉన్న సమాచారం ప్రకారం సీఎఫ్‌టీఆర్ఐ నివేదికను అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయినా చర్యలు తీసుకోకపోవడాన్ని నేరంగానే చూస్తున్నాం. ఈ విషయాలను సీబీఐ సిట్ పరిగణనలోకి తీసుకుందా? లేదా? వారిని నేరస్థులుగా పరిగణిస్తారా? లేదా? అనేది ఛార్జ్‌షీట్ చూస్తే గానీ తెలియదు. ఒకవేళ పరిగణించకపోతే వారిని కూడా చేర్చాలని కోరతాం. దీనిపై అడ్వకేట్ జనరల్ సలహా కూడా తీసుకున్నాం' అని వివరించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం మంత్రిమండలి సమావేశం నిర్వహించారు. ఆ సమావేశ వివరాల్ని మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, పార్థసారథి, సత్యకుమార్ యాదవ్ విలేకర్లకు వివరించారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ తితిదే పవిత్రత తను కాపాడటానికి, (మిగతా 11లో)

కుట్ర కనిపిస్తున్నా.. బాధ్యుల్ని నిందితులుగా ఎందుకు చేర్చలేదు?

- నిబంధనలు సవరించారు.. అది ఉద్దేశపూర్వక నేరమే
- వైకాపా చేసింది మహాపాపం.. వారికి శిక్ష పడాల్సిందే

13లో

భగీరథ యత్నం..
చివరి దశలో పోలవరం!

- సవాళ్లను అధిగమించి.. వేగంగా ప్రాజెక్టు పనులు
- పూర్తికావొచ్చిన కొత్త డయాఫ్రం వాల్
- ఇప్పటికే బట్రస్ డ్యాం పూర్తి
- సీపేజీ సమస్య పరిష్కారంతో వరద రోజుల్లోనూ ఆగని పనులు
- ప్రధాన డ్యాం పూర్తి చేసే పనులూ ప్రారంభం
- కుడి, ఎడమ కాలువల అనుసంధానం వేగవంతం
- ఏడాదిన్నరలో ఎంతో పురోగతి
- కొత్త ప్రభుత్వంలో ఇప్పటికే రూ.4,747 కోట్ల ఖర్చు

పుష్కరాలకు పూర్తి చేయాలని లక్ష్యం

ప్రత్యేక కథనం } 3లో



ఆంధ్రప్రదేశ్ జీవనాడి... ప్రజల చిరకాల స్వప్నం.. రాష్ట్రం నలుమూలలకూ జలఫలాలు పంచే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చివరి అంకంలోకి వచ్చింది. సమీప భవిష్యత్తులోనే ఈ ప్రాజెక్టు కల సాకారమయ్యేలా పనులు వేగంగా జరుగుతున్నాయి. 2027 జూన్ కల్లా అంటే గోదావరి పుష్కరాల నాటికే ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం.

దుగరాజపట్నం పోర్టుకు భూముల సేకరణ!

- 2,170 ఎకరాల సేకరణకు.. రూ.544 కోట్ల కేటాయింపు
- ప్రాజెక్టు అభివృద్ధికి వీపీఏ-ఏపీ మారిటైం బోర్డు ఎంవోయూ

3లో

వాణిజ్య ఒప్పందంపై భగ్గు


పార్లమెంటు ప్రాంగణంలో విపక్ష సభ్యులతో కలిసి ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేతలు ప్రియాంకా గాంధీ, రాహుల్‌గాంధీ

- అమెరికాతో ప్రధాని రాజీపడ్డారు.. రైతు కష్టాన్ని అమ్మేశారు: విపక్షం
- మాట్లాడే హక్కు హరించడం ప్రజాస్వామ్యానికి మచ్చ
- స్పీకర్‌కు రాసిన లేఖలో రాహుల్
- నరవణె పుస్తకంపై కొనసాగిన ప్రకంపనలు
- లోక్‌సభలో 8 మంది సస్పెన్షన్

దిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందం సాకారమవుతున్న వేళ పార్లమెంటు ఉభయసభల్లో విపక్షాలు భగ్గుమన్నాయి. దేశ ప్రయోజనాలను పట్టించుకోకుండా ఒప్పందం ఎలా కుదుర్చుకుంటారని నిలదీశాయి. దీంతోపాటు చైనాతో మునుపటి ఘర్షణ అంశం లోక్‌సభలో మరోసారి ప్రస్తావనకు వచ్చి తీవ్ర వాదోపవాదాలకు దారితీసింది. నిరసనలు తెలిపే క్రమంలో అనుచితంగా వ్యవహరించారంటూ ఎనిమిది మంది సభ్యులపై వేటు వేశారు. బడ్జెట్ సమావేశాలు (మిగతా 2లో)

అమెరికాతో వాణిజ్య ఒప్పందం పెద్ద నిర్ణయం

ప్రతి ఒక్కరికీ దానివల్ల ప్రయోజనం

దేశానికి అనుకూలంగానే మా పని

ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ భేటీలో మోదీ

10లో

వ్యవసాయ, పాడి రంగానికి పూర్తి రక్షణ

కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్

అంగ'రంగ' వైభోగమే!!

అమెరికా టారిఫ్ కోతతో ఎగుమతుల్లో దూకుడే

కార్మిక ఆధారిత పరిశ్రమలకు సానుకూలతలు

రత్నాభరణాలు, జౌళి-దుస్తులు, ఆక్వాకు పునరుత్తేజం

కొత్త ఆర్డర్లకు అవకాశం

రూ. 12 లక్షల కోట్లు పెరిగిన మదుపర్ల సంపద

వివరాలు బిజినెస్ లో

గగన తలానికి ఘనమైన రక్షణ!

- ఎస్ఎఫ్‌డీఆర్ టెక్నాలజీ పరీక్ష విజయవంతం
- కొత్తతరం క్షిపణుల రూపకల్పనకు వీలు
- శత్రు యుద్ధవిమానాల పాలిట సింహస్వప్నం



దిల్లీ: రక్షణ సాంకేతికతలో భారత్ మరో ముందడుగు వేసింది. అధునాతన సాలిడ్ ఫ్యూయెల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్ఎఫ్‌డీఆర్) చోదక వ్యవస్థతో పనిచేసే క్షిపణి పరిజ్ఞానాన్ని మంగళవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరానికి చేరువలోని సమీకృత పరీక్ష వేదిక (ఐటీఆర్) నుంచి ఈ ప్రయోగం జరిగింది. గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించగల కొత్తతరం దీర్ఘశ్రేణి క్షిపణులను అభివృద్ధి చేయడానికి ఈ టెక్నాలజీ దోహదపడుతుంది. ఈ సాంకేతికత కలిగిన అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) ఈ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసింది. ఇందులో హైదరాబాద్‌లోని రక్షణ పరిశోధన, అభివృద్ధి ల్యాబ్ (డీఆర్‌డీఎల్), రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (ఆర్‌సీఐ), పుణెలోని హై ఎనర్జీ మెటీరియల్స్ రీసెర్చ్ ల్యాబ్ ముఖ్య పాత్ర పోషించాయి.

ఏమిటీ ఎస్ఎఫ్‌డీఆర్ పరిజ్ఞానం?

ఈ టెక్నాలజీలో నాజిల్‌రహిత బూస్టర్, ఘన ఇంధనంతో నడిచే ఎయిర్ బ్రీతింగ్ రామ్‌జెట్ ఇంజిన్ వంటివి ఉంటాయి. సంప్రదాయ రాకెట్లు తమ వెంట ఇంధనంతోపాటు (మిగతా 2లో)

తప్పించుకోవడానికి నో ఛాన్స్


దీర్ఘశ్రేణి, అధిక వేగం, గాల్లో సులువుగా విన్యాసాలు చేయగలిగిన సామర్థ్యం వంటి లక్షణాల వల్ల ఎస్ఎఫ్‌డీఆర్ క్షిపణి నుంచి తప్పించుకోవడం శత్రు యుద్ధవిమానానికి చాలా కష్టం. మన పైలట్లు సురక్షితంగా 300 కిలోమీటర్ల దూరంలో ఉంటూ శత్రు జెట్లను చాలా ముందుగానే కూల్చడానికి వీలు కలుగుతుంది. దీనివల్ల మన వాయుసేన పోరాట సామర్థ్యం మరింత ఇనుమడిస్తుంది. దిగుమతి చేసుకున్న క్షిపణులపై ఆధారపడటం తగ్గుతుంది.

ఆరోగ్య ఆంధ్ర@ఏఐ

ఆధునిక సాంకేతికతతో సమర్థ వైద్య సేవల దిశగా రాష్ట్రం అడుగులు

ఈనాడు – అమరావతి

వైద్య రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరుగుతోంది. వ్యాధులను గుర్తించడం నుంచి చికిత్స వరకు ఈ సాంకేతికతను వైద్యులు అందిపుచ్చుకుంటున్నారు. ఇప్పటికే పలు దేశాల్లో ఏఐ క్లినిక్‌లు అందుబాటులోకి వచ్చాయి. భారత్‌లోనూ ఈ తరహా వైద్య విధానాలను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం 'ఇండియా ఏఐ సమిట్' పేరుతో జాతీయ వ్యూహం రూపొందించేందుకు ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తోంది. సాంకేతికత వినియోగంలో ముందున్న ఏపీలో గతేడాది డిసెంబరులోనే ఇండియా ఏఐ తొలి సదస్సు నిర్వహించారు. త్వరలో జాతీయ విధానాన్ని ఖరారు చేయనున్నారు. ఆ సమయానికి ఏపీ కూడా ఓ వ్యూహంతో సిద్ధమయ్యేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఏఐ వినియోగంతో సేవల్లో వేగం, పారదర్శకత పెరుగుతుందని.. ఆరోగ్య ఆంధ్ర సాకారం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.



వ్యాధులను ముందే గుర్తించడం..

ప్రభుత్వం సంజీవని ప్రాజెక్టును కుప్పంలో ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనుంది. వ్యాధి వచ్చాక చికిత్స కాకుండా.. ఏఐ విశ్లేషణ ద్వారా ముందే గుర్తించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ప్రజలను ఎక్కువగా ఇబ్బందిపెట్టే 10 రకాల వ్యాధులను గుర్తించి, వాటి నివారణపై దృష్టిసారించే ఉద్దేశంతో బిల్‌గేట్స్ ఫౌండేషన్, అంతర్జాతీయ నిపుణుల కమిటీ సహకారంతో ఈ సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నారు. ఆర్టీజీఎస్ ద్వారా డేటా విశ్లేషిస్తారు. రోగుల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేసి వాటిని హెల్త్‌కేర్ ప్రొవైడర్లకు అందుబాటులోకి తెస్తారు. ఇలా పలు ఏఐ ఆధారిత వైద్య సేవల ప్రాజెక్టుల దిశగా ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంటోంది.

దోమలపై డ్రోనాస్త్రం

రాష్ట్రంలో దోమల నియంత్రణకు.. మలేరియా, డెంగీ లాంటి వ్యాధుల నివారణకు ప్రభుత్వం డ్రోన్ సాంకేతికతను వినియోగిస్తోంది. మన్యంతోపాటు.. విశాఖ, విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరం, గుంటూరు తదితర ప్రాంతాల్లో ఈ సేవలను విస్తరిస్తోంది.

- గిరిజన ప్రాంతాల్లోని ఆసుపత్రులకు డ్రోన్ల ద్వారా ఔషధాలు, బ్లడ్ యూనిట్లు పంపించి.. అక్కడి నుంచి రక్త, మల, మూత్ర నమూనాలను వైద్య పరీక్షల కోసం తీసుకొచ్చే చర్యలు చేపట్టింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నుంచి ఈ సేవలు అందుబాటులోకి తెచ్చేలా రెడ్‌వింగ్ సంస్థతో ఒప్పందం కుదిరింది. (మిగతా 2లో)

బంగారం, వెండి ధరలు

అమాంతం దూసుకెళ్లాయ్

2008 తరవాత ఒకరోజులో అత్యధిక లాభం ఇదే



10 గ్రాముల మేలిమి బంగారం రూ.1,58,500

కిలో వెండి రూ.2,79,600

2లో

క్లిక్ దూరంలో 25 రకాల
సేవలు!

ఆస్తి పన్ను విధింపు నుంచి ట్రేడ్ లైసెన్స్ వరకు

- కార్యాలయాలకు ప్రజలు వెళ్లే అవసరం లేదు
- అందుబాటులోకి నవీకరించిన పురపాలక పోర్టల్

మీ కొత్త ఇంటికి ఆస్తి పన్ను మదింపు చేయించుకోవాలా? ఇకపై మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాల్సిన పని లేదు. సిబ్బంది చుట్టూ తిరగాల్సిన అవసరమూ లేదు. ఇళ్లు, కార్యాలయాల్లో నుంచే నవీకరించిన పురపాలక పోర్టల్ ద్వారా ఇంటి వివరాలు అప్‌లోడ్ చేసుకోవచ్చు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు నిర్ధారించాక, కమిషనర్ ఆస్తి పన్ను విధిస్తారు.

ఆస్తి పన్నే కాదు, వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్, ఆస్తి పేరు మార్పునకు మ్యుటేషన్, మ్యారేజ్ సర్టిఫికెట్ ఇలా 25 రకాల పౌరసేవలు క్లిక్ దూరంలో అందుబాటులోకి వచ్చాయి. పురపాలక శాఖ పోర్టల్ ద్వారా ప్రజలు వీటిని సులువుగా పొందొచ్చు. కావాల్సిన సేవలు ఎంచుకొని, అవసరమైన వివరాలు అప్‌లోడ్ చేస్తే సంబంధిత కమిషనర్ లాగిన్‌కి వెళ్తాయి. వాటిని నిర్ధారించుకున్నాక గడువులోగా సేవలు అందిస్తారు. పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఆన్‌లైన్ సేవలు కొత్త కానప్పటికీ, ప్రజలు వాటిని సులువుగా పొందేలా ప్రభుత్వం పురపాలక పోర్టల్‌ను నవీకరించి, ఇటీవలే అందుబాటులోకి తెచ్చింది. సిబ్బంది అవినీతికి అడ్డుకట్ట వేయడంతో పాటు జాప్యాన్ని నివారించేందుకు ఇది దోహదపడనుంది. (మిగతా 2లో)




సేవలు పొందడం ఇలా..

- పురపాలకశాఖ వెబ్‌సైట్ (cdma.ap.gov.in) ఓపెన్ చేశాక 'ఫింగర్ టిప్స్‌లో మున్సిపల్ సేవలు' అనే వాక్యం కింద ఆన్‌లైన్‌లో అందించే సేవల వివరాలు కనిపిస్తాయి.
- కావాల్సిన సేవపై క్లిక్ చేసి నగరం, పట్టణం, ప్రాంతంతో పాటు అవసరమైన వివరాలు, పత్రాలు అప్‌లోడ్ చేసి, సబ్మిట్ చేయాలి.
- ఆ అర్జీ సంబంధిత మున్సిపల్ కమిషనర్ లాగిన్‌కి వెళ్లి, ప్రాసెస్ ప్రారంభమవుతుంది.

18న అమరావతికి బిల్ గేట్స్?

సీఎం చంద్రబాబుతో సమావేశం 11లో

ఇదీ సంగతి!



విపత్తుల్లో... రుణాల వసూలుకు
వేధించవద్దు

- ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయాలని బ్యాంకులకు మార్గదర్శకం
- బ్యాంకులకు సూచనలతో ఆర్బీఐ ముసాయిదా

ఈనాడు, హైదరాబాద్: ప్రకృతి విపత్తుతో ప్రజలు నష్టపోయారని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన సందర్భాల్లో ప్రజలను పాత రుణ బకాయిలు కట్టాలని వేధించకుండా వారిని ఆదుకోవడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని బ్యాంకులకు రిజర్వు బ్యాంకు సూచించింది. ఇందుకు సంబంధించిన ముసాయిదాను విడుదల చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం(2026-27) ఆరంభం నుంచి బ్యాంకులు అమలు చేయాలని పేర్కొంది. అమలుకు ముందు తుది ఉత్తర్వులు జారీ చేస్తుంది. ముసాయిదాలో ముఖ్యాంశాలివీ...

- ప్రకృతి విపత్తు వాటిల్లి ప్రజలు నష్టపోయారని కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పక్షంలోగా రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి(ఎస్ఎల్‌బీసీ) ప్రత్యేక సమావేశం నిర్వహించి బాధితులను ఆదుకునేందుకు సాయం ప్రకటించాలి. ఒకవేళ రాష్ట్రం మొత్తం కాకుండా ఏవైనా కొన్ని జిల్లాల్లో మాత్రమే విపత్తు వాటిల్లితే ఆ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్లతో ఎస్ఎల్‌బీసీ సమావేశం ఏర్పాటు చేయాలి.
- దెబ్బతిన్న రుణ గ్రహీతలను గుర్తించడం, వారి బకాయిల చెల్లింపులపై కొంతకాలం మారటోరియం విధించే అవకాశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవాలి.



పట్టాదారు పాసు పుస్తకాలు లేకున్నా అప్పులివ్వాలి

రైతు సాధారణంగా తన భూమిని బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం తీసుకుంటారు. ఆ పూచీకత్తు భూమికి సంబంధించిన పట్టాదారు పాసు పుస్తకం లేదా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు విపత్తులో దెబ్బతిన్నా లేదా కనిపించకున్నా... ఆ ప్రాంత రెవెన్యూ అధికారి నుంచి తీసుకున్న భూమి ధ్రువీకరణ పత్రం చూపితే మరింత వ్యవసాయ రుణం ఇవ్వాలి.

- రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రాంతాల్లో విపత్తులు వాటిల్లితే రైతు భూమి గుర్తింపు పత్రాన్ని అక్కడున్న భూమి యాజమాన్య (మిగతా 2లో)

గగన తలానికి ఘనమైన రక్షణ!

(మొదటి పేజీ తరువాయి)

దాన్ని మండించడానికి అవసరమయ్యే ఆక్సిజన్‌ను ఆక్సిడైజర్ రూపంలో మోసుకెళతాయి.

■ ఎస్‌ఎఫ్‌డీఆర్ ఆధారిత క్షిపణి తీరు భిన్నం. అది ఆక్సిజన్‌ను గాలి నుంచే సేకరిస్తుంది. ఈ క్షిపణి.. ముందుకు దూసుకెళ్లే క్రమంలో లోపలికి చొచ్చుకొచ్చే గాలిని సేకరిస్తుంది. దాని సాయంతో మన ఇంధనాన్ని మండించి శక్తి (థ్రస్ట్‌)ని విడుదల చేస్తుంది.

■ ఈ అస్త్రం పయనిస్తున్నప్పుడు.. లోపలికి దూసుకొచ్చే గాలి సంపీడనాన్ని సర్దుబాటు చేసుకోవడం ద్వారా రాకెట్ ఉత్పత్తి చేసే థ్రస్ట్‌ను నియంత్రించుకుంటుంది. సంప్రదాయ మన ఇంధన రాకెట్టు.. ఇంధనాన్ని వేగంగా మండిస్తాయి. ఆ క్రమంలో విడుదలయ్యే అధిక శక్తి.. రాకెట్‌ను ఆ తర్వాత కూడా ముందుకు నడిపిస్తుంది. రామ్‌జెట్‌లో నడిచే క్షిపణుల్లో ప్రజ్వలన.. నియంత్రిత పద్ధతిలో, సుస్థిరంగా కొనసాగుతుంది. అందువల్ల అవి ఎక్కువసేపు అధిక వేగాన్ని కొనసాగించగలవు. ముఖ్యంగా చివర్లో.. లక్ష్యానికి చేరువైన దశలోనూ అదే జోరును ప్రదర్శించగలవు.

■ తనకు కావాల్సిన ఆక్సిజన్‌ను ప్రత్యేకంగా మోసుకెళ్లాల్సిన అవసరంలేనందువల్ల క్షిపణిలో జోలెడు చోటు మిగిలి ఉంటుంది. ఫలితంగా ఎక్కువ ఇంధనం, పెద్ద వార్‌హెడ్‌ను మోసుకెళ్లడానికి వీలవుతుంది. దీనివల్ల ప్రయాణించే దూరం, ప్రత్యర్థికి కలిగించే నష్టం చాలా ఎక్కువగా ఉంటాయి.

■ తొలుత క్షిపణికి అవసరమైన వేగాన్ని అందించడానికి బూస్టర్ ఉపయోగపడుతుంది. నిర్దేశిత వేగాన్ని అందుకున్నాక రామ్‌జెట్ వ్యవస్థ పనిచేయడం ప్రారంభిస్తుంది. దీని ద్వారా ధ్వని కన్నా 3.8 రెట్ల వేగాన్ని సాధించొచ్చు.

అమాంతం దూసుకెళ్లిన » బంగారం, వెండి ధరలు

2008 తర్వాత ఒకరోజు అత్యధిక లాభం

అంతర్జాతీయంగా బంగారం, వెండి ధరలు మంగళవారం ఒక్కసారిగా దూసుకెళ్లాయి. అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో, సురక్షితమని భావించడమే కాక.. పలు రంగాల నుంచి వస్తున్న గిరాకీ ఫలితంగా గతవారంలో ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర జీవనకాల గరిష్ఠమైన 5594.82 డాలర్లకు, ఔన్సు వెండి ధర 115.50 డాలర్లకు చేరాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్‌గా వార్ష్‌ను నియమిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించాక, ఈ లోహాల ట్రేడింగ్‌లో భారీ అమ్మకాలు వచ్చాయి. వడ్డీరేట్లు అధికంగా ఉండాలనే వార్ష్ దృక్పథం వల్ల, డాలర్ బలోపేతం అవుతుందనే అంచనాలతో ఈ



కమొడిటీల కాంట్రాక్టులను తెగనమ్మడం, వీటికి మార్జిన్లు పెంచడమూ ప్రభావం చూపింది. ఫలితంగా ఔన్సు బంగారం ధర 4403 డాలర్లకు, వెండి ధర 75 డాలర్లకు దిగి వచ్చింది.

మళ్లీ గణనీయ మార్పు

ఈ లోహాల ధరలు అందుబాటులోకి వచ్చాయనే భావనకు తోడు, అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన తరుణంలో మంగళవారం మళ్లీ భారీగా కొనుగోళ్లు వచ్చాయి. ఫలితంగా 2008 నవంబరు తరవాత ఒక్కరోజులోనే అత్యధికంగా ఈ లోహాల ధరలు పెరిగాయని చెబుతున్నారు. మంగళవారం రాత్రి 11.55 గంటల సమయానికి ఔన్సు బంగారం ధర 292 డాలర్లు (6.3%) పెరిగి 4926 డాలర్లకు, వెండి ధర 6 డాలర్లు (7.5%) అధికమై 83 డాలర్లకు చేరాయి. దేశీయంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి కాస్త బలపడి 90.32 స్థాయికి చేరినా కూడా, ఇక్కడ లోహాల ధరలు పెరిగాయి. 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,58,500కు, కిలో వెండి ధర రూ.2,79,600 వద్ద స్థిరపడ్డాయి. సోమవారం ఈ ముగింపు ధరలు రూ.1,50,000, రూ.2,48,490 (అన్ని పన్నులతో కలిపి) కావడం గమనార్హం.

– ఈనాడు వాణిజ్య విభాగం

వాణిజ్య ఒప్పందంపై భగ్గు

(మొదటి పేజీ తరువాయి)

మొదలైంది. అయితే, లోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే.. 2020 డోక్లాం వద్ద ముద్రణ ఉంది సైన్యం మాజీ అధిపతి ఎం.ఎం.నరవణే రాసిన ఆత్మకథలోని అంశాలను విపక్షనేత రాహుల్‌గాంధీ మరోసారి ప్రస్తావించడం, అమెరికాతో ఒప్పందం గురించి ట్రంప్ ప్రకటన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పత్రాలను చించి సభాపతి స్థానం వైపు విసరడంతోపాటు సెక్రటరీ జనరల్ టేబుల్‌పైకి వెళ్లేందుకు సభ్యులు ప్రయత్నించారు. దీంతో కాంగ్రెస్‌కు చెందిన ఏడుగురు, సీపీఎం సభ్యుడొకరు సస్పెండయ్యారు. వీరితో తెలంగాణ ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఒకరు. ఉదయం పలుమార్లు వాయిదాపడిన సభ మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి సమావేశమైంది. నిరసనలతో సభా కార్యకలాపాలను అడ్డుకుంటున్న ఎనిమిదిమంది పేర్లను సభాపతి స్థానంలో ఉన్న దిలీప్ సైకియా చదివారు. వారిని ఈ సమావేశాలవరకు సస్పెండ్ చేయాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించగా సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. సభ్యుల, సభాపతిపై ఏమాత్రం గౌరవం లేకుండా పత్రాలను చించి విసిరేశారని రిజిజు ఆక్షేపణ తెలిపారు. సభ్యుల సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ విపక్షాలు పార్లమెంటు ఆవరణలో నిరసనలు కొనసాగించాయి. తమను సస్పెండ్ చేయడాన్ని ప్రజాస్వామ్యంపై దాడిగా మాణికం ఠాగూర్ (కాంగ్రెస్) ఆరోపించారు.



లోక్‌సభ కార్యకలాపాలకు భాజపా ఎంపీ దిలీప్ సైకియా అధ్యక్షత వహించిన సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు విసిరేసిన పత్రాలు

నిజాలు బయటకు రావాలి

నరవణె పుస్తకం గురించి సభలో మాట్లాడేందుకు తనను అనుమతించకపోవడంపై రాహుల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. దేశ భద్రత అంశమే ఈ చర్చకు కారణమని స్పష్టం చేశారు. ఒక మ్యాగజీన్ కథనంలోని విషయాలు దేశ భద్రతకు అత్యంత కీలకమని పేర్కొన్నారు. చైనా-భారత్ సరిహద్దుల్లో పరిస్థితులు, ప్రధానమంత్రి స్పందన వంటి అంశాలపై నిజాలు బయటకు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. 'రాష్ట్రపతి ప్రసంగంలో జాతీయ భద్రత ప్రధాన అంశం. చైనా, పాకిస్థాన్‌లతో మన సంబంధాలు దేశ భవిష్యత్తుకు కీలకం. అలాంటి సందర్భంలో జరిగిన ఘటనలపై మాట్లాడకుండా నన్నెందుకు అడ్డుకుంటున్నారు' అని ప్రశ్నించారు. ప్రభుత్వం చర్చకు ఎందుకు వెనుకడుగు వేస్తోందని నిలదీశారు.

అగ్రరాజ్యానికి మోదీ లొంగిపోయారు: రాహుల్

వాణిజ్య ఒప్పందం విషయంలో అమెరికా ఒత్తిడికి ప్రధాని మోదీ లొంగిపోయారని రాహుల్ ఆరోపించారు. ఈ ఒప్పందం ద్వారా రైతుల కష్టార్జితాన్ని అమ్మేశారని విమర్శించారు. "దాదాపు నాలుగు నెలలుగా నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందం సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా ఎందుకు ఖరారైంది అని ఆలోచించాలి. ఈ విషయంలో ప్రధానిపై తీవ్ర ఒత్తిడి ఉంది. వ్యాపారవేత్త అదానీపై అమెరికాలో కేసు వంటి వ్యవహారాలు దీనికి కారణం. వాణిజ్య ఒప్పందం విషయంలో ప్రధాని రాజీ పడ్డారు. మొత్తం దేశాన్ని అమ్మేశారు" అని దుయ్యబట్టారు.



సాయుధ దళాల స్థైర్యాన్ని దెబ్బతీస్తారా?

విపక్షనేత వ్యాఖ్యలను ఎన్డీయే ఎంపీలు, కేంద్ర మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సభా నియమాలను అతిక్రమించడం, ప్రచురించని పుస్తకంలోని విషయాలను ప్రస్తావించడం సరికాదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. స్పీకర్ ఇప్పటికే స్పష్టతనిచ్చిన అంశాన్ని మళ్లీ సభలోకి తీసుకురావడం అనుచితమన్నారు. రాహుల్ వ్యాఖ్యలు సాయుధ దళాల మనోబలాన్ని దెబ్బతీ



మాట్లాడుతున్న రిజిజు

సేలా ఉన్నాయని చెప్పారు. సభను రిజిజు తప్పుదారి పట్టిస్తున్నారని, విపక్ష నేత మాట్లాడే హక్కును అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. అధికార- విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. సభ్యులను శాంతింపజేసేందుకు ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ పలుమార్లు కోరినా ఫలితం లేకపోయింది. విపక్షాలు సభాపతి స్థానం వద్దకు వచ్చి నినాదాలు చేస్తూ పత్రాలు విసరడంతో సభను బుధవారానికి వాయిదా వేశారు.

హక్కును హరిస్తున్నారు: విపక్ష నేత

లోక్‌సభలో మాట్లాడేందుకు ప్రజాస్వామ్యబద్ధంగా తనకు లభించిన హక్కును హరిస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాను మాట్లాడకుండా స్పీకర్ అడ్డుకున్నారని విమర్శించారు. పార్లమెంటు చరిత్రలోనే తొలిసారిగా ఇలా జరిగిందని చెప్పారు. ఈ మేరకు స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. 'ఇది మన ప్రజాస్వామ్యానికి మచ్చ. దీనిపై నిరసనను తెలియజేస్తున్నా. జాతీయ భద్రత అంశంపై మాట్లాడకుండా ఉద్దేశపూర్వకంగా ప్రయత్నించారు. ప్రతిపక్ష సహా సభలోని ప్రతి సభ్యుడి హక్కుల్ని కాపాడడం స్పీకర్ రాజ్యాంగబద్ధ బాధ్యత' అని పేర్కొన్నారు. సభలో ఒక పత్రాన్ని ప్రస్తావించాలనుకుంటే సభ్యుడు దాని ప్రామాణికతను ధ్రువీకరించాల్సి ఉంటుందని, దానిలోని విషయాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని నరవణె పుస్తకం విషయంలో తాను అదేవిధంగా చేశానని చెప్పారు.

'ట్రంప్ ప్రకటించేశాక ప్రభుత్వం స్పందించింది'

అమెరికాతో ఒప్పందం గురించి రాజ్యసభలోనూ విపక్షాలు గళం విప్పాయి. ఒప్పందం పూర్తి వివరాలను ఇవ్వాలని డిమాండ్ చేశాయి. ఆపరేషన్ సిందూర్ మాదిరిగా ఈ ఒప్పందం గురించి ముందుగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారని, ఆ తర్వాత మన ప్రభుత్వం స్పందించిందని ఆప్ ఎంపీ అబ్దుల్ వహాబ్ (ఐయూఎంఎల్) ఎద్దేవా చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని విపక్ష సభ్యులు ఆరోపించారు. రష్యా చమురు గురించి ట్రంప్ చేసిన ప్రకటనపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. ఒప్పందంపై చర్చకు సభాపతి అనుమతించకపోవడంతో తృణమూల్ మినహా మిగతా విపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. విపక్షం నైరాశ్యంలో ఉందని, ప్రతిదాన్నీ వ్యతిరేకిస్తోందని అధికారపక్షం విమర్శించింది. తమకు ఎలాంటి దాపరికం లేదని, ఒప్పందంపై ప్రభుత్వం తగినసమయంలో సవివర ప్రకటన చేస్తుందని రాజ్యసభాపక్ష నేత జె.పి.నడ్డా చెప్పారు.

బెయిల్‌ను దుర్వినియోగం చేస్తున్న జోగి సోదరులు

- కోర్టుల్లో సిట్, ఎక్సైజ్ అధికారుల అదనపు అఫిడవిట్

ఈనాడు, అమరావతి: 'నకిలీ మద్యం' కేసులో నిందితులు జోగి రమేష్ (ఏ18), జోగి రాము (ఏ19) చట్టాన్ని గౌరవిస్తారని, విచారణకు సహకరిస్తారని కోర్టు నమ్మకంతో బెయిల్ ఇస్తే, దాన్ని వారు దుర్వినియోగం చేశారు. బెయిల్‌పై విడుదలైన వెంటనే విజయవాడ జైలు ఎదుట మీడియాతో మాట్లాడి, సిట్ అధికారులను దూషించారు. అధికారుల కుటుంబాలను, వారి వ్యక్తిగత జీవితాలను ప్రస్తావించారు. వారిలో భయాందోళన రేకెత్తిస్తూ నిష్పక్షపాత దర్యాప్తునకు ఆటంకం కలిగిస్తున్నారని సిట్ అధికారులు మంగళవారం విజయవాడలోని ఎనిమిదో ఏడీజే కోర్టులో అదనపు అఫిడవిట్ దాఖలు చేశారు. జోగి ప్రసంగాలకు సంబంధించిన వీడియోలను అందజేశారు. నిందితుల వ్యాఖ్యలు బెయిల్ షరతుల ఉల్లంఘన కిందకు వస్తాయని పేర్కొంటూ ఈనెల 5కు కోర్టు వాయిదా వేసింది. జోగి సోదరుల బెయిళ్లను రద్దు చేయాలని ఎక్సైజ్, సిట్ అధికారులు జిల్లా కోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే.

చట్టం అంటే గౌరవం లేదు

'జోగి సోదరులు కోర్టు షరతులన్నీ ఉల్లంఘించారు. బెయిల్ ద్వారా వచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేశారు. దర్యాప్తు సంస్థను, చట్టాన్ని సవాలు చేస్తున్నారు. అసభ్యంగా తిడుతున్నారు. వీరి ప్రవర్తన బెయిల్‌పై విడుదలైన వారిలా కాకుండా, కక్షపూరితంగా ఉందని అఫిడవిట్‌లో సిట్ పేర్కొంది. అందువల్ల బెయిలు రద్దు చేసి, కస్టడీకి తీసుకునేలా ఆదేశించాలని కోరింది.

క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాలకు భూమిపూజ 7న?

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధానిలో ఈనెల 6న నిర్వహించ తలపెట్టిన క్వాంటమ్ వ్యాలీ నిర్మాణాల భూమిపూజ 7వ తేదీకి మారినట్లు సమాచారం. ఉద్దండరాయునిపాలెం సమీపంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తదితరులు పరిశీలించారు.

ఆరోగ్య ఆంధ్ర @ఏఐ

(మొదటి పేజీ తరువాయి)

క్షయ కట్టడి దిశగా

ఏఐ సాంకేతికతతో క్షయ ప్రభావిత ప్రాంతాల మ్యాపింగ్, స్క్రీనింగ్‌కు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మొబైల్ ఆధారిత పరికరాల ద్వారా దగ్గు శబ్దం తీవ్రత, లక్షణాలు విశ్లేషించి ఏఐ ద్వారా క్షయను అంచనా వేసే సాంకేతికత క్షేత్రస్థాయి వైద్యారోగ్య సిబ్బందికి త్వరలో అందుబాటులోకి తేనుంది. క్షయ రోగులను క్రమం తప్పకుండా పర్యవేక్షించేలా, మరణ తీవ్రతను ముందే గుర్తించేలా, హైరిస్క్ టీబీ కేసులకు చికిత్స అందుబాటులోకి తెచ్చే ప్రణాళికలు ఉన్నాయి.

శిశు సంరక్షణ చర్యలు

42 రోజులలోపు ఉన్న శిశువు బరువు, పొడవు, శరీర చుట్టు కొలతలు అంచనా వేసేలా ఏఐ ద్వారా సాంకేతిక వ్యవస్థను ప్రభుత్వం అందుబాటులోకి తేనుంది. ఈ సాధనాన్ని ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు అందుబాటులోకి తెచ్చేలా సన్నాహాలు చేస్తోంది.

గ్రామీణ ప్రాంతాలకు చేరువ...

ఏఐ ఆధారిత నిర్ధారణ పద్ధతులు, టెలీమెడిసిన్, రిమోట్ మానిటరింగ్, ప్రజారోగ్య సమాచార విశ్లేషణతో గ్రామీణ ప్రాంతాలకు ఆరోగ్య సేవలను చేరువచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏపీ డిజిటల్ హెల్త్ మిషన్ ద్వారా వ్యాధులపై ముందస్తు హెచ్చరికలు, డేటా ఆధారిత ప్రణాళికలు, ఆసుపత్రుల మధ్య వైద్య సేవల్లో సమన్వయం దిశగా చొరవచూపుతోంది.

నేత్ర సంరక్షణ

డయాబెటిక్ రెటినోపతి స్క్రీనింగ్ ద్వారా వెబ్ ఆధారిత ఏఐ సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. మొబి ల్యాబ్ కిట్‌లోని కెమెరాతో తీసిన కంటి రెటీనా చిత్రాలను విశ్లేషించి డయాబెటిక్ రెటినోపతి తీవ్రతను గుర్తిస్తారు. అధిక ప్రమాదంలో ఉన్న రోగులను నేత్ర వైద్యుల వద్దకు రిఫర్ చేయడానికి ఇది ఉపకరిస్తుంది. శివారు ప్రాంతాల ప్రజలు ఆసుపత్రుల వరకు వెళ్లకుండా.. ఇంటి వద్దనే తొలి దశ స్క్రీనింగ్ నిర్వహిస్తారు. ఈ చర్యలతో స్పెషలిస్టులపై భారం తగ్గుతుంది.

సమగ్ర వ్యూహంతో...

దేశంలో 2030 నాటికి సురక్షిత, ప్రభావవంతమైన ఏఐ ఆరోగ్య సేవలు అందరికీ చేరువ చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య ఆరోగ్య సమస్యలు, మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, డిజిటల్ సామర్థ్యాల్లో గణనీయమైన తేడాలున్నందున.. ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగానికి ఒకే విధానం కాకుండా.. ఆయా ప్రాంతాల అవసరాలకు తగ్గట్లు వ్యూహాలు అవసరమని భావిస్తోంది. ఐసీఎంఆర్, డబ్ల్యూహెచ్‌వో సహకారంతో ఈ దిశగా ఇప్పటికే వ్యూహాలు సిద్ధం చేస్తోంది.

విపత్తుల్లో... రుణాల వసూలుకు వేధించవద్దు

(మొదటి పేజీ తరువాయి)

సంఘం(కమ్యూనిటీ) ఇచ్చినా బ్యాంకు ఆమోదించి రుణ సాయం చేయాలి.

■ విపత్తులో బ్యాంకు భవనం దెబ్బతింటే తాత్కాలికంగా కార్యాలయం తెరిచి సేవలు అందించాలి. ఇంకా శాటిలైట్ కార్యాలయాలు, ఎక్స్‌టెన్షన్ కౌంటర్లు, మొబైల్ బ్యాంకింగ్ సేవలతో కూడా ఆదుకోవాలి.

■ ఏటీఎంలు దెబ్బతింటే వెంటనే వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి. అవి వెంటనే మరమ్మతు చేయలేకపోతే నగదు పంపిణీకి ప్రత్యామ్నాయ మార్గాలలో సేవలు అందించాలి.

■ విపత్తు ప్రాంతాల్లో బ్యాంకులు వసూలుచేసే వివిధ రకాల రుసుములు, ఛార్జీలను ఏడాదిపాటు రద్దుచేయాలి.

■ రుణాలపై ఏదైనా వడ్డీ రాయితీ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయిస్తే వెంటనే వాటిని అమలుచేయాలి.

■ రుణం తీసుకున్నవారు బీమా చేయించి ఉంటే...విపత్తు సమయంలో వచ్చే బీమా పరిహారాన్ని ఈ రుణానికి బ్యాంకు సర్దుబాటు చేయాలి.

■ రుణాల వసూలు కాలపరిమితిని పొడిగించాలి. ఇలా గడువు పొడిగించిన తరవాత కనీసం 20 శాతం బకాయి సొమ్మును తిరిగి చెల్లిస్తే రుణగ్రహీతను ఎగవేతదారుల జాబితాలో చేర్చకూడదు.

■ సమితి తీసుకున్న నిర్ణయాలను ప్రజలందరికీ తెలియజేయాలి. బ్రోచర్లు, పత్రికల్లో ప్రకటనలు, క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న ప్రాంతాలకు బ్యాంకుల సిబ్బంది వెళ్లి చెప్పడం తదితర అన్ని మార్గాల్లో విస్తృత ప్రచారం చేయాలి.

కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కేసులు నమోదు

- **మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని తెదేపా నేతల ఫిర్యాదు**

ఈనాడు, నెల్లూరు; న్యూస్‌టుడే, నెల్లూరు (నేరవిభాగం), పొదలకూరు, వేదాయపాలెం: మాజీ మంత్రి, వైకాపా నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై నెల్లూరు నగరం దర్గామిట్ట, పొదలకూరు పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా.. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను కించపరిచేలా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని తెదేపా నేతలు ఫిర్యాదులు చేశారు. దీనిపై కేసులు నమోదు చేసిన పోలీసులు విచారణకు రావాలని గోవర్ధన్‌రెడ్డికి మంగళవారం నోటీసులు ఇవ్వగా.. వారం రోజుల సమయం కోరినట్లు తెలిసింది. 'కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రస్తుతం పొదలకూరు పీఎస్‌లో నమోదైన కేసులో షరతులతో కూడిన బెయిల్‌పై ఉన్నారు. వాటిని ఉల్లంఘించడంతో పాటు సబ్ జ్యుడీషియల్‌లో ఉన్న అంశాలపై పదేపదే విలేకర్ల సమావేశాలు నిర్వహిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారు. తిరుమల లడ్డూ విషయంలో హిందువుల మనోభావాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తున్నారు. దాంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది' అని దర్గామిట్ట పోలీసుస్టేషన్‌లో నెల్లూరుకు చెందిన తెదేపా నేత పచ్చిపాల రామిరెడ్డి ఫిర్యాదు చేశారు. పొదలకూరు పోలీసుస్టేషన్‌లోనూ రెండు కేసులు నమోదు చేశామని, విచారణకు హాజరు కావాలని కాకాణికి నోటీసు జారీ చేశామని ఎస్సై హనీఫ్ తెలిపారు. ■ పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులను ఎదుర్కొంటామని నెల్లూరులోని నివాసంలో గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.



కాకాణికి నోటీసు ఇస్తున్న పోలీసు

క్లిక్ దూరంలో 25 రకాల సేవలు!

(మొదటి పేజీ తరువాయి)

దీనిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పక్కాగా ఉంటేనే, ఆశించిన ప్రయోజనం నెరవేరనుంది. కమిషనర్లు చేస్తారని పట్టించుకోనట్లైతే కథ మళ్లీ మొదటికొచ్చే ప్రమాదముంది.

ప్రతి సేవకూ ఓ గడువు

■ ప్రజలకు అందించాల్సిన ప్రతి పౌరసేవకూ ప్రభుత్వం గడువు నిర్దేశించింది. ఉదాహరణకు కొత్త ఇంటికి ఆస్తి పన్ను దరఖాస్తు చేసిన 15 రోజుల్లో విధించాల్సిందే. ట్రేడ్ లైసెన్స్ వారం రోజుల్లో పునరుద్ధరించాలి. మ్యారేజ్ రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ జారీ ప్రక్రియ మూడు రోజుల్లో పూర్తి చేయాలి. ఇలా 25 రకాల సేవల్లో ఏది ఎన్ని రోజుల్లో అందించాలో గడువు నిర్దేశించారు.

■ గడువులోగా సేవలు అందించడంలో జాప్యమైనా, దరఖాస్తు తిరస్కరించినా సహేతుక కారణాలను దరఖాస్తుదారులకు తెలియజేయాలి. అకారణంగా జాప్యం చేసినట్లు విచారణలో తేలితే.. సంబంధిత ఉద్యోగుల నుంచి పైఅధికారుల వరకు బాధ్యులను చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు.

■ పౌరసేవల ఫీజులను క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా చెల్లించవచ్చు. కార్యాలయాలకు వెళ్లే అవసరం లేకుండా నగదు రహిత చెల్లింపులకు అవకాశం కల్పించారు. సేవల వారీగా ఫీజుల వివరాలు పోర్టల్‌లో పేర్కొన్నారు. ఉదాహరణకు ఇంటి ఆస్తి పన్నుకు సంబంధించి ఆ ప్రాంతం, ఇంటి స్థలం కొలతలు (పొడవు, వెడల్పు) నమోదు చేయగానే ఆటోమేటిక్‌గా ఫీజుల వివరాలు తెలుస్తాయి.

– ఈనాడు, అమరావతి

జీఎస్టీ ఫైలింగ్‌లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్, ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ మధ్య ఒప్పందం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ 'జీరో పావర్టీ పి4' చొరవతో బంగారు కుటుంబం పథకం కింద నిరుద్యోగ యువతకు జీఎస్టీ ఫైలింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చేలా స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్, ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ మధ్య మంగళవారం ఒప్పందం కుదిరింది. విజయవాడలోని స్వర్ణాంధ్ర పి4 ఫౌండేషన్ కార్యాలయంలో ఆ ఫౌండేషన్ ఛైర్మన్ చెరుకూరి కుటుంబరావు సమక్షంలో సీఈవో జె.విజయలక్ష్మి, ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. నిరుద్యోగ యువతను స్వయం ఉపాధిలో ప్రోత్సహించేందుకు ఏటా ఉచిత శిక్షణ ఇవ్వాలని ట్యాక్స్ బార్ అసోసియేషన్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా కుటుంబరావు మాట్లాడుతూ.. నెల రోజుల ఉచిత శిక్షణకు డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, డిగ్రీ పూర్తిచేసిన వారు అర్హులని, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసిన వారికి ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు. వీళ్లు వివిధ వ్యాపార సంస్థలకు చెందిన నెలవారీ జీఎస్టీ రిటర్న్‌లను ఫైల్ చేయడం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ కార్యదర్శి సురేష్‌కుమార్, కోశాధికారి ఫణికుమార్, జీఎస్టీ శిక్షకులు చక్రరమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రహం అనుగ్రహం

4-2-2026 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్షం

తదియ: రా. 1-55 తదుపరి చవితి

పుబ్బ: రా. 12-10 తదుపరి ఉత్తర

వర్జ్యం: ఉ. 8-00 నుంచి 9-37 వరకు

అమృత ఘడియలు: సా. 5-42 నుంచి 7-19 వరకు

దుర్ముహూర్తం: ఉ. 11-51 నుంచి 12-37 వరకు

రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు

సూర్యోదయం: ఉ.6.36; **సూర్యాస్తమయం:** సా.5.53

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	27.0
అనంతపురం	17.6	33.4
కడప	18.0	31.0
హైదరాబాద్	18.6	28.6
విశాఖపట్నం	19.0	29.2
శ్రీకాకుళం	19.0	30.0
తిరుపతి	19.0	30.4
రాజమహేంద్రవరం	19.0	34.0
విజయవాడ	20.0	29.5
గుంటూరు	20.0	31.0
తాడేపల్లిగూడెం	20.0	31.0
నరసాపురం	20.0	31.8
కర్నూలు	20.0	32.8
ఒంగోలు	20.6	30.5
నెల్లూరు	20.6	30.5

భగీరథ యత్నం.. చివరి దశలో పోలవరం!

సవాళ్లను అధిగమించి.. వేగంగా ప్రాజెక్టు పనులు



ఎడమ టన్నెల్‌లో వేగంగా జరుగుతున్న పనులు

పోలవరం నుంచి ఈనాడు ప్రతినిధులు

గోదావరి పుష్కరాల (2027 జూన్) నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ లక్ష్యం చేరుకునేలా పనులు సాగుతున్నాయని జనవరి చివరి వారంలో ప్రాజెక్టును సందర్శించిన విదేశీ నిపుణుల బృందమూ అభిప్రాయపడింది. 'పోలవరం ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేం. అన్నీ సాంకేతిక సమస్యలు ఇందులో ఇమిడి ఉన్నాయి' అని వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి జలవనరుల శాఖ మంత్రి చేతులెత్తేశారు. 2024లో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ఈ సవాళ్లను అధిగమించి అనతికాలంలోనే మంచి ఫలితాలను చూపించింది. కేంద్ర ప్రభుత్వం అడ్వాన్సుగానే నిధులు ఇస్తోంది. పోలవరంలో ఇక మిగిలి ఉన్నది ప్రధాన డ్యాం నిర్మాణమే. మరో వైపు కుడి, ఎడమ కాలువల అనుసంధాన పనులూ వేగంగా పూర్తవుతున్నాయి. అప్పటికి తొలిదశ పునరావాసమూ పూర్తి చేయనున్నారు.

రాష్ట్రంలో 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడే నాటికి పరిస్థితి ఏమిటి? ఇప్పుడు ఏ స్థాయిలో ఉందంటే...

కాఫర్ డ్యాం పనుల్లో

2024 @ జూన్

● ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు నిర్మించినా సరైన ప్రమాణాలు పాటించకపోవడం, సీపేజీ పరిమిత స్థాయిలోనే ఉండేలా చూసుకోవాలని 2024కు ముందు కేంద్ర నిపుణులు హెచ్చరించినా పెడచెవిన పెట్టడంతో పెద్ద సమస్య ఏర్పడింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు నిర్మించిన ఫలితం లేకుండా పోయింది. ఆ రెండు డ్యాంల వల్ల మధ్యలో ప్రధాన డ్యాం నిర్మించే చోట నీళ్లు చేరకూడదు. పనులు సజావుగా చేసుకునేలా ఉండాలి. అలాంటిది ఎగువ కాఫర్ డ్యాం సీపేజీ ఎక్కువై ప్రధాన డ్యాం ప్రాంతం గోదావరిని తలపించేలా ఉండేది. పనులు ఎలా చేయాలా అని తలలు పట్టుకునే స్థితి.

● వైకాపా ప్రభుత్వ సకాలంలో ఎగువ కాఫర్ డ్యాం గ్యాప్‌లు పూడ్చకపోవడంతో సమస్యలు ఏర్పడ్డాయి. హైదరాబాద్ ఐఐటీ నిపుణుల బృందమూ ఇదే చెప్పింది. 2020 జులైలో ఆ గ్యాప్‌ల మధ్య నుంచి వచ్చిన వరద ప్రవాహ తాకిడికి ప్రధాన డ్యాం ప్రాంతంలో అగాధాలు ఏర్పడ్డాయి.

2026 @ ఫిబ్రవరి

● విదేశీ నిపుణుల బృందం ఇప్పటికే ఆరుసార్లు పోలవరం ప్రాజెక్టును సందర్శించింది. సాంకేతిక సమస్యలపై అధ్యయనం చేస్తూ కేంద్ర జల సంఘం, వివిధ కేంద్ర సంస్థల నిపుణులతో మేధోమథనం చేసి ఆయా సమస్యలపై పరిష్కారాలు సూచిస్తోంది. ఎగువ కాఫర్ డ్యాంను ఆనుకుని బట్రస్ డ్యాం నిర్మించాలని వారు సిఫార్సు చేశారు. దీంతో 2025 జూన్ నాటికి బట్రస్ డ్యాం నిర్మాణం పూర్తి చేశారు. దీనివల్ల వరదలు వచ్చే సమయానికి సీపేజీ బాగా తగ్గింది. మిగిలిన సీపేజీ నీటిని ఎప్పటికప్పుడు పంపులు పెట్టి బయటకు తోడేశారు. ఎప్పుడూ లేనట్లు ఒక వైపు వరదలు ఉన్నా ఎలాంటి అవాంతరాలూ లేకుండా పోలవరంలో 2025 జులై నుంచి నవంబరు వరకు పనులు చేశారు.

● అగాధాలను పూడ్చి వేశారు. ఇసుకతో నింపి వైబ్రో కాంపాక్షన్ చేశారు. నేలను టైట్ చేశారు. సమస్య పరిష్కారమైంది.

నిధుల సాధన.. పునరావాసంలో ముందడుగులు

2024 @ జూన్

● ఈ ప్రాజెక్టుకు రూ.55,455 కోట్లకు సాంకేతిక సలహా కమిటీ ఆమోదం 2019 ఫిబ్రవరిలో ఇచ్చినా కేంద్రం నుంచి ఆమోదం తెచ్చుకోలేదు. తొలిదశలో +41.15 మీటర్ల స్థాయిలో నీళ్లు నిలబెట్టేందుకు అవసరమైన నిధులు ఇవ్వాలంటూ జగన్ సర్కార్ ప్రతిపాదించింది. 2024 మే నాటికి రూ.2,697 కోట్ల బిల్లులు పోలవరంలో కేంద్రం నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది.

2026 @ ఫిబ్రవరి

● పోలవరంలో ఏడాదిన్నర కాలంలోనే రూ.4,747 కోట్ల విలువైన పనులు, పునరావాసానికి సంబంధించి ఖర్చు చేశారు. తొలిదశలో మిగిలి ఉన్న పనులకు అవసరమైన రూ.12,157 కోట్లు కేంద్రం అడ్వాన్సుగా ఇస్తామని ప్రకటించింది. అలాగే అందిస్తోంది. ఇప్పటికే కేంద్రం ఇచ్చిన రూ.4,318 కోట్లను రాష్ట్రం ఖర్చు చేసింది. మూడో విడత అడ్వాన్సు నిధులు త్వరలో రానున్నాయి.

డయాఫ్రం వాల్ పనులు నాడు..నేడు

2024 @ జూన్

● 2020 వరదల్లో డయాఫ్రం వాల్ ధ్వంసమైతే ఏడాది తర్వాత కానీ ఆ విషయం గుర్తించలేదు. తదుపరి నిర్ణయాలు మరింత ఆలస్యమయ్యాయి. కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలా లేక పాత డయాఫ్రం వాల్‌కు మరమ్మతులు చేయాలా అన్నది కూడా అప్పటికి తేల్చలేదు.

2026 @ ఫిబ్రవరి

● కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాత డయాఫ్రం వాల్ స్థానే కొత్త డయాఫ్రం వాల్ నిర్మించడానికి కేంద్ర జలసంఘం నిర్ణయించింది. 2025 జనవరిలో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం ప్రారంభమయింది. 2026 జూన్ నాటికి పూర్తి చేస్తామని బావర్ కంపెనీ పేర్కొంది. 65,352 చదరపు క్యూబిక్ మీటర్ల మేర పని చేయాలి. ఇప్పటికే 59,490 చదరపు క్యూబిక్ మీటర్ల పని పూర్తైంది. 1,350 మీటర్ల పొడవున నిర్మించాలి. 1,128 మీటర్ల మేర నిర్మాణం పూర్తయింది. అంటే 91 శాతం కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణమూ పూర్తయింది. ఫిబ్రవరి నెలాఖరుకు మొత్తం పూర్తవుతుంది.



కొత్త డయాఫ్రంవాల్ ఇదే.. 91శాతం పూర్తైంది. దీన్ని ఆనుకొని అటూఇటూ జరుగుతున్న ప్రధాన రాతి, మట్టి కట్ట పనులు

ఇక ప్రధాన డ్యాం నిర్మాణమే మిగిలింది

ప్రస్తుతం ప్రధాన డ్యాం నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. (రాతి, మట్టి కట్ట) డయాఫ్రం వాల్ నిర్మించిన ప్రాంతంలో ప్రధాన డ్యాం రెండు భాగాలుగా నిర్మిస్తున్నారు. గ్యాప్ 1, గ్యాప్ 2 భాగాలుగా ఈ పని చేయాల్సి ఉంది. గ్యాప్ 1 ప్రధాన డ్యాం ఆకృతులకు కేంద్ర జలసంఘం ఆమోదం లభించింది. డ్రాయింగులు కూడా పూర్తయ్యాయి. ప్రధాన డ్యాం గ్యాప్ 1 +25 మీటర్ల నుంచి +53.32 మీటర్ల వరకు నిర్మించాల్సి ఉంది. మొత్తం 584 మీటర్ల పొడవు. 12 లక్షల క్యూబిక్ మీటర్ల మేర పని చేయాలి. కిందటి నవంబరు నెలలో పనులు ప్రారంభించి 1.61 లక్షల క్యూబిక్ మీటర్ల పని చేశారు.

● గ్యాప్ 2 ప్రధాన డ్యాం ఆకృతులకు విదేశీ నిపుణుల బృందం సూత్రప్రాయంగా ఆమోదం తెలియజేసింది. వారి నుంచి లిఖిత పూర్వకంగా అనుమతులు రావాలి. ఈ డ్యాం 1.74 కిలోమీటర్ల మేర నిర్మించాలి. ప్రస్తుతం ఇసుక రీచ్‌లో +26 మీటర్ల వరకు ఎంబ్యాంక్‌మెంట్ నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. ఆ ప్రాంతంలో పనులు జరుగుతున్నాయి.

● కుడి కాలువ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఎడమ కాలువ పనులు ఈ ఏడాది జూన్ నాటికి పూర్తవుతాయి.

● పోలవరంలో తొలిదశలో +41.15 మీటర్ల స్థాయి నీళ్లు నిలబెట్టనున్నారు. ఆ మేరకు 38,060 నిర్వాసిత కుటుంబాలను తరలించాల్సి ఉంది. ఇప్పటికే 16,291 కుటుంబాలను తరలించారు. మరో 21,769 కుటుంబాలను తరలించాల్సి ఉంది. ఇంకా 49 పునరావాస కాలనీలను పూర్తి చేయాలి. ఇందు కోసం మార్చిలో టెండర్లు ఖరారు చేసి 2026 డిసెంబరు నాటికి పనులు పూర్తి చేయాలనేది లక్ష్యం.



ప్రారంభమైన ప్రధాన డ్యామ్ పనులు

ఉచిత వైద్య సేవల్లో దేశానికి నమూనాగా ఏపీ: మంత్రి సత్యకుమార్



కళ్లజోడు తొడిగి విద్యార్థితో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్. చిత్రంలో మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఉచిత వైద్య సేవల విధానం దేశానికే నమూనాగా నిలుస్తోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. జాతీయ అంధత్వనివారణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా తెనాలిలో మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద రాష్ట్రవ్యాప్తంగా 94,689 మంది విద్యార్థులకు రూ.2.52 కోట్ల ఖర్చుతో కంటి అద్దాలను అందిస్తున్నామని వివరించారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని తెనాలిలో ప్రారంభించినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

★ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా క్యాన్సర్ బాధితుల ఉచిత వైద్యానికి ప్రభుత్వం ఏటా రూ.650 కోట్లకుపైగా ఖర్చుచేస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ నెల 4న క్యాన్సర్ డే సందర్భంగా మహమ్మారి కట్టడికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఒక ప్రకటనలో వివరించారు. క్యాన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు నిర్వహిస్తున్న ఎన్సీడీ 4.0 సర్వేలో 3.71 లక్షల మందికి నోటి క్యాన్సర్, 1.80 లక్షల మందికి రొమ్ము, 2.46 లక్షల మందికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు.

గీతం వర్సిటీకి భూముల క్రమబద్ధీకరణపై హైకోర్టు విచారణ

విశాఖ జిల్లా కలెక్టర్, వర్సిటీ అధ్యక్షుడు శ్రీభరత్ తదితరులకు నోటీసులు

ఈనాడు, అమరావతి: విశాఖలోని గీతం విశ్వవిద్యాలయానికి సుమారు 54.79 ఎకరాలను క్రమబద్ధీకరిస్తున్నారని, దీన్ని నిలువరించాలని దాఖలైన వ్యాజ్యంలో కౌంటర్ వేయాలని ప్రతివాదులను హైకోర్టు ఆదేశించింది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, విశాఖ జిల్లా కలెక్టర్, విశాఖ గ్రామీణ మండల తహసీల్దార్, గీతం వర్సిటీ అధ్యక్షుడు శ్రీభరత్‌కు నోటీసులిచ్చింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణ మోహన్ మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. గీతం వర్సిటీకి భూముల క్రమబద్ధీకరణను అడ్డుకోవాలని, ఆక్రమణలను తొలగించాలని కోరుతూ న్యాయవాది నక్కా నిమ్మీ గ్రేస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. రుషికొండ, ఎండాడ గ్రామాల పరిధిలోని ఆ భూములు రస్తా, కొండ, పోరంబోకు, కాలువ భూమిగా రికార్డుల్లో ఉన్నాయన్నారు. చాలాకాలంగా గీతం వర్సిటీ ఆక్రమణల్లో ఉన్న ఆ భూములను క్రమబద్ధీకరించి, చట్టబద్ధం చేయాలని అధికారులు చూస్తున్నారన్నారు.

ఈ వ్యాజ్యానికి విచారణార్హత లేదు

రెవెన్యూశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది (జీపీ) కేఎం కృష్ణారెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'వ్యాజ్యానికి విచారణార్హత లేదు. ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించేందుకు ఉద్దేశించి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 30ని అడ్డుపెట్టుకొని గీతం వర్సిటీకి భూములను క్రమబద్ధీకరిస్తున్నారంటూ పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారు. జీవో 30 ఆధారంగా క్రమబద్ధీకరణ ప్రతిపాదన లేదు. ఈ వ్యవహారంలో పిటిషనర్‌కు సంబంధమే లేదు. ఆధారాల్లేకుండా పిటిషన్ వేశారు. ప్రభుత్వాధికారులను బ్లాక్‌మెయిల్ చేయడానికే ఇలాంటి వ్యాజ్యాలు దాఖలు చేస్తున్నారు. విశాఖ జిల్లా పరిధిలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాలు వేస్తున్నారు. వ్యాజ్యం విచారణార్హతపై కౌంటర్ వేస్తాం. సమయం ఇవ్వండి' అని కోరారు. గీతం వర్సిటీ తరఫున న్యాయవాది రుద్రప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. 'గీతం వర్సిటీకి భూముల క్రమబద్ధీకరణకు విశాఖ గ్రామీణ తహసీల్దార్ చర్యలు ప్రారంభించారని పిటిషనర్ చెబుతున్నారు. ఈ వాదనలకు ఆధారాలేమీ ఇవ్వలేదు. భూముల కేటాయింపుపై వర్సిటీ చేసిన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు గతంలో ఉత్తర్వులిచ్చింది. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ వ్యాజ్యానికి విచారణార్హత లేదు. కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వండి' అని కోరారు.



జూనియర్ల ప్రశ్నలకు నిదానంగా సమాధానమివ్వండి

సందేహాలు అడగాలంటే భయపడేలా మీ జూనియర్లతో ప్రవర్తించకండి. మీరు భయపెడితే తర్వాత ఎప్పుడూ వారు మిమ్మల్ని ప్రశ్నలు అడగరు. అన్నీ తమకు తెలుసని ఊహించుకుంటారు. అలాంటి ఊహల వల్ల కొన్నిసార్లు తప్పిదాలు జరగొచ్చు. అనుకోనిది ఏదైనా జరిగితే చివరికి దానికి సమాధానం చెప్పుకోవాల్సింది సీనియర్లే. మీ సొంత భద్రత కోసమైనా జూనియర్లు అడిగిన వాటికి నిదానంగా సమాధానం ఇవ్వండి.

– కమలేశ్ దార్జీ, వైద్య నిపుణుడు



విశాఖ ఉక్కుపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

విశాఖ ఉక్కు

పూర్తి ఉత్పత్తి సామర్థ్యం సాధించాలి

- రూ.486 కోట్ల నష్టాల నుంచి.. రూ.54 కోట్ల లాభాలు
- ఉక్కు పరిశ్రమ పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం ఉక్కు కర్మాగారం (ఆర్ఐఎన్ఎల్) రికార్డు స్థాయిలో 94% సామర్థ్య వినియోగానికి చేరుకుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2024 సెప్టెంబరులో ఉన్న రూ.486 కోట్ల నష్టాలను అధిగమించి.. 2026 జనవరిలో రూ.54 కోట్ల లాభాలను ఆర్జించిందన్నారు. సచివాలయంలో విశాఖ ఉక్కు పరిశ్రమ పురోగతిపై అధికారులతో సీఎం మంగళవారం సమీక్షించారు. ఈ సమావేశంలో కేంద్ర ఉక్కుశాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, విశాఖ ఉక్కు కర్మాగారం సీఎండీ మనీష్‌రాజ్ గుప్తా, సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "సంస్థలోని అన్ని విభాగాల్లో కొత్త విధానాలు ప్రవేశపెట్టి.. ప్లాంట్‌ను బలోపేతం చేయాలి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సహకారంతో ఏడాదిన్నరలో విశాఖ ఉక్కు కర్మాగారం అనూహ్య ప్రగతి సాధించింది. సంస్థ నిలదొక్కుకునేందుకు కేంద్రం రూ.11వేల కోట్ల సాయం అందించింది" అని తెలిపారు. అధికారులు మాట్లాడుతూ, "రోజుకు 19,401 టన్నుల ఉక్కు ఉత్పత్తికి సంస్థ చేరింది. మూడు బ్లాస్ట్‌ఫర్నేస్‌లు పనిచేయడంతో ఉత్పత్తి భారీగా పెరిగింది. 2024-25 రెండో త్రైమాసికంలో 9,215 టన్నుల ఉత్పత్తే చేసింది. అప్పుడు రోజుకు 45% ఉత్పత్తి సామర్థ్యమే ఉంది. కార్మికులు, ఉద్యోగులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా మరిన్ని ఫలితాలు సాధించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆర్ఐఎన్ఎల్‌కు క్రెడిట్ రేటింగ్ పెరిగింది" అని సీఎంకు తెలిపారు.

అర్జున్ కంట్లో పడితే అరదండాలే!





నేరస్థులతో రోబో, పోలీసులు ★ అనుమానితులను సరిపోల్చుకుంటున్న రోబో

విశాఖపట్నం(కార్పొరేషన్), న్యూస్‌టుడే: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన హ్యూమనాయిడ్ రోబో 'ఏఎస్‌సీ అర్జున్' ఇద్దరు పాత నేరస్థులను పట్టించింది. సోమవారం రాత్రి 8.10 గంటల సమయంలో స్టేషన్ ప్రాంగణంలో రోబో విధుల్లో ఉంది. అప్పటికే దానిలో నేరస్థుల వివరాలు అప్‌లోడ్ చేసి ఉండడంతో స్టేషన్‌లో తిరిగే ప్రతి ఒక్కరి ఫొటోలు తీసి, తన వద్ద ఉన్న సమాచారంతో సరిపోల్చుకుంటోంది. ఈ క్రమంలో ఇద్దరు అనుమానితులను గుర్తించింది. సీసీ టీవీ ఫుటేజీ సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే పోలీసులు వచ్చి రోబో చెప్పిన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని పాత నేరస్థులైన శివ, బంగారుగా గుర్తించారు. వారి వద్ద ప్రయాణ టికెట్ లేదని, వారిపై రాయగడ పోలీస్‌స్టేషన్‌లో అనేక కేసులు ఉన్నట్టు తెలుసుకొని, కేసు నమోదు చేశారు. రాయగడ పోలీసులకూ సమాచారం ఇచ్చినట్లు రైల్వే పోలీసులు మంగళవారం తెలిపారు. రైల్వే డీఆర్ఎం లలిత్ బోహ్రా మాట్లాడుతూ... పాత నేరస్థుల్ని గుర్తించడంలో ఏఐ ఆధారిత రోబో సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు.

అది రాజకీయ ఉద్దేశంతో పెట్టిన కేసు

- దాంతో మాకు సంబంధం లేదు
- జగన్ అక్రమాస్తుల కేసులో తెలంగాణ హైకోర్టుకు నివేదించిన రాంకీ

ఈనాడు, హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో సీబీఐ కేసు పెట్టడం రాజకీయాల్లో భాగమని, ఆ రాజకీయాలతో తమకు సంబంధం లేదంటూ రాంకీ ఫార్మా మంగళవారం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. దాని ఆధారంగా ఈడీ కేసు పెట్టి, జప్తు చేసిన తమ ప్లాట్లను విడుదల చేయాలన్న మధ్యంతర ఉత్తర్వులపై విచారణ చేపట్టాలని కోరింది. ఆ ఆస్తుల జప్తు చెల్లదంటూ అప్పిలేట్ ట్రైబ్యునల్ వెలువరించిన తీర్పుపై ఈడీ, రాంకీ హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వీటిపై జస్టిస్ పి.శ్యాంకోశీ, జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావులతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది.

రూ.150 కోట్ల బ్యాంకు గ్యారంటీ ఇస్తాం

రాంకీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 'విశాఖపట్నంలో ఫార్మా సిటీ ఏర్పాటుకు చంద్రబాబు నేతృత్వంలోని ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ టెండర్లు పిలవగా ప్రాజెక్టును దక్కించుకున్నాం. పర్యావరణ పరిరక్షణ కోసం ఫార్మా సిటీ అవతల అర కిలోమీటరు గ్రీన్ బెల్ట్ ఏరియాగా బఫర్‌జోన్ వదిలిపెట్టాలని సుప్రీం కోర్టు కమిటీ ఆదేశించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి లోపలే 250 మీటర్లు బఫర్‌జోన్ వదిలిపెట్టాలని సూచించారు. బఫర్‌జోన్‌కు 250 మీటర్లు వదిలితే 1500 ఎకరాలు పోతుందని, ఫార్మా సిటీకి ఐదారు వందల ఎకరాలు మాత్రమే మిగులుతుందని.. టెండరు ఒప్పందం ప్రకారం 50 మీటర్లు గ్రీన్‌బెల్ట్ ప్రాంతంగా వదిలిపెడతామని మేం ప్రతిపాదించాం. దానికి రాజశేఖరరెడ్డి అంగీకరించారు. ప్లాట్ల విక్రయంకూడా జరిగింది. ఆ తర్వాత వైఎస్ మృతి చెందడంతో ఆయన కుమారుడు జగన్ సొంతంగా రాజకీయ పార్టీ పెట్టారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం సీబీఐ కేసులు నమోదు చేసింది. బఫర్‌జోన్‌ను 250 మీటర్ల నుంచి 50 మీటర్లకు కుదించడంవల్ల రాంకీకి లబ్ధి చేకూర్చారంటూ సీబీఐ కేసు నమోదు చేసింది. దాని ఆధారంగా ఈడీ కూడా కేసుపెట్టి, 150 ఎకరాలను జప్తుచేసింది. జప్తు చెల్లదని అప్పిలేట్ ట్రైబ్యునల్ తీర్పు వెలువరించింది. అయితే విడుదల చేసిన ఆస్తులను అన్యాక్రాంతం చేయరాదని ఆదేశాలిచ్చింది. దాన్ని సవాలు చేస్తూ అప్పీలు వేశాం. జప్తు చేసిన స్థలానికి సంబంధించి రూ.150 కోట్ల బ్యాంకు గ్యారంటీ సమర్పిస్తాం. కేసు రుజువైతే ఆ మొత్తాన్ని ఈడీ జప్తు చేయవచ్చు' అని చెప్పారు. వాదనలు వినిపించడానికి అదనపు సొలిసిటర్ జనరల్ కార్యాలయం న్యాయవాది గడువు కోరడంతో విచారణను కోర్టు ఈ నెల 12కి వాయిదా వేసింది.

దుగరాజపట్నం పోర్టుకు భూముల సేకరణ!

- 2,170 ఎకరాల సేకరణకు.. రూ.544 కోట్ల కేటాయింపు
- ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు

ఈనాడు, అమరావతి: తిరుపతి జిల్లా దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, జాతీయ మెగా నౌకానిర్మాణ క్లస్టర్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. వీటికి టెక్నికల్ ఫీజిబులిటీ రిపోర్టును రైట్స్ సంస్థ తయారుచేసింది. వాటిని కేంద్ర ప్రభుత్వ పరిశీలనకు అధికారులు పంపారు. ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు వీలుగా 2026-27 బడ్జెట్‌లో కేంద్రం నిధులు కేటాయించిందని.. ప్రాజెక్టు పనులు త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీనికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) అందించనుంది. ఈ ప్రాజెక్టు అభివృద్ధికి రూ.30వేల కోట్లతో ప్రతిపాదనలను ఏపీ మారిటైం బోర్డు రూపొందించింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం దుగరాజపట్నం పోర్టు అభివృద్ధికి కేంద్రం నిధులుసమకూర్చాలి. ఈ ప్రాజెక్టు ద్వారా ఏటా 5లక్షల టన్నుల సరకు రవాణా సామర్థ్యంతో యాంకర్ షిప్‌యార్డు, నౌకానిర్మాణం, నౌకల మరమ్మతుల వ్యవస్థ అందుబాటులోకి రానుంది.

ఎస్‌పీవీ ఏర్పాటు

ఏపీ మారిటైం బోర్డు, విశాఖపట్నం పోర్టు అథారిటీ ఉమ్మడి భాగస్వామ్యంతో పోర్టు, క్లస్టర్ అభివృద్ధి చేయనున్నాయి. దీనికోసం ప్రత్యేక వాహకనౌక (ఎస్‌పీవీ) ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే అనుమతించింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు ఉంటారు. త్వరలో దీన్ని ఏర్పాటుచేస్తామని అధికారులు తెలిపారు.

మారిటైం రంగానికి రూ.1,765 కోట్లు

ఈ ప్రాజెక్టును దశలవారీగా కేంద్రం అభివృద్ధి చేయనుంది. అందుకు అనుగుణంగా మారిటైం రంగానికి వివిధ విభాగాల కింద రూ.1,765 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. అందులో అత్యధిక వాటా దుగరాజపట్నం ప్రాజెక్టుకు దక్కుతుందని అధికారులు తెలిపారు.

★ దుగరాజపట్నంలో 2 కి.మీ.ల వాటర్ ఫ్రంట్‌తో పోర్టు అభివృద్ధి చేయనున్నారు. పోర్టు నిర్మాణానికి అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుంది. డెవలపర్‌ను గుర్తించి.. వారికి క్లస్టర్ అభివృద్ధి పనులు అప్పగించనున్నారు. ఈ ఖర్చును పీపీపీ విధానంలో ప్రైవేటు డెవలపర్ భరిస్తారు. రాష్ట్రప్రభుత్వం తన ఈక్విటీ కింద భూములను ఇస్తుంది. నిర్మాణ వ్యయాన్ని కేంద్రం భరిస్తుంది. పదేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేసే అవకాశం ఉంది.

ప్రాజెక్టు అభివృద్ధికి తొలి అడుగు

నేషనల్ మెగా నౌకానిర్మాణ క్లస్టర్ ఏర్పాటుకు భూములు సేకరించి.. ఎస్‌పీవీకి బదిలీ చేసేందుకు రాష్ట్రప్రభుత్వం అనుమతులిచ్చింది. దీని కోసం 2,170.70 ఎకరాలు కావాలని రైట్స్ సంస్థ తన నివేదికలో పేర్కొంది. తిరుపతి జిల్లా వాకాడులో 1,995.04 ఎకరాలు, నెల్లూరు జిల్లా కోట మండలంలో 175.66 ఎకరాలు ప్రాజెక్టు కోసం సేకరించాలి. దీనికోసం రూ.544.30 కోట్లను రాష్ట్రప్రభుత్వం కేటాయించింది.

నంది అవార్డులు, నాటకోత్సవాలపై త్వరలో ప్రకటన: మంత్రి దుర్గేష్

ఈనాడు, అమరావతి: నంది అవార్డులు, నాటకోత్సవాల నిర్వహణపై త్వరలోనే ప్రకటన చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అమరావతిని సినిమా రంగానికి కేంద్ర బిందువుగా మార్చాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉందని ఆయన వివరించారు. చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఏప్రిల్ నుంచి ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తామని మంత్రి పేర్కొన్నారు. సచివాలయంలో మంగళవారం ఆయన జనవరి 11న తెనాలిలో నిర్వహించిన ఏపీ షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్-2026 పోటీల్లో విజేతలను సత్కరించారు. విశాఖకు చెందిన చంద్రశేఖర్ తీసిన 'మహావృక్షం' ప్రథమ బహుమతి పొందింది. శ్రీకాకుళానికి చెందిన శ్రీనివాసరావు తీసిన 'సింహాద్రి అప్పన్న' ద్వితీయ, పాలకొల్లుకు చెందిన నవీన్ కుమార్ 'అబద్ధం వర్సెస్ నిజం' తృతీయ బహుమతులు సాధించాయి. విజేతలకు రూ.లక్ష చొప్పున నగదు అందించారు. ఉత్తమనటిగా సుజిత (మనం), ఉత్తమ క్యారెక్టర్ నటిగా సాయిప్రవక్త (అబద్ధం వర్సెస్ నిజం), ఉత్తమ నటుడు పవన్‌శర్మ (మన్ను-మిన్ను), బాలనటిగా హర్షతున్నీసా, యంగ్ టాలెంట్‌గా రిత్విక్‌రెడ్డి (అస్త్ర), ఉత్తమ డైరెక్టర్‌గా త్రివిక్రమ్ (డెబ్యూ డైరెక్టర్), విలన్‌గా ఎం.భాస్కర్ ఎంపికయ్యారు. వీరితోపాటు తెలుగు స్క్రిప్ట్ పరిశీలకులు మంజులూరి లక్ష్మీపతి మాస్టర్, జగదీశ్, దర్శకుడు నరేశ్ దోనె తదితరులను మంత్రి సత్కరించి జ్ఞాపికలు అందించారు. దర్శకుడు దిలీప్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు

భారత్‌లో తయారీకి కొత్త సత్తువ

అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే క్రమంలో చిక్కు సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి... ఒడంబడిక ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చే సమయం ఆసన్నమైందని కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ మూడు రోజుల కిందటే వెల్లడించారు. అంతలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌తో ఒప్పందానికి ఓటేస్తున్నామని, టారిఫ్‌లను 18శాతానికి తగ్గిస్తున్నామంటూ తనదైన అనూహ్య రీతిలో ప్రకటించారు. వాణిజ్య ఒప్పంద విధివిధానాలపై ఇంకా స్పష్టత లేనప్పటికీ సుంకాల భారం దిగిరావడం మాత్రం సంతోషకర పరిణామమే! చైనా, వియత్నాం, బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఇండొనేసియా, మలేసియా, థాయ్‌లాండ్ తదితర దేశాలతో పోల్చితే ఇండియాపై అమెరికా సుంకాలు తగ్గడంతో అగ్రరాజ్య విపణిలో మన సరకులకు గిరాకీ పెరుగుతుంది. ముఖ్యంగా ఎక్కువ మందికి ఉపాధి కల్పించే దుస్తులు, రత్నాలూ ఆభరణాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, తోలు, పాదరక్షలు, రసాయన పరిశ్రమలకు ఇది లాభదాయకం కానుంది. డీలాపడిన ఎంఎస్ఎంఈలకు కొత్త సత్తువనిచ్చి, 'భారత్‌లో తయారీ'కి సరికొత్త రెక్కలనిస్తుంది. ఇరుపక్షాల నడుమ సంబంధాల బలోపేతానికిగానూ గడిచిన కొన్నాళ్లుగా ప్రధాని మోదీ, భారత ప్రతినిధి బృందాలు కనబరచిన సంయమనమే అమెరికా సుంకాల విషయంలో అంతిమంగా సానుకూల ఫలితాన్ని రాబట్టింది!

గడిచిన నాలుగేళ్లలో భారతీయ వస్తూత్పత్తులకు అతిపెద్ద దిగుమతిదారు అమెరికాయే. 2024లో 21వేల కోట్ల డాలర్లకు పైబడిన ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 50వేల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలని ఇరుపక్షాలు లోగడే నిశ్చయించాయి. కానీ, ట్రంప్ మొదలుపెట్టిన సుంకాల సమరంతో దిల్లీ-వాషింగ్టన్ స్నేహబంధం ఒడుదొడుకులకు లోనైంది. టారిఫ్‌ల మోతతో ఆటంకాలు ఎదురైనప్పటికీ 2024 ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలంతో పోల్చితే, నిరుడు అవే తొమ్మిది నెలల్లో అమెరికాకు భారత ఎగుమతులు 9.75శాతం అధికమయ్యాయి. అదే సమయంలో అగ్రరాజ్యం నుంచి దిగుమతులూ 12.85శాతం పెరగడం గమనార్హం! ఇండియాతో వాణిజ్యలోటు ఎక్కువగా ఉందన్న సంగతిని ట్రంప్ పదేపదే ప్రస్తావిస్తున్న నేపథ్యంలో అమెరికా వస్తూత్పత్తుల కొనుగోళ్లను దిల్లీ పెంచింది. అలాగని ఇంధన, సాంకేతిక, వ్యవసాయ, ఇతరేతర రంగాల్లో 50వేల కోట్ల డాలర్ల విలువైన దిగుమతులకు భారత్ సరేనందన్న ట్రంప్ మాటలు ఇప్పటికిప్పుడు నిజమయ్యే పరిస్థితి ఎంతమాత్రం లేదు. ఇండియా, ఈయూలు చారిత్రాత్మక ఎఫ్‌టీఏతో దగ్గర కావడం, బీజింగ్‌పై పైచెయ్యి సాధించాలంటే దిల్లీ సహకారం అనివార్యమవడం తదితర పరిణామాల నేపథ్యంలోనే సుంకాల తగ్గింపునకు ట్రంప్ ముందుకొచ్చారన్నది వాస్తవం!

సుంకాలు, పన్నేతర ప్రతిబంధకాలు అన్నింటినీ తొలగించి తమ వ్యవసాయ, పాడి ఉత్పత్తులను భారత విపణిలోకి వెల్లువెత్తించడానికి అవకాశమివ్వాలని ట్రంప్ యంత్రాంగం ఎప్పటినుంచో పట్టుబడుతోంది. దేశీయ రైతాంగానికి అది నష్టం చేస్తుందన్న భావనతో ఇండియా ఇంతవరకు దానికి ససేమిరా అంటోంది. 'అన్నదాతలు, మత్స్యకారులు, పాడి రైతుల ప్రయోజనాల పరిరక్షణలో భారత్ ఎప్పటికీ రాజీపడబోదు' అని ప్రధాని మోదీ సైతం నిరుడు తేల్చిచెప్పారు. దేశీయ పరిశ్రమలూ వ్యవసాయం, పాడి, ఎంఎస్ఎంఈల రక్షణకు తగిన చర్యలు తీసుకుంటూనే వాణిజ్య ఒప్పందాలను ఒక కొలిక్కి తెస్తున్నామని కేంద్రం నిన్న లోక్‌సభలో పేర్కొంది. అమెరికాతో ఒడంబడికలోనూ ఆమేరకు జాగ్రత్త వహించాలి. ట్రంప్ ఆశిస్తున్నట్లుగా రష్యా నుంచి చమురు దిగుమతులు పూర్తిగా ఆగిపోతే 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత ఇంధన బిల్లు 1200 కోట్ల డాలర్ల మేర అధికమవుతుందని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేసింది. ఈ నేపథ్యంలో జాతి శ్రేయస్సుకు లబ్ధి కలిగించే విధంగానే అమెరికాతో వాణిజ్య దౌత్యంలో ఇండియా నేర్పుగా నెగ్గుకురావాలి!




బయటి ప్రపంచాన్ని మెప్పించడానికి పాడటం వృత్తి. తనను తాను మెచ్చుకునేలా పాడుకోవడం కళ. అలా తనను తాను తెలుసుకునే క్రమంలో కళాకారుడు సృష్టించే కళే సంతోషాన్ని ఇస్తుంది. చిరకాలం నిలిచి ఉంటుంది.

– పండిట్ భీమ్‌సేన్ జోషి

గురుబ్రహ్మ...

భౌతిక ప్రపంచంలో వినోద, విహారాలతో సంతృప్తి చెందుతున్నంతవరకు ఆధ్యాత్మిక లోకంలో విహరించాలనే ఆలోచన రాదు. ప్రాపంచిక సుఖాలే శాశ్వతమన్న భ్రమలో ఉండి దారితెన్నులు తెలియని వారికి భగవత్సన్నిధికి దిశానిర్దేశం చేసే వ్యక్తి గురువు.

'గురువు' అంటే అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానాన్ని ప్రసాదించేవాడు అని అర్థం. అందుకే మన సంస్కృతిలో గురువును దైవసమానంగా భావిస్తాం. గురువు పుస్తక జ్ఞానాన్ని అందించే వ్యక్తి మాత్రమే కాదు. జీవిత సత్యాన్ని, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, నైతిక విలువలను బోధించేవాడు. జీవితానికి సరైన మార్గాన్ని చూపించి, కష్ట సమయంలో ధైర్యాన్ని నింపి, లక్ష్యసిద్ధికి సాయపడేవాడు.



అంతర్యామి

ఒక మహారాజు కుమార్తె వజ్రాలహారం పోగొట్టుకుంది. ఎంతో విలువైన ఆ హారాన్ని తెచ్చిన వారికి తన ఆస్థానంలో పెద్ద కొలువును ఇస్తానని రాజు ప్రకటించాడు. రాజ్యంలో యువకులంతా అన్నహారాలు మాని హారం వెతుకులాటలో పడ్డారు. ఓ నిరుపేద యువకుడు కూడా హారం కోసం వెతుకుతూ ఓ రోజు ఎండ తీవ్రత వల్ల అలసిపోయి నది ఒడ్డున చెట్టు కింద కూర్చున్నాడు. అప్పుడు అతడికి నీళ్లలో తళతళా మెరుస్తున్న వజ్రాల హారం కనిపించింది. వెంటనే యువకుడు నదిలో దూకి దాని కోసం వెతికాడు. ఎంత వెతికినా ఫలితం దక్కక నిరుత్సాహంగా ఒడ్డుకు వచ్చేశాడు. అప్పుడు అతడికి 'నాయనా! నువ్వు నీటిలో చూసింది వజ్రాల హారం ప్రతిబింబాన్ని. ఒక్కసారి తల పైకెత్తి చూడు' అనే మాటలు వినిపించాయి. వెంటనే ఆ యువకుడు చెట్టుపైకి చూశాడు. కొమ్మకు వేలాడుతూ వజ్రాల హారం ఉందక్కడ. ఆ విషయం చెప్పిన వ్యక్తి కోసం చూస్తే చెట్టు మొదట్లో ఓ సాధువు కనిపించాడు. వెంటనే యువకుడు ఆ సాధువుకు ప్రణమిల్లి, చెట్టు ఎక్కి హారం తీసుకున్నాడు.

ప్రతిబింబాన్ని చూసి అదే వజ్రాల హారమని భ్రమించిన వ్యక్తికి, నిజమైన దాన్ని చూపించిన సాధువులా.. ప్రాపంచిక విషయాలలో మునిగి తేలుతున్న వారికి సరైన దిశానిర్దేశం చేసేవాడే అసలైన గురువు. గురువు అంటే పాఠశాలలు, కళాశాలల్లో బోధించే ఉపాధ్యాయులు మాత్రమే కాదు. జీవితంలో మనకు మార్గదర్శకులుగా ఉండే ప్రతి ఒక్కరూ గురువులే. తల్లిదండ్రులు, తోబుట్టువులు, పెద్దలు, స్నేహితులు, మంచి పుస్తకాలు, అనుభవాల్ని కూడా గురువులుగానే భావించాలి. గురువు ఒక వ్యక్తి జీవితాన్ని తీర్చిదిద్ది, సక్రమ మార్గంలో నడిపిస్తాడు. గురువు లేని విద్య లేదు, పురోగతి లేదు. అందుకే గురువును గౌరవించడం వారి బోధనలను పాటించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం. ముఖ్యంగా ఆధ్యాత్మిక జీవనంలో గమ్యాన్ని చేరుకోవడానికి అనుభవజ్ఞుడైన గురువు మార్గదర్శనం ఎంతో అవసరం. భక్తుడికి భగవంతుడికి అనుసంధానకర్తయైన గురువు బ్రహ్మతో సమానమే. అలాంటి గురువు లభించిన వారి జన్మ ధన్యమే.

– ఎం.వెంకటేశ్వర రావు

సాగు రంగంలో మారిన ప్రాధమ్యాలు



దేశానికి ఆహార భద్రత సమకూరిన పరిస్థితుల్లో 2026 కేంద్ర బడ్జెట్లో సాగు రంగానికి సంబంధించి ప్రాధమ్యాలు మారాయి. రుణ మాఫీలు, కనీస మద్దతు ధరలు, సబ్సిడీల పెంపు వంటి సంచలన ప్రకటనలేమీ ఈ పద్దులో లేవు. తాత్కాలిక పరిహారాలు, ఉపశమనాల నుంచి నష్టభయం లేని స్థిర ఆదాయాల సాధనకు పునాది ఏర్పరచడమే ఈ బడ్జెట్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

భారతీయ వ్యవసాయం నేడు కొత్త మలుపులో నిలిచి ఉంది. ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, చేపలు, పాడి ఉత్పత్తులను అవసరానికి మించి ఉత్పత్తి చేసుకోగలుగుతున్నాం. విదేశాలకూ ఎగుమతి చేస్తున్నాం. అయితే, రైతులకు స్థిరమైన ఆదాయం కల్పించడం, వాతావరణ మార్పులను, జాతీయ, అంతర్జాతీయ విపణుల్లో ఒడుదొడుకులను తట్టుకుంటూ ఎప్పటికప్పుడు రాబడి పెరిగేలా చూడటం విధానకర్తల ముందున్న అతి పెద్ద సవాలు. తాజా కేంద్ర బడ్జెట్ దీనికే ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది.

భారతదేశ స్థూల విలువ జోడింపులో వ్యవసాయం వాటా 18శాతమే. కానీ, శ్రామిక బలగంలో 45శాతం ఈ రంగంపైనే ఆధారపడి ఉందని 2025-26 ఆర్థిక సర్వే తెలిపింది. వ్యవసాయం, అనుబంధ వృత్తుల్లో ఉత్పత్తి పెరుగుతున్నా తరచూ అనిశ్చితి ఎదురవుతోంది. 2024-25లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 35.7 కోట్ల టన్నులకు చేరింది. అంతకుముందు సంవత్సరం కన్నా అది 7.5శాతం ఎక్కువ. ఉద్యాన పంటల ఫలసాయం ఆహారోత్పత్తిని మించిపోయింది. దశాబ్దం కిందటి నుంచి పంటల సాగుకన్నా పశుపోషణ, మత్స్య పరిశ్రమ వేగంగా వృద్ధి చెందుతున్నాయి. మరోవైపు వాతావరణ మార్పుల వల్ల ప్రకృతి విపత్తులు సర్వసాధారణమవుతున్నాయి. అస్థిర వర్షపాతం, మండుటెండలు, భూగర్భ జలాలు తరిగిపోవడం, ఒకే జిల్లాలో, ఒకే మండలంలో దిగుబడుల్లో తేడాలు గ్రామీణుల ఆదాయాలలో అనిశ్చితికి దారితీస్తున్నాయి. దిగుబడులు పెరిగినా మార్కెట్లో ధరలు పడిపోయి రైతు ఆదాయాలకు కోతపెడుతున్నాయి. విత్తనాలు, ఎరువుల ధరలు పెరిగిపోతున్నాయి. కోతల తరవాత ఆరు నుంచి 10శాతం పంట నష్టమవుతున్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో తాజా బడ్జెట్ దిగుబడుల పెంపుకన్నా, నష్టాల నివారణపై ఎక్కువగా దృష్టి సారించింది.



అధిక రాబడే ధ్యేయంగా...

తాజా కేంద్ర బడ్జెట్లో కీలకమైన ప్రకటన భారత్-విస్తార్ పోర్టల్ ప్రారంభం. ఇది కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో బహు భాషల్లో పని చేసే వ్యవసాయ సలహా వేదిక. అగ్రిస్టాక్, ఐసీఏఆర్ పరిశోధనా ఫలాలు, డిజిటల్ సమాచార వ్యవస్థల సమ్మేళనమిది. భారతీయ వ్యవసాయ విస్తరణ సేవలకు సమాచార కొరతేమీ లేదు. ఈ సమాచారాన్ని రైతులకు సకాలంలో అందించి ఆశించిన ఫలితాలను సాధించడంలోనే సమస్య ఎదురవుతోంది. సమాచారానికి తోడు ఉత్పత్తి సాధనాలను సమకూర్చాలి. నీరు, రుణాలు సకాలంలో అందాలి. పంట చేతికొచ్చాక ధరలు పడిపోకుండా చూడాలి. ఈ లోపాలను అధిగమిస్తేనే విస్తార్ సార్థకమవుతుంది. భూసార పరీక్షలు, ఏ నేలలో ఏ పంటలు వేయాలనే సూచనలు, వాతావరణ వివరాలు, పంటల వైవిధ్యానికి సంబంధించిన సిఫార్సులు, మార్కెట్ సమాచారం అందించి రైతులు సరైన నిర్ణయాలు తీసుకోవడానికి తోడ్పడాలి. నష్ట భయాన్ని నివారించాలి. ఈ పనులను చేయగల సత్తాను భారత్-విస్తార్‌కు సమకూర్చాలి. చిన్న రైతులకు దీనివల్ల ఎంతో లబ్ధి చేకూరుతుంది. కొత్తగా 500 ప్రధాన జలాశయాలు, అమృత్ సరోవరాలను సమగ్రంగా అభివృద్ధి చేయనున్నట్లు తాజా బడ్జెట్‌లో ప్రకటించారు. దీనికి మరికాస్త ఎక్కువ ప్రాధాన్యం లభించి ఉంటే బాగుండేది. పంట దిగుబడి స్థిరంగా ఉండాలంటే నీటి సరఫరా నికరంగా జరగాలి. అలాంటి చోట్ల గ్రామీణుల ఆదాయాలు స్థిరంగా ఉంటాయి. వర్షాభావ ప్రాంతాల్లోనూ నిరంతర నీటి సరఫరా, భూగర్భ జలాల పునరుద్ధరణ, చెరువుల్లో చేపల పెంపకం, పశువులకు నీరు, గ్రామస్థాయిలో వాతావరణ మార్పుల నుంచి భద్రత లభించినప్పుడు రైతులకు నీటి వనరులు ప్రభుత్వ సబ్సిడీలకన్నా మెరుగైన నష్టనివారణ సాధనాలవుతాయి.

ఆహార ధాన్యాలకన్నా మిన్నగా ఆదాయం తెచ్చిపెట్టే కొబ్బరి, జీడిపప్పు, కొకోవా, చందనం, ఇతర ఉద్యాన పంటలకు ఈసారి బడ్జెట్ ప్రాధాన్యమివ్వడం విశేషం. భవిష్యత్తులో వరి, గోధుమ వంటి ఆహార పంటలు మాత్రమే గ్రామీణ ఆదాయాలను పెంచలేవని ఆర్థిక సర్వే తెలిపింది. నీటి కొరత, పెట్టుబడి ఖర్చులు పెరగడం, భూసార క్షయం వంటివి దీనికి కారణాలు! ఆహార పంటలకు బదులు కొబ్బరి, జీడి, చందనం వంటి పంటలకు మళ్లితే హెక్టారుకు అధిక ఆదాయం లభిస్తుంది. ఎగుమతుల ద్వారా అదనపు రాబడి సిద్ధిస్తుంది. బ్రాండు పేరు మీద అమ్మితే వ్యాపార వృద్ధి జరుగుతుంది. సాగు, శుద్ధి, ఎగుమతులు, మార్కెటింగ్ విభాగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అయితే, నాణ్యమైన వంగడాలను వాడటం, పంట కోత తరవాత సరైన ప్రాసెసింగ్, శీతల గిడ్డంగుల సదుపాయాలు, మార్కెట్ వసతులు ఉంటేనే అధిక ఆదాయానికి అవకాశం ఉంటుంది. ఈ ఏడాది బడ్జెట్‌లో మూలధన వ్యయాన్ని రికార్డు స్థాయిలో రూ.12.2 లక్షల కోట్లుగా నిర్ణయించడంతో ఇలాంటి మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టిపెట్టిందని అర్థమవుతోంది.

తెలుగు రాష్ట్రాలకు ప్రయోజనం

అధిక విలువనిచ్చే కొబ్బరి, జీడి, ఉద్యాన పంటలకు బడ్జెట్ ప్రాధాన్యమివ్వడం ఆంధ్ర, తెలంగాణలకు లాభిస్తుంది. అమృత్ సరోవరాలు, సమగ్ర జలాశయాల అభివృద్ధి కార్యక్రమాలు రాయలసీమ, ఉత్తర తెలంగాణలలోని చెరువులకు, తద్వారా రైతులకు మేలు చేస్తాయి. భారత్-విస్తార్ వల్ల రైతులకు వారి భాషలోనే వ్యవసాయ పరమైన సలహా సంప్రదింపులు లభిస్తాయి. మౌలిక వసతుల విస్తరణతో వారు ఎంతో ప్రయోజనం పొందుతారు. ప్రధానమంత్రి-కిసాన్ పథకం కింద ఇప్పటి వరకు దేశంలో 11 కోట్ల మందికి పైగా రైతులకు రూ.4 లక్షల కోట్ల మేర సాయం అందింది. కేంద్ర బడ్జెట్ ఈ పథకాన్ని విస్మరించలేదు. అదే సమయంలో ఇక సంక్షేమం అంటే కేవలం నగదు సాయం చేయడం మాత్రమే కాదనీ సాగులో, రైతు జీవితాల్లో అనిశ్చితిని తగ్గించడమన్న సందేశం బడ్జెట్‌లో కనిపిస్తోంది.



డాక్టర్ షేక్ ఎన్.మీరా
డైరెక్టర్, ఐకార్–అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్

మన ఐన్‌స్టీన్... బోస్!

విజ్ఞానశాస్త్రంలో ఇరవయ్యో శతాబ్దాన్ని అత్యంత ప్రభావితం చేసిన శాస్త్రవేత్తల్లో ప్రముఖులు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, మేరీ క్యూరీ. వీరిద్దరి ప్రశంసలు అందుకున్న భారతీయుడు... భౌతిక శాస్త్రవేత్త సత్యేంద్రనాథ్ బోస్. 'యాన్ ఇంపార్టెంట్ స్టెప్ ఫార్వర్డ్' అంటూ ఐన్‌స్టీనే బోస్ పరిశోధనాపత్రం 'ప్లాంక్స్ లా అండ్ హైపోథెసిస్ ఆఫ్ లైట్ క్వాంటా'ను జర్మన్ భాషలోకి అనువదించారు. అలాగే ఐన్‌స్టీన్‌కు అసాధారణ రీతిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించిపెట్టిన సాపేక్ష సిద్ధాంతాన్ని ఆంగ్లంలోకి అనువదించారు బోస్.

ఒక్క రంగంలోనో, ఒక్క సబ్జెక్టులోనో అసాధారణ ప్రావీణ్యం ప్రదర్శించడమే గొప్ప. అలాంటిది ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిలాసఫీ, ఆర్ట్స్, సాహిత్యం, సంగీతం తదితర రంగాల్లోనూ అద్భుతమైన ప్రతిభాపాటవాలను కనబరిచారు బోస్. ఆయనకు పలు భాషలు వచ్చు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 1937లోనే సైన్స్ గురించి తాను రాసిన పుస్తకం 'విశ్వ-పరిచయ్'ను బోస్‌కు అంకితమిచ్చారు. సత్యేంద్రనాథ్ బోస్ 1894 జనవరి ఒకటిన కోల్‌కతాలో జన్మించి 1974 ఫిబ్రవరి నాలుగున అస్తమించారు.



విఖ్యాత భారత శాస్త్రవేత్తలు జగదీశ్ చంద్రబోస్, ప్రఫుల్ల చంద్రరాయ్‌లు సత్యేంద్రనాథ్‌కు స్ఫూర్తి. ఖగోళ భౌతిక శాస్త్రవేత్త మేఘనాథ్ సాహా స్నేహితుడు. ఐన్‌స్టీన్‌తో కలిసి బోస్ పలు పరిశోధనలు చేశారు. క్వాంటమ్ భౌతికశాస్త్రంలో బోస్- ఐన్‌స్టీన్ స్టాటిస్టిక్స్, బోస్- ఐన్‌స్టీన్ కండెన్సేట్ థియరీలు చాలా ప్రఖ్యాతి పొందాయి. బోస్ ఐన్‌స్టీన్ స్టాటిస్టిక్స్‌కి అనుగుణంగా ప్రవర్తించే కణాలకు పాల్ డిరాక్ అనే శాస్త్రవేత్త వారిద్దరి పేర్లు కలిసేలా 'బోసాన్స్' అని పేరు పెట్టారు. సి.వి.రామన్, మేఘనాథ్ సాహా, సత్యేంద్రనాథ్ బోస్‌లను ఇరవయ్యో శతాబ్దపు భారతీయ భౌతిక శాస్త్రవేత్తల త్రయంగా చెప్పవచ్చు. సత్యేంద్రనాథ్ బోస్ పరిశోధనలపై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు నోబెల్ బహుమతి పొందారు కానీ, పలుమార్లు నామినేట్ అయినప్పటికీ బోస్‌కు ఆ ప్రతిష్ఠాత్మక బహుమతి అందలేదు. భారత ప్రభుత్వం సత్యేంద్రనాథ్‌ను 1954లో 'పద్మ విభూషణ్'తో గౌరవించింది. ఆరోజుల్లో కొత్తగా ఏర్పాటైన సీఎస్ఐఆర్‌కి సలహాదారుగా, ఇండియన్ ఫిజికల్ సొసైటీకి, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కి, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌కి అధ్యక్షుడిగా సేవలందించారాయన. శాంతినికేతన్‌లోని విశ్వభారతి విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా కూడా వ్యవహరించారు. ఎక్స్‌రే క్రిస్టలోగ్రఫీ వంటి సబ్జెక్టులను తన విద్యార్థుల మాతృభాష బెంగాలీలో బోధించి వారి అభిమానాన్ని చూరగొన్నారు. పీజీ, పరిశోధక విద్యార్థులకు కూడా సైన్సును మాతృభాషలో బోధించాలన్న తపన ఆయనది. అందుకుగాను వంగీయ విజ్ఞాన పరిషద్‌నీ, 'జ్ఞాన్ ఒ విజ్ఞాన్' అనే సైన్సు పత్రికనీ ప్రారంభించారు. వయోజనుల కోసం రాత్రి పాఠశాలల నిర్వహణకు సత్యేంద్రనాథ్ బోస్ ఎంతగానో కృషిచేశారు.

ఎందరో గొప్ప గొప్ప శాస్త్రవేత్తలు భారత భూమిపై పుట్టి విశ్వవిఖ్యాతి గాంచారు. వారందరి జీవిత చరిత్రలు నేటి విద్యార్థులకు పాఠ్యాంశాలు కావాలి. అప్పుడే శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనకు యువతరానికి తగిన స్ఫూర్తి లభిస్తుంది. దేశం గర్వించే నవతరం శాస్త్రవేత్తలు తయారవుతారు.

– అరుణ్ కుమార్



ఆహార ఎగుమతులకు గండి!

పర్యావరణ మార్పుల కారణంగా ప్రకృతి విపత్తులు విజృంభించి ఆహారోత్పత్తులను దెబ్బతీస్తున్నాయి. పలు కారణాల వల్ల గడిచిన ఆరు దశాబ్దాల్లో దేశాల మొత్తం వస్తు ఎగుమతుల్లో ఆహారోత్పత్తుల వాటా తగ్గిపోయింది. శుద్ధిచేసిన, నాణ్యమైన ఆహారాలపై ప్రత్యేక దృష్టి సారించడం, ఇతర పరిణామాల వల్ల పాకిస్థాన్, జర్మనీ వంటి దేశాల ఆహార ఎగుమతులేమో పెరిగాయి. 1962, 2024ల్లో ఆయా దేశాల మొత్తం వస్తు ఎగుమతుల్లో ఆహారోత్పత్తుల వాటా... (శాతాల్లో)

దేశం	1962	2024
బ్రెజిల్	71.15	40.35
థాయ్‌లాండ్	54.2	14.72
ఇండియా	38.9	11.13
అమెరికా	20.68	9.45
ఇటలీ	15.5	10.99
పాకిస్థాన్	14.2	24.39
జపాన్	7.39	1.15
జర్మనీ	2.05	6.28

(ఆధారం: ఐరాస నివేదిక-2025)

విజ్ఞాన వెలుగులు విస్తరించాలంటే...



దేశ ఆర్థికాభివృద్ధిని బలోపేతం చేయడంతో పాటు వికసిత్ భారత్‌కు బాటలు పరిచేలా మూడు కర్తవ్యాలతో 2026-27 బడ్జెట్‌ను రూపొందించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఆ కర్తవ్యాల్లో రెండో దానిలో విద్యకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి. వాటిలో ఉన్నత విద్యకు సంబంధించినవి ఏంటి, వాటి వల్ల జరిగే మేలెంత అన్నది పరిశీలనార్హం.

తాజా కేంద్ర బడ్జెట్లో ఉన్నత విద్యకు సంబంధించి ప్రధాన పారిశ్రామిక, లాజిస్టిక్ కారిడార్ల సమీపంలో అయిదు విశ్వవిద్యాలయ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పరిశ్రమలు-తరగతి గదుల మధ్య అంతరాన్ని తొలగించడానికి ఇవి తోడ్పడతాయి. శాస్త్ర, సాంకేతిక, ఇంజినీరింగ్, గణిత (స్టెమ్) రంగాల పురోగతి కోసం ప్రతి జిల్లాలో ఒక బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. బయో ఫార్మా రంగం అభివృద్ధి కోసం కొత్తగా మూడు జాతీయ ఫార్మాస్యూటికల్ సంస్థలను స్థాపించాలని, ప్రస్తుతం ఉన్న ఏడు సంస్థలను మెరుగుపరచాలని సంకల్పించారు. అలాగే భారతీయ సంప్రదాయ చికిత్స విధానాన్ని, పద్ధతులను మెరుగుపరచే దిశగా అనుబంధ ఆరోగ్య నిపుణులను తయారు చేయాలని, అలాంటి సంస్థలను ప్రోత్సహించాలని ప్రతిపాదించారు. యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపునకు తొమ్మిది వేల కోట్ల రూపాయలకుపైగా నిధులు ప్రత్యేకించారు. ముఖ్యంగా 'విద్య నుంచి ఉద్యోగానికి, దాని నుంచి సొంతంగా సంస్థలను స్థాపించే స్థాయికి' యువతను ప్రేరేపించేలా విద్యను సంస్కరించాలని నిర్ణయించారు. ఇదంతా బాగానే ఉన్నా- సాధారణ కేటాయింపులు, వ్యవస్థాగత అలక్ష్యం దేశీయ ఉన్నతవిద్య పరిస్థితిని ఎక్కడి గొంగడి అక్కడే అన్నట్లు మారుస్తున్నాయి.

దుర్భరావస్థలో రాష్ట్ర వర్సిటీలు

బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.1.39 లక్షల కోట్లు కేటాయించారు. ప్రతి సంవత్సరంలాగే ఈసారీ చదువుల పద్దులో పాఠశాల విద్యకు పెద్దపీట వేశారు. దానికి అత్యధికంగా రూ.83,562 కోట్లు ప్రత్యేకించారు. ఉన్నత విద్యకు రూ.55,727 కోట్లు ప్రకటించారు. ఇందులో అధిక భాగం కేంద్ర విశ్వవిద్యాలయాలు (రూ.17740 కోట్లు), ఐఐటీల(రూ.12,123 కోట్లు)కే వెళ్లిపోతుంది. ఇక రాష్ట్ర వర్సిటీలకు పెద్దగా మిగిలేదేమీ ఉండదు. 'ఉన్నత విద్యాభివృద్ధి' బాధ్యతను రాష్ట్రాలే ఎక్కువగా మోస్తున్నాయి. దేశం మొత్తం మీద 57 కేంద్రీయ విశ్వవిద్యాలయాలుంటే, 483 రాష్ట్ర విశ్వవిద్యాలయాలు నెలకొన్నాయి.

ఉన్నత విద్యను పెద్ద సంఖ్యలో విద్యార్థులకు అందించడంలో రాష్ట్ర విశ్వవిద్యాలయాలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. అయినప్పటికీ, వాటికి నిధులు అడుగంటిపోతున్నాయి. ఒక విధంగా చూస్తే ప్రైవేటు, డీమ్డ్ విశ్వవిద్యాలయాల ఏర్పాటుతో ఉన్నత విద్య ముఖచిత్రం మారిపోతోంది. ప్రభుత్వ రంగంలో కొనసాగుతున్న సంస్థలు నామమాత్రంగా తయారయ్యాయి. నిధుల కొరత, అధ్యాపకుల ఖాళీలు, నాణ్యత ప్రమాణాల స్థిరీకరణ వంటి అంశాల పరంగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు కొరగానివిగా తయారవుతున్నాయి. ఈ సమస్యలను చక్కదిద్దితే తప్ప రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు పూర్వ వైభవం తీసుకురావడం సాధ్యంకాదు. ఏడున్నర దశాబ్దాలుగా ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి(జీఈఆర్) 28.4శాతం దగ్గరే ఉంది. అందులోనూ ప్రాంతీయ అసమానతలు నెలకొన్నాయి. కొఠారి కమిషన్ సిఫార్సు చేసినట్లుగా విద్యపై ఖర్చు జీడీపీలో ఆరు శాతానికి చేరడంలేదు. అది ప్రస్తుతం 4.1శాతం నుంచి 4.6శాతం మధ్యే తచ్చాడుతోంది. పైగా ప్రభుత్వాలు క్రమేపీ విద్య నుంచి పక్కకు జరిగిపోయే ప్రయత్నం చేస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి కేంద్రం 2015లోనే 'ఉన్నత విద్య' ప్రక్షాళనకు నడుంకట్టింది. అందులో భాగంగా జాతీయ విద్యావిధానం-2020 ప్రకటించింది. అందులోని ప్రధాన సంస్కరణల అమలులో తగినంత వేగం కొరవడింది. గత నెలలో 'ఉన్నత విద్యా కమిషన్' ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సంస్థల క్రమబద్ధీకరణ, గుర్తింపు, గ్రాంట్ల మంజూరు, ప్రమాణాల నిర్ధారణ వంటి విషయాలపై వేర్వేరుగా సంస్థల ఏర్పాటును ప్రస్తావించారు. యూజీసీ, ఎన్‌సీటీఈ వంటి సంస్థలన్నీ ఈ కమిషన్‌లో విలీనమవుతాయి.

నిలిచిపోయిన నిధులు

జాతీయ విద్యా విధానం ముసాయిదాలోనే విద్యాసంస్కరణలు ప్రస్తావితమైనా అమలులో ఆలస్యం వల్ల ఉన్నత విద్యారంగంలో అనిశ్చితి నెలకొంది. ఉదాహరణకు, అక్రెడిటేషన్‌కు సంబంధించిన కార్యకలాపాలు స్తంభించాయి. కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు నిధుల మంజూరు ఆగిపోయి దాదాపు ఒకటిన్నర దశాబ్దం అయింది. విద్యను 'రాష్ట్రాల జాబితా' నుంచి 'ఉమ్మడి జాబితా'లోకి మార్చినప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పేమీ లేదు. ఉమ్మడి జాబితాను సాకుగా చూపి, ఉన్నత విద్యపై నియంత్రణ తమ చేజారిపోతోందని రాష్ట్రాలు అంటున్నాయి. భారతదేశం విజ్ఞాన ఖనిగా, విశ్వగురుగా అవతరించాలంటే ఉన్నత విద్యకు నిధులు పెంచాలి. మారుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళించాలి.



ఆచార్య కోదాటి వియ్యన్నరావు
పూర్వ ఉపకులపతి,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

నాన్న కోసం..!

ఫ్రెండ్స్. మనందరికీ మొసలి తెలుసు కదా! 'అమ్మో దాని రూపం గుర్తొస్తేనే చాలా భయమేస్తుంది. మొసలి బొమ్మలను పట్టుకోవాలన్నా, వాటితో ఆడుకోవాలన్నా అస్సలు నచ్చదు' అంటారా! అది నిజమే కానీ ఓ నేస్తం మాత్రం మొసలితో ఏకంగా చిన్నపాటి యుద్ధమే చేశాడు. తనెవరంటే..

ఆగ్రాకు చెందిన అజయ్ రాజుకు తొమ్మిదేళ్లు. నాలుగో తరగతి చదువుతున్నాడు. ఒకసారి నాన్న వీర్‌భాన్‌తో కలిసి వాళ్ల అక్క తను పశువులను మేపడానికి పొలిమేరల్లోకి వెళ్లారు. అలా కొంత దూరం వెళ్లాక.. దాహమేస్తుందని అడగటంతో, పక్కనే ఉన్న నదిలో నీళ్లు తీసుకురావడానికి వెళ్లారు వీర్‌భాన్. బాటిల్‌లో నీళ్లు నింపుతుండగానే ఒక్కసారిగా నదిలోంచి ఒక మొసలి వచ్చింది. అతని కాలు పట్టుకొని నదిలోకి లాక్కెళ్లడానికి ప్రయత్నించింది. అది చూసిన అజయ్ వెంటనే పరిగెత్తుకుంటూ వెళ్లి, ఒక కర్రతో దాన్ని చాలాసార్లు కొట్టాడు. అయినా అది వాళ్ల నాన్న కాలును వదలకపోవడంతో ఇంకా గట్టిగా కొట్టాడు.



దాంతో అది కాలు వదిలి నదిలోకి వెళ్లిపోయింది. ఆ సమయంలో అజయ్ స్థానంలో వేరే ఎవరైనా ఉంటే భయంతో అరుస్తారు, ఏడుస్తారు. కానీ తను మాత్రం ధైర్యంగా మొసలితో పోరాడి తండ్రిని కాపాడుకున్నాడు.


హాయ్! బుజ్జీ!!

వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన పిల్లలకు కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్'ని అందిస్తుంది. 2025 సంవత్సరానికి గానూ ధైర్యసాహసాల విభాగంలో ఆ అవార్డును అజయ్‌కి ఇచ్చింది. 'ఆ సమయంలో ఎలాగైనా మా నాన్నని కాపాడుకోవాలనే ఆలోచన మాత్రమే ఉంది. అందుకే మొసలిని కొట్టగలిగాను. భవిష్యత్తులో రక్షణ విభాగంలో పని చేసి.. మా నాన్నని కాపాడినట్లే దేశాన్ని రక్షిస్తాను' అని చెబుతున్నాడు అజయ్. ★

పదవలయం

ఇక్కడ ఇచ్చిన ఆధారాలతో వచ్చే పదాలను రాయండి. అన్నీ 'వే' అక్షరంతోనే ప్రారంభమవుతాయి.

1. రంగస్థలం
2. పిల్లనగ్రోవి
3. ఎండాకాలం
4. పండుగ
5. ఒక కవి
6. పొద్దున్నే
7. జీతం
8. బాధ



జవాబు: 1.వేదిక 2.వేణువు 3.వేసవి 4.వేడుక 5.వేమన 6.వేకువ 7.వేతనం 8.వేదన

ఆందోళన వద్దు.. ధైర్యమే మందు

- నేడు వరల్డ్ క్యాన్సర్ డే

పటమట, విజయవాడ సిటీ, విజయవాడ వైద్యం - న్యూస్‌టుడే

మారిన ఆహార అలవాట్లు, వాతావరణ పరిస్థితులు, జీవనశైలి తదితర కారణాల వల్ల ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రస్తుతం వ్యాధిని నయం చేయడానికి అధునాతన వైద్యం అందుబాటులో ఉంది. ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స చేసుకుంటే నయం అవుతుంది. విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి రోజూ 20-30 మంది రోగులు వస్తున్నారు. 15 మందికి కీమోథెరపీ, ఐదుగురికి శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. హైఎండ్ లీనియర్ యాక్సిలేటర్ వైద్య పరికరం అందుబాటులో ఉన్న గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రేడియేషన్ అవసరమైన రోగులను పంపుతున్నారు. త్వరలో విజయవాడలో కూడా ఆ యంత్రం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. నేడు వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా వ్యాధిని జయించిన కొంతమందిపై కథనం.

గతం కంటే ఆరోగ్యం మెరుగు



ఆరోగ్యం క్షీణించే వరకు క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించలేదు. మూడేళ్ల నుంచి వైద్యుల సూచన మేరకు చికిత్స పొందుతున్నాను. 30 కీమోలు చేయించుకున్నా. గతంతో పోల్చుకుంటే ఆరోగ్యం మెరుగుపడింది. వ్యాధి బారిన పడ్డామని ఆందోళన చెందకూడదు. ఏమీ కాదనే ధైర్యం తెచ్చుకోవాలి. ఒంటరిగా ఉండడం కంటే కుటుంబ సభ్యులతో ఎక్కువసేపు గడపాలి. వ్యాయామం చేయాలి. **- ఆరేపల్లి నాగమల్లీశ్వరి, చలివేంద్రపాలెం**

ఆత్మవిశ్వాసం అవసరం



మా మధ్య తరగతి కుటుంబానికి నేనే ఆధారం. 2024లో క్యాన్సర్ వచ్చింది. కీమోలు చేయించుకుంటున్నా. వైద్యానికి రూ.2.5 లక్షలు ఖర్చు చేశాను. ఆర్థికంగా భారమైంది. వ్యాధి బారిన పడ్డాను.. ఏమవుతుందో అనే భయం వద్దు. ఆత్మవిశ్వాసంతో ఉంటేనే ఆరోగ్యంగా ఉంటాం. వైద్యులు సూచనలు పాటించాలి. నిర్లక్ష్యం చేయకుండా మందులు వేసుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుంది. **- రాజశేఖర్, అజిత్‌సింగ్‌నగర్**

మనోధైర్యంతో జయించా..

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయినిగా పని చేస్తున్నా. 2013లో బ్రెస్ట్ క్యాన్సర్ ఉందని తెలిసింది. వైద్యులు శస్త్రచికిత్స చేసి గడ్డలు తొలగించి, కీమో చేయాలని సూచించారు. విద్యార్థుల తరగతులకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ఇచ్చే ఆరు నెలల సమయాన్ని వైద్యానికి వినియోగించుకున్నా. నాలుగు కీమోలు మూడు నెలల్లో చేయించుకున్నా. ఆ సమయంలో దిగులు పడకుండా పుస్తకాలు చదవడం, జీవిత లక్ష్యాన్ని గుర్తు చేసుకుంటూ చికిత్స చేయించుకొని వ్యాధిని జయించా. క్యాన్సర్‌ని ధైర్యంగా ఎదుర్కోవాలి. అప్పుడే మునుపటిలా జీవించవచ్చు. ప్రస్తుతం అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. ఆందోళన వద్దు. **- మనోజ**



మత్తు వీడు.. జీవితం చూడు..

'డ్రగ్స్ వద్దు యోగా ముద్దు' నినాదంతో మంగళవారం విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో యోగా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీసీపీ సరిత, బ్రహ్మకుమారీస్ ప్రసంగించారు. విద్యార్థులు అధికసంఖ్యలో తరలివచ్చి యోగాసనాలతో అబ్బురపరిచారు.

పాదచారి ప్రాణం.. గాలిలో దీపం

★ ప్రమాదాల్లో బలవుతున్న బాటసారులు ★ నగరంలో 88 శాతం ఫుట్‌పాత్‌లు లేవు

'పద్మవ్యూహాన్ని తలపించే విజయవాడ ట్రాఫిక్‌లో పాదచారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. దారి దాటాలంటే.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. ఎటు నుంచి ఏ వాహనం ఢీకొంటుందో తెలియకుంది. రోడ్లపై జీబ్రా లైన్లు సరిగాలేవు.. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురయ్యాయి. దారి దాటే వారి కోసం పెలికన్ సిగ్నళ్లు లేవు. ఫలితంగా పాదచారుల మరణాలు ఆందోళనకరంగా నమోదవుతున్నాయి. వీఎంసీ, పోలీసు, ర.భ. శాఖలు ఉమ్మడిగా స్పందిస్తేనే మరణాలకు అడ్డుకట్ట వేయొచ్చు.'



పీసీఆర్ కూడలి వద్ద జీబ్రాలైన్స్ లేని తీరు..

కాలిబాటల ఆక్రమణ..

పాదచారుల నడకకు కచ్చితంగా ఫుట్‌పాత్‌లు నిర్మించాలి. ఎత్తు 0.75 మీటర్లు, వెడల్పు 1.5 మీటర్లు ఉండాలి. విజయవాడలో అన్ని రోడ్ల నిడివి 53.4 కి.మీ. కాగా.. 6.41 కి.మీ.లోనే ఫుట్‌పాత్ ఉంది. దాదాపు 88 శాతం ఫుట్‌పాత్‌లే లేవు. ఉన్నవీ ఆక్రమించేశారు. ప్రధాన ప్రాంతాల్లో చదరపు గజం విలువ భారీగా ఉండటంతో దుకాణదారులు వీటిని కలిపేస్తుండగా.. వాణిజ్య డిమాండ్ లేని ప్రాంతాల్లో ఉన్నాయి.

★ **గొల్లపూడివాసి జోజి (83)కి** రోజూ ఉదయం నడక అలవాటు. ఇటీవల నడక ముగించి వస్తుండగా. . వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన జోజిని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా దారిలోనే ప్రాణాలు వదిలాడు. **– ఈనాడు, అమరావతి**

డివిజన్/క్లస్టర్	2024 ★	2024 ✪	2025 ★	2025 ✪
వెస్ట్	27	27	25	25
నార్త్	11	11	09	09
సౌత్	15	15	18	18
సెంట్రల్	30	31	21	22
నందిగామ	12	14	13	14
జగ్గయ్యపేట	11	11	07	07
మైలవరం	03	03	04	04
తిరువూరు	03	03	07	07
మొత్తం	112	115	104	106

ప్రమాదాలు ★ మృతులు ✪

సబ్‌వేలు లేక అవస్థలు...

☛ బెంజి సర్కిల్.. ఇటుగా రోజుకు లక్షన్నర వాహనాలు వెళ్తాయి. కోల్‌కతా - చెన్నై జాతీయ రహదారిపై ఉండటంతో రద్దీ ఎక్కువ. ఇక్కడి నుంచి పటమట, బందరు, బస్టాండు, ఏలూరు, గుంటూరు వైపు వెళ్లొచ్చు. ఇక్కడ సబ్‌వే నిర్మిస్తే.. ట్రెండ్‌సెట్ మాల్ నుంచి పటమట వైపు తేలికగా వెళ్లొచ్చు.

☛ రమేష్ ఆసుపత్రి, మహానాడు కూడళ్లలో సర్వీసు రోడ్డులోకి వెళ్లాలంటే చుక్కలే. వీటికి రెండు వైపులా ఎక్కువ జనసాంద్రత కాలనీలు, ఆవాసాలున్నాయి. ఐటీఐ, పాలిటెక్నిక్, స్పా, ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నాయి.

పెలికన్ సిగ్నళ్లు ఏవీ...

బందరు, ఏలూరు రోడ్లు ప్రధానమైనవి. ట్రాఫిక్ అంతా ఇక్కడే ఉంటుంది. కేవలం బందరు రోడ్డుపైనే పాదచారులకు ఉద్దేశించిన జీబ్రాలైన్లు ఉన్నాయి. ఏలూరు రోడ్డులో లేవు. ఇవి ఉన్నచోటా లక్ష్యం నెరవేరడంలేదు. జీబ్రా లైన్ల వద్ద దారి దాటాలంటే ప్రయాసే. వీటి వద్ద తప్పనిసరిగా పెలికన్ సిగ్నళ్లు పెట్టాలి. ఇవి ఎక్కడా లేవు. దీంతో సురక్షితంగా రోడ్డు దాటలేని దుస్థితి. సిగ్నళ్లు ఉంటే.. పాదచారులు రోడ్డు దాటేందుకు వాహనాలను ఆపి.. ప్రత్యేక సమయం ఇస్తారు.



నేతాజీ వంతెన వద్ద.. దూసుకొస్తున్న వాహనాల నడుమ దాటుతూ..

☛ బస్టాండులో దిగి రైల్వేస్టేషన్‌కు, అటు నుంచి ఇటు వచ్చీపోయే ప్రయాణికులూ ఎక్కువే. పోలీసు కంట్రోల్ రూమ్ కూడలిలో రోజుకు 50 వేల మంది పాదచారులు రాకపోకలు సాగిస్తారు. బస్టాండ్ బయట నుంచి రైల్వేస్టేషన్ ఆర్చి వరకు వంతెన నిర్మిస్తే సాఫీగా వెళ్లొచ్చు.

లేనిదల్లా... సంకల్పమొక్కటే!



క్లీన్ ఆంధ్ర... గ్రీన్ ఆంధ్రా.. చాలానే అన్నారు... నగరంలో పలు రహదారుల పక్కన మొక్కలనూ నాటారు.. ఇవి నాటేందుకు తావు లేని ప్రాంతాల్లో నిరుడు సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి కుండీలను పెట్టేశారు.. వీటిల్లో మొక్కలనూ నాటారు. ఇప్పుడవి నిర్వహణ లేక దారి పొడవునా పూర్తిగా ఎండిపోయి నిర్జీవంగా కనిపిస్తున్నాయిలా. కొన్నిచోట్ల కుండీలు విరిగి అడ్డదిడ్డంగా పడి ఉన్నాయి. మొక్కలు నాటినప్పుడు వాటి నిర్వహణ బాధ్యతలు కూడా సరిగా ఉంటేనే నగరం పచ్చదనంతో కళకళలాడేది. రామవరప్పాడు ఇన్నర్ రింగు రోడ్డులో కనిపించిన దృశ్యాలివి. **- ఈనాడు, అమరావతి**

ప్రమాదం జరిగిందని.. ప్రయాణం ఆపలేదు..



ఎన్టీఆర్ జిల్లా చౌటుపల్లి గ్రామానికి చెందిన కువ్వారపు సుజేశ్వరరావు(56), ఎలిసమ్మ దంపతులు జీవనం కోసం 25 ఏళ్ల కిందట సొంత గ్రామం వదిలి సంగారెడ్డి జిల్లా బొంతపల్లి గ్రామంలో టైలర్ వృత్తి చేసుకుంటూ బతుకుతున్నారు. 2016లో జరిగిన ఒక ప్రమాదంలో సుజేశ్వరరావు కుడి కాలు విరిగిపోవడంతో ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి ద్విచక్ర వాహనంలో బయటకు వెళ్లాలంటే ఇబ్బందిపడినా జీవనం కోసం తప్పని పరిస్థితి. భార్యతో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మరోసారి జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గాయమైన కాలితో ద్విచక్ర వాహనాన్ని నియంత్రించడం ఇబ్బందిగా ఉండేది. దీంతో ద్విచక్ర వాహనం పక్కకి పడిపోకుండా సపోర్టుగా ఉండడానికి, భార్య సైతం కూర్చోవడానికి వీలుగా ఒక బాక్సును తయారు చేయించి అమర్చారు. రూ.50వేల ఖర్చుతో ద్విచక్ర వాహనాన్ని ఇలా మార్పు చేయించారు. ఇప్పుడు లగేజీతో పాటు, సోలార్ సాయంతో సెల్‌ఫోన్ ఛార్జింగ్, మ్యూజిక్ సిస్టం అమర్చుకుని ఎంతదూరమైనా సునాయాసంగా వెళ్తున్నామని సుజేశ్వరరావు చెబుతున్నారు. సొంతూరు చౌటుపల్లి నుంచి సంగారెడ్డికి జాతీయ రహదారిపై వెళ్తూ కనిపించారు. **-ఈనాడు, అమరావతి**

7న ఉద్యోగాల భర్తీకి స్పెషల్ డ్రైవ్

కరెన్సీనగర్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ - సీడాప్ ఆధ్వర్యంలో 7న విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సుందరం ఫాస్ట్‌నర్స్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగాలకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు మధుభూషణ్‌రావు, శ్రీనివాసరావు తెలిపారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ చేసిన 18-34 ఏళ్లలోపు యువకులు మాత్రమే అర్హులని చెప్పారు. నెలకు రూ.14,500-16,500 వేతనం, సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 78423-64823, 90006-58079లలో సంప్రదించవచ్చన్నారు.

పెట్రోల్ సీసా విసిరింది ఎవరు?

ఈనాడు - అమరావతి: వైకాపా నేత జోగి రమేష్ ఇంటిపై పెట్రోల్ సీసా విసిరిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. డ్రోన్ దృశ్యాల్లో మాస్క్ ధరించిన వ్యక్తి పెట్రోల్ నింపిన సీసాను జోగి ఇంటిపైకి విసిరినట్లు నమోదైంది. వైకాపాకు చెందిన వారే దాడి చేసి.. తమపై నెపం వేస్తున్నారని తెదేపా నేతలు విమర్శిస్తున్నారు. పెట్రోల్ సీసా విసిరిన వ్యక్తి వైకాపా కార్యకర్తా? లేక తెదేపా కార్యకర్తా? అని పోలీసులు ఆరా తీస్తున్నారు. గుంపులో నుంచి సీసా వేసినట్లుగా తేలింది. రెడ్డిగూడెం మండల వ్యక్తిగా ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. దాడి ఘటనలో 93 మందిని గుర్తించిన జోగి వర్గం... వివరాలను పోలీసులకు అందజేసింది. ఇప్పటి వరకు మొత్తం 43 మందిని పోలీసులు గుర్తించారు. వీరిలో 12 మందికి నోటీసులు ఇచ్చి పిలిచి... స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు. పెట్రోల్ సీసా ఇచ్చిన వ్యక్తి దొరికితే సెక్షన్లు మార్చే అవకాశం ఉందని సమాచారం.

బెజవాడలో నొక్కేసి.. నేపాల్‌లో అమ్మేసి..

ఎలక్ట్రానిక్ షోరూం చరవాణుల చోరీ కేసు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: పటమటలోని ఒక ఎలక్ట్రానిక్ షోరూంలో రూ.18 లక్షల విలువైన చరవాణుల చోరీ కేసు కొలిక్కి వచ్చింది. మొత్తం ఆరుగురు నిందితులు ఈ నేరం చేసినట్లు తేలింది. వీరిలో నలుగురు ప్రధాన సూత్రధారులు కాగా.. మిగిలిన ఇద్దరిని ఒక్కొక్కరికి రూ.30వేలు ఇస్తామని చెప్పి విజయవాడకు తీసుకువచ్చినట్లు తెలిసింది. సీసీ ఫుటేజీల ఆధారంగా సీసీఎస్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

న్యాట్‌గ్రిడ్‌లో వివరాలు.. విజయవాడలో సీసీ కెమెరాలో దొరికిన నిందితుల ఆచూకీ కనుక్కునేందుకు సీసీఎస్ పోలీసులు సెల్ టవర్ డేటాను విశ్లేషించారు. కొన్ని కీలకమైన ఆధారాలు సేకరించారు. అలాగే క్రైం డేటా బేస్ 'న్యాట్‌గ్రిడ్'ను ఆశ్రయించారు. నిందితుల ఫొటోలను అందులో అప్‌లోడ్ చేయగానే.. ఒక వ్యక్తి వివరాలు తెలిశాయి. అతడు బిహార్ రాష్ట్రానికి చెందిన గోవింద్‌చౌదరిగా తేలింది. అతడిని పట్టుకునేందుకు రెండు బృందాలు పట్నాకు వెళ్లాయి. అక్కడి పోలీసులతో కలిసి కేసు దర్యాప్తు ముమ్మరం చేశారు.



సీసీ కెమెరాకు చిక్కిన చరవాణుల చోరీ ముఠా.. వారి నాయకుడు గోవింద్ చౌదరి

బిహార్‌లో ఇద్దరు నిందితుల అరెస్టు

చిక్కడు... దొరకడు: ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా అనుమానిస్తున్న గోవింద్‌చౌదరి.. చరవాణుల చోరీల్లో దిట్ట. ఇతడిపై బిహార్‌లో పలు కేసులు ఉన్నాయి. స్థానికంగా ఉండే వారితో కలిసి చోరీలు చేసేవాడు. ఈ విషయం పోలీసులు గుర్తించేలోగానే జారుకునేవాడు. చరవాణులను నేపాల్‌లో విక్రయిస్తుంటాడు. ప్రత్యేకంగా ఒక ముఠాను తయారు చేసుకుని.. దొంగతనాలు చేస్తున్నాడు. ఇదే విధంగా బిహార్‌కు చెందిన రోణంకుమార్‌యాదవ్, జితిన్‌కుమార్, ఫిరోజ్, సూరజ్, నయీంలను విజయవాడకు తీసుకొచ్చి నేరం చేశాడు. విజయవాడలో చోరీ చేసిన చరవాణులతో నేపాల్‌కు పారిపోయి.. వాటిని అక్కడ అమ్మేశాడు. నయీం, సూరజ్‌లు బిహార్‌లోనే ఉండిపోవడంతో పోలీసులకు దొరికారు. వారిని సీతామర్హి న్యాయస్థానంలో హాజరుపరిచారు. అనంతరం వారిని ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తీసుకువస్తున్నారు. రోణంకుమార్‌యాదవ్, జితిన్‌కుమార్, ఫిరోజ్‌లు నేపాల్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారి కోసం ఒక బృందాన్ని నేపాల్‌కు పంపించారు.

'మిగులు' నగదు.. అందక దిగులు

✦ సౌర విద్యుత్తు వినియోగదారులకు కష్టాలు
✦ ఆగిపోయిన 7 నెలల చెల్లింపులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే

సౌర విద్యుత్తు వినియోగదారులకు 'మిగులు' విద్యుత్తు చెల్లింపులు చాంతాడులా పెరిగిపోతున్నాయి. ప్రతి నెలా వారు వాడుకోగా మిగిలిన విద్యుత్తును ప్రభుత్వం తీసుకుంటోంది. దీనికి యూనిట్‌కు రూ.2.09ల చొప్పున చెల్లిస్తుంది. గత ఏడాది జూన్ నుంచి ఈ చెల్లింపులు నిలిచిపోయాయి. ఈ ఏడాది జనవరిలో వినియోగదారుల ఖాతాలో 2025, మే నెలకు సంబంధించిన డబ్బులు పడ్డాయి. జూన్ నుంచి డబ్బులు పడకపోవడంతో.. ఎప్పుడు వస్తాయో అని ఎదురు చూస్తున్నారు. దీనిపై విద్యుత్తు అధికారుల నుంచి సరైన సమాచారం లేకపోవడంతో గందరగోళానికి గురవుతున్నారు.

చెక్కులతో ఇబ్బందులు

విద్యుత్తు సంస్థ తాము తీసుకున్న విద్యుత్తుకు ప్రతి 3 నెలలకు ఒకసారి చెక్కు రూపంలో చెల్లిస్తామంటూ ఒప్పందం కుదుర్చుకుంది. అయితే ఇది వినియోగదారులకు ఇబ్బందికరంగా మారింది. కొంత మందికి రూ.10లు కూడా మిగులు వచ్చింది. దానికి చెక్కు ఇస్తే వినియోగదారులు రూ.10ల కోసం బ్యాంకుకు వెళ్లాలా? అని అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీంతో ఆ సమస్యను తీర్చేందుకు విద్యుత్తు సంస్థ నడుం బిగించింది.

బ్యాంకు ఖాతాకే బదిలీ



మిగులు విద్యుత్తు సంబంధించిన నగదును వినియోగదారుని ఖాతాలోనే వేయాలని అధికారులు నిర్ణయించారు. సౌర విద్యుత్తు తీసుకునేటప్పుడే వినియోగదారుల ఖాతాలను సంస్థ తీసుకుంది. ఇక నుంచి వాటిలోనే నగదు వేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు 2025, మే నెల వరకు మాత్రమే చెల్లించారు.

- వినియోగదారులు : దాదాపు 5 వేల మంది
- చెల్లించాల్సిన నగదు: రూ.లక్షల్లో (అంచనా)

ప్రతి నెలా చెల్లిస్తే మేలు

మిగులు విద్యుత్తు నగదును ప్రతి నెలా చెల్లిస్తే బాగుంటుందని వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు. దాదాపు అందరూ బ్యాంకుల నుంచి రుణం తీసుకుని.. సౌర విద్యుత్తు పెట్టించుకున్నారు. వీరు ప్రతి నెలా రూ.2100 నుంచి రూ.3600 వరకు ఈఎంఐ చెల్లిస్తున్నారు. ప్రతి నెలా మిగులు సొమ్మును వెంటనే చెల్లిస్తే.. ఈఎంఐ కొంత వరకు తగ్గుతుందని.. తమకు కొంత వెసులుబాటు ఉంటుందని చెబుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

140 మీటర్ల వెడల్పు మేరకే
ఓఆర్ఆర్ భూసేకరణ
ముందు జాగ్రత్తకే నోటిఫికేషన్‌లో 250 మీటర్ల ప్రస్తావన

ఈనాడు, అమరావతి, కంచికచర్ల, న్యూస్‌టుడే

ఓఆర్ఆర్ (అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు) భూసేకరణ విషయంలో కొద్ది రోజులుగా రైతులు ఆందోళన చెందుతున్నారు. 140 మీటర్ల వెడల్పుతో రహదారి నిర్మిస్తారని ప్రతిపాదనల్లో ఉంటే.. గెజిట్ నోటిఫికేషన్‌లో 250 మీటర్లుగా పేర్కొనడంతో వారిలో అలజడి మొదలైంది. అధికారుల చుట్టూ తిరుగుతూ ఫిర్యాదులు చేస్తున్నారు. ఆందోళనలకూ సిద్ధమయ్యారు. ఇది ముందు జాగ్రత్త కోసమేననీ... 140 మీటర్ల వెడల్పుతోనే ఓఆర్ఆర్ నిర్మిస్తామని అధికారులు స్పష్టత ఇస్తున్నారు.

ఆందోళన అవసరం లేదు... సాధారణంగా 3ఏ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తవకుండా భూమి సర్వేకు అధికారులకు హక్కు ఉండదు. దీంతో క్షేత్రంలో కొలతలు తీసి సరిహద్దులు వేయలేరు. జీపీఎస్‌పై ఆధారపడాల్సిందే. ★ 140 మీటర్ల వెడల్పును జీపీఎస్‌ను ప్రామాణికంగా తీసుకుని సరిహద్దులు నిర్ధారిస్తే క్షేత్రంలో కొన్నిచోట్ల 5-10 మీటర్లు తేడా వచ్చే వీలుంది. ఇలాగైతే మళ్లీ ప్రక్రియ మొదటి నుంచి చేయాల్సిందే. దీంతో ప్రాజెక్టు మరో ఏడాది ఆలస్యం అవుతుంది. ★ ఈ సమస్య రాకుండా ముందు జాగ్రత్తగా నోటిఫికేషన్‌లో 250 మీటర్లుగా ప్రస్తావించారు. అభ్యంతరాల ప్రక్రియ పూర్తయి... సర్వే చేశాక 140 మీటర్లకే క్షేత్రంలో కొలత వేసి సరిహద్దులు నిర్ణయించి ఆ మేరకే భూమి తీసుకుంటారు. ఈవిషయం తుది నోటిఫికేషన్‌లో పొందుపరుస్తారు

అన్నదాతల కలవరం...

★ ఓఆర్ఆర్ నిర్మాణానికి కంచికచర్ల, వీరులపాడు, జి.కొండూరు, మైలవరం మండలాల్లో 18 గ్రామాల్లో 1,798 సర్వే నంబర్లలో 1,416.31 హెక్టార్లు సేకరించనున్నారు. ★ జనవరి 5న విడుదలైన గెజిట్ నోటిఫికేషన్‌లో 140 బదులుగా 250 మీటర్ల భూసేకరణ ఉంది. ★ 140 మీటర్లే ఎక్కువనీ, 250 మీటర్లు తీసుకుంటే నష్టపోతామనీ, విలువైన పంటలు పండే భూమి కోల్పోయి.. జీవనోపాధి ప్రశ్నార్థకం అవుతుందని వాపోతున్నారు. ★ గ్రామసభలు, ప్రజావిచారణ చేపట్టకుండా, భూ యజమానులను సంప్రదించకుండా నిర్ణయించారని చెబుతున్నారు.

అభ్యంతరాలపై స్పష్టత ఇచ్చాం..

★ ఎన్‌హెచ్ పీడీ పార్వతీశం మాట్లాడుతూ.. రైతులు భూసేకరణ విషయంలో అపోహ పడవద్దనీ.. 140 మీటర్ల భూమి మాత్రమే తీసుకుంటామనీ. అభ్యంతరాలపై స్పష్టత ఇచ్చామన్నారు.

7న గుంటుపల్లిలో ఉద్యోగ మేళా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ వికాస ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ శనివారం ఉదయం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని రైజ్ సెంటర్, ప్రభుత్వ హైస్కూలు వద్ద ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. అపోలో టైర్స్‌లో నాప్స్ ట్రైనీ, టాటా ఎలక్ట్రానిక్స్‌లో మొబైల్ ఆపరేటర్, టెక్నో టాస్క్‌లో కస్టమర్ సపోర్టు అసోసియేట్, సీఎంఆర్ ఆటో మొటివ్స్‌లో టెక్నీషియన్స్ సోర్సులో టీమ్ లీడ్స్‌లో, రాగ టెక్ సోర్స్‌లో మెషిన్ ఆపరేటర్, వెస్ట్ సైడ్‌లో మేనేజర్లు, ఫైనాన్స్‌లో బీపీవో టెలీకాలర్లు, జస్ట్ డయల్‌లో ఫీల్డ్ బిజినెస్ మేనేజర్లు, సంతోష్ ఆటో మోటార్స్‌లో ఎగ్జిక్యూటివ్స్, వీల్ స్మార్ట్‌లో ఎగ్జిక్యూటివ్స్, ఇండస్ ఇండ్‌లో లోన్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు వివరించారు. పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ (2021 నుంచి 2024 ఉత్తీర్ణులైన ఫ్రెషర్లు) విద్యార్హత కలిగి, ఆరు నెలల అనుభవం ఉన్న మహిళలు/పురుష అభ్యర్థులు అర్హులు. కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలి. ఎంపికైన వారికి రూ.నెలకు రూ.12,500ల నుంచి రూ.35,000లు వరకు జీతం ఉంటుంది. విజయవాడ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కార్యాలయాల్లో పని చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాల నకళ్లతో హాజరు కావాల్సి ఉంది. మరిన్ని వివరాలకు 82477 66718, 91546 67779 చరవాణి నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఘనంగా పెదవడ్లపూడి శిర్డీ సాయిబాబా మందిరం వార్షికోత్సవం

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: దక్షిణ శిర్డీగా ప్రసిద్ధిగాంచిన పెదవడ్లపూడి భగవాన్ శ్రీసత్య శిర్డీ సాయి బాబా మందిరం 20వ వార్షికోత్సవం ఆలయ కమిటీ ఛైర్మన్, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ పాతూరి నాగభూషణం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయాన్నే స్వామివారికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం రామినేని ఫౌండేషన్ ఛైర్మన్ ధర్మప్రచారక్ ఆధ్వర్యంలో స్వామి వారికి అన్నాభిషేకం చేశారు. ఈ ఉత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సినీ గాయనీగాయకులు ఆలపించిన భక్తిపాటలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు కోలాట నృత్యం ప్రదర్శించారు. జబర్దస్త్ బృందం కామెడీ విందు కడుపుబ్బా నవ్వించింది. అనంతరం వేలాది మంది ప్రజలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల ఆరోగ్య రక్షణకు సాయిబాబా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు నందం అబద్ధయ్య, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, లంకా దినకర్, ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సిసోదియా, ఏపీ మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్ శ్రీహరిరావు, రాజ్యసభ మాజీ సభ్యులు గరికపాటి మోహన్‌రావు, ఉత్తర అమెరికాలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధి కోమటి జయరాం, రిటైర్డ్ డీజీపీ మాలకొండయ్య, గంగాధర్ నాదెళ్ల, యలమంచిలి జగదీష్‌బాబు, కాపూరి ప్రసాద్, పంతల సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన భక్తులకు పాతూరి నాగభూషణం ధన్యవాదాలు తెలిపారు.



మంత్రి రామానాయుడికి స్వామి వారి చిత్రపటం అందజేసి సన్మానిస్తున్న పాతూరి నాగభూషణం



సాంస్కృతిక కార్యక్రమాలు తిలకిస్తున్న భక్తజనసందోహం

డ్రగ్స్ రహిత సమాజం నిర్మించడమే ధ్యేయం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా డ్రగ్స్‌పై దండయాత్ర కార్యక్రమం చేపట్టామని డీసీపీ (అడ్మిన్) కె.జి.వి.సరిత పేర్కొన్నారు. డ్రగ్స్‌పై దండయాత్ర ఏనిమిదో రోజు సైకిల్ యాత్రలో భాగంగా మంగళవారం సత్యనారాయణపురానికి చేరింది. ఈ సందర్భంలో శారదా కళాశాల కూడలి వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డులో 'డ్రగ్స్ వద్దు యోగా ముద్దు' నినాదంతో యోగా కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై యోగాసనాలు వేశారు. బ్రహ్మకుమారీస్ పద్మజ, రాధ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు శకుంతల.. వందల మందితో ప్రాణాయామం చేశారు. అనంతరం యోగా ట్రైనర్ ఎ.నిహారిక.. కుర్చీని చేసే చిన్న చిన్న ఆసనాలు వేయించి సాధన చేయించారు. ఆటో డ్రైవర్ చంద్రశేఖర్.. డిగ్రీ చదివే రోజుల్లో గంజాయికి బానిసయ్యానని, జీవితం అర్థంకాని సమయంలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ప్రాణాయామం చేసేనట్లు చెప్పారు. యోగా చేశాను.. ఇప్పుడు సాధారణ స్థితికి చేరుకుని జీవితాన్ని గడుపుతున్నానని వివరించారు. డీసీపీ (అడ్మిన్) కె.జి.వి.సరిత మాట్లాడుతూ.. డ్రగ్స్‌పై ఎలాంటి సమాచారాన్నైనా 112 లేదా 1972 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ https://events.ntrpolice.in/లో లాగిన్ అయి రిజిస్టర్ అవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఎస్పీ నగేష్, ఏడీసీపీ జి.రామకృష్ణ, నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్, సత్యనారాయణపురం సీఐ ఎస్.వి.వి.లక్ష్మీనారాయణ, ఎస్సైలు వెంకటేశ్వర్లు, చిన్న కొండలరావు, నరేంద్ర, ఏసీపీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, అధిక సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆసనాలు నేర్పుతున్న బ్రహ్మకుమారీలు, శిక్షకులు

బ్రాయిలర్ ధరలు (కేజీ రూ.లలో)

విజయవాడ: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 లెగ్గర్ ధర 160 లైవ్ బర్డ్ స్కిన్ -232 లైవ్ స్కిన్‌లెస్ - 264. [illegible] - 150, 159, 170 [illegible] - 290 [illegible] - 300.

8న విద్యాసాగర్ నామినేషన్

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల గళం, సుదీర్ఘకాలం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నాయకుడిగా అలుపెరగని పోరాటం చేస్తూ సంఘానికి వన్నె తెచ్చిన ప్రస్తుత అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణలు ఈ నెల 8వ తేదీన అవే పదవులకు నామినేషన్లు వేయనున్నారని జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛనర్లు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర సంఘానికి ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్జీవో హోమ్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిష్ఠాత్మకమైన ఎన్జీవో రాష్ట్ర సంఘం ఎన్నికల్లో విద్యాసాగర్, రమణల ప్యానెల్ అభ్యర్థులు ఎన్జీవో హోమ్‌లో ఈ నెల 8వ తేదీ ఉదయం నామినేషన్లు దాఖలు చేయనున్నారని తెలిపారు. విద్యాసాగర్ దాదాపు 30 ఏళ్లకుపైగా సంఘంలో వివిధ హోదాల్లో క్రియాశీలకపాత్ర పోషించారని చెప్పారు. జిల్లా కార్యదర్శి పి.రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యాసాగర్ ప్యానెల్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి జిల్లాల సంఘ నాయకులు, ఉద్యోగులు తరలివస్తారని వెల్లడించారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు విజయవాడ పాత బస్టాండ్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో హోమ్‌కు చేరుకుని నామినేషన్లు దాఖలు చేస్తారని వివరించారు. అనంతరం జింఖానా మైదానంలో భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వేమూరి ప్రసాద్, బి.సతీష్ కుమార్, బి.వి.రమణ, జి.రామకృష్ణ, వి.నాగార్జున, జానీబాషా, ఎం.రాజబాబు, మధుసూదనరావు, రవీష్, విశ్వనాథ్, పి.రాజశేఖర్, నజీరుద్దీన్, డీఎస్ఎన్ శ్రీనివాసరావు, టి.విద్యాసాగర్, జానీ సోహిల్, రత్నకుమార్, బి.విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

ఎస్‌ఆర్‌ఎం విశ్వవిద్యాలయంలో గ్రీన్ హైడ్రోజన్ సెంటర్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో గ్రీన్ హైడ్రోజన్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపనకు సంబంధించి జేకే శ్రీవాస్తవ హైడ్రోజన్ పీఎస్‌పీ సంస్థ, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం, ఏపీ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదిరింది. ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో మంగళవారం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఎస్ఆర్ఎం గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రీసెర్చ్) ప్రొఫెసర్ డి.నారాయణరావు మాట్లాడుతూ.. 'హైడ్రోజన్ ప్రాముఖ్యత, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం నేషనల్ హైడ్రోజన్ మిషన్ ప్రారంభించింది. ఇందుకు అనుగుణంగా సీఎం చంద్రబాబు రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ఏర్పాటు చేయాలని భావించారు. ఇందులో ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించింది. ఆధునిక పరిశోధనలపై దృష్టి సారించే ప్రముఖ సంస్థ జేకే శ్రీవాస్తవ సంస్థ సహకారంతో అమరావతిలో ఒప్పందం కుదుర్చుకుని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీస్ ఏర్పాటు చేస్తున్నాం. స్వదేశీ సాంకేతికతతో ఎలక్ట్రోలైజర్లను తయారు చేయడం, సిలిండర్ల నాణ్యత పరీక్షించడం, హైడ్రోజన్ నిల్వ చేయడానికి కొత్త పద్ధతులు కనిపెట్టడం ఇందులో ప్రధానంగా ఉంటాయి. కొత్త క్యాటలిస్టులను అభివృద్ధి చేయడం ద్వారా హైడ్రోజన్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, డేటా సెంటర్లలో హైడ్రోజన్ వాడకం, భవిష్యత్తులో రాబోయే హైడ్రోజన్ ఆధారిత విమానాల కోసం రీఫ్యూయలింగ్ స్టేషన్లను డిజైన్ చేయవచ్చు. దీన్ని ముఖ్యమంత్రి త్వరలో ప్రారంభిస్తారు' అని తెలిపారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న జేకే శ్రీవాస్తవ, ప్రేమ్‌కుమార్, చిత్రంలో ప్రతినిధులు

మార్చి 18న భూమి పూజ

జేకే శ్రీవాస్తవ హైడ్రోజన్ పీఎస్‌పీ సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ జేకే శ్రీవాస్తవ మాట్లాడుతూ.. '5 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఐరోపాకు ఎగుమతి చేయడానికి ఇప్పటికే ఆర్డర్లు వచ్చాయి. 2028 ఆగస్టు 15 నాటికి తొలి షిప్‌మెంట్ పంపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ ప్రాజెక్టుకు మార్చి 18న భూమి పూజ జరుగుతుంది. సుదీర్ఘ తీర ప్రాంతం, ఓడరేవులు, ప్రభుత్వ తోడ్పాటు ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ హైడ్రోజన్ హబ్‌గా మారుస్తాయి' అని ఆశాభావం వ్యక్తం చేశారు.

10 లక్షల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యం

నెడ్‌క్యాప్ ఎండీ ఎం.కమలాకర్ బాబు మాట్లాడుతూ.. 'ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా ఈ ప్రాజెక్టు చేపట్టాం. సుమారు రూ.7.5 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి 2029-30 నాటికి 10 లక్షల మందికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వ లక్ష్యం' అని తెలిపారు. ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సీహెచ్. సతీష్ కుమార్, వర్సిటీ రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్‌కుమార్, జేకే శ్రీవాస్తవ హైడ్రోజన్ పీఎస్‌పీ సంస్థ డైరెక్టర్ ప్రశాంత్ శ్రీవాస్తవ, బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఆర్గర్ కోలాజోవ్‌స్కి, పావెల్ ట్రోజనోవ్‌స్కి, ఎస్ఆర్ఎం ఆచార్యులు పాల్గొన్నారు.

కాల్వలకు 3,405 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నగరంలోని ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాల్వలకు మంగళవారం 3,405 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 1,015, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 2,304, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి ఏలూరు 511, కేఈబీ 403, బందరు కాల్వలకు 101 క్యూసెక్కుల మేర విడుదల చేశారు.

కృత్రిమ మేధతో వైద్యవిద్యలో నూతన ఒరవడి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా కృత్రిమ మేధ యుగం నడుస్తోందని, వైద్య విద్యలో నూతన ఒరవడిగా ఏఐ ఆధారిత కాంపిటెన్సీ బేస్డ్ ఎడ్యుకేషన్‌కు త్వరలో శ్రీకారం చుడతామని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న 38 వైద్య కళాశాల ప్రిన్సిపల్స్, వైస్ ప్రిన్సిపల్స్, ఆచార్యులు, విద్యార్థులతో మంగళవారం విశ్వవిద్యాలయంలో వెబెక్స్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అమెరికాలో వైద్య రంగంలో పాతికేళ్ల అనుభవం కలిగిన డాక్టర్ చంద్రశేఖర్ బందుగల హాజరయ్యారు. ఆయన రూపొందించిన 'ఎడ్మెడ్ ఏఐ' సహకారంతో వైద్య విద్యార్థులకు అత్యున్నత నాణ్యత కలిగిన ఏఐ ఆధారిత అభ్యాస, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని వీసీ తెలిపారు. జాతీయ వైద్య కమిషన్ సూచించిన కాంపిటెన్సీ బేస్డ్ మెడికల్ ఎడ్యుకేషన్ మార్గనిర్దేశకాల మేరకు నైపుణ్యాల ట్రాకింగ్, కంటిన్యూస్ అసెస్మెంట్ డిజిటల్ లెర్నింగ్ తప్పనిసరిగా చేయాల్సి ఉందని, అందుకు ఏఐ ఆధారిత అభ్యాసాల స్వీకరణ తప్పనిసరని ఎన్ఎంసీ పేర్కొందని తెలిపారు. ముఖ్యఅతిథి చంద్రశేఖర్ మాట్లాడుతూ... ప్రస్తుతం తాను అమెరికాలో గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నానని, వైద్య విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రత్యేక యాప్ రూపొందించానని తెలిపారు. వెబెక్స్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సౌరబ్ గౌర్ పాల్గొని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఏఐ విషయంలో చాలా ఆసక్తిగా ఉన్నారని, దీనిపై పూర్తి విధి విధానాలు రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ సాయి సుధీర్, రీసెర్చ్ విభాగం డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ, పబ్లికేషన్ డైరెక్టర్ డాక్టర్ సుధ, మెడికల్ ఎడ్యుకేషన్ సలహాదారు డాక్టర్ లోకేశ్ ఈదర తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న వీసీ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ సాయి సుధీర్ తదితరులు

విజయవాడ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విజయవాడ రైల్వేస్టేషన్‌లో మంగళవారం సాయంత్రం విస్తృత తనిఖీలు చేశారు. రైళ్లలో మత్తు పదార్థాల రవాణా నేపథ్యంలో నగర పోలీసులు, ఈగల్ బృందం, రైల్వే పోలీసులు అన్ని ప్లాట్‌ఫారాలు, పార్సిల్ కార్యాలయం, తారాపేట, పలు రైళ్లలో అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఏసీపీలు జి.రామకృష్ణ, స్రవంతి రాయ్, సీఐలు లక్ష్మీనారాయణ, రమణ, ఫతేఅలీ తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికుల బ్యాగు పరిశీలిస్తున్న పోలీసు జాగిలం

21 నుంచి మహిళా ఆర్చరీ టోర్నీ

విజయవాడ క్రీడలు: జాతీయ, రాష్ట్ర ఆర్చరీ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో ఖేలో ఇండియా మహిళా జాతీయ ఆర్చరీ ర్యాంకింగ్ టోర్నీ (ఎన్ఏఆర్‌టీ) నిర్వహిస్తామని రాష్ట్ర ఆర్చరీ సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బెవర వెంకటరమణ తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, వివిధ సంస్థల నుంచి అంతర్జాతీయ, జాతీయ స్థాయి ఆర్చర్లు తలపడతారని తెలిపారు. తొలి 16 స్థానాల్లో నిలిచిన ఆర్చర్లు తర్వాత జరిగే 4వ మహిళా జాతీయ ఆర్చరీ ర్యాంకింగ్ టోర్నీకి అర్హత సాధిస్తారని చెప్పారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన ఆర్చర్లకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

నగరంలో యువకుడి దారుణ హత్య

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ రైల్వేస్టేషన్‌లో యువకుడి దారుణ హత్య తీవ్ర కలకలం రేపింది. మద్యం మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య చెలరేగిన ఘర్షణ చివరికి హత్యకు దారితీసింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడలోని రామరాజ్యనగర్‌కు చెందిన సరగడ రాము(20), సాయి(21) స్నేహితులు. ఇద్దరు కలిసి క్యాటరింగ్ పనులు చేసుకుంటూ రాత్రి రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారాలపై నిద్రపోతుంటారు. మంగళవారం ఉదయం ఇద్దరు కలిసి తారాపేట రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ బార్‌లో మద్యం కొనుగోలు చేసి 8వ నంబరు ప్లాట్‌ఫాంపైకి వెళ్లారు. అక్కడ తనకు సంబంధించి గుట్కాలు, సిగరెట్లు తీస్తున్నాడని రాము ఆవేశంతో సాయి మెడపై మద్యం సీసాతో పొడిచాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో సాయి అక్కడికక్కడే మరణించాడు. ప్రయాణికులు ఇచ్చిన సమాచారంతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రామును అదుపులోకి తీసుకున్నారు. అతడిపై విజయవాడలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 15కి పైగా కేసులు ఉన్నాయి. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ కూడా ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ సీఐలు జె.వి.రమణ, ఫతేఅలీ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం కేసులో బెయిల్ పిటిషన్లపై కౌంటర్లకు నోటీసులు

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో బెయిల్‌పై ఉన్న ముగ్గురు నిందితుల బెయిల్ పిటిషన్లపై ప్రాసిక్యూషన్‌కు ఏసీబీ కోర్టు నోటీసులు ఇచ్చింది. నిందితులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలు ఇటీవల బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఇవి మంగళవారం అనిశా కోర్టులో విచారణకు వచ్చాయి. ప్రాసిక్యూషన్ కౌంటర్లు దాఖలుకు వీలుగా తదుపరి విచారణ ఈనెల 6కు వాయిదా పడింది.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఇబ్రహీంపట్నం గ్రామీణం 9773300487 గొల్లపూడి 8008574638

? స్థానిక బీసీ కాలనీ మూడో బజారులో కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగు పారక అవస్థలు పడుతున్నాం. తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలి. - జి.పవన్‌కుమార్, గ్రామస్థుడు ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల పూడిక తీయించి మురుగు పారేందుకు చర్యలు చేపడతాం. - బసవలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు

స్పందనకు వందనం: ✤ స్థానిక పంచాయతీలోని ఎస్సీ వాడలో సిమెంట్ రహదారి వెంట ఉన్న డ్రెయిన్లలో పూడిక పేరుకుపోయి మురుగునీరు పారుదలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు తెలిపిన సమస్యను పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎస్.నాగబాబుకు వివరించగా స్పందించారు. మంగళవారం పంచాయతీ సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

✤ విస్సన్నపేట గ్రామ పంచాయతీ పరిధి తిరువూరు రహదారిలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మురుగు రహదారిపై ప్రవహిస్తోందని, చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకురాగా ఈవో కేశవ హరికృష్ణ కుమార్ స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులను క్షేత్రస్థాయికి పంపి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

మైలవరం, జి.కొండూరు, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున సాయం అందిస్తోందని, ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆయన కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన పేదలకు మంజూరైన చెక్కులను ఆయా మండలాల నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజాగా 51 మందికి రూ.35,57,810లు మంజూరైనట్లు వివరించారు. ఈ ప్రభుత్వంలో ఇప్పటి వరకు నియోజకవర్గంలో రూ.12.94 కోట్లను అందజేశామన్నారు. పేదల ఆరోగ్యం, భద్రత ప్రధమ ప్రాధాన్యతగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

జాతీయ పోటీలకు ఎంపిక

మైలవరం, న్యూస్‌టుడే: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ అధ్యాపకుడు మన్నేస్వామి తెలిపారు. తృతీయ బీఏ విద్యార్థులు ఎన్.జగన్, డి.సీతయ్య, తృతీయ బీకాం విద్యార్థి పవన్‌కల్యాణ్‌లు కృష్ణా విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పోటీల్లో ప్రతిభ చాటి, ఎంపికయ్యారని పేర్కొన్నారు. త్వరలో మహారాష్ట్రలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని వివరించారు.


విద్యార్థులతో ప్రిన్సిపల్, పీడీ

ప్రణాళిక పదిలం.. లక్ష్య సాధనే ధ్యేయం

నూరు శాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక తరగతులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో వంద శాతం ఉత్తీర్ణతను సాధించాలన్న లక్ష్యంతో వంద రోజుల ప్రణాళికను అత్యంత పకడ్బందీగా అమలు చేస్తున్నారు. గతం కంటె మెరుగ్గా నిబంధనల మార్పులతో ప్రణాళికను రూపకల్పన చేశారు. ప్రతి విద్యార్థి సామర్థ్యం రోజూ నేరుగా విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి చేరేలా ప్రణాళిక అమలవుతుంది. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టి పాఠశాలలను తనిఖీ చేస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్నారు.

మరో రెండు పరీక్షలు: విద్యార్థులు ప్రస్తుతం రోజూ జరుగుతున్న పరీక్షలతోపాటు మరో రెండు పరీక్షలు రాయబోతున్నారు. ఈనెల 9వ తేదీ నుంచి ప్రీ ఫైనల్, అనంతరం గ్రాండ్ టెస్టులు నిర్వహించాల్సి ఉంది. ఈ రెండు పరీక్షలు వందరోజుల ప్రణాళిలో భాగమే. గతంలో విద్యార్థుల హాజరుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు కాదు. ఈసారి ఒక విద్యార్థి వందరోజుల కార్యక్రమానికి గైర్హాజరైతే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సీఆర్‌పీ, పాఠశాలకు కేటాయించిన ప్రత్యేకాధికారి విద్యార్థి తల్లిదండ్రులను సంప్రదించి కారణాలను ఆరా తీస్తున్నారు.


గుంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో వంద రోజుల ప్రణాళికను కలెక్టర్‌కు వివరిస్తున్న డీఈవో చంద్రకళ

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు:	519
పరీక్ష కేంద్రాలు :	140
పది విద్యార్థులు:	27,797
బాలురు: 14,184,	బాలికలు: 13,613

రెండు బృందాలుగా విభజన: పాఠశాలలో నిర్వహించిన పరీక్షల ప్రాతిపదికన షైనింగ్‌టీం, రైజింగ్‌టీంగా విద్యార్థులను విభజించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఏ, బీ గ్రేడ్ల విద్యార్థులను షైనింగ్ టీంగా, సీ, డీ గ్రేడ్ల విద్యార్థులను రైజింగ్ టీంగా విభజించి వేర్వేరుగా ప్రత్యేక తరగతులు చెబుతున్నారు.

నిత్యం పర్యవేక్షిస్తున్నాం

వంద రోజుల కార్యక్రమంపై నిత్యం పర్యవేక్షణ జరుగుతోంది. రోజు పాఠశాలలను తనిఖీ చేసి ఎలా సాగుతుందో నివేదికలు తీసుకుంటున్నాం. జిల్లా కలెక్టర్ కూడా వివిధ కార్యక్రమాలకు హాజరై విద్యార్థులకు ఇస్తున్న శిక్షణపై ఆరా తీస్తున్నారు. మంచి ఫలితాలు వస్తాయన్న విషయంలో ఎలాంటి సందేహం లేదు. - **చంద్రకళ, డీఈవో, ఎన్టీఆర్ జిల్లా**

సైబర్ రంగంలో సేవలకు గుర్తింపు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు షణ్ముఖ శ్రీ సాయి కొమ్మూరి అవుట్‌స్టాండింగ్ యంగ్ సైబర్ సెక్యూరిటీ ప్రొఫెషనల్ అవార్డు గెలుచుకున్నారు. ముంబయిలోని గ్రాండ్ హయత్‌లో జరిగిన ఇండియన్ సైబర్ అండ్ ఎలక్ట్రానిక్ సెక్యూరిటీ సమ్మిట్ 2026 కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. మనదేశ రక్షణ సమాచారం ఇతర దేశాలు అపహరించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చేసిన పరిశోధనలు, సైబర్ రక్షణ కార్యక్రమాల్లో అవగాహన కల్పించడం వంటి సేవలకు అవార్డు వరించింది. 23 ఏళ్ల వయసులోనే అరుదైన ఘనత సాధించారు. సైబర్ భద్రత రంగంలో సేవలందిస్తున్న బెంగళూరుకు చెందిన ఓ సంస్థలో ఆయన సెక్యూరిటీ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. ఆయన పరిశోధనలకు 2024లో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. 2025లో న్యూఢిల్లీ సైబర్ సెక్యూరిటీ అండ్ కమ్యూనికేషన్స్ ఇంటిగ్రేషన్ సెల్ నుంచి ఆయనకు అధికారిక ప్రశంసాపత్రం అందింది. 2026లో ఆయనను ఆ సంస్థ సభ్యుడిగా గుర్తించింది.

యువతను మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంచాలి


శిక్షణలో పాల్గొన్న సిబ్బందితో శేఖర్‌బాబు, దేవమణి, తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: యువకులను మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియాకు దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని నవజీవన్ బాల భవన్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు బాల భవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత చిన్నతనంలోనే మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, మరో వైపు సోషల్ మీడియా, నెట్ వర్కింగ్ సైట్లతో మెదడు తీవ్ర ప్రభావమై శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతున్నారని తెలిపారు. ఇలాంటి ఇబ్బందులు పడేవారిని డీ అడిక్షన్ సెంటర్ ద్వారా చికిత్స అందించి సాధారణ వ్యక్తులుగా మార్చవచ్చని, నూజివీడు మండలం పోనసనపల్లిలో ఏర్పాటు చేసిన బోస్కో డి అడిక్షన్ సెంటర్లో ఉచితంగా వారిని చేర్పించవచ్చని సూచించారు. అవసరమైన వారు 94904 92020 నంబర్ సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మానసిక వికాస కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ దేవమణి, వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ విజయ, డాక్టర్ నరేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

తిరువూరు: ద్విచక్రవాహన తాళాల విషయంలో జరిగిన వివాదంలో తిరువూరుకు చెందిన ఓ బాలుడిపై ముగ్గురు యువకులు దాడి చేశారు. ఈ క్రమంలో బాలుడి తల్లి చేసిన ఫిర్యాదు మేరకు నిందితుడైన ఎ.కొండూరు మండలం కంభంపాడుకు చెందిన జోడపప్పు జాన్, అతని ఇద్దరి స్నేహితులపై కేసు నమోదు చేశామని [illegible] తెలిపారు. మంగళవారం జాన్ అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరు పరచగా రిమాండ్ విధించారన్నారు.

భూ వివాదాలు నివారించేందుకు కృషి


గుర్రాజుపాలెంలో పాస్‌పుస్తకాలు పంపిణీలో కమిషనర్ జయలక్ష్మి, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే: భూ వివాదాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) జి.జయలక్ష్మి అన్నారు. మండలంలోని గుర్రాజుపాలెంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో కలెక్టర్ జి.లక్ష్మీశతో కలిసి రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ రికార్డులు డిజిటలైజేషన్, సాంకేతిక ఆధునీకరణ డేటా ద్వారా భూ సంబంధిత వివాదాలకు చెక్ పెట్టడమే కాకుండా రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని తెలిపారు. పారదర్శకంగా రీసర్వే పూర్తి చేసి సరికొత్త క్యూఆర్ కోడ్‌తో పట్టాదారు పాస్ పుస్తకాలను రూపొందించినట్లు, చరవాణితో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తమ భూ వివరాలు తెలుసుకోవచ్చన్నారు. భూ సంబంధిత వివాదాల పరిష్కారానికై జిల్లా స్థాయిలో ప్రతి సోమవారం రెవెన్యూ క్లీనిక్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. నూతనంగా ఇచ్చిన పాస్ పుస్తకాలతో శాటిలైట్ టెక్నాలజీ, జియో కోఆర్డ్స్ అనుసంధానం చేశారని, గ్రామాల్లో ఇక మీదట హద్దులు మార్చేందుకు వీలు లేకుండా పటిష్ఠంగా రీసర్వే జరిపి పాస్ పుస్తకాలు రైతులకు అందజేస్తున్నట్లు వివరించారు. ప్రకృతి విపత్తులు వచ్చినా అత్యంత కచ్చితత్వంతో మన భూమి సరిహద్దు భద్రంగా ఉంటుందని, భూ సమాచారం డేటా సెంటర్లో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేసీ ఎస్.ఇలక్కియా, ఆర్డీవో కావూరి చైతన్య, సర్పంచి వెంకట్రామయ్య, ఉప సర్పంచి వెంకటరమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు ఆనందంగా ఉన్నారు

గుళ్లపూడి(గంపలగూడెం), న్యూస్‌టుడే: రైతులకు తమ భూముల పట్టాదారు పాస్ పుస్తకాలను ఎలాంటి తప్పులు లేకుండా రాజముద్రతో ముద్రించి ప్రభుత్వం పంపిణీ చేస్తోందని ఆర్డీవో కె.మాధురి అన్నారు. మండలంలోని గుళ్లపూడిలో భూముల రీసర్వే పూర్తవగా గ్రామానికి చెందిన 456 మంది రైతులకు కొత్తగా మంజూరైన భూ హక్కు పత్రాలను మంగళవారం ఆమె పంపిణీ చేశారు. కొత్త పాస్ పుస్తకాలపై ఉన్న క్యూఆర్‌కోడ్ స్కాన్ చేస్తే సదరు రైతుల భూవివరాలు కూడా తెలుసుకోవచ్చన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీసర్వే, కొత్త పుస్తకాలు పంపిణీపై భూయజమానులు సంతృప్తిగా ఉన్నారని, ఎవరికైనా తమకిచ్చిన పుస్తకాల్లో లోపాలు గుర్తిస్తే వెంటనే రెవెన్యూ సిబ్బందికి తెలియజేస్తే సరిచేస్తారన్నారు. భూ హక్కు పత్రాలు అందుకున్న రైతులు బ్యాంకు రుణాలకు వినియోగించుకోవచ్చన్నారు. తహసీల్దార్ వి.రాజకుమారి, ఆర్ఐ ఎం.వీరభద్రరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీవో తనిఖీలు

తిరువూరు, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం ఆర్డీవో మాధురి, తహసీల్దార్ వై.నాగమణి సమక్షంలో రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం లక్ష్మీపురంలోని చౌకధర దుకాణాన్ని అధికారులు తనిఖీ చేశారు. రేషన్ సరకుల నిల్వలు, పంపిణీ విధానం, రికార్డులను పరిశీలించి, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. పౌరసరఫరాల డీటీ శ్వేతా తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో చేరండి

మైలవరం, న్యూస్‌టుడే: తమ కళాశాలలో మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వచ్చే ఏడాది ఇంటర్ పూర్తి చేసే విద్యార్థులు చేరాలని లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.రంగారావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఓపెన్ డే కార్యక్రమం నిర్వహించారు. డిగ్రీ కళాశాలలోని సౌకర్యాలు, విద్యాబోధన తీరును వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఫణికుమార్, కేవీ ముత్యాల, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఉపాధ్యాయుల సౌకర్యార్థం మండలంలోని మండల పరిషత్ పాఠశాలల్లో పని చేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంత ఉపాధ్యాయులు ముగ్గురు కలిసి 20 కుర్చీలను వితరణగా అందజేశారు. మంగళవారం దాతలు కె.శ్రీనివాసరావు, పి.గోపాల్, ఇ.నీలావతమ్మలు వాటిని ఎంఈవోలు రాజు, బాలుల ద్వారా కార్యాలయంలో సమకూర్చారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.రవిబాబు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఎంఈవో, పాఠశాల కార్యాలయాలను సంప్రదించాలని కోరారు.

రేపు బీసీల ఆత్మగౌరవ సభ

కొండపల్లి, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ చిట్టిబాబు ఆధ్వర్యంలో బీసీల ఆత్మగౌరవ సభను కొండపల్లి ఆంధ్రా పబ్లిక్ పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించనున్నారు. సభా కార్యక్రమంలో మాజీ మంత్రులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొంటారని, చట్ట సభల్లో పొందాల్సిన హక్కుల గురించి వక్తలు ప్రసంగిస్తారని చిట్టిబాబు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ నాయకులు సభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మండలంలో ప్రజాదర్బార్ నేడు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమం జరుగుతుందని.. శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.

దాడిలో ఒకరికి గాయాలు

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక థియేటర్ వద్ద గల వైన్‌షాప్ ముందు సోమవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్సై కే సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెల్వాడానికి చెందిన వేముల గోపీచంద్ ద్విచక్ర వాహనంపై, జి కొండూరు మండలం గడ్డమణుగుకు చెందిన సూదిరెడ్డి సురేష్ కారులో రాగా, రెండు వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. దాంతో వారి మధ్య వాదన జరగ్గా, చేతిలో ఉన్న వస్తువుతో సురేష్ తలపై గోపీచంద్ కొట్టి గాయపరిచినట్లు ఎస్సై వివరించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు గోపీచంద్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కిడ్నీ బాధితులకు పోషకాహారం

వినగడప(గంపలగూడెం), న్యూస్‌టుడే: విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) వితరణతో మండలంలోని వినగడప, శివారు గ్రామాలైన తండా, నారికింపాడు గ్రామాలకు చెందిన 40 మంది మూత్రపిండాల వ్యాధి బాధితులకు మంగళవారం పోషకాహారం పంపిణీ చేశారు. కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో కిడ్నీ బాధితులకు ఆరు నెలల పాటు పోషకాహారం పంపిణీ చేస్తామని ఎంపీ చిన్ని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎ.కొండూరు మండలంలో గతేడాది డిసెంబరులో ఎంపీ ఆధ్వర్యంలోనే పోషకాహారం పంపిణీ ప్రారంభించారు. జనవరిలో తిరువూరు మండలంలో కూడా బాధితులకు అందజేశారు. గంపలగూడెం మండలంలోని అనుముల్లంకలో సోమవారం పంపిణీ జరిగింది. వినగడపలో మాజీ ఎంపీపీ కోటగిరి శ్రీనివాసరావు, తెదేపా గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కోలా వెంకటేశ్వరరావు, మందడపు రామారావు పాల్గొని బాధితులకు పంపిణీ చేశారు.

జాతీయరహదారి వెంట వెలుగులు


తీగలు పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది

స్పందనకు వందనం: గుంటుపల్లి (ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే: నగర ట్రాఫిక్ పోలీసు విభాగం, జాతీయ రహదారి సంస్థలు సంయుక్తంగా గుంటుపల్లి డాన్ బోస్కో పాఠశాల నుంచి తుమ్మలపాలెం ఐశ్వర్య గ్రాండ్ వరకు జాతీయరహదారి వెంట ఉన్న విద్యుత్తు దీపాలకు విద్యుత్తు సరఫరాను మంగళవారం పునరుద్ధరించారు. ఇటీవల రాత్రి సమయాల్లో గుంటుపల్లి తుమ్మలపాలెం గ్రామాల మధ్య వీధి దీపాలు వెలగకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు ఈనాడులో కథనాలు ప్రచురించగా స్పందించారు. ఈ నేపథ్యంలో రహదారి డివైడర్ల మధ్యలో ఉన్న లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని నగర ట్రాఫిక్ డీసీపీ షేక్ షరీనా బేగం ట్రాఫిక్ విభాగం అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ, ఆర్ఎస్ఐ లక్ష్మణరావు పర్యవేక్షించారు.

సమ్మె జయప్రదానికి పిలుపు



తిరువూరులో అంగన్‌వాడీ, ఆశావర్కర్ల నిరసన

విస్సన్నపేట, న్యూస్‌టుడే: సమస్యల సాధనకై దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్స్ మండలంలోని తెల్లదేవరపల్లి పీహెచ్‌సీలో డాక్టర్ శ్రీనివాసరావుకు సమ్మె నోటీసును మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు నాగరాజు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు చిలకమ్మ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే: లేబర్‌కోడ్‌ను రద్దు చేయాలని తిరువూరు మండలంలోని అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు నిరసన మంగళవారం నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి వినతి


పెనుగొలనులో పోస్టుకార్డులు చూపిస్తున్న ఉపాధ్యాయులు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం పోస్టు కార్డు ఉద్యమం నిర్వహించారు. మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయులు తమ సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖలు రాసి పోస్టు చేశారు. పీఆర్సీ కమిషన్ ఛైర్మన్‌ను నియమించాలని, 29శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలని, ఉద్యోగ పింఛన్‌దారుల బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, ఆరోగ్య కార్డుల వైద్య బిల్లులు వెంటనే పరిష్కరించాలని పోస్టు కార్డుపై రాసి పంపించారు. యూటీఎఫ్ మండల నాయకులు కె.మురళి, జి.కోటేశ్వరరావు, కె.రాధాకృష్ణ, పి.ఏడుకొండలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడి ఎన్నిక


సత్యనారాయణ

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షునిగా మండలంలోని పెనుగొలను గ్రామస్థుడు సుగ్గల సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు కోట నాగేశ్వరరావు ఇంటి వద్ద మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.చినసత్యంబాబు, నాయకులు కె.నరసింహారావు, కె.రవికుమార్, ఎస్.విష్ణు, వి.రామకృష్ణ పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి



మద్దులపర్వ: రైతులతో ఏవో డి.శ్రీనివాసరావు, సిబ్బంది

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రైతులు తమ భూముల్లో మట్టినమూనాలు తీసి పరీక్షలు చేయించాలని రెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మద్దులపర్వ, ముచ్చనపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలకు రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని సూచించారు. ఉద్యాన అధికారి నరేంద్రకుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది సంపత్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: రబీ వరిలో ఉల్లికోడు లేదా పీక పురుగు నివారణకు నాటిన 20 రోజుల లోపు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని విస్సన్నపేట ఏడీఏ శశికళ అన్నదాతలకు సూచించారు. మంగళవారం విస్సన్నపేటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉల్లికోడు ఆశించిన వరిలో ఆకులు మధ్య కొమ్మ ఉల్లి ఆకులా మారి పొడవుగా వెండి రంగులో మారుతుందని, ఇటువంటి కొమ్మల నుంచి కంకులు రాక దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారి షేక్ టిప్పుసుల్తాన్, సిబ్బంది.

తిరువూరు, న్యూస్‌టుడే: మట్టి సారాన్ని పరీక్షించడం ద్వారా పంటలకు అవసరమైన పోషకాలు,సేంద్రీయ పదార్థాల స్థాయిని తెలుసుకోవచ్చని వ్యవసాయ అధికారిణి పద్మ తెలిపారు. మండలంలోని చింతలపాడులో మంగళవారం ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మట్టి నమూనా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్కే, ప్రకృతి వ్యవసాయ విభాగ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మామిడి సాగులో జాగ్రత్తలు పాటించండి

గొల్లపూడి, న్యూస్‌టుడే: మామిడి సాగులో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల ఉద్యాన శాఖ అధికారి పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కొత్తూరుతాడేపల్లిలో మామిడి రైతులతో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మామిడిలో మొగ్గ దశ నుంచి కోత దశ వరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పండు ఈగ నివారణకు లింగాకర్షక బుట్టలు, నల్లతామర పురుగులకు నీలిరంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలన్నారు. రైతులు బొర్రా పున్నారావు, ద్వారకా రాకేష్, గరిమెళ్ల రంబాబు తదితరులు పాల్గొన్నారు

125 దేశాల నాణేలు..కరెన్సీ నోట్ల ప్రదర్శన


తిలకిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోడూరు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని కోడూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తెలిపేందుకు వివిధ దేశాల నాణాలు, కరెన్సీ నోట్లపై ప్రదర్శన మంగళవారం ఏర్పాటు చేశారు. హెచ్ఎం రామ్‌ప్రదీప్ ఆధ్వర్యంలో 125 దేశాల నాణేలను సేకరించి ప్రదర్శన చేశారు. విద్యార్థులకు ఆయా దేశాల కరెన్సీ నోట్ల గురించి వివరించారు. ఉపాధ్యాయులు తేజస్విని, జయశ్రీ, సుప్రియ, నాగేంద్రరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత ప్రసూతి సేవలు


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా, అధికారులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న ఉచిత ప్రసూతి సేవలను సద్వినియోగం చేసుకునేలా గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులను, వారి కుటుంబ సభ్యులను అంగన్‌వాడీ ఉద్యోగులు చైతన్యపరచాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి ఎస్‌కే.రుక్సానా సుల్తానా ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ ఉద్యోగులకు కేపీఐ సర్వేపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహారం ప్రతి నెలా గర్భిణులకు అందిస్తున్నామని, అదేవిధంగా కార్పొరేట్ ఆసుపత్రుల కంటే మెరుగైన వైద్య సదుపాయాలు, సేవలు, నిష్ణాతులైన వైద్యులు కాన్పులు చేసేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నారనే విషయాన్ని కూడా గర్భిణులకు వివరించాలన్నారు. నిర్మాణ దశలో ఆగిపోయిన అంగన్‌వాడీ భవనాల వివరాలను తనకు పంపించాలని సీడీపీవో కృష్ణకుమారిని ఆదేశించారు. ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలనతో అవగాహన



సందర్శనలో చంద్రగూడెం మల్లె రైతులు

మైలవరం, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయి పర్యటన, పరిశీలన ద్వారా మల్లెపూల అనుబంధ పరిశ్రమలపై రైతులకు అవగాహన కలుగుతుందని మండలంలోని చంద్రగూడెం పీఏసీఎస్ అధ్యక్షుడు రోశాలు, మండల ఉద్యాన అధికారి అహ్మద్ పేర్కొన్నారు. రైతు విజ్ఞానయాత్రల్లో భాగంగా రాష్ట్ర ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మల్లె రైతులను తమిళనాడులోని నీలకొట్టై ప్రాంతానికి క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లారు. అక్కడ మల్లె నుంచి నూనె తీసే పరిశ్రమలను సందర్శించి, ఆ విధానాలను పరిశీలించారు. పరిశ్రమలకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. అంతర్జాతీయంగా మల్లె నూనెకు గల గిరాకీని అక్కడి అధికారులు రైతులకు వివరించినట్లు ఉద్యాన అధికారి తెలిపారు.

‘రాష్ట్రంలో ఆటవిక రాజకీయం రాజ్యమేలుతోంది’


మాట్లాడుతున్న మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్

ఇబ్రహీంపట్నం, రాష్ట్రంలో ఆటవిక రాజకీయాన్ని పోలీసుల సాక్షిగా తెదేపా చేస్తుందని వైకాపా మాజీ మంత్రులు వనిత, అనిల్‌కుమార్ యాదవ్, పేర్ని నానిలు ఆరోపించారు. జోగి ఇంటిపై దాడి నేపథ్యంలో వారు జోగి రమేష్‌ను మంగళవారం ఇబ్రహీంపట్నంలో పరామర్శించి మాట్లాడారు. పవిత్రమైన తిరుపతి లడ్డూపై అసత్యాలు పలికి, సీబీఐ ఇచ్చిన రిపోర్టుకి సమాధానం చెప్పలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు తెదేపా తెర తీసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు వెనుక ఉండి అరాచకాలను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి మరో మూడు సంవత్సరాలు గడువు ఉన్నందున అప్పటి వరకూ ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండని, ఎన్ని దాడులు చేస్తారో చేసుకోండని సవాలు విసిరారు. మహిళలు, బీసీలు తెదేపాలోనే ఉన్నట్లుగా మంత్రులు మాట్లాడుతున్నారన్నారు. ఇతర పార్టీల్లో ఉన్న వారు మహిళలుగా గుర్తించే సంస్కృతి తెదేపా ప్రజాప్రతినిధులకు లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వానికి ఎక్స్‌పైరీ డేట్ 2029గా తెలుస్తుందన్నారు. జోగి రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి మృతిపై కేసు

కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్లకు చెందిన విశ్రాంత ఆర్టీసీ కండక్టర్ మంద శ్యామ్యూల్(64) మృతిపై కేసు నమోదైంది. ఎస్ఐ పి.విశ్వనాథ్ కథనం ప్రకారం.. శ్యామ్యూల్‌కు భార్య, అవివాహితులైన ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కంచికచర్ల రెవెన్యూ పరిధిలోని 175/1బి సర్వే నంబరులో తన భార్య చంద్రలీల పేరున ఉన్న 6.58 ఎకరాల వ్యవసాయ భూమిని శ్యామ్యూల్.. 2012లో ఇబ్రహీంపట్నం మండలం మూలపాడుకు చెందిన జాస్తి జ్యోతిర్మయికి(సేల్- జీపీఏ) రిజిస్ట్రేషన్ చేసి రూ.10 లక్షలు నగదు తీసుకున్నారు. తర్వాత సదరు మహిళ అప్పటి రెవెన్యూ అధికారుల సహాయంతో మోసపూరితంగా తమ పొలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతో మృతుని కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి కోర్టులో వివాదం నడుస్తుండడం, ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడం, కుమార్తెలకు వివాహం చేయలేకపోవడం, తాను మోసపోయినట్టు శ్యామ్యూల్ మనస్తాపం చెందేవారు. ఈ క్రమంలోనే తన తండ్రి ఈ నెల 2న మరణించారని కుమారుడు బుచ్చిబాబు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగిని సస్పెండ్ చేయాలి

కొండపల్లి, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య మహిళా కార్మికులపై అసభ్య వ్యాఖ్యలను ప్రచారం చేసిన ఉద్యోగిని సస్పెండ్ చేయాలని పారిశుద్ధ్య కార్మికులు మున్సిపల్ శాఖ ప్రాంతీయ సంచాలకులు నాగనరసింహారావును మంగళవారం కలిసి వినతి పత్రం ఇచ్చారు.



విద్యార్థులూ, ఉద్యోగార్థులూ తాజా వర్తమాన పరిణామాలను అనుసరిస్తుండాలి. ఎక్కడ ఏ సానుకూలత కనిపించినా దాని ఫలితంగా భవిష్యత్తు ఉద్యోగావకాశాలపై ఒక అవగాహనకు రావాలి. ఐరోపా సమాఖ్య (ఈయూ), భారత్ మధ్య ఇటీవల స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదిరింది. దీంతో మన దేశానికి 6.9 లక్షల కోట్ల రూపాయల ప్రయోజనం జరుగనుంది. సుంకాల తగ్గింపు రీత్యా వివిధ రంగాలూ లబ్ధి పొందనున్నాయి. ఈ పరిణామాలన్నీ ఐరోపా దేశాల్లో ఉన్నత విద్య, ఉద్యోగాలు ఆశించే భారతీయులకు మేలు చేసేవే.

ఐరోపా దేశాలు రమ్మంటున్నాయ్!

జౌళి, దుస్తులు, సముద్ర ఉత్పత్తులు, పాదరక్షలు, రసాయనాలు, ప్లాస్టిక్, పిల్లల బొమ్మలు, క్రీడా పరికరాలతో పాటు సేవా రంగాలూ పెద్ద ఎత్తున ప్రయోజనం పొందనున్నాయి. దీనివల్ల భారతీయ వృత్తి నిపుణులు, వివిధ విద్యా నేపథ్యాలున్న యువత, నైపుణ్యం ఉన్నవారూ, ఏ నైపుణ్యమూ లేని కార్మికులూ ఐరోపాలో ఉపాధి పొందవచ్చు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చేందుకు మరో ఏడాది వ్యవధి ఉన్నందున సన్నద్ధం కావడానికీ అవకాశం ఉంది.

ఎవరికి డిమాండ్?

ఐటీ, ఇంజినీరింగ్, హెల్త్‌కేర్, ఫైనాన్స్-అకౌంటింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, కన్‌స్ట్రక్షన్, మాన్యుఫ్యాక్చరింగ్, లాజిస్టిక్స్-ట్రాన్స్‌పోర్ట్, హాస్పిటాలిటీ, టూరిజం రంగాల్లో విద్యార్హతలు, నైపుణ్యాలు ఉన్న యువతకు మంచి అవకాశాలున్నాయి. ప్రత్యేకించి కొన్ని కౌశలాలు నేర్చుకోవడం ద్వారా ఐరోపా దేశాల్లో ఉపాధితో పాటు ఆకర్షణీయ వేతనాలూ అందుకోవచ్చు.

ఏ హోదాల్లో?

ప్రస్తుతం మనదేశంలో డిమాండ్ ఉన్న ప్రత్యేక సామర్థ్యాలకే యూరప్ దేశాల్లోనూ పెద్దపీట వేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ డెవలపర్స్, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్పెషలిస్టులు, డేటా సైంటిస్టులు, డేటా అనలిస్టులకు ఐరోపా దేశాలు స్వాగతం పలుకుతున్నాయి.

ఇంజినీరింగ్ స్పెషలిస్టులు: జర్మనీలో మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, కెమికల్, ఆటోమోటివ్ ఇంజినీర్లకు డిమాండ్ ఉంది.

హెల్త్‌కేర్ నిపుణులు: జర్మనీ, స్వీడన్, నార్వే దేశాలకు సుశిక్షితులైన నర్సులు, డాక్టర్లు, మెడికల్ టెక్నీషియన్లు, ఫిజియోథెరపిస్టుల అవసరం ఉంది.

ఫైనాన్స్, అకౌంటింగ్ స్పెషలిస్టులు: ఫ్రాంక్‌ఫర్ట్, లగ్జంబర్గ్, డబ్లిన్‌లు ఫైనాన్స్, అకౌంటింగ్ స్పెషలిస్టుల కోసం ఎదురుచూస్తున్నాయి.

ఇవన్నీ డిగ్రీతో పాటు నైపుణ్యాలు అవసరమైన ఉద్యోగాలే. ఐరోపా దేశాల్లో ఒకేషనల్, డిప్లొమా కోర్సులతోనూ ఉపాధి పొందవచ్చు.

కన్‌స్ట్రక్షన్, మాన్యుఫ్యాక్చరింగ్: వెల్డర్లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లతో సహా టెక్నీషియన్లకూ మంచి డిమాండ్ ఉంది.

లాజిస్టిక్స్, ట్రాన్స్‌పోర్టు: రవాణా రంగంలో భారీ వాహనాల డ్రైవర్లు, వేర్‌హౌజ్ మేనేజర్ల కొరత ఉంది.

హాస్పిటాలిటీ, టూరిజం: పాకశాస్త్ర నిపుణులతో పాటు హోటల్ మేనేజ్‌మెంట్ సిబ్బందికి స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్ దేశాల్లో డిమాండ్ ఉంది. పలు వంటకాల వారీ నిపుణుల కోసం యూరప్ దేశాలు ఎదురుచూస్తున్నాయి. ఉదాహరణకు బిర్యానీ స్పెషలిస్టులను జర్మనీ స్వాగతిస్తోంది.

ఏ నైపుణ్యాలు?

ఐరోపా దేశాల్లో ఉద్యోగాల కోసం ఎంచుకున్న రంగంలో ప్రావీణ్యంతో పాటు కొన్ని ప్రత్యేక కౌశలాలు నేర్చుకోవాలి.

భాషా నైపుణ్యం: టెక్నాలజీ సంబంధిత వృత్తులకు ఆంగ్లంపై పట్టు అనివార్యం. అయితే స్థానిక భాషలు వచ్చిన వారికి నియామకాల్లో ప్రాధాన్యం ఉంటుంది. ఇలాంటి వాటిలో జర్మనీ, ఫ్రెంచ్, ఇటాలియన్ భాషలు ముఖ్యమైనవి.

కలివిడితనం: విద్యార్హతలు, నైపుణ్యాలతో పాటు విభిన్న వాతావరణ పరిస్థితులు, సంస్కృతుల మధ్య సౌకర్యవంతంగా పనిచేయగలగాలి. స్థానిక బృంద సభ్యులతో కలివిడిగా వ్యవహరించగలగాలి. వృత్తిపరమైన నిబద్ధత ఉండాలి.

సర్టిఫికేషన్లు: చేయాలనుకున్న ఉద్యోగం ప్రకారం ఇవి ఉంటాయి. సంస్థలు, రంగాల వారీ అర్హతలు, సర్టిఫికేషన్లు మారతాయి. సాధారణంగా అమెజాన్ వెబ్ సర్వీస్ (ఏడబ్ల్యూఎస్), సిస్కో, మైక్రోసాఫ్ట్ లాంటి సర్టిఫికేషన్లు అడుగుతారు.

ఏ దేశం ఎవరికి బాగు?

ఆసక్తి ఉన్న దేశం వైపు పరుగెత్తడం కంటే మన సామర్థ్యాలకు ఏ దేశంలో రాణింపు ఉంటుందో తెలుసుకోవడం ముఖ్యం. ఆ ప్రకారం నిర్ణయం తీసుకోవాలి.

జర్మనీ: ఇంజినీర్లు, ఐటీ, హెల్త్‌కేర్ నిపుణులు.

నెదర్లాండ్స్: టెక్నాలజీ, ఇంజినీరింగ్ నైపుణ్యాల కేంద్రం

ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ: హాస్పిటాలిటీ, టూరిజం, హెల్త్‌కేర్ స్పెషలిస్టులకు డిమాండ్ ఉంది.

రొమేనియా: తయారీ రంగంలో టెక్నీషియన్లకు స్వర్గధామంగా అవతరిస్తోంది.



ఉద్యోగ సాధనకు తగిన సమయం, సందర్భం కలిసి రావాలి. ఐరోపా దేశాల్లో కొలువులు ఆశిస్తోన్న యువతకు ఇదే తరుణం. భారత్-ఐరోపా సమాఖ్య మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరినందున ద్వారాలు తెరుచుకున్నాయి. దేశాల వారీ అధ్యయనం చేసి, స్వీయ సామర్థ్యాలను మదింపు చేసుకోవాలి. వాటి ప్రకారం కార్యాచరణ సిద్ధం చేసుకుంటే కెరియర్ స్వప్నం సాకారమవుతుంది.



- యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

కోర్టు అసిస్టెంట్లు

తూర్పు గోదావరి జిల్లాలోని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ కోర్టుల్లో ఒప్పంద ప్రాతిపదికన కోర్టు అసిస్టెంట్, కోర్టు అటెండెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ● కోర్టు అసిస్టెంట్-04 ● కోర్టు అటెండెంట్-02

అర్హత: పదో తరగతి. **వయసు:** 31.01.2026 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. **వేతనం:** నెలకు కోర్టు అసిస్టెంట్‌కు రూ.10,000. కోర్టు అటెండెంట్‌కు రూ.6,000. **ఎంపిక:** ఇంటర్వ్యూ తదితరాలతో.

చిరునామా: ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి, తూర్పు గోదావరి, రాజమహేంద్రవరం.

దరఖాస్తుకు చివరి తేదీ: 16.02.2026

వెబ్‌సైట్: https://eastgodavari.dcourts.gov.in/notice-category/recruitments/

ఫిట్టర్ అర్హతతో ఎలాంటి కొలువులు?



ఫిట్టర్ ట్రేడుతో ఐటీఐ చేస్తున్నాను. ఈ అర్హతతో విదేశాల్లో ఉద్యోగాలకు అవకాశం ఉందా, అదనంగా ఎలాంటి నైపుణ్యాలు కావాలి? - రంగనాథ్

■ ఐటీఐ చదవడం వల్ల సాంకేతిక రంగంలో ఒక బలమైన పునాది ఏర్పడుతుంది. పరిశ్రమల ఆధారిత దేశాల్లో ఫిట్టర్లకు మంచి డిమాండ్ ఉంది. మన దేశంలోనే కాకుండా గల్ఫ్ దేశాలు, యూరప్, ఆస్ట్రేలియా, కెనడా లాంటి అనేక దేశాల్లో తయారీ పరిశ్రమలు, ఆటోమొబైల్ రంగం, ఆయిల్ అండ్ గ్యాస్ పరిశ్రమలు, పవర్ ప్లాంట్లు, షిప్ బిల్డింగ్ యార్డులు మొదలైన చోట్ల ఫిట్టర్ ట్రేడుతో ఉపాధి అవకాశాలు ఉన్నాయి. ఐటీఐ సర్టిఫికెట్‌తో పాటు కొన్నేళ్ల వృత్తి అనుభవం, అదనపు నైపుణ్యాలు ఉంటేనే విదేశాల్లో ఉద్యోగం పొందే అవకాశాలు మరింత మెరుగుపడతాయి.

◗ ఫిట్టర్ ట్రేడు పూర్తి చేసుకున్నవారు సాధారణంగా మెకానికల్ భాగాల అసెంబ్లీ, మెషిన్ ఇన్‌స్టలేషన్, మెయింటెనెన్స్, బిగింపు, మరమ్మతులు నిర్వహించగలగాలి. విదేశాల్లో పనిచేయాలంటే ఈ పనుల్లో ప్రాక్టికల్ పరిజ్ఞానం చాలా అవసరం. కనీసం మూడేళ్ల పరిశ్రమ అనుభవం ఉంటే ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. అలాగే బ్లూప్రింట్ లేదా డ్రాయింగ్ చదవగలగడం, మెజరింగ్ పరికరాలు సరిగ్గా ఉపయోగించగలగడం, భద్రతా నిబంధనలు పాటించడం లాంటి అంశాలు కూడా చాలా ముఖ్యం.



ఫిట్టర్ ట్రేడుతో పాటు సీఎన్‌సీ మెషిన్ ఆపరేషన్, లేథ్, మిల్లింగ్ మెషిన్ వాడకం, హైడ్రాలిక్స్, న్యూమాటిక్స్ బేసిక్స్, వెల్డింగ్ లాంటి స్కిల్స్ ఉంటే పరిశ్రమల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తాయి. అలాగే ఇండస్ట్రియల్ మెయింటెనెన్స్, మెషిన్ అసెంబ్లీ, ట్రబుల్ షూటింగ్ లాంటి రంగాల్లో శిక్షణ తీసుకుంటే మల్టీ స్కిల్డ్ టెక్నీషియన్‌గా గుర్తింపు పొందవచ్చు.

ఉపాధి పథం
నైపుణ్య సాధనం

◗ విదేశీ ఉద్యోగాల్లో సర్టిఫికేషన్లు కీలక పాత్ర పోషిస్తాయి. ఇండస్ట్రియల్ సేఫ్టీ సర్టిఫికెట్, ఫస్ట్ ఎయిడ్ ట్రెయినింగ్, వెల్డింగ్ సర్టిఫికెట్, ఐఎస్‌ఓ క్వాలిటీ అవేర్‌నెస్ కోర్సులు లాంటి వాటి వల్ల ప్రొఫైల్ బలపడుతుంది. కొన్ని దేశాలు స్కిల్ అసెస్‌మెంట్ లేదా ట్రేడ్ టెస్ట్ కూడా నిర్వహిస్తాయి. కాబట్టి ప్రాక్టికల్ పనుల్లో ప్రావీణ్యం ఉండటం చాలా అవసరం.

◗ భాషా నైపుణ్యాలకు సంబంధించి ఆంగ్లంలో మాట్లాడగలగడం, అర్థం చేసుకోవడం, భద్రతా సూచనలను పాటించడం లాంటివి విదేశాల్లో పని చేయడానికి ఎంతో అవసరం. అదనంగా టీమ్ వర్క్, టైమ్ మేనేజ్‌మెంట్, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ప్రవర్తన లాంటి సాఫ్ట్ స్కిల్స్ కూడా ఉపయోగపడతాయి.

ఫిట్టర్ ట్రేడుతో ఐటీఐ పూర్తి చేసుకున్నవారికి విదేశాల్లో పలు ఉద్యోగాలు ఉన్నాయి. వాటిని సాధించాలంటే వృత్తి అనుభవం, అదనపు నైపుణ్యాలు, సర్టిఫికేషన్లు, ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలి. ఇప్పటి నుంచే ఈ అంశాలపై దృష్టి పెట్టి క్రమంగా ముందుకు సాగితే, మంచి వేతనంతో స్థిరమైన కెరియర్‌ను నిర్మించుకోవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

వాయిదా వేస్తున్నారా..

విద్యార్థులు, ఉద్యోగులు లక్ష్యాలు నిర్దేశించుకుంటారు. కొంతవరకు ప్రయత్నిస్తారు. అంతలోనే 'ఆ.. పరీక్షకు ఇంకా నెల రోజులు ఉన్నాయి. ఇప్పటి నుంచీ చదివితే అప్పటికి గుర్తుండదు, అయినా మళ్లీ చదవాల్సిందే కదా!' 'బాస్ ఇచ్చిన పనికి ఇంకా వారం గడువు ఉంది తర్వాత చూద్దాంలే' అనుకుంటూ వాయిదాలు వేస్తుంటారు.

విద్యార్థులైనా, వృత్తి నిపుణులైనా చిన్న చిన్న పనులు చేస్తున్నప్పుడే ఉత్పత్తి సామర్థ్యం పెరిగి ఒత్తిడి తగ్గుతుంది. సమయం ఉందని వాయిదా వేస్తే అనుకోని అవాంతరాలు ఎదురుకావచ్చు లేదా చివరలో సమయం లేకపోవడం వల్ల ఒత్తిడి పెరిగి తప్పులూ జరగవచ్చు. అందువల్ల గడువుతో సంబంధం లేకుండా ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఒక క్రమ పద్ధతిని అనుసరిస్తేనే కోరుకున్న ఫలితాలు వస్తాయి.

✦ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని పూర్తి చేయకుండా వాయిదా వేస్తుంటే అది మానసికంగా ఒత్తిడినీ పెంచుతుంది. ఆ పని ఎంత చిన్నదైనప్పటికీ సకాలంలో చేస్తే ఎంతో సంతృప్తి దక్కుతుంది. ఆత్మవిశ్వాసమూ పెరుగుతుంది. కొత్త లక్ష్యాలను నిర్ణయించుకోవడానికీ అవకాశం ఏర్పడుతుంది.

✦ కొత్త పనులు చేయాలనే ఆలోచన మంచిదే. కానీ తర్వాత చూద్దాంలే అని వాయిదా వేస్తే ఆ పని ఎప్పటికీ పూర్తి కాకపోవచ్చు. ప్రయత్న సాధన నిరంతరంగా ఉంటేనే ఫలితాలు సిద్ధిస్తాయి. ప్రతి లక్ష్యానికీ సమాన విలువ ఇవ్వాలి, దాన్ని నాయకత్వ లక్షణాలతో పూర్తిచేయాలి. ఆత్మవిశ్వాసం, జవాబుదారీతనం ఉంటే ఎదుగుదల సాధ్యమవుతుంది.



✦ అనుకున్న లక్ష్యాలను సకాలంలో విజయవంతంగా పూర్తిచేయడానికి పట్టుదల, క్రమశిక్షణ ఎంతో అవసరం. ప్రయత్న సాధనలో అనేక సందర్భాల్లో పని చాలా పెద్దగా కనిపించొచ్చు. అందువల్ల చిన్న చిన్న భాగాలుగా విభజించుకోవాలి. ఒక్కొక్కటీ పూర్తయితే కొన్ని రోజుల్లోనే పెద్ద విజయం అందుకోవచ్చు.

✦ పనులు వాయిదా వేయడానికి బద్ధకం ఒక్కటే కారణం కాకపోవచ్చు. కొంతమంది చేయలేమేమో అన్న సంకోచం తోనూ వెనుకడుగు వేస్తుంటారు. ఇంకొంత మంది సరైన సమయం రావాలని ఎదురుచూస్తుంటారు. అయితే గొప్ప లక్ష్యంతో మొదలుపెట్టిన పనులు నిర్దేశించుకున్న గడువు కొంచెం దాటినప్పటికీ పూర్తవుతాయి. సరైన ప్రణాళికకు చిత్తశుద్ధి తోడైతే ఏ పని ప్రారంభించినా తప్పకుండా విజయవంతమవుతుంది.

✦ సాధనలో అడ్డంకులు ఎదురైతే మన వల్ల కాదని వదిలేయకూడదు. వాటిని సవాళ్లుగా స్వీకరించాలి. చిన్న చిన్న ఇబ్బందులు మనల్ని ఆపడానికి రావు. వాటి నుంచి నేర్చుకోవడానికి, అలవాటు పడటానికి, వృద్ధిని పెంచుకోడానికి మరింత స్పష్టతతో ఉండటానికి అవి తోడ్పడతాయి.

✦ విజయం స్వల్ప ప్రయత్నంతో రాదు. సులువుగా దక్కదు. అందువల్ల వాయిదా వేయడాన్ని విరమించుకుని, నిబద్ధతతో కృషి చేస్తే అనుకున్న పనులన్నీ గడువులోగా పూర్తవుతాయి. ఫలితంగా విజయం సాధించామనే సంతృప్తితో పాటు ఆత్మవిశ్వాసమూ పెరుగుతుంది. తర్వాత చేయాలనుకున్న పనులకు అది ఎంతో ప్రేరణ అవుతుంది.

తెలంగాణ హైకోర్టులో

తెలంగాణ హైకోర్టు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఆఫీస్ సబార్డినేట్, డ్రైవర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ● ఆఫీస్ సబార్డినేట్: 34 ● డ్రైవర్: 09

అర్హత: పోస్టులను అనుసరించి ఏడో తరగతి, పదోతరగతి ఉత్తీర్ణత.

వయసు: 01.07.2026 నాటికి 46 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

వేతన శ్రేణి: నెలకు ఆఫీస్ సబార్డినేట్‌కు రూ.19,000 - రూ.58,850, డ్రైవర్‌కు రూ.22,900 - రూ.69,150.

దరఖాస్తు ఫీజు: డ్రైవర్ పోస్టులకు రూ.500, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు.. జనరల్, బీసీలకు రూ.600, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, పీడబ్ల్యూడీ, ఈఎస్‌ఎంలకు రూ.400. **ఎంపిక:** రాత పరీక్ష (సీబీటీ), స్కిల్ టెస్టులతో **దరఖాస్తు ప్రారంభ తేదీ:** 07.02.2026

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 28.02.2026

వెబ్‌సైట్: https://tshc.gov.in/showChildDocTypes?id=95

ఇలా నేర్చుకుందాం

ప్రస్తుతం విద్యార్థుల ముందు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. అయితే అనేక అంశాలు వారిని ప్రభావితం చేస్తున్నాయి. అన్ని పనులూ ఒకేసారి పూర్తి చేయాలనుకోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అందువల్ల కష్టపడినప్పటికీ సానుకూల ఫలితాలు దక్కడం లేదు. ఈ పరిస్థితిని అధిగమించాలంటే స్మార్ట్‌గా, సెలక్టివ్‌గా ఉండటం ఎంతో ముఖ్యమని నిపుణులు అంటున్నారు.

పనులన్నీ ఒకేసారి చేస్తేనే విజయం సాధించవచ్చని అనుకోకూడదు. చేసే పనిని సరైన రీతిలో నిర్ధారించుకోవాలి. ప్రతి పనీ చేయాలని అనుకోవడం వల్ల దేనిపైనా పూర్తి దృష్టి కేంద్రీకరించలేరు. దీంతో ఆశించిన విజయం దక్కదు. కాబట్టి విద్యార్థులు ముందుగా లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకోవాలి. ఆ తర్వాత అందుకు ఉపయోగపడే పనులకే ప్రాధాన్యమివ్వాలి.

ఉదాహరణకు ఒక విద్యార్థి జేఈఈ, యూపీఎస్సీ ఎన్‌డీఏ పరీక్షలకు ఒకేసారి సన్నద్ధత ప్రారంభించడం వల్ల ఏకాగ్రతను కోల్పోతాడు. అలా కాకుండా తన ఆసక్తి ఏంటో తెలుసుకుని, ఎంచుకున్న లక్ష్యానికి సంబంధించిన సబ్జెక్టులపై మాత్రమే దృష్టి సారించాలి. అప్పుడే మంచి ఫలితాలు సాధించగలుగుతాడు. దీన్నే సెలక్టివ్‌గా ఉండటం అనుకోవచ్చు. ఇందులో ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయం అవసరంలేని వాటిని వదిలేయాలి. సోషల్ మీడియా లాంటి ప్రతిబంధకాలను అధిగమించాలి. రోజూ పరిమిత సమయాన్ని మాత్రమే అలాంటి వాటికి ఉపయోగించుకోవాలి.



● స్మార్ట్‌గా ఉండటం అంటే ఎక్కువ గంటలు చదవడం కాదు. సరైన విధానంలో నేర్చుకోవడం. కొంతమంది విద్యార్థులు పరీక్షకు ముందు అన్ని సబ్జెక్టులూ ఒకేసారి చదవడానికి ప్రయత్నిస్తుంటారు. అన్ని ప్రశ్నలకూ జవాబులు గుర్తుంచుకోవాలనే తాపత్రయంతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు. అలా కాకుండా ఉన్న సమయం ప్రకారం ముఖ్యమైన అంశాలు ఎంచుకుని, వాటిని బాగా అర్థం చేసుకుని చదివితే మంచి మార్కులు సాధించవచ్చు.

● ఆన్‌లైన్ కోర్సులు, ఇంటర్న్‌షిప్పులు లాంటివి ఒకేసారి చేయడంతో దేని మీదా పూర్తిగా శ్రద్ధ పెట్టలేరు. అలాకాకుండా తమ కెరియర్‌కు అవసరమయ్యే ఒకే ఒక్క కోర్సు లేదా ఇంటర్న్‌షిప్పు ఎంచుకుంటే అందులో పట్టు సాధించడానికి వీలవుతుంది. ఒకే సమయంలో వేర్వేరు పనులు చేయడం వల్ల మానసిక ఒత్తిడీ పెరుగుతుంది. దీంతో పాటు ఆలోచనా శక్తీ, సృజనాత్మకతా తగ్గుతాయి. కాబట్టి స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని, సరైన ప్రణాళికతో ముందుకెళ్తే మేలు జరుగుతుంది. అది పూర్తయిన తర్వాతే ఇంకో పనిమీద దృష్టి సారించాలి. ఫలితంగా ఎలాంటి ఒత్తిడికీ లోనుకాకుండా ఒక క్రమంలో అన్నీ పూర్తి స్థాయిలో నేర్చుకోగలుగుతారు.

ఈ పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే పనులన్నీ ఒకేసారి చేయాలనే ఆలోచన వదిలేసి, లక్ష్యానికి ఉపయోగపడేవే ఎంచుకోవాలి. సరైన దిశలో స్మార్ట్‌గా, సెలక్టివ్‌గా ముందుకు సాగాలి.

ఎన్ఐఐలో ఎస్ఆర్ఎఫ్‌లు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ, దిల్లీ ఒప్పంద ప్రాతిపదికన సీనియర్/ జూనియర్ రిసెర్చ్ ఫెలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● సీనియర్/జూనియర్ రిసెర్చ్ ఫెలో: 01

అర్హత: పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతన శ్రేణి: నెలకు రూ.32,000 - 42,000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 17.02.2026

ఎంపిక: ఇంటర్వ్యూతో **వెబ్‌సైట్:** https://www.nii.res.in/en/announcements

అగ్రికల్చరల్ కాలేజీలో

అగ్రికల్చరల్ కాలేజీ మడకశిర ఒప్పంద ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

● పార్ట్‌టైమ్ మెడికల్ ఆఫీసర్: 01

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు రూ.25,000.

ఎంపిక: ఇంటర్వ్యూతో

ఇంటర్వ్యూ తేదీ: 11.02.2026

వేదిక: అగ్రికల్చరల్ కాలేజీ, మడకశిర.

వెబ్‌సైట్: https://angrau.ac.in/ANGRU/Recruitment_Notification_2021.aspx

హెచ్ఆర్ అసిస్టెంట్‌లు

ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, న్యూదిల్లీ ఒప్పంద ప్రాతిపదికన హెచ్ఆర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ● హెచ్ఆర్ అసిస్టెంట్: 03

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ/ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 01.02.2026 నాటికి 35 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. **ఎంపిక:** రాత పరీక్ష/ ఇంటర్వ్యూతో

వేతనం: నెలకు రూ.40,000.

ఆఫ్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 27.02.2026

చిరునామా: జేఈఎం/హెచ్ఆర్ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ట్ సెంటర్, సాకేత్, న్యూదిల్లీ-110017.

వెబ్‌సైట్: https://ircon.org/career-ircon/contract-employment

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

ఈమెయిల్ మార్కెటింగ్

సంస్థ: స్లేట్ ఏజెన్సీ నైపుణ్యాలు: మార్కెటింగ్, మార్కెటింగ్ ఆటోమేషన్, మార్కెటింగ్ క్యాంపెయిన్స్, మార్కెటింగ్ స్ట్రాటజీస్ స్టైపెండ్: రూ.12,500
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 27
☛ https://tinyurl.com/29xu96y9

రియాక్ట్ నేటివ్ డెవలప్‌మెంట్

సంస్థ: టెక్‌విజ్ ఇన్నోవేటివ్ ప్రై.లి.
నైపుణ్యం: రియాక్ట్ నేటివ్
స్టైపెండ్: రూ.8,000-15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 27
☛ https://tinyurl.com/273f8t5t

వెబ్ డెవలప్‌మెంట్

సంస్థ: ఇగ్నికల్ట్ గేమ్‌ల్యాబ్స్ ఎల్ఎల్‌పీ
నైపుణ్యాలు: సీఎస్ఎస్, జనరేటివ్ ఏఐ టూల్స్, వర్డ్‌ప్రెస్ స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 27
☛ https://tinyurl.com/2h5xer4h

ఇన్‌సైడ్ సేల్స్

సంస్థ: సేల్స్‌గ్రో
నైపుణ్యాలు: కోల్డ్ కాలింగ్, సేల్స్, టెక్నికల్ సపోర్ట్ స్టైపెండ్: రూ.7,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 27
☛ https://tinyurl.com/592rp3et

ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్

సంస్థ: క్రితిబోధ్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: యాంగ్యులర్‌జేఎస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చాట్‌జీపీటీ, సీఎస్ఎస్, ఫ్లాస్క్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, లాంగ్‌చెయిన్, ఎల్ఎల్ఎంఓపీఎస్, మాంగోడీబీ, నోడ్.జేఎస్, ఓత్, పోస్ట్‌గ్రేఎస్‌క్యూఎల్, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, పైతాన్, రియాక్ట్, రెస్ట్ ఏపీఐ
స్టైపెండ్: రూ.25,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 27
☛ https://tinyurl.com/3t6y853v

హైదరాబాద్‌లో

మార్కెటింగ్

సంస్థ: ద స్టోరీ
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.2,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 26
☛ https://tinyurl.com/29nsx9ud

ఎలక్ట్రానిక్స్ డిజైన్

సంస్థ: నియో ఇన్నోవేషన్స్
నైపుణ్యాలు: ఏఆర్ఎం మైక్రోకంట్రోలర్, సర్క్యూట్ డిజైన్, పీసీబీ డిజైన్
స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 26
☛ https://shorturl.at/hcHsH


వసుంధర

vasundhara@eenadu.in

మళ్లీ జీవిస్తున్నారు!

క్యాన్సర్ అన్న పదం వినగానే భయపడిపోతారంతా. దీంతో చావు ఖాయమన్న భావనే అందుకు కారణం. కానీ వీళ్లు దాన్ని మృత్యువులా కాదు... జీవితంలో ఓ దశగానే చూశారు. కాబట్టే, ధైర్యంగా ఓడించగలిగారు. క్యాన్సర్ బాధితులకే కాదు... మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వీళ్ల కథలను మీరూ చదివేయండి.

నేడు క్యాన్సర్ డే



క్యాన్సర్ మంచే చేసింది!

మానసికంగా, శారీరకంగా మనిషిని దెబ్బతీసే మహమ్మారి క్యాన్సర్. ఇది వచ్చిందంటే బతకమేమో అన్న భయంతోనే సగం చచ్చిపోతాం. అలాంటిది తనకు క్యాన్సర్ రావడం ఒక రకంగా మంచిదే అంటున్నారు **లవీనా జైన్**. ఉత్తరప్రదేశ్‌లోని మేరఠ్ ఆమెది. 'ఇద్దరు పిల్లలు, వాళ్ల ఆలనాపాలనా చూస్తూ నేను, వ్యాపారంలో ఆయన... ఖాళీ లేకుండా గడిపేవాళ్లం. కానీ 2010లో నాకు రొమ్ము క్యాన్సర్ ఉందని వైద్యులు చెప్పారు. కొద్దిరోజులకే మావారికి నోటి క్యాన్సర్ 4వ స్టేజ్‌లో ఉన్నట్లు తెలిసింది. షాక్ మీద షాక్. ఏం చేయాలో అర్థం కాలేదు. పిల్లలేమో చిన్నోళ్లు... వ్యాపారం, ఇల్లు కట్టడం కోసం చేసిన అప్పులు... మా జీవితానికి ఇంకోరోజు ఉందో లేదో కూడా తెలియదు. మాకు ఏమైనా అయితే పిల్లల పరిస్థితేంటని ఆలోచించాం. బాబునీ పాపనీ కూర్చోబెట్టి పరిస్థితి వివరించాం. మాకేం కాదు... కంగారుపడకండి. ఒకవేళ ఏదైనా అయితే చెల్లి జాగ్రత్త అని బాబుకి చెప్పి, వైద్యం కోసం బయలుదేరాం. ఆయనకూ నాకూ సర్జరీలు అయ్యాయి. సాయం అడుగుతామేమో అనే భయంతో అయిన వాళ్లెవరూ దగ్గరికి కూడా రాలేదు. కీమో, రేడియో థెరపీలు జరుగుతున్నాయి. నేను కాస్త కోలుకున్నా. కానీ ఆర్థికంగా చితికిపోయాం. ఇల్లు గడవడమూ కష్టమైంది. అప్పుడే నా దగ్గర ఉన్న రూ.1500లతో వ్యాపారం ప్రారంభించాను' అంటారు లవీనా.



'ఎవరిముందూ చేయి చాచొద్దు. ఉన్నదాంట్లోనే ఏదైనా చేయాలని ఆలోచిస్తున్నప్పుడు... వంటల్లో నాకున్న నైపుణ్యమే మమ్మల్ని ఆదుకుంది. చిన్నప్పట్నుంచీ జామ్‌లూ, స్క్వాష్‌లూ తయారు చేయడమంటే ఇష్టం నాకు. దాన్నే వ్యాపారంగా మలుచుకోవాలనుకున్నా. నిమ్మ స్క్వాష్ చేసి తెలిసిన వాళ్లకి పంపించాను. వాళ్లు బాగుందని ఇంకొన్ని బాటిళ్లు కావాలని అడిగారు. అలా మొదలైంది 'లవీనాస్ త్రిప్తి ఫుడ్స్'. జామ్‌లు, చిరుతిళ్లు తయారు చేసి ఇంటింటికీ వెళ్లి అమ్మేదాన్ని. నా ఆరోగ్యం సహకరించనప్పుడు బాబు వెళ్లేవాడు. కిట్టీ పార్టీల్లో నేను తయారుచేసిన చిరుతిళ్లు ఉండేలా కమ్యూనిటీ వాళ్లతో ఒప్పందం చేసుకున్నా. ఏడాదిలోనే ఆర్థికంగా పుంజుకున్నాం' అనే లవీనా మొరాదాబాద్, ఘజియాబాద్‌లకీ బ్రాంచ్‌లను విస్తరించారు. ఆర్థిక కష్టాల నుంచి బయటపడ్డారు. భర్త కూడా కోలుకున్నారు. 'క్యాన్సర్ నాకు చాలా పాఠాలు నేర్పింది. నన్ను ఒక సైనికురాల్ని చేసింది. అందుకే క్యాన్సర్ నాకు మంచే చేసిందని భావిస్తా. ఇప్పుడు నాకు 56 ఏళ్లు. ఇప్పటికీ ఈ వ్యాధి తిరిగొచ్చే ముప్పు ముంది. కానీ ఉన్నన్ని రోజులు మనసుకు నచ్చిన పనిచేస్తూ, ఆనందంగా జీవితాన్ని గడపాలనే లక్ష్యంతో సాగిపోతున్నా' అంటారామె.

తనలా ఇంకెవరూ బాధపడొద్దని..

'భవిష్యత్తు కోసం పరుగులు పెడుతుంటాం. ఒత్తిడీ, ఆందోళనలతో జీవించేస్తుంటాం. 2017 ఆగస్టుకు ముందు నేనూ అంతే. తరవాతే తెలిసింది... జీవితంలో నేనేం పోగొట్టుకున్నానో. నేను చేసిన తప్పు ఇంకెవరూ చేయకూడదనే నా తాపత్రయం' అంటారు **రీతూ రుంగ్టా**. ఈమెది ఝార్ఖండ్‌లోని జంషెడ్‌పుర్. వ్యాపారవేత్తల కుటుంబం. పిల్లలు, వ్యాపార బాధ్యతలతో క్షణం తీరిక లేని జీవితం. 'ఒకరోజు ఉన్నట్టుండి రొమ్ములో భరించలేనంత నొప్పి... వైద్యుల దగ్గరికెళ్తే క్యాన్సర్ అని తేల్చారు. చికిత్స కోసం ముంబయి వెళ్లమన్నారు. స్టేజ్-2 కదా నయమైపోతుందిలే అనుకున్నా. మొదటి కీమో జరిగేంత వరకూ ధైర్యంగానే ఉన్నా. జుట్టు ఊడిపోవడం మొదలైంది. కనుబొమలూ, రెప్పలూ పోయాయి. అంతే... దిగులు మొదలైంది. అద్దంలో చూసుకుని ఒకటే ఏడ్చా. నాలుగు రోజులు కంటిమీద కునుకు లేదు. ఏదైతే అదైందని గుండె చేయించేసుకున్నా. ఇంటికి వెళ్తే పిల్లలు నన్ను చూసి గుర్తుపట్టలేకపోయారు. చిన్నబాబు ఏడ్చేశాడు కూడా. గది నుంచి బయటకు రావాలంటే ఆత్మన్యూనతా భావం. ఎలాగో కుదురుకుని బయటకు వస్తే... జాలిగా చూసేవారు కొందరైతే... ఏదో అంటరాని వ్యాధి వచ్చినట్లు దూరంగా జరిగే వాళ్లు ఇంకొందరు. నయం కావడానికి ఏడాదిన్నర పట్టింది. మేజర్, మైనర్ కలిపి 30 కీమోలు చేశారు. ఈ ప్రయాణంలో ఒక్కటే కోరుకున్నా నేను... దేవుడు నాకు ఇంకో అవకాశం ఇస్తే నాలా ఇంకెవరూ బాధపడకుండా చూడాలని!



2019లో వ్యాధి నుంచి బయటపడ్డాను. కానీ, 'క్యాన్సర్ సైలెంట్ కిల్లర్... అది ఎప్పుడు, ఎలా వ్యాప్తి చెందుతుందో ఎవ్వరం చెప్పలేం. మీకు మళ్లీ వ్యాధి వచ్చే ఆస్కారం 80 శాతం ఉంది. ఈసారి వ్యాధి బారిన పడితే మిమ్మల్ని కాపాడటం కష్టం' అన్నారు వైద్యులు. ఎప్పుడో ఏదో జరుగుతుందని ఇప్పుడే బాధపడుతూ కూర్చోవాలి అనుకోలేదు. పేపర్‌లో మిసెస్ ఇండియా ప్రకటన చూశా. క్యాన్సర్ బాధితురాలిగా కన్నా... మిసెస్ ఇండియాగా నా క్యాన్సర్ ప్రయాణం చెబితే ఎక్కువమందికి చేరుతుంది అనిపించింది. పోటీలో పాల్గొనడానికి బయలుదేరా. 'ఎలాగో చావు తప్పి బయటపడ్డావు... విశ్రాంతి తీసుకోక ఇదంతా అవసరమా' అన్నారంతా. వెనకడుగు వెయ్యలేదు. అనుకున్నట్లుగానే 2019 'మిసెస్ ఇండియా వరల్డ్' టైటిల్‌తోపాటు 'ఐరన్ లేడీ' అనే కితాబునూ అందుకున్నా. గెలిచాక క్యాన్సర్ వారియర్‌గా నేను ఎదుర్కొన్న ఇబ్బందులూ, సవాళ్లూ ఎంతోమందికి స్ఫూర్తి పాఠాలవుతాయని వివరించాను. నా ఆశయ సాధన కోసం యోగా, సైకాలజీ, కమ్యూనికేషన్లలో నైపుణ్యం సంపాదించుకున్నా' అనే రీతూ... యోగా శిక్షకురాలిగా క్యాన్సర్ బాధితులకు శారీరక, మానసిక ఒత్తిడిని అధిగమించడంలో సాయం చేస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా సర్టిఫైడ్ ట్రైనర్, కౌన్సెలర్‌గా గుర్తింపునూ పొందారు.

భయపడితే బాధ తగ్గిపోదు...

సెలెబ్రిటీ ఫ్యాషన్ డిజైనర్‌గా **మనాలీ జగతాప్** పేరు సుపరిచితమే. సక్సెస్‌కి మారు పేరుగా నిలిచిన ఆమె తన ప్రయాణంలో ఎన్నో ఎత్తు పల్లాలు చూశారు. మనాలీది ముంబయి. ఫ్యాషన్‌పై అభిరుచితో అందులో ఫార్మల్ డిగ్రీ లేకపోయినా... 22 ఏళ్లకే డిజైనర్‌గా కెరియర్ ఆరంభించారామె. రిచా చద్దా, హ్యూమా ఖురేషీ, శిల్పాశెట్టి, డైసీ షా వంటి తారలెందరికో ఆమె డిజైన్ చేశారు. ఇండో-వెస్టర్న్, ఫ్యూజన్, సస్టైనబుల్ ఫ్యాషన్‌లలో చేసిన ప్రయోగాలు... ఆమె లగ్జరీ బ్రాండ్‌కి మరింత పేరు తెచ్చిపెట్టాయి. మనాలీ డిజైన్లు అనేక బ్యూటీ పాజెంట్స్‌తో పాటు, మ్యూజిక్ అవార్డులు, ఐఐఎఫ్ఏ అవార్డుల వేదికలపైనా మెరిశాయి. ఇలా హాయిగా సాగిపోతున్న జీవితంలో 2018 ఓ చేదు అనుభవాన్ని మిగిల్చింది. అప్పటికే కొన్ని నెలలుగా అధికరక్తస్రావంతో బాధపడుతున్నారామె... మొదట ఒత్తిడి వల్ల అనుకున్నారు. తీవ్రమయ్యేసరికి ఆసుపత్రికి వెళ్లారు. వైద్యులు పరీక్ష చేసి సిస్ట్ ఉందని దాన్ని తొలగించారు. కానీ, ఆ తర్వాత వచ్చిన బయాప్సీ రిపోర్ట్‌లో మనాలీకి క్యాన్సర్ (ఎండోమెట్రియల్ స్ట్రోమల్ సార్కోమా) నిర్ధరణ కావడంతో ఆమె కుటుంబాన్ని ఆందోళనలోకి నెట్టేసింది. ఒక్క క్షణం మనాలీకి ప్రపంచం తలకిందులైనట్లు అనిపించిందట. కానీ, బాధపడటం, భయపడటం వల్ల అది తగ్గిపోదు. అందుకే పోరాడాలనుకున్నా అంటారామె. 12 కీమోథెరపీలు జరిగాయి. ఈ క్రమంలో జుట్టు రాలడం, శారీరక బలహీనత, మానసిక క్షోభ... వంటివెన్నో అనుభవిస్తున్నా తన ముఖంపై చిరునవ్వుని చెదరనీయలేదు. చికిత్స సమయంలో స్టోర్ మూసేసినా రిమోట్‌గా డిజైనింగ్ కొనసాగించారు. సెలెబ్రిటీ క్లయింట్లు మనాలీకి సపోర్ట్ చేశారు.. కుటుంబం, స్నేహితులు సహకరించారు. దాన్నుంచి బయటపడ్డాక ఆమె దృక్పథమే మారింది. జీవితాన్ని వీలైనంతగా ఆస్వాదిస్తూ, కృతజ్ఞతతో జీవించాలనుకున్నారు. డిజైనర్‌గా రాణిస్తూనే... క్యాన్సర్‌పై అవగాహననీ కల్పిస్తున్నారు. 'ఉమీద్ ఏక్ కోషిష్' అనే ఎన్‌జీవోను స్థాపించి అనాథ పిల్లలకు సాయం చేస్తున్నారు.



అనారోగ్యాలపై అలసత్వం వద్దని క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

అవన్నీ సవాళ్లు!

'ఎంబీఏ చేస్తా'... **ఉషా రే** ఈ మాట చెప్పినప్పుడు అందరూ షాకయ్యారు. అప్పటికి ఆమెకు 77 ఏళ్లు. పైగా అంతకు ముందే క్యాన్సర్ దాటారు మరి. ఆమె మాత్రం ఇదంతా సాధారణమన్నట్లే సాగారు. 'ఖాళీ బుర్ర దెయ్యాల కార్ఖానా' అంటారు ఉష. ఈమెది పుణె. ఎంఎస్సీ పూర్తిచేసిన ఈమె కొన్ని దశాబ్దాలపాటు దేశవిదేశాల్లో టీచర్‌గా పనిచేశారు. ఈక్రమంలో 2003లో క్యాన్సర్ బయటపడింది. నాలుగో దశ... కష్టమన్నారంతా. ఉష మాత్రం ఇదొక సవాలు అన్నట్లే చూశారు. ఎనిమిది నెలల చికిత్స తరవాత కోలుకుని, తిరిగి బోధన కొనసాగించారు. 2009లో రిటైరయ్యాక ఓ ఆసుపత్రిలో మేనేజ్‌మెంట్ కొలువులో చేరారు. సీఈఓ స్థాయికి చేరారు. కానీ ఏదో అసంతృప్తి ఆమెను తొలిచేది. 'మా దగ్గరికి ఉద్యోగానికి వచ్చిన వాళ్లంతా ఎంబీఏ పూర్తిచేసినవాళ్లే. నా చుట్టూ ఉన్న వాళ్లూ అంతే. వాళ్లకంటే నేను కొన్ని విషయాల్లో వెనకబడ్డా అనిపించేది. అందుకే చదవాలనుకున్నా'నంటారు ఉష. దానికి రెండేళ్ల క్రితమే క్యాన్సర్‌తో రెండో పోరాటం చేశారామె. అయినా నేర్చుకోవడం, పనిచేయడం ఆపలేదు. ఉద్యోగం చేస్తూనే ఎంబీఏ ఇన్ హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరారు. అయితే ఆన్‌లైన్ విద్య. అప్పటిదాకా కంప్యూటర్ పరిచయం లేదు. ఆమెదేమో జువాలజీ నేపథ్యం. ఇప్పుడు అకౌంట్స్, మార్కెటింగ్ అంటూ కొత్త సబ్జెక్టులు నేర్చుకోవాలి. అయినా పట్టుదలగా చదివి, 80 ఏళ్లు రావడానికి ముందే పూర్తిచేశారు... అదీ 82 శాతం మార్కులతో. 'ఇన్నేళ్ల తరవాత చదవడం అంటే కష్టమే. కాకపోతే 'కష్టం' అన్నదేదీ ఉండదు. ప్రతిదీ సవాలే. అది క్యాన్సరైనా, కొత్త సబ్జెక్టులైనా. కాబట్టే, కాస్త ఎక్కువ సమయం వెచ్చించి మరీ నేర్చుకున్నా. చివరకు సాధించా. కాబట్టి, సవాళ్లను చూసి కంగారుపడొద్దు. అవి మనల్ని మరింత దృఢంగా మారుస్తాయి' అనే ఉష ప్రపంచంలోనే ఎంబీఏ పట్టా పొందిన పెద్ద వయస్కురాలు. భవిష్యత్తులోనూ చదువు కొనసాగిస్తారట. నర్సింగ్‌లో శిక్షణనిచ్చే సంస్థనీ ప్రారంభిస్తారట. ఇలా ఇంకా ప్రణాళికలెన్నో వేస్తున్నారు. 'ప్రతిరోజూ వేడుకే. దాన్ని నేర్చుకోవడంతో నింపేస్తున్నా' అంటారామె.



ఇంటి దగ్గరే పరీక్ష...

వడోదరకు చెందిన డాక్టర్ సయాంతని ప్రమాణిక్, భర్త అనిర్బన్‌తో కలిసి సర్వైకల్ క్యాన్సర్‌ను ఇంటి దగ్గరే పరీక్షించే కిట్‌ను అభివృద్ధి చేశారు. నివారించదగ్గదే అయినా మనదేశంలో రొమ్ము క్యాన్సర్ తర్వాత ఎక్కువ మంది సర్వైకల్ క్యాన్సర్‌తో మరణిస్తున్నారు. ఎనిమిది నిమిషాలకు ఒకరు సర్వైకల్ క్యాన్సర్‌కు బలి అవుతున్నారు. ముందస్తు స్క్రీనింగ్‌తో క్యాన్సర్ లక్షణాలను గుర్తించడంద్వారా ఈ మరణాలను తగ్గించవచ్చు. మహిళలు హాస్పిటల్, డయాగ్నస్టిక్ కేంద్రాలకు వెళ్లి పరీక్ష చేసుకోవాలంటే చాలా అడ్డంకులు. సమయం దొరక్కపోవడంతోపాటు, హాస్పిటల్‌లో అసౌకర్యవంతమైన వాతావరణం, సామాజిక కారణాలు... వాళ్లను పరీక్షలకు దూరం చేస్తున్నాయి. అదే సొంతంగా ఇంట్లోనే పరీక్ష చేసుకుంటే వీటన్నింటినీ అధిగమించవచ్చని భావించారు సయాంతని. సాధారణంగా సర్వైకల్ క్యాన్సర్ అభివృద్ధికి 15-20 ఏళ్లు పడుతుంది. ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారించవచ్చు. భారత్‌లో సరైన అవగాహన లేని కారణంగా స్టేజ్ 3, 4కు చేరాక దీన్ని గుర్తిస్తున్నారు. ఆ ఆలోచనతో తెచ్చిందే సర్విచెక్ కిట్. హెచ్‌పీవీ కారణంగానే 95 శాతం సర్వైకల్ క్యాన్సర్లు వస్తున్నాయి. కాబట్టి ఈ వైరస్‌ను ప్రధానంగా పరీక్షిస్తారు. 'ఇంటికి వెన్నెముక అయిన మహిళ మరణం మొత్తం కుటుంబాన్నే చిందరవందర చేస్తుంది. సర్వైకల్ క్యాన్సర్ మరణాలు తగ్గించడానికి అనేక స్వచ్ఛంద సంస్థలతో కలిసి క్షేత్ర స్థాయిలో పని చేస్తున్నాం' అని చెబుతారు సయాంతని.





మీకు నెట్‌వర్క్ ఉందా?

వర్క్‌లైఫ్ బ్యాలెన్స్, సామాజిక ఒత్తిళ్లు, లింగ వివక్ష వంటి సవాళ్ల మధ్య స్త్రీలు... తమ కెరియర్‌ని నిర్మించుకోవాలంటే బలమైన వృత్తి సంబంధాలు (ప్రొఫెషనల్ నెట్‌వర్క్) కూడా కావాలి. వాటిని ఏర్పరుచుకోవాలంటే...

- ఇప్పటి డిజిటల్ యుగంలో లింక్డిన్ లాంటి ప్రొఫెషనల్ ప్లాట్‌ఫామ్‌లు మహిళలకు గొప్ప అవకాశం. ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేసి ఆయా రంగాల్లోని నిపుణులతో కనెక్ట్ అవ్వొచ్చు. ఈ అలవాటు మార్కెట్‌లో కొత్తగా వస్తున్న మార్పులు తెలుసుకోగలగడంతో పాటు సహజంగా సంబంధాలనూ ఏర్పరుస్తాయి.
- స్థానికంగా జరిగే ఈవెంట్‌లు, కాన్ఫరెన్స్‌లకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌ల్లో హాజరుకావొచ్చు. ముఖ్యంగా విమెన్ ఆంత్రప్రెన్యూర్ సదస్సులు, ఐటీ కాన్ఫరెన్స్‌లు, వర్క్‌షాప్‌లకు వెళ్తే.... అక్కడ వివిధ రంగాలకు చెందిన నిపుణులతో సత్సంబంధాలు, పరస్పర పరిచయాలూ ఏర్పడతాయి.
- విమెన్ ఇన్ టెక్, లీన్ ఇన్ సర్కిల్, విమెన్ ఆంత్రప్రెన్యూర్స్ నెట్‌వర్క్... వంటి ఎన్నో గ్రూపులు మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నాయి. వారిచ్చే అప్‌డేట్‌లను తెలుసుకోండి. ఇలాంటి సర్కిల్స్‌లో చేరడం వల్ల ధైర్యం పెరుగుతుంది. కొత్త అవకాశాలు దొరుకుతాయి.



ఆమె మనసు బంగారం!

ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఒక పారిశుద్ధ్య కార్మికురాలిని సన్మానించి రూ.లక్ష అందజేశారు. తాజాగా సినీ నటుడు రజనీకాంత్ ఆమెను ఇంటికి పిలిచి బంగారు గొలుసుతో సన్మానించారు. ఇంతకీ అంతలా ఆమె ఏం చేశారంటే...

తమకున్న కష్టాలకు... డబ్బు, బంగారం దొరికితే బావుణ్ణని ఆశపడుతుంటారు చాలామంది. పారిశుద్ధ్య కార్మికురాలు పద్మకి అలానే ఓ నగల మూట దొరికింది. ఆమె అనుభవిస్తున్న పేదరికానికి ఆ నగలను చూడగానే సంబరపడిపోవాలి. కానీ ఆమె అలా చేయలేదు. పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. పరుల సొమ్ముకు ఆశపడని ఆమె తీరుకు ప్రశంసలు అందుకుంటున్నారు. ఓ ప్రైవేటు సంస్థ తరఫున గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్నారు పద్మ. జనవరి 11న టీనగర్‌లో విధుల్లో ఉండగా రోడ్డుపై ఓ బ్యాగుని గమనించారు. తెరిచి చూడగా అందులో బంగారు ఆభరణాలు కనిపించాయి. ఆ బ్యాగును తీసుకెళ్లి, పాండిబజార్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారామె. పోలీసులు దర్యాప్తు చేసి ఆ నగల బ్యాగును తిరిగి యజమానికి అందజేశారు. అందులోని నగల విలువ రూ.45 లక్షలు. అయినా నిజాయతీగా బ్యాగును అప్పగించిన పద్మను పోలీసులు అభినందించారు. ఈమె గురించి తెలిసి మంగళవారం హీరో రజనీకాంత్ తన నివాసానికి పిలిచి బంగారు గొలుసు బహూకరించారు. భారత తపాలా శాఖ తమిళనాడు సర్కిల్ 'మై స్టాంప్' పథకం కింద పద్మ ఫొటోతో ప్రత్యేక స్టాంపును విడుదల చేసింది. ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంకు ప్రీమియం సేవింగ్స్ ఖాతాతోపాటు ఆమెకు రూ.15 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా సౌకర్యాన్నీ కల్పించింది. కొవిడ్ సమయంలో పద్మ భర్త సుబ్రమణి మెరీనా బీచ్ సమీపంలో పారిశుద్ధ్య పనులు చేస్తుండగా రూ.1.5 లక్షల నగదు దొరికింది. ఆయన కూడా ఆ డబ్బును పోలీసులకు అప్పగించారు. ఈ దంపతుల నిజాయతీని ప్రశంసించనివాళ్లు లేరంటే నమ్మండి!



– న్యూస్‌టుడే, చెన్నై

ఇల్లే గ్రంథాలయం..!

ఒక చిన్న ఆలోచన వేలమంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. దాని వెనక ఉన్న పేరు ప్రియాంక గార్గ్. 'వే ఆఫ్ లైఫ్' పేరుతో బుక్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసి, ఉచితంగా పుస్తకాల్ని అందిస్తున్నారామె.

పేద పిల్లల చదువుల కోసం తన ఇంటినే లైబ్రరీగా మార్చేశారు హరియాణాలోని ఫరీదాబాద్‌కు చెందిన ప్రియాంక గార్గ్. వృత్తి రీత్యా ఛార్టర్డ్ అకౌంటెంట్. మన దేశంలో చాలామంది విద్యార్థులు స్కూల్ స్థాయిలోనే చదువు మానేస్తున్నారు. పుస్తకాలు కొనుక్కునే స్థోమత లేక చదువుకి దూరం అవుతున్న వాళ్లూ చాలామందే. ప్రియాంకకి కూడా ఇలాంటి పరిస్థితి ఎదురైంది. తన ఇంట్లో పనిచేసే మహిళ పిల్లలకు పుస్తకాలు కొనేందుకు డబ్బులు లేవు అని అడిగిందట. 'నా పిల్లలు పెద్దవాళ్లు, నీ పిల్లలు చిన్నవాళ్లు. ఇద్దరి తరగతులు వేరు. ఆ పుస్తకాలు నా దగ్గర లేవు. బయట కొని తెస్తా' అన్నారట. అంతలోనే ప్రియాంక ఉంటున్న హౌసింగ్ సొసైటీ వాట్సాప్ గ్రూప్‌లో 'మా ఇంట్లో పనిచేసే మహిళ పిల్లలకి పాఠ్య పుస్తకాలు కావాలి. ఎవరి దగ్గరైనా పుస్తకాలుంటే చెప్పండి' అంటూ మెసేజ్ పెట్టారటామె. అది మొదలు సొసైటీ సభ్యుల నుంచి అలాంటి మెసేజ్‌లు ఇచ్చారట. అది చూసి ప్రియాంక ఇలా బుక్స్ అవసరం అయిన వారందరికీ సాయం చేయాలనుకున్నారు. అందుకే 2018లో 'వే ఆఫ్ లైఫ్' పేరుతో ఉచిత బుక్ బ్యాంక్‌ను ఏర్పాటుచేశారీమె.

విద్యాదానం చేయమన్నా...

ఈ బుక్ బ్యాంక్ కోసం ప్రియాంక చాలా కష్టపడ్డారు. మొదట్లో తన హౌసింగ్ సొసైటీలో ఇంటింటికీ తిరిగి పాత టెక్స్ట్ బుక్స్, స్టడీ మెటీరియల్స్ సేకరించారు. తరవాత దాతల నుంచి పాతపుస్తకాలను సేకరించేందుకు నగరంలో ప్రచారాలు చేపట్టి, శిబిరాలను ఏర్పాటుచేశారు. సోషల్ మీడియాలోనూ వే ఆఫ్ లైఫ్ ప్రాముఖ్యతను వివరిస్తూ పెద్దఎత్తున ప్రచారాలు చేశారు. 'పాత టెక్స్ట్ బుక్స్, స్టడీ మెటీరియల్స్‌ను అమ్మకండి. వాటిని మాకు అందించి విద్యాదానం చేయమని కోరాను. దాంతో ఎంతోమంది దాతలు పాతపుస్తకాల్ని వే ఆఫ్ లైఫ్ ఆఫీస్‌కి పంపించడం మొదలుపెట్టారు. దిల్లీ నుంచి ఏటా ఎంతోమంది పాత పుస్తకాల్ని, మెటీరియల్స్‌ని డొనేట్ చేస్తున్నారు. ఆ విధంగానే ఈ వే ఆఫ్ లైఫ్‌ని పెద్ద బుక్ బ్యాంక్‌గా మార్చగలిగా. ఇక్కడ కేజీ నుంచి పీజీ వరకూ అన్ని తరగతుల పుస్తకాలు... రైల్వే, ఎస్ఎస్‌సీ, నీట్, యూపీఎస్‌సీ వంటి అన్ని పోటీపరీక్షల స్టడీ మెటీరియల్స్ ఇక్కడ దొరుకుతాయి. పిల్లలకు కథల పుస్తకాలనీ ఉంచాం. మొత్తంగా మా ఇంటినే పుస్తక బ్యాంక్‌గా మార్చేశా'అంటున్నారు ప్రియాంక.



ప్రియాంక

తల్లిదండ్రులూ వస్తున్నారు...

'నేను బుక్ బ్యాంక్‌ను మొదలుపెట్టినప్పుడు పేద పిల్లలు మాత్రమే వస్తారనుకున్నా. కానీ ప్రైవేటు స్కూల్స్, ఇంటర్నేషనల్ పాఠశాలల తల్లిదండ్రులూ మా దగ్గరకి వస్తున్నారు. మాకు విదేశాల నుంచీ బుక్స్ కోసం కాల్స్ వస్తున్నాయి. వాళ్లకి పుస్తకాలను పంపాలంటే రవాణా ఛార్జీలను స్పాన్సర్ చేసే దాతలు మాకు కావాలి. అంతేకాదు, పుస్తకాల కొరత వల్ల ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదు. ఇదే నా లక్ష్యం. వందమందికి పైగా వాలంటీర్లు దీంట్లో పనిచేస్తున్నారు. ఉచిత పుస్తకాల పంపిణీకి కొన్ని స్వచ్ఛంద సంస్థలతోనూ పని చేస్తున్నాం. దీనికితోడు ప్రభుత్వ సాయం కూడా అందితే బాగుంటుంది' అంటారు ప్రియాంక..

అవసరాలే... అందంగా..!

స్మార్ట్ కిచెన్

అయ్యో... ఉప్పెక్కడ పెట్టాను... దనియాలపొడి కనిపించడం లేదు... మిరియాలపొడి ఏ డబ్బాలో పెట్టానో... బ్రేక్ ఫాస్ట్ కోసం ఓట్స్ తీస్తుంటే గిన్నెలో ఎక్కువ పడిపోయాయి... ఇవన్నీ రోజూ మన కిచెన్‌లో జరిగేవే కదా. చిన్న సమస్యలుగానే ఉన్నా కనిపించని సమయం వృథా అయ్యేది ఇక్కడే. వాటన్నింటికీ పరిష్కారంగా వచ్చినవే ఈ ఆర్గనైజర్లు.. వేటికవే ప్రత్యేకం, మనకీ ఉపయోగకరం...

అతుక్కుంటాయి... స్థలాన్ని ఆదా చేస్తాయి...

వంటింటి వస్తువులను పెట్టుకోవడానికి వీలుగా కిచెన్‌లో ర్యాక్స్ లేనివాళ్లకి 'మాగ్నటిక్ స్పైస్ జార్స్' బాగా ఉపయోగపడతాయి. రిఫ్రిజిరేటర్‌కి అతికించుకునేందుకు వీలుగా జాడీల వెనక లేదా మూతలకి అయస్కాంతంతో తయారైన ఈ కంటైనర్లు ట్రాన్స్‌పరెంట్‌గా ఉండి లోపల ఉండే మసాలాలు సులువుగా కనిపిస్తాయి. స్టవ్ దగ్గరగా ఉండాలనుకుంటే మాగ్నటిక్ బోర్డును గోడకు ఫిట్ చేసుకుని జార్‌లను అతికించుకుంటే సరిపోతుంది. వివిధ రకాల ఆకారాల్లోనూ, సైజుల్లోనూ ఇవి దొరుకుతున్నాయి.






డైనింగ్ టేబుల్ కొత్తగా...

డైనింగ్ టైబుల్‌పై ఉప్పు, మిరియాలపొడులు, కారప్పొడులు వేసుకునే డబ్బాలు మనం చూస్తూనే ఉంటాం. ఆ డబ్బాలే కాస్త ఆకర్షణీయంగా కనిపిస్తే భలే అందంగా ఉంటాయి కదా. అయితే ఈ 'యానిమల్ హోల్డర్ విత్ సాల్ట్ అండ్ పెప్పర్ షేకర్ సెట్' మీ ఇంట్లో ఉండాల్సిందే. ఇవి ఆహారానికి రుచినే కాదు, ఇంటికి అందాన్నీ ఇస్తాయి. జిరాఫీ, ఏనుగులంటూ మనకు కావాల్సిన జతువుల రూపాల్లో దొరుకుతున్నాయి. పరిమాణంలో చిన్నగా ఉండటం వల్ల ఎక్కడికంటే అక్కడికి మార్చుకోవడమూ సులువే.





డబ్బా కోసం వెతకక్కర్లేదు...

నెలకు సరిపడా సరకులు ఒకేసారి తెచ్చేసుకుంటాం. ఎక్కడివక్కడ సర్దేసుకుంటాం. ఆఫీసుకి వెళ్లే హడావుడిలో సరిపడినంత పప్పు, పిల్లలు రోజూ తినే ఓట్‌మీల్ వంటివి సమపరిమాణంలో కొలిచి తీసుకునే సమయం ఉండదు. దాంతో ఎక్కువ తక్కువలు అవుతుంటాయి. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని తీసుకొచ్చినవే ఈ'గ్రిడ్ సెరెల్ ఫుడ్ డిస్పెన్సర్స్'. ఒక్కో కంటెయినర్ విడివిడిగా లేదా నాలుగైదు కలిపి గోడకు లేదా టేబుల్‌పై పెట్టుకునేలా వీటిని రూపొందించారు. వీటిల్లో పప్పు, ఓట్స్, స్నాక్స్ ఏవైనా నింపి దాని ముందు భాగంలో ఉన్న వాల్వ్ తిప్పితే రంధ్రం నుంచి పప్పు కిందికి వచ్చి కొలతకోసం ఇచ్చిన కప్పులో పడుతుంది. దాంతో ఎక్కువ తక్కువలు పడతాయనే భయమూ ఉండదు.





సముద్రంలో 4కి.మీ. ఈది.. కుటుంబాన్ని కాపాడిన బాలుడు

ఇంటర్నెట్ డెస్క్: సముద్రంలో చిక్కుకొన్న తన తల్లి, తోబుట్టువులను కాపాడుకునేందుకు పదమూడేళ్ల బాలుడు పెద్ద సాహసమే చేశాడు. ఆస్ట్రేలియాలోని పెర్త్‌కు చెందిన జోవాన్ (47) అనే మహిళ తన ముగ్గురు పిల్లలు ఆస్టిన్ (13), బౌ (12), గ్రేస్ (8)లతో కలిసి సరదాగా గడిపేందుకు గత శుక్రవారం సముద్రతీరానికి వెళ్లారు. విడిది చేసిన హోటలు నుంచి చిన్న పడవ (కయాక్), పెడల్ బోర్డులను అద్దెకు తీసుకొని మధ్యాహ్న సమయంలో సముద్ర విహారానికి బయలుదేరారు. మధ్యలో వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో.. క్రమంగా తీరానికి దూరంగా కొట్టుకుపోయి ప్రమాదంలో చిక్కుకున్నారు. ఈ సమయంలో తల్లి సూచనతో.. తీరాన్ని చేరుకొని సాయం అర్థించేందుకు పెద్ద కుమారుడు ఆస్టిన్ చిన్న పడవలో బయలుదేరాడు. కొంతదూరం వెళ్లాక పడవలో నీరు చేరడంతో మధ్యలోనే వదిలేశాడు. ఈతకు అడ్డుగా ఉందని లైఫ్‌జాకెట్‌నూ వదిలేసి.. తీరం వైపు ఈదుకొంటూ వెళ్లాడు. ఉద్ధృతమైన అలల నడుమ అలా దాదాపు 4 కిలోమీటర్ల మేర ఈదిన ఆ చిన్నారి చివరకు తీరానికి చేరుకొని అధికారులకు సమాచారం ఇచ్చాడు. అప్పటికే చీకటి పడింది. హెలికాప్టరుతో గాలింపు చేపట్టిన సహాయక బృందం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో తీరానికి 14 కిలోమీటర్ల దూరాన పెడల్ బోర్డును పట్టుకొని వేలాడుతున్న తల్లి, ఇద్దరు పిల్లలను గుర్తించి కాపాడారు.



మంగళవారం ఈ కుటుంబం మీడియాతో మాట్లాడింది. క్లిష్ట సమయంలో ముగ్గురు పిల్లలను వదిలేసి తీరానికి తాను వెళ్లలేకపోయానని, ఆస్టిన్‌ను పంపడం తన జీవితంలో తీసుకున్న అత్యంత కఠినమైన నిర్ణయమని తల్లి జోవాన్ తెలిపారు. సముద్రంలో కొట్టుకుపోయినా మొదట్లో ధైర్యంగానే ఉన్నామని, చీకటి పడేకొద్దీ ఆందోళన పెరిగి చలికి వణికిపోయామని చెప్పారు. 10 గంటలు నీటిలో ఉండటంతో చిన్న కుమారుడు బౌ కాళ్లు చచ్చుబడిపోయాయన్నారు. సానుకూలంగా మాత్రమే ఆలోచించాలనే కృతనిశ్చయంతో తాను ఈదుకొంటూ వెళ్లి, తీరానికి చేరాక కుప్పకూలినట్లు ఆస్టిన్ గుర్తుచేసుకున్నాడు. అల్లకల్లోలంగా మారిన సముద్రంలో దాదాపు 4 కిలోమీటర్లు భీకరమైన అలలకు ఎదురీదిన ఆస్టిన్‌ను అధికారులు ప్రశంసలతో ముంచెత్తారు.



తల్లి, తోబుట్టువులతో ఆస్టిన్ (కుడి చివర)

న్యూస్‌ప్రింట్ కొరతపై ఐఎన్ఎస్ ఆందోళన

దిల్లీ: పత్రికల ముద్రణకు వినియోగించే కాగితం (న్యూస్‌ప్రింట్) కొరత దీర్ఘకాలంగా కొనసాగుతుండటంతో ప్రచురణ కర్తలు దిగుమతులపై ఆధారపడక తప్పని పరిస్థితి నెలకొందని ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) ఆందోళన వ్యక్తం చేసింది. 'దేశంలో వార్తాపత్రికల న్యూస్‌ప్రింట్ వినియోగం ఏడాదికి సుమారు 12 లక్షల టన్నులు. కానీ, దేశంలో దాని ఉత్పత్తి 5లక్షల టన్నులు మించడంలేదు. ఇక్కడి పేపర్ మిల్లులు 40 శాతం గిరాకీకి తగిన న్యూస్‌ప్రింట్‌ను మాత్రమే అందించగలుగుతున్నాయి. గిరాకీ, సరఫరా మధ్య ఉన్న ఈ భారీ అంతరం రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతూనే ఉంది. దేశంలో కాగితం తయారీ పరిశ్రమ విస్తరణకు నోచుకోకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దేశ ప్రజలకు నిరంతరాయంగా సమాచారాన్ని అందించాల్సిన అవసరం ఉన్నందున ప్రచురణకర్తలు తప్పనిసరి పరిస్థితుల్లో విదేశాల నుంచి దిగుమతయ్యే న్యూస్‌ప్రింట్‌పై ఆధారపడాల్సి వస్తోంది' అని ఐఎన్ఎస్ పేర్కొంది.

వాణిజ్య ఒప్పందం పెద్ద నిర్ణయం

ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ భేటీలో మోదీ



ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీని సత్కరించిన రాజ్‌నాథ్, నితిన్ నబీన్, జేపీ నడ్డా తదితరులు

దిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలనుకోవడం పెద్ద నిర్ణయమని, దేశంలో ప్రతి ఒక్కరికీ దానివల్ల ప్రయోజనం ఉంటుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇలాంటి ఒప్పందాలైనా, బడ్జెట్ అయినా- అన్నింటా దేశానికి అనుకూలంగానే తమ సర్కారు ఎల్లప్పుడూ పనిచేస్తుందని చెప్పారు. మంగళవారం పార్లమెంటు సముదాయంలో జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో కూటమి ఎంపీలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఐరోపా సమాఖ్య (ఈయూ), అమెరికాలతో ఒప్పందాల విషయంలో కూటమి ఎంపీలు ముందుగా ప్రధానిని అభినందించారు. అగ్రరాజ్యంతో ఒప్పందం వల్ల భారత్‌లోని తయారీదారులు, ఎగుమతిదారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు బలపడతారని మోదీ చెప్పారు. 'ట్రంప్ విధించిన సుంకాలపై మమ్మల్ని విమర్శించారు. అయినా సహనంతో ఉన్నాం. అదే ఇప్పుడు గెలిపించింది' అని అన్నారు. "ఇటీవల జరిగిన పలు ఎన్నికల్లో సాధించిన విజయాలతో సంతృప్తిపడిపోవద్దు. క్షేత్రస్థాయిలో లేకుండా ఎన్నికల్లో గెలవలేం. ప్రజల సంక్షేమం కోసం మంచిపనులు చేస్తుండాలి. పార్లమెంటులో మీరంతా చురుకైన భూమిక పోషించాలి. స్థాయీ సంఘాల ద్వారా ఉత్తమ పనితీరు కనపరచాలి" అని దిశానిర్దేశం చేశారు.

ఇన్ని ఒప్పందాలు ఓ చరిత్ర: రిజిజు

సమావేశానంతరం కేంద్రమంత్రి కిరణ్ రిజిజు విలేకరులతో మాట్లాడారు. అమెరికాతో ఒప్పందంపై యావద్దేశంలో ఉత్సుకత ఉందని చెప్పారు. "మోదీ నేతృత్వంలో తొమ్మిది ఒప్పందాలు కొలిక్కి వచ్చాయి. మొత్తం 39 దేశాలతో సంతకాలు జరిగాయి. ఇదొక చరిత్ర" అని వివరించారు. భాజపా, తెదేపా, జేడీ(యు), ఎల్జేపీ (ఆర్), శివసేన, జేడీ(ఎస్) తదితర భాగస్వామ్య పక్షాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి.

మా యుద్ధ నౌకపైకి ఇరాన్ డ్రోన్

కూల్చేశాం..: అమెరికా

దుబాయ్: చర్చలకు సానుకూలంగా ఉన్నామని చెబుతూనే మరోవైపు కవ్వింపు చర్యలకు ఇరాన్ పాల్పడుతోందని అమెరికా ఆరోపించింది. అరేబియా సముద్రంలో ఉన్న తమ విమాన వాహక యుద్ధ నౌకపైకి ఇరాన్ డ్రోన్‌ను పంపిందని, దాన్ని కూల్చేశామని ప్రకటించింది. 'అబ్రహాం లింకన్ విమాన వాహక నౌక అరేబియా సముద్రంలో ఉంది. ఇరాన్‌కు చెందిన షాహెద్ 139 డ్రోన్ ఆ యుద్ధ నౌక దిశగా దూసుకొచ్చింది. గుర్తించిన అమెరికా.. దానిని ఎఫ్35 యుద్ధ విమానంతో కూల్చి వేసింది' అని అధికారులు వెల్లడించారు. ఈ వారం ఆఖర్లో అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు జరుగుతాయని వార్తలొచ్చిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

- న్యాయబద్ధంగా, నిష్పాక్షికంగా జరిగే చర్చల్లో పాల్గొనాలని తమ దేశ విదేశాంగ మంత్రిని కోరినట్లు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అంతకుముందు వెల్లడించారు. ఇరాన్‌తో చర్చల ప్రతిపాదనను అమెరికా ధ్రువీకరించలేదు. మరోవైపు ఇరాన్, అమెరికాల మధ్య ఉద్రిక్తతల్ని సడలించే దిశగా ఒక ఒప్పందాన్ని కుదిర్చేందుకు నిర్వహించనున్న సమావేశంలో పాల్గొనాల్సిందిగా తమకూ ఆహ్వానం లభించిందని పాకిస్థాన్ మంగళవారం ప్రకటించింది.

మణిపుర్ సీఎంగా ఖేమ్‌చంద్ సింగ్!

- ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఎన్నిక
- ఉప ముఖ్యమంత్రిగా కుకీ నాయకురాలు నెమ్చా కిప్‌గెన్!



దిల్లీ: మణిపుర్ నూతన సీఎంగా యుమ్నమ్ ఖేమ్‌చంద్ సింగ్ (62) బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్ర ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా ఆయన ఎన్నికయ్యారు. దిల్లీలోని మణిపుర్ భవన్‌లో మంగళవారం రాష్ట్ర ఎన్డీయే భాగస్వామ్య పక్షాల భేటీ జరిగింది. భాజపా, ఎన్‌పీపీ, ఎన్‌పీఎఫ్ ఎమ్మెల్యేలతో పాటు ముగ్గురు స్వతంత్ర శాసనసభ్యులు దానికి హాజరయ్యారు. వారంతా ఖేమ్‌చంద్‌ను తమ నేతగా ఎన్నుకున్నారు. అంతకుముందు, మణిపుర్ భాజపా ఎమ్మెల్యేలు దిల్లీలోని తమ పార్టీ ప్రధాన కార్యాలయంలో సమావేశమై ఖేమ్‌చంద్‌ను పార్టీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నారు. తైక్వాండోలో ప్రావీణ్యమున్న ఖేమ్‌చంద్.. 2017 నుంచి 2022 వరకు మణిపుర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022లో బీరెన్‌సింగ్ సర్కారులో మంత్రిగా నియమితులయ్యారు. మణిపుర్‌లోని మూడు కీలక సామాజిక వర్గాలతోనూ (మైతేయ్‌లు, కుకీలు, నాగాలు) సత్సంబంధాలు కలిగి ఉండటం ఖేమ్‌చంద్‌కు కలిసొచ్చినట్లు తెలుస్తోంది. ఆయన బుధవారమే గవర్నర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి కోరే అవకాశాలు ఉన్నాయి. మాజీ మంత్రి, కుకీ నాయకురాలు నెమ్చా కిప్‌గెన్ కొత్త ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పదవిని చేపట్టనున్నట్లు తెలుస్తోంది. నాగాలకు చెందిన ఎమ్మెల్యే ఒకరు డిప్యూటీ సీఎంగా ఉండాలన్న ప్రతిపాదన కూడా ఉన్నట్లు సమాచారం.

ఏడాదిగా రాష్ట్రపతి పాలన

జాతుల మధ్య ఘర్షణలతో మణిపుర్ 2023 మే నుంచి అట్టుడికింది. ఈ క్రమంలో నిరుడు ఫిబ్రవరిలో అప్పటి సీఎం బీరేన్‌సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి రాష్ట్రపతి పాలనలో ఉంది. మణిపుర్‌లో మొత్తం 60 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 2022 నాటి ఎన్నికల్లో భాజపా తరఫున 32 మంది ఎమ్మెల్యేలుగా గెలిచారు. అనంతరం ఐదుగురు జేడీయూ శాసనసభ్యులు కమలదళంలో చేరారు. ఆరుగురు సభ్యులున్న ఎన్‌పీపీ, ఐదుగురు ఎమ్మెల్యేలున్న ఎన్‌పీఎఫ్ కూడా రాష్ట్రంలో ఎన్డీయేలో భాగస్వామ్య పక్షాలే.



ఇతరులతో పోల్చుకోకండి

మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకునే క్రమంలో ఇతరులతో పోల్చుకోకండి. కొన్నిసార్లు మీరు ముందుకు వెళ్లొచ్చు, అప్పుడప్పుడు వెనుకబడొచ్చు. కానీ, మీ పోటీ మీతోనే అని గుర్తుంచుకోండి. స్వల్పకాలిక ఫలితాలపై ఆందోళన చెందకండి. దీర్ఘకాలిక లక్ష్యాల కోసం మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి.

– వెరాజోబుస్టోస్, పెర్ఫార్మెన్స్ కోచ్

వ్యవసాయ, పాడి రంగానికి పూర్తి రక్షణ: గోయల్



దిల్లీ: సున్నితమైన వ్యవసాయ, పాడి రంగాలకు భారత్, అమెరికా ఒప్పందంలో పూర్తి రక్షణ లభించనుందని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. అంతేకాకుండా జౌళి-వస్త్రాలు, ప్లాస్టిక్, గృహాలంకరణ సామగ్రి, తోలు ఉత్పత్తులు, రత్నాభరణాలు, సేంద్రియ రసాయనాలు, రబ్బరు ఉత్పత్తులు, యంత్రాలు, విమాన తయారీ రంగంలోని కార్మికులకు అపార అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. త్వరలో రెండు దేశాలు సంయుక్త ప్రకటన చేయనున్నాయని, అందులో మరిన్ని వివరాలు వెల్లడవుతాయని వివరించారు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై ట్రంప్ ప్రకటన చేసిన నేపథ్యంలో మంగళవారం దిల్లీలో మీడియాతో గోయల్ మాట్లాడారు. 'పలు రంగాలపై అమెరికా సుంకం 50శాతం నుంచి 18 శాతానికి తగ్గనుంది. పోటీదారుల కంటే మెరుగైన ఒప్పందం కుదరనుంది. చైనా, బంగ్లాదేశ్, మలేసియా, కంబోడియా, వియత్నాంల కంటే తక్కువ సుంకాలే మనకు అమలు కానున్నాయి' అని గోయల్ వివరించారు.


సీఈసీపై అభిశంసనకు మమత పిలుపు

దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)కు వ్యతిరేకంగా దిల్లీలో పోరాటాన్ని తీవ్రం చేసిన పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ మంగళవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఉద్వాసనకు పిలుపునిచ్చారు. సీఈసీకి వ్యతిరేకంగా ప్రవేశపెట్టే అభిశంసన తీర్మానానికి మద్దతిస్తామని తెలిపారు. బెంగాల్‌కు చెందిన సర్ బాధితులతో కలిసి ఆమె దిల్లీలో మీడియాతో మాట్లాడారు.

ఓ తండ్రి హృదయ వేదన ఈ ఔషధ చెట్టు



కేరళలోని కోళికోడ్ బీచ్‌లో నిర్వహించిన దివ్యాంగుల ప్రత్యేక కార్యక్రమంలో సిరంజీలు, మందు సీసాలు వేలాడదీసిన ఈ 'ఔషధ చెట్టు' అందరినీ ఆలోచింపజేసింది. కోళికోడ్ జిల్లాలోని చంగరోత్ గ్రామానికి చెందిన యూసుఫ్ ఈ చెట్టును ఇలా అలంకరించారు. గత పదేళ్లుగా ఆయన కుమార్తె శదాహ్ చికిత్సకు వాడిన మందులివి. దివ్యాంగ పిల్లలున్న తల్లిదండ్రుల ఇబ్బందులు ఇతరులకు తెలియజేసేందుకే ఆ ఔషధ చెట్టును రూపొందించినట్లు యూసుఫ్ 'ఈటీవీ భారత్'కు తెలిపారు. శదాహ్‌కు అరుదైన 'రెడ్ సిండ్రోమ్' అనే వైకల్యముంది. ఇటువంటి పిల్లలకు తీవ్రమైన మూర్ఛ సమస్య ఉంటుంది. "నా కుమార్తె ఆరు రకాల మందులు వాడుతుంది. చాలామంది నిపుణులకు కూడా ఈ సమస్య గురించి తెలియదు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఆమె వాడిన మందుల బాటిళ్లను వేలాడదీశా" అని యూసుఫ్ వివరించారు. ఆర్థికస్తోమత లేని తల్లిదండ్రుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించడమే తన ఉద్దేశమన్నారు. ఇటువంటి కేసుల్లో ప్రభుత్వం ఔషధాలను ఉచితంగా సరఫరా చేయాలని కోరారు.



ఎప్‌స్టీన్ ఫైల్స్ విచారణకు హాజరవుతాం

- క్లింటన్ దంపతుల వెల్లడి

వాషింగ్టన్: లైంగిక నేరగాడిగా అపఖ్యాతి మూటగట్టుకోవడంతో పాటు అంతర్జాతీయ గూఢచారిగా పనిచేశారన్న ఆరోపణలు ఎదుర్కొన్న జెఫ్రీ ఎప్‌స్టీన్ వ్యవహారంపై విచారణ మరో మలుపు తిరిగింది. అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు) ఓవర్‌సైట్ కమిటీ ముందు హాజరై వాంగ్మూలం ఇవ్వడానికి మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ఆయన భార్య హిల్లరీ క్లింటన్‌లు అంగీకరించారు. ఈ విషయాన్ని తమ న్యాయవాదుల ద్వారా కమిటీకి తెలియజేశారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన జేమ్స్ కోమర్ కాంగ్రెస్ హౌస్ ఓవర్‌సైట్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇంతకుముందు క్లింటన్ దంపతులు వాంగ్మూలం ఇవ్వడానికి నిరాకరించడంతో వారిపై ధిక్కార చర్యలు చేపడతామని కమిటీ ఛైర్మన్ హెచ్చరించారు. ధిక్కార నేరం రుజువైతే భారీ జరిమానా చెల్లించడంతో పాటు కారాగార శిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుంది. క్లింటన్ దంపతులపై అటువంటి చర్యలు తీసుకోవద్దని వారి తరఫు న్యాయవాదులు అభ్యర్థించారు.



బ్రిటిష్ ఎంపీ రాజీనామా

మరోవైపు ఎప్‌స్టీన్‌తో దగ్గర సంబంధాలున్న వ్యక్తిగా పేరుబడ్డ ప్రముఖ బ్రిటిష్ రాజకీయ నాయకుడు పీటర్ మండెల్సన్ బ్రిటన్ పార్లమెంటు ఎగువసభ శాశ్వత సభ్యత్వం నుంచి నిష్క్రమించనున్నట్టు ప్రకటించారు. ఎప్‌స్టీన్‌తో సాన్నిహిత్యం కలిగివున్న మండెల్సన్‌ను సభ్యత్వం నుంచి తొలగించేందుకు ప్రభుత్వం చట్టాన్ని తేవాలని యోచిస్తున్న తరుణంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. తాజాగా విడుదలైన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో వెల్లడైన వివరాలు తనను ఆశ్చర్యానికి గురిచేశాయని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అన్నారు. ఈ ఉదంతంలో అమెరికా ప్రభుత్వం తాజాగా 30 లక్షల పేజీల సమాచారాన్ని విడుదల చేసిన విషయం విదితమే.

భారత్‌పైనే తక్కువ సుంకాల భారం!

ఇంటర్నెట్ డెస్క్: అమెరికాతో వాణిజ్య ఒప్పందం ద్వారా పొరుగు దేశాలు, కీలక ఎగుమతిదారులైన వారి కంటే భారత్‌పైనే తక్కువ సుంకాల భారం పడే అవకాశముంది. బంగ్లాదేశ్, శ్రీలంకలపై సుంకాలు 20 శాతం కాగా.. పాకిస్థాన్‌పై 19 శాతం, చైనాపై అధికంగా 34-37 శాతం వరకూ ఉన్నాయి. ఇండోనేసియా, వియత్నాం, థాయ్‌లాండ్, కంబోడియా, మలేసియా వంటి ఇతర ఆసియా దేశాల కంటే మన దేశంపై విధించనున్న 18శాతం సుంకాలు తక్కువే అయినప్పటికీ.. ఐరోపా కూటమి, జపాన్, దక్షిణ కొరియాతో పోలిస్తే కొంచెం ఎక్కువే. ఈ మూడింటిపై ప్రస్తుతం 15 శాతం సుంకాలు అమలవుతున్నాయి.

చమురు నిలిపివేతపై సమాచారం లేదు: రష్యా

మాస్కో: భారత్ తమ నుంచి చమురు కొనుగోలును నిలిపేస్తుందన్న విషయమై ఎటువంటి సమాచారం లేదని రష్యా వెల్లడించింది. భారత్ ఎటువంటి నోటీసూ ఇవ్వలేదని స్పష్టం చేసింది. వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా చమురు కొనుగోలును నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం రష్యా అధ్యక్ష భవనం అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందించారు. భారత్‌తో సంబంధాల మెరుగు విషయంలో ఉన్న అన్ని అవకాశాలనూ వినియోగించుకుంటామని స్పష్టం చేశారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని రష్యా ఉప ప్రధాని, ఇంధనశాఖ వ్యవహారాలను చూస్తున్న అలెగ్జాండర్ నోవాక్ తెలిపారు. అధికారిక ప్రకటననే తాము పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించారు. తమ చమురుకు అంతర్జాతీయంగా డిమాండు ఉందని, సరఫరా, డిమాండు మధ్య సమతౌల్యంగా వ్యవహరిస్తున్నామని వివరించారు.

ఒప్పందంలో గోర్ కీలక పాత్ర!

- ట్రంప్‌నకు అత్యంత విశ్వాసపాత్రుడు



ఇంటర్నెట్ డెస్క్: భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంలో సెర్గియో గోర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ట్రంప్‌నకు అత్యంత విశ్వాసపాత్రుడిగా ఉన్న ఆయన మళ్లీ భారత్, అమెరికాను దగ్గర చేశారు. ఆయన భారత్‌లో అమెరికా రాయబారిగా జనవరిలో బాధ్యతలు చేపట్టారు. కొద్ది సమయంలోనే రెండు దేశాల మధ్య సంబంధాలను పునర్నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు. అందులో భాగంగానే ఒప్పందం కుదిరే విషయంలోనూ చొరవ చూపారు. 39 ఏళ్ల సెర్గియో.. ట్రంప్‌నకు వీర విధేయుడు. అందుకే అతి తక్కువ కాలంలోనే ఆయన ట్రంప్ పరిపాలన విభాగంలో స్థానం సంపాదించగలిగారు. అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్‌ను భారత్‌లో అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్య ఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం అప్పట్లో దౌత్యవర్గాలను షాక్‌కు గురి చేసింది. గోర్ నియామకంపై భారత్‌లో మిశ్రమ స్పందన వ్యక్తమైంది. కానీ ట్రంప్.. 'నా అజెండాను అమలు చేయడానికి నేను పూర్తిగా విశ్వసించే ఓ వ్యక్తి నాకు కావాలి. ఆ విషయంలో సెర్గియో గొప్ప రాయబారి అవుతారు' అని పొగడ్తల వర్షం కురిపించారు.

1990లలో గోర్ కుటుంబం అమెరికాకు వలస వచ్చింది. ఆయన తల్లిదండ్రులవి రష్యా మూలాలు. అమెరికా వచ్చిన కొంతకాలానికే గోర్‌కు పౌరసత్వం లభించింది. జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ అయిన ఆయన.. 2008లో పొలిటికల్ సైన్స్, అంతర్జాతీయ వ్యవహారాల్లో పట్టా పొందారు. తొలి నుంచీ రిపబ్లికన్ పార్టీతో సంబంధాలు కొనసాగించిన గోర్.. ఆ పార్టీ నేషనల్ కమిటీకి కమ్యూనికేషన్ అండ్ రీసెర్చ్ అనలిస్టుగా పని చేశారు. 2020లో ట్రంప్ హయాంలో విక్టరీ ఫైనాన్స్ కమిటీకి చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా నియమితులు కావడంతో అందరి దృష్టిని ఆకర్షించారు. తర్వాత ఆయన ట్రంప్‌నకు అత్యంత సన్నిహితుడిగా మారిపోయారు. 'మేయర్ ఆఫ్ మార్-ఎ-లాగో'గా నిక్‌నేమ్‌ను సంపాదించుకున్నారు. మార్-ఎ-లాగో అనేది ఫ్లోరిడాలోని ట్రంప్ రిసార్టు పేరు. గోర్.. భారత్‌కు రాయబారిగా నియమితులు కాకముందు వైట్‌హౌస్‌లో పర్సనల్ డైరెక్టర్‌గా పని చేశారు.



ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్‌లో బస్సు లోయలో పడిన ప్రాంతంలో సహాయక చర్యలు

ఉత్తరాఖండ్‌లో లోయలో పడ్డ బస్సు

ముగ్గురి మృతి, ఏడుగురికి తీవ్ర గాయాలు

దేహ్రాదూన్: ఉత్తరాఖండ్‌లోని కల్సీ ప్రాంతంలో మంగళవారం ఓ బస్సు లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు ప్రయాణికులు మృతిచెందారు. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఓ పురుషుడు ఉన్నారు. మీనక్ రోడ్డులోని కువాను సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాదానికి గురైన బస్సు హిమాచల్ రోడ్‌వేస్‌కు చెందినది. ప్రమాద సమయంలో అందులో 30 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఉక్రెయిన్‌పై డ్రోన్లు, క్షిపణుల వర్షం

- చర్చలకు ముందు రష్యా దాడి తీవ్రం



కీవ్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో చెలరేగిన మంటలు

కీవ్: రష్యా తమపై 450 దీర్ఘశ్రేణి డ్రోన్లతో పాటు భిన్న రకాలకు చెందిన 70 క్షిపణుల్ని ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మంగళవారం వెల్లడించారు. కీవ్‌లో నాటో కూటమి సెక్రటరీ జనరల్ మార్క్ రుట్ పర్యటనకు ఒక రోజు ముందు ఈ దాడి జరగడం గమనార్హం. అబుధాబీలో అమెరికా మధ్యవర్తిత్వంతో బుధవారం శాంతిచర్చలు పునఃప్రారంభం కానున్న దశలో దాడుల్ని రష్యా తీవ్రం చేసింది. విద్యుత్ సదుపాయాలు లక్ష్యంగా డ్రోన్, క్షిపణి దాడులు జరిగాయని జెలెన్‌స్కీ తెలిపారు. చలితీవ్రత అధికమైన నేపథ్యంలో ఉక్రెయిన్ ప్రజలకు వెలుగును, వేడిని అందించే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించేలా రష్యా ఈ దాడులకు పూనుకుందని ఆరోపించారు. తమకు గగనతల రక్షణ సాధనాలు సరఫరా చేయాలని, దురాక్రమణను ఆపేలా రష్యాపై ఒత్తిడి పెంచాలని మిత్ర దేశాలను ఆయన కోరారు. ఉక్రెయిన్‌లోని ఐదు ప్రాంతాలపై రష్యా ఏకకాలంలో దాడికి పాల్పడిందని, ఈ సంవత్సరం తమ విద్యుత్ నెట్‌వర్క్‌పై జరిగిన అతిపెద్ద దాడి ఇదేనని ప్రైవేటు విద్యుత్ సంస్థ డీటెక్ పేర్కొంది.

అజిత్ పవార్ అంత్యక్రియల్లో చేతివాటం

ఏడుగురి అరెస్టు

ఇంటర్నెట్ డెస్క్: మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియల వేళ చేతివాటం ప్రదర్శించిన ఏడుగురిని పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. విమాన ప్రమాదంలో కన్నుమూసిన అజిత్ పవార్ అంత్యక్రియలు గురువారం బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో జరిగాయి. అక్కడికి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. వారిలో దాదాపు 15 మంది.. తమ బంగారు గొలుసులు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు ప్రారంభించి ఏడుగురు అనుమానితులను అరెస్టు చేశారు.

పరస్పరం తాకిన ఎయిరిండియా, ఇండిగో విమానాల రెక్కలు

- ముంబయి విమానాశ్రయంలో అనూహ్య ఘటన



ముంబయి: ముంబయి విమానాశ్రయంలో మంగళవారం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ప్రయాణికులతో ఉన్న రెండు విమానాల రెక్కల కొనభాగాలు పరస్పరం తాకాయి. ఈ ఘటనలో రెక్కల భాగాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. అయితే ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారు. పౌర విమానయాన శాఖ అధికార ప్రతినిధి వెల్లడించిన వివరాల ప్రకారం- ఎయిరిండియాకు చెందిన విమానమొకటి (ఎయిర్‌బస్ ఎ320) ముంబయి నుంచి కోయంబత్తూరుకు బయలుదేరేందుకు మంగళవారం సాయంత్రం సిద్ధమైంది. అదే సమయంలో ఇండిగోకు చెందిన ఓ విమానం (ఇది కూడా ఎయిర్‌బస్ ఎ320) హైదరాబాద్ నుంచి ముంబయి చేరుకుంది. ఎయిరిండియా విమానం టేకాఫ్ కోసం రన్‌వే వైపు వెళ్తుండగా.. ఇండిగో విమానం ల్యాండింగ్ అనంతరం ట్యాక్సీయింగ్ ప్రక్రియలో ఉంది. ఈ క్రమంలో వాటి కుడి రెక్కల కొనభాగాలు పరస్పరం తాకాయి. అధికారులు వెంటనే ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందకు దించారు. ఈ ఘటనపై డీజీసీఏ బృందం దర్యాప్తు జరపనుంది.

ఆ గ్రామంలో నిత్యం జనగణమన.. రాత్రి 7 దాటితే పిల్లలకు నో ఫోన్



జాతీయ గీతాలాపనతో ఎక్కడివారు అక్కడే నిలిచిపోయిన గ్రామస్థులు

సాధారణంగా పాఠశాలల్లో రోజూ జాతీయ గీతాలాపన ఉంటుంది. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా నెవాసా తాలూకాలో గల సౌందాల గ్రామంలోనూ ఉదయం 10.00 గంటలైతే గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోని లౌడ్ స్పీకర్లలో 'జనగణమన' మొదలవుతుంది. ఊళ్లో పొలాల్లో పనిచేస్తున్న రైతులు, రోడ్లపై వెళ్తున్నవారు ఎక్కడివారక్కడ ఆగిపోయి శ్రద్ధగా గీతాలాపన చేస్తారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించాలని, అందరం భరతమాత బిడ్డలమన్న భావన కలగాలని ఈ నియమం పెట్టుకున్నట్లు గ్రామ సర్పంచి శరద్ అర్గాడే తెలిపారు. అంతేనా.. గ్రామంలో రాత్రి 7.00 గంటల తర్వాత విద్యార్థులకు మొబైల్ ఫోన్లు ఇవ్వడాన్ని సైతం నిషేధించారు. కాదని ఎవరైనా మొబైల్‌తో కనబడితే రూ.500 జరిమానా వసూలు చేస్తారు. బాలకార్మికుల సమాచారం ఇచ్చినవారికి రూ.1,000 బహుమతిగా ప్రకటించారు. గ్రామ వివాహాల్లో ఎవరైనా కట్నం అడిగినట్లు తమ దృష్టికి తెస్తే రూ.5,000 బహుమతిగా ఇస్తామని ప్రకటించినట్లు సర్పంచి తెలిపారు. ఈ నిర్ణయం తమ ఆడబిడ్డలను గృహహింస నుంచి కాపాడుతుందన్నారు.

రంగుల మక్కలు, ముల్లంగితో రెట్టింపు లాభాలు



రాజస్థాన్‌లోని సీకర్ జిల్లా పిప్రాలీ గ్రామం సారవంతమైన నేలలు, సాగుకు అనుకూలమైన వాతావరణానికి ప్రసిద్ధి. ఈ గ్రామ రైతు సంజయ్ యాదవ్ జీవనోపాధిగా ప్రారంభించిన వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కించడంతో పిప్రాలీ పేరు మరోమారు రాష్ట్రంలో ప్రతిధ్వనిస్తోంది. సాగులో పదేళ్లకు పైగా అనుభవం ఉన్న సంజయ్ రసాయన ఎరువులకు పూర్తిగా స్వస్తిచెప్పి, సహజసిద్ధమైన ప్రకృతి విధానాలతో చక్కటి ఫలితాలు సాధిస్తున్నారు. ఫతేపుర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో పొందిన శిక్షణ స్ఫూర్తితో మొక్కజొన్నలోని పలురకాలను మేళవించి సంకరజాతి విత్తనాలు సిద్ధం చేశారు. ఫలితంగా.. వివిధ రంగుల్లో మొక్కజొన్న పండించారు. ఈ మక్కలు భిన్నంగా, ఆకర్షణీయంగా కనిపించడమే కాదు.. యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు వీటిలో మెండుగా ఉన్నాయి. దిగుబడిని నేరుగా మార్కెట్లో విక్రయించి రెట్టింపు లాభాలు సాధించిన సంజయ్ ఈ రకం మొక్కజొన్నపై ఇప్పుడు పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశారు. సేంద్రియ పద్ధతిలో సంజయ్ పండించిన ఎర్ర ముల్లంగి సైతం మార్కెట్లో మంచి ధర పలుకుతోంది. చుట్టుపక్కల రైతులంతా ఇప్పుడు ఇదే బాటలో నడుస్తున్నారు. సాగులో కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకొని విత్తనాలు తయారుచేసుకొంటే దళారీ వ్యవస్థకు స్వస్తి చెప్పవచ్చని సంజయ్ అంటున్నారు.

కెనడాలో కాల్పుల కలకలం.. ముగ్గురు భారతీయుల అరెస్టు

ఒట్టావా: కెనడాలోని సర్రే ప్రాంతంలో ఓ ఇంటి వెలుపల కాల్పులు జరిపిన ఘటనకు సంబంధించి ముగ్గురు భారతీయులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను హర్జోత్ సింగ్(21), తరణ్‌వీర్ సింగ్(19), దయజీత్ సింగ్ బిల్లింగ్ (21)గా గుర్తించారు. సర్రేలోని క్రెసెంట్ బీచ్ ప్రాంతంలో ఈ నెల 1న ఈ కాల్పుల ఘటన చోటుచేసుకుంది.

కల్తీ నెయ్యి వెనక.. సింఘాల్, ధర్మారెడ్డి, బాలాజీ, భూమన, చెవిరెడ్డి, సుబ్బారెడ్డి

- నెయ్యి సేకరణ నిబంధనల సడలింపులో వీరి పాత్ర
- 2019లో నిబంధనలు పటిష్ఠపరిచిన అధికారులే 5 నెలల్లో ఎందుకు సడలించారు?
- కొనుగోళ్ల కమిటీలో ప్రత్యేక ఆహ్వానితులుగా భూమన, చెవిరెడ్డి
- ఆ కమిటీ నిర్ణయాలతోనే నెయ్యి కల్తీకి దారులు
- ఉన్నతాధికారులతో పాటు కమిటీ సభ్యులపైనా చర్యలు తీసుకోవాలి
- సిట్ లేఖలో అందరి వైపూ వేళ్లు



సింఘాల్, ధర్మారెడ్డి, బాలాజీ, భూమన, చెవిరెడ్డి, సుబ్బారెడ్డి

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో వినియోగించిన నెయ్యి నూటికి నూరు పాళ్లు కల్తీ జరిగిందని తేల్చేసిన సిట్ ఈ పాపంలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, అప్పటి తితిదే బోర్డు (ఛైర్మన్‌గా వై.వి.సుబ్బారెడ్డి ఉన్నారు), నాటి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో ధర్మారెడ్డి, ఆర్థిక సలహాదారు, అకౌంట్స్ అధికారి బాలాజీల పాత్రను విశదీకరించింది. 2019 ఆగస్టులో పకడ్బందీగా రూపొందించిన నెయ్యి సేకరణ నిబంధనలను సింఘాల్, ధర్మారెడ్డి, బాలాజీలు మళ్లీ 5 నెలల్లోనే ఎందుకు సడలించేశారని ప్రశ్నించింది. నిబంధనల సడలింపులో వారు విచక్షణను విస్మరించారని పేర్కొంది. లడ్డూ కల్తీపై దర్యాప్తు చేసిన సిట్ ప్రభుత్వానికి 14 పేజీల లేఖను సమర్పించింది. అందులో ఈ మొత్తం వ్యవహారం ఎలా సాగిందో ప్రస్తావించింది.

మొదటి మెట్టు: నిబంధనల సడలింపునకు నాటి అధికారుల ఆమోదం

నాటి ఈవో సింఘాల్, అదనపు ఈవో ధర్మారెడ్డి, అకౌంట్స్ అధికారి, ఆర్థిక సలహాదారు బాలాజీలు టెండర్ నిబంధనల సడలింపు నోట్‌లను ఆమోదించారు. అంతకు ముందు 5 నెలల కిందటే వీరే పకడ్బందీ నిబంధనలు రూపొందించారు. 5 నెలల ముందు అలా ఎందుకు సిఫార్సు చేశారో, ఇప్పుడు ఎందుకు సడలిస్తున్నారో ఆ నోట్‌లో కనీసం ప్రస్తావించలేదు.

రెండో మెట్టు: చెవిరెడ్డి, కరుణాకరరెడ్డిలు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉన్న కమిటీ సిఫార్సే

నెయ్యి కొనుగోలు నిబంధనల్ని సడలిస్తూ అధికారులు ఆమోదించిన నోట్‌ను 2020 ఫిబ్రవరి 29న తితిదే బోర్డు కొనుగోళ్ల కమిటీ సిఫార్సు చేసింది. ఆ కమిటీలో భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు.

మూడో మెట్టు: వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా ఉన్న తితిదే బోర్డు ఆమోదం

కొనుగోళ్ల కమిటీ సిఫార్సులను 2020 ఫిబ్రవరి 29న నాటి తితిదే బోర్డు కూడా ఆమోదించిందని సిట్ పేర్కొంది. నాడు బోర్డు ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి ఉండటం గమనార్హం.

ఈ నిబంధనల సడలింపు వల్లే ఈ కేసులో నిందితులుగా ఉన్న భోలేబాబా ఓర్గానిక్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవీ డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్, మాల్ గంగా డెయిరీ, ఇతర ప్రైవేట్ డెయిరీలు తితిదే టెండర్లను పొందేందుకు మార్గం సుగమం చేసింది.. అని సిట్ ఆ లేఖలో స్పష్టం చేసింది. 68.17 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరాకు ఈ నిబంధనల సడలింపే కారణమయింది.

పకడ్బందీ నిబంధనల్ని ఇలా సడలించేసి..

- 2014లో రూపొందించిన నెయ్యి సేకరణ టెండర్ నిబంధనల ప్రకారం డెయిరీకి టెండర్ తేదీకి ముందు కనీసం మూడేళ్లపాటు నెయ్యి ఉత్పత్తిలో అనుభవం ఉండాలి. రోజుకు కనీసం 4 లక్షల లీటర్ల ఆవుపాలను సేకరించే, సగటున 6 టన్నుల నెయ్యిని ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉండాలి.
- 2018 జూన్ 5న తితిదే బోర్డు 9:2 నిష్పత్తిలో ట్యాంకర్ల ద్వారా అగ్ మార్క్ స్పెషల్ గ్రేడ్ నెయ్యిని సేకరించాలని నిర్ణయించింది. అంటే 9 భాగాలు దేశవ్యాప్త డెయిరీల నుంచి, 2 భాగాలు ఏపీ డెయిరీల నుంచి సేకరించాలని నిర్ణయం. జాతీయ డెయిరీలకు వార్షిక టర్నోవర్ రూ.150 కోట్లు, ఆవు పాల సేకరణ రోజుకు 4 లక్షల లీటర్లు, ఆవు పాల వెన్న ఉత్పత్తి రోజుకు 6 టన్నులు ఉండాలి. ఏపీ డెయిరీలకు వార్షిక టర్నోవర్ రూ.50 కోట్లు, ఆవు పాల సేకరణ రోజుకు 1.5 లక్షల లీటర్లు, ఆవు పాల వెన్న ఉత్పత్తి రోజుకు 2 టన్నులు ఉండాలని నిర్ణయించారు.
- 2019లో నెయ్యి వినియోగం దాదాపు 50% పెరిగింది. నెయ్యి టెండర్లలో నిబంధనలు మార్చేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. ఆరు నెలలకు బదులు మూడు నెలల కాలానికే ఆవు నెయ్యిని సేకరించేలా సాధ్యాసాధ్యాలు పరిశీలించేందుకు కమిటీ ఏర్పాటయింది. పి.జగదీశ్వర్‌రెడ్డి (సేకరణ విభాగం జీఎం) సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.రమేష్‌రెడ్డి, వేంకటేశ్వర గో సంరక్షణశాల డైరెక్టర్ కె.హరనాథ్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి వెంకయ్య, డెయిరీ నిపుణుడు ఎం.విజయభాస్కరరెడ్డి, బెంగళూరు నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్త బి.సురేంద్రనాథ్‌లు కమిటీలో సభ్యులు. 2019 ఏప్రిల్ 30న ఈ కమిటీ ఏర్పాటుకు తితిదే అప్పటి ఈవో సింఘాల్ ఆమోదించారు. ఈ కమిటీ సిఫార్సుల మేరకు 2019 జులై 31న తితిదే ప్రత్యేకాధికారి ఎ.వి.ధర్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో టెండర్ నిబంధనల్ని బలోపేతం చేసేందుకు సిఫార్సు చేశారు.

నిబంధనలు ఇలా బలోపేతం..

- జాతీయ డెయిరీలకు ఆవు వెన్న ఉత్పత్తి సామర్థ్యం రోజుకు 6 టన్నుల నుంచి 12 టన్నులకు, వార్షిక టర్నోవర్ రూ.150 కోట్ల నుంచి రూ.250 కోట్లకు పెంచారు. ఏడాది కాలంగా రోజుకు 4 లక్షల లీటర్ల పాల సేకరణ తప్పనిసరి. తితిదేలో నెయ్యి అవసరాలు పెరిగినందున ఆరు నెలల్లో 20,71,000 కిలోల ఆవు నెయ్యిని ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉండాలి. అందువల్ల ఆవు పాల వెన్న వార్షిక ఉత్పత్తి పెంచాలని కమిటీ ప్రతిపాదించింది. రోజుకు 12 టన్నుల ఆవు పాల వెన్న ఉత్పత్తి సామర్థ్యం, రోజుకు 4 లక్షల లీటర్ల ఆవు పాల సేకరణ సామర్థ్యం ఉండాలని నిర్ణయించింది.
- ఈ సిఫార్సులను నాటి ప్రత్యేకాధికారి ఎ.వి.ధర్మారెడ్డి 2019 ఆగస్టు 15న ఆమోదించగా ఈవో సింఘాల్ ఆ మర్నాడే ఆమోదించారు. ఆ సమయంలో కొనుగోళ్ల కమిటీ, తితిదే బోర్డు లేవు. ఈ సిఫార్సులను వాటి ముందుంచలేదు. 2019 జూన్‌లో తితిదే ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డిని నియమించినా ఫైలు ఆయన ముందుకు వెళ్లలేదు.

నిబంధనలు మార్చాలని సిఫార్సు చేసింది కొనుగోళ్ల కమిటీయే!

పై నిబంధనలతో 2019 అక్టోబరులో తితిదే నెయ్యి కొనుగోలు టెండర్లు పిలిచింది. ఆ టెండర్ల ద్వారా అర్హత పొందిన వారికి కాంట్రాక్టు ఆమోదిస్తూనే కొనుగోళ్ల కమిటీ నెయ్యి కొనుగోలు టెండర్లు మార్చాలని సిఫార్సు చేసింది. టెండర్‌లో పాల్గొనే వారి సంఖ్య తక్కువగా ఉంటోందని, ఎక్కువ మంది పాల్గొనేలా టెండర్ నిబంధనల్ని మార్చాలని సూచించింది. కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కొలుసు పార్థసారథి సభ్యులుగా ఉన్న కమిటీయే ఈ సిఫార్సు చేసింది.

- దీంతో 2019లో ఏర్పాటైన కమిటీకే టెండర్ నిబంధనలను మార్చే బాధ్యతలు అప్పగిస్తూ 2020 జనవరి 6న నిర్ణయం తీసుకున్నారు. ఐఐఎం లక్నోలో ప్రొఫెసర్‌గా ఉన్న ఎస్.వెంకటరమణను నిపుణుడిగా ఈ కమిటీలోకి తీసుకున్నారు. కమిటీ సభ్యులతో పాటు ప్రొక్యూర్‌మెంట్ జనరల్ మేనేజర్ పి.జగదీశ్వరరెడ్డిని సైతం 2020 జనవరి 23న నిర్వహించిన కమిటీ సమావేశానికి ఆహ్వానించారు. ఈ కమిటీ క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా, ఎక్కువ సమయం కూడా వెచ్చించకుండా టెండర్ నిబంధనల సడలింపులకు సిఫార్సు చేసింది.

టెండర్ నిబంధనల సడలింపు ఇలా..

- రోజుకు 4 లక్షల లీటర్ల ఆవుపాలు సేకరించే అనుభవం తప్పనిసరిగా ఉండాలనే నిబంధన తొలగింపు
- డెయిరీ నిర్వహణ అనుభవం మూడేళ్ల నుంచి ఏడాదికి తగ్గింపు
- ఆవు పాల వెన్న ఉత్పత్తి రోజుకు 12 టన్నుల నుంచి 8 టన్నులకు తగ్గింపు
- వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల నుంచి రూ.150 కోట్లకు తగ్గింపు

టెండర్ నిబంధనలు ఎందుకు మార్చాల్సి వచ్చిందో ఎలాంటి వివరణ ఇవ్వకుండానే ఎక్కువ మంది టెండర్లలో పాల్గొనేందుకు నిబంధనలు మారుస్తున్నామంటూ సమర్థింపు జోడించారు.

- దీనికి 5 నెలల ముందు నెయ్యి కొనుగోలు టెండర్ నిబంధనలు పకడ్బందీగా రూపొందించి బలోపేతం చేసిన సీనియర్ అధికారుల (ఎకౌంట్స్ అధికారి బాలాజీ, అదనపు ఈవో ధర్మారెడ్డి, ఈవో సింఘాల్) బృందమే ఏ సంకోచం లేకుండా ఈ సడలింపులను ఆమోదించింది. ఆ తర్వాత కొనుగోళ్ల కమిటీ, తితిదే ధర్మకర్తల మండలి సైతం వాటికి ఆమోదముద్ర వేశాయి.

అక్రమ డెయిరీలకు రాచబాట

- నిబంధనలు సడలించినా తితిదే టెండర్లలో పాల్గొనే వారి సంఖ్య పెరగలేదు.
- ఏదైనా డెయిరీలో నాణ్యమైన నెయ్యి ఉత్పత్తిలో పాలసేకరణ కీలకం. అయితే ఆవుపాల సేకరణ తప్పనిసరి అనే నిబంధనను టెండర్ల నుంచి తొలగించారు. ఇది కల్తీ నెయ్యి సరఫరా చేసిన ప్రైవేట్ డెయిరీలు భోలేబాబా ఓర్గానిక్ డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్, మాల్ గంగా మిల్క్ అండ్ ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లు టెండర్లు పొందడానికి వీలు కల్పించింది.
- 2018లో జాతీయ డెయిరీలకు వార్షిక టర్నోవర్ పరిమితి రూ.150 కోట్లు. 2019లో దీన్ని రూ.250 కోట్లకు పెంచారు. 2020లో తిరిగి రూ.150 కోట్లకు తగ్గించారు. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే 2018 కన్నా టర్నోవర్ పరిమితి ఎక్కువ ఉండాలి. కానీ తగ్గించారు. దీని వల్ల భోలేబాబా, వైష్ణవి సహా అనేక చిన్న డెయిరీలు టెండర్లలో పాల్గొనేందుకు అనుమతి వచ్చింది.
- టెండర్ తేదీకి ముందు నెయ్యి ఉత్పత్తిలో కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలనే నిబంధన 2014 నుంచి ఉంది. 2020 నిబంధనల సడలింపు సమయంలో దీన్ని ఏడాదికి తగ్గించేశారు. ఇది కొత్తగా స్థాపించిన ప్రైవేట్ డెయిరీలు, ఈ కేసులోని నిందితులైన భోలేబాబా డెయిరీ, ఫతేపూర్ ప్లాంట్ సహా అనేక డెయిరీలకు ఈ టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించింది.
- టెండర్ నిబంధనల సడలింపుతో అంతిమంగా పాలు సేకరించని, తగిన అనుభవం, ప్రతిష్ఠ లేని డెయిరీలు టెండర్లలో పాల్గొనేందుకు వీలు కల్పించింది. ఇది అంతిమంగా లడ్డూ ప్రసాదాల తయారీకి తితిదే సేకరించే నెయ్యి నాణ్యతతో రాజీ పడటానికి దారి తీసింది. ఇది కోట్ల మంది వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలు, విశ్వాసాలను దెబ్బతీసింది.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

- నిబంధనల్ని రూపొందించే కమిటీలోకి డెయిరీ నిపుణుడిని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) లేదా నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌డీఆర్ఐ) నుంచి తీసుకోవాలి. కానీ ఐఐఎం లక్నోలో సప్లై చైన్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ ఎస్.వెంకటరమణయ్యను నిపుణుడిగా ఆహ్వానించారు. ఈయనకు నెయ్యి సేకరణ పద్ధతుల్లో నిర్దిష్ట నైపుణ్యం లేదని సిట్ దర్యాప్తులో వెల్లడయింది.
- ఈ కమిటీ ఏర్పాటులో అధికారులు తమ విచక్షణను ఉపయోగించలేదు.
- 2019 ఆగస్టులో పకడ్బందీ నిబంధనలకు సిఫార్సు చేసిన ఈవో సింఘాల్, అదనపు ఈవో ధర్మారెడ్డి, అకౌంట్స్ అధికారి బాలాజీ 5 నెలల్లోనే అందుకు పూర్తిగా విరుద్ధమైన సిఫార్సులు చేశారు. టెండరు నిబంధనల సడలించాలనడానికి కారణాలేంటో కూడా తెలుసుకోలేదు. వీరు ఉద్దేశపూర్వకంగా తప్పిదాలు చేశారు. ఈ అధికారులతో పాటు నిబంధనలు సడలించిన కమిటీ వైఫల్యమూ ఉంది. వీరందరిపై తగిన చర్యలు తీసుకోవాలి.

పరీక్షల్లో నెయ్యి కల్తీ తేలినా.. ప్రమాణాలు మార్చేసి...

నెయ్యి నాణ్యతపై 2022 మే 25న తితిదేకి ఒక అనామక ఫిర్యాదు అందింది. దీంతో ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్, భోలేబాబా ఓర్గానిక్ డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ ట్యాంకర్లు, టిన్‌ల నుంచి నెయ్యి నమూనాలను సేకరించి మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్‌కు పరీక్షలకు పంపారు. 2022 జూన్‌లో నమూనాలు పంపితే ఆగస్టు 3న నివేదికలు వచ్చాయి. ఆ నెయ్యి నమూనాలన్నింటిలోనూ బీటా సిటోస్టెరాల్ ఉనికిని వెల్లడించాయి. అంటే నెయ్యి కల్తీ అయినట్లు నిర్ధారణ అయింది. ఈ పరీక్ష నివేదికలను తొక్కిపెట్టారు.

- 2022 మే 30న అప్పటి ఈవో ధర్మారెడ్డి ఆ టెండర్లలో బీటా సిటోస్టెరాల్ పరిమితితో సహా ఎఫ్ఎస్ఎస్ఏఆర్ (ఆహార భద్రతా ప్రమాణాల నియంత్రణ) చేర్చి డెయిరీలతో ఒప్పందాలు కుదుర్చుకోవాలని నోట్ ఆమోదించారు. అలాంటిది 2022 ఆగస్టు 31న అందుకు విరుద్ధమైన నిర్ణయం తీసుకున్నారు. ఆల్ఫా మిల్క్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, హత్రాస్, ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లతో సవరించిన ప్రమాణాలు, బీటా సిటోస్టెరాల్‌తో సహా అనుమతిస్తూ ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అవకాశం కల్పించారు.

బాలాజీపై చర్యలకు మీనమేషాలేల?

- నేటికీ తితిదే ప్రధాన ఎకౌంట్స్ అధికారిగా ఆయనే
- కల్తీ నెయ్యి సరఫరాకు ముఖ్య కారకుల్లో ఒకరిగా సిట్ నిర్ధారణ

ఈనాడు, అమరావతి, ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరుమల కల్తీ నెయ్యి కుంభకోణానికి నాటి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో ధర్మారెడ్డితో పాటు తితిదే ఆర్థిక సలహాదారు, ప్రధాన ఎకౌంట్స్ అధికారి (ఎఫ్ఏ అండ్ సీఏవో) ఒ.బాలాజీ ముఖ్య కారకులని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ రాష్ట్ర ప్రభుత్వానికి వారం క్రితమే లేఖ రాసింది. ఈవో సింఘాల్‌ను ఇటీవల బదిలీ చేయగా, బాలాజీ మాత్రం పాత పోస్టులోనే కొనసాగుతున్నారు. మంగళవారం నాటికి కూడా ఆయనపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం విస్మయపరుస్తోంది. 2004లో తితిదేలోకి ప్రవేశించిన బాలాజీ.. ఆర్థిక సలహాదారుగా, ప్రధాన ఎకౌంట్స్ అధికారిగా కీలక స్థానానికి చేరారు.

టెండర్లన్నీ అతని కనుసన్నల్లోనే

తితిదే పరిధిలో ఏటా రూ.వేల కోట్ల సరకు కొనుగోళ్లకు టెండర్లు పిలవడంతో పాటు ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు సాధారణంగా కేంద్ర సర్వీసులకు చెందిన ఇండియన్ ఆడిట్ అండ్ ఎకౌంట్స్ సర్వీస్ (ఐఏఅండ్ఏఎస్) లేదా ఐఆర్ఎస్ అధికారులను నియమించేవారు. వీరిని ఆర్థిక సలహాదారు, ప్రధాన ఎకౌంట్స్ అధికారిగా (ఎఫ్ఏఅండ్‌సీఏవో)గా పిలుస్తారు. ఈ సంప్రదాయానికి తిలోదకాలిస్తూ, చీఫ్ ఎకౌంట్స్ అధికారిగా ఉన్న బాలాజీకే ఆర్థిక సలహాదారుగా గతంలో పూర్తి బాధ్యతలు అప్పగించారు. కేంద్ర సర్వీసు అధికారులను కాదని, తాము చెప్పినట్లు నడుచుకుంటారన్న భావనతోనే బాలాజీని ఏళ్ల తరబడి అదే పోస్టులో కొనసాగిస్తున్నట్లు విమర్శలున్నాయి. టెండర్లు సహా ఉద్యోగుల జీతాలు, డిపాజిట్లు, మార్కెటింగ్, బడ్జెట్ ఇలా ప్రతి ఆర్థిక వ్యవహారం బాలాజీ చేతుల మీదుగానే సాగుతోంది. కల్తీ నెయ్యి సరఫరా సంస్థలు తితిదేలోకి చొరబడేందుకు కారణమైన టెండరు నిబంధనల సడలింపు నోట్‌ను 2020 ఫిబ్రవరి 14న బాలాజీ, ధర్మారెడ్డిలు సిఫార్సు చేయగా.. అప్పటి ఈవో సింఘాల్ ఆమోదించారు. అంతకు కొన్నినెలల ముందే టెండరు నిబంధనలు కఠినతరం చేశామని, వాటికి విరుద్ధంగా తాజా సడలింపులున్నాయని నోట్‌లో కనీసం ప్రస్తావించలేదు. బాలాజీ సభ్యుడిగా ఉన్న కొనుగోళ్ల కమిటీ టెండరు నిబంధనల సడలింపునకు 2020 ఫిబ్రవరి 18న ఆమోదం తెలపగా, అదే నెలాఖరున తితిదే బోర్డు ఆమోదించింది. అన్ని ప్రక్రియల్లోనూ బాలాజీ ప్రధాన పాత్రధారి. సింఘాల్, ధర్మారెడ్డితో కలిసి బాలాజీ తీసుకున్న నిర్ణయాల వల్లే భోలేబాబా, వైష్ణవి, మాల్ గంగా వంటి డెయిరీలు తితిదే టెండర్లు దక్కించుకుని కల్తీ నెయ్యి సరఫరా చేశాయి. సహకార డెయిరీలకు అవకాశం లేకుండా పోయింది.

పవన్ కల్యాణ్‌తో కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు భేటీ



పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామచందర్‌రావు, చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి, భాజపా తెలంగాణ శాఖ అధ్యక్షుడు రామచందర్‌రావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలు సహా పలు కీలక అంశాలపై చర్చించారు. తమకు మద్దతు ప్రకటించిన జనసేన అధినేత పవన్ కల్యాణ్... ఎన్నికల్లో తమ పార్టీ తరఫున ప్రచారం చేయడానికి అంగీకరించినట్లు భాజపా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

18న అమరావతికి బిల్ గేట్స్?

- సీఎం చంద్రబాబుతో సమావేశం
- అమరావతి క్వాంటమ్ వ్యాలీలో పెట్టుబడులపై స్పష్టత?

ఈనాడు, అమరావతి: మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 18న అమరావతి రానున్నారు. సీఎం చంద్రబాబుతో సమావేశమై.. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఏఐ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు వీలుగా గత ఏడాది మార్చిలో బిల్, మెలిండా గేట్స్ ఫౌండేషన్‌తో రాష్ట్రప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీనివల్ల ఆరోగ్య సేవల ఎనలిటిక్స్, డిజిటల్ వ్యవసాయం, పాలనలో సాంకేతికత వినియోగం ద్వారా ప్రజలకు వేగవంతంగా సేవలు అందించాలన్నది లక్ష్యం. ఈ ప్రాజెక్టు అమలుపై ఇరువురి మధ్య చర్చ జరిగే అవకాశం ఉంది. దీంతోపాటు అమరావతి క్వాంటమ్ వ్యాలీలో మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు పెట్టే ప్రతిపాదన ఉందన్న ప్రచారం ఉంది. దీనిపైనా అదేరోజు స్పష్టత ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కల్తీ పాపం వారిదే - మా దృష్టిలో వారు నేరస్థులే

(మొదటి పేజీ తరువాయి)

శ్రీవారి వైభవం మరింత పెరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా శ్రీవారిని రాజకీయాల్లోకి లాగకుండా, తప్పు చేయడానికి భయపడేలా చర్యలు ఉంటాయని ఆయన వెల్లడించారు. 'తితిదేలో పరిపాలనపరంగా ఇంకా ఏమైనా లోపాలున్నాయేమో తేల్చేందుకు తక్కువ కాలపరిమితితో కూడిన కమిటీని వేయనున్నాం. కల్తీ నెయ్యి వ్యవహారంలో ఉద్దేశపూర్వకంగానే తప్పులు చేసినట్లు గుర్తించిన సిట్ సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పష్టంగా పేర్కొంది. అయినా బాధ్యుల అభిప్రాయాల్ని మరోసారి తెలుసుకోవడానికి కమిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఆ తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటాం' అని వివరించారు. ఇప్పుడు కూడా విధిలేని పరిస్థితుల్లో బాధతోనే మాట్లాడుతున్నామని, దీని నుంచి రాజకీయ లబ్ధి పొందాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. బ్రిటిష్ పాలకులు, నిజాం కూడా శ్రీవారి ఆలయ విధివిధానాల్లో చొరబడే ప్రయత్నం చేయలేదని, ఆ సంప్రదాయాన్ని పునరుద్ధరించేందుకే ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు.

ఎన్‌డీడీబీ నివేదికతోనే కల్తీ నెయ్యిపై ప్రస్తావించిన చంద్రబాబు

కల్తీ నెయ్యి సరఫరాలో అక్రమాలన్నీ అప్పట్లో పెద్దలకు తెలిసే జరిగాయని సిట్ నివేదిక తేల్చింది. వారు కచ్చితంగా అందులో భాగస్వాములనే ఆధారాలు బయటపడుతున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన ఎన్డీయే పక్షాల సమావేశంలో సీఎం చంద్రబాబు.. వైకాపా హయాంలో శ్రీవారి లడ్డూప్రసాదం తయారీకి వినియోగించే నెయ్యిలో జంతు కొవ్వు అవశేషాలున్నట్లు బయటపడిందని ప్రస్తావించారు. తిరుమలకు సరఫరా చేసిన నెయ్యిలో ఫిష్ ఆయిల్, జంతుకొవ్వు, పందికొవ్వు కలిశాయని ఎన్‌డీడీబీ సీఏఎల్ఎఫ్ ఇచ్చిన నివేదికలోని అంశాలనే ఆయన ప్రజల ముందు ఉంచారు. వైకాపా హయాంలో 2022 ఆగస్టులో సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎఫ్‌టీఆర్ఐ)కు అప్పటి ఈవో నెయ్యి శాంపిల్స్‌ను పంపించారు. అప్పుడు కూడా బీటాసిస్టోస్టెరాల్ పాజిటివ్ వచ్చింది. కానీ ఆ నివేదికను తొక్కిపెట్టి, కల్తీని కొనసాగిస్తూ మరింత విస్తృతం చేశారు. ఇందులో తితిదే అప్పటి ఛైర్మన్, కొంతమంది సభ్యులు, అధికారుల పాత్ర ఉంది' అని స్పష్టం చేశారు.



నెయ్యి కల్తీపై సచివాలయంలో విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి, సత్యకుమార్ యాదవ్

5 నెలల్లోనే నిబంధనల్ని నీరుగార్చిన ధర్మారెడ్డి

తెదేపా ప్రభుత్వం నెయ్యి సరఫరాలో నిబంధనల్ని కఠినతరం చేస్తే వాటిని ఆమోదిస్తూ సంతకం పెట్టిన ఈవో ధర్మారెడ్డే.. వైకాపా అధికారంలోకి వచ్చాక 5 నెలలు తిరగకుండానే వాటన్నింటినీ నీరుగార్చారు. సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక అప్పటికే వచ్చినా చర్యలు తీసుకోలేదు. ఈ నివేదిక అప్పటి ఛైర్మన్, ఏఈవో, ఈవో దృష్టిలో కూడా ఉంది. అయినా చర్యలు తీసుకోలేదంటే వారు నేరస్థులా? కాదా? టెండర్ నిబంధనల ప్రకారం నెయ్యి పరీక్ష తప్పనిసరిగా చేయాలి. కానీ టెండరు ప్రక్రియ పూర్తయిన తర్వాత దాన్ని తొలగించాలని సంస్థ కోరితే ధర్మారెడ్డి మినహాయింపునిచ్చేశారు. దీని వెనుక నేరపూరిత కుట్ర ఉందనడానికి ఇదే తార్కాణం. కాబట్టే ఈ వ్యవహారంలో భాగస్వాములందరినీ నేరస్థులుగానే పరిగణిస్తున్నాం' అని వివరించారు.

పాలే లేకుండా నెయ్యి తయారీనా!

నెయ్యి సేకరణ పకడ్బందీగా ఉండాలని 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో నిబంధనలు మరింత కఠినతరం చేశారు. నెయ్యి సరఫరా చేసే సంస్థ కనీసం 4 లక్షల లీటర్ల పాలు సేకరణ చేయగలగాలి. డెయిరీ కార్యకలాపాల్లో కనీసం మూడేళ్ల అనుభవం, రూ.250 కోట్ల టర్నోవర్ ఉండాలనే నిబంధనల్ని పెట్టారు. వీటిని వైకాపా ప్రభుత్వంలో తొలుత ధర్మారెడ్డి ఆమోదించారు. టెండర్ల ప్రక్రియ ప్రారంభించిన తర్వాత పోటీ తక్కువగా ఉందని, నిబంధనల్ని సరళీకృతం చేయాలని చెప్పి మూడు నిబంధనల్ని మార్చారు. రూ.250 కోట్ల నిబంధనను రూ.150 కోట్లకు తగ్గించారు. ఏడాది అనుభవం ఉంటే చాలని మార్చారు. పాల సేకరణ నిబంధనే తీసేశారు. అసలు పాలు లేకుండా నెయ్యి తయారు చేయగలరా? ఇలా నిబంధనల్ని మార్చి, మళ్లీ టెండర్లు పిలిచారు. దీంతో అప్పటి వరకు టెండరు దరిదాపుల్లోకి రాలేని భోలేబాబా, తదితర సంస్థలన్నీ పోటీలోకి వచ్చాయి. వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న భోలేబాబా సంస్థ యాజమాన్యం వద్దకు వెళ్లి టెండర్‌లో పాల్గొనాలంటే కిలోకు రూ.25 చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారు అంగీకరించకపోవడంతో ఆ సంస్థను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించారు. దీంతో భోలేబాబా సంస్థ వైష్ణవి డెయిరీతో ఒప్పందం కుదుర్చుకుని టెండర్లలో పాల్గొంది. ఆ సంస్థ సరఫరా చేసిన నెయ్యి నమూనాలను పరీక్షించినప్పుడే అక్రమాలన్నీ వెలుగులోకి వస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగా తప్పు చేసిన తితిదే అప్పటి అదనపు ఈవో ధర్మారెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ఎఫ్ఏ,సీఏవో బాలాజీలపై చర్యలు తీసుకోవాలని సిట్ ప్రభుత్వానికి సూచించింది' అని అన్నారు.

నకిలీ డాక్యుమెంట్లతోనే వైష్ణవి డెయిరీ టెండర్

నెయ్యి సరఫరాకు సంబంధించి వైష్ణవి డెయిరీకి ఏడాది అనుభవం కూడా లేదు. నకిలీ డాక్యుమెంట్లను సమర్పించి టెండరులో పాల్గొంది. పామాయిల్ 58 లక్షల లీటర్లు కొనుగోలు చేశారు. రసాయనాలు, కలరింగ్, ఫ్లేవరింగ్ ఏజెంట్లను కలిపారు. ఇవన్నీ తెలియకుండా జరిగినవి కాదు. సిట్ నివేదికలో పొందుపరిచిన వారందరినీ ఇందులో నేరస్థులుగానే పరిగణిస్తున్నాం. ఛార్జిషీట్‌లో వారిని నేరస్థులుగా పరిగణించారా? లేదా? అనేది చూస్తాం. ఒకవేళ పరిగణించకపోతే అవినీతి ఎలా జరిగిందో సిట్ దృష్టికి తీసుకెళ్లాలనే అంశంపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. అనుబంధ అభియోగపత్రం (సప్లిమెంటరీ ఛార్జిషీట్) కోసం ఎదురుచూస్తున్నాం. భోలేబాబా సంస్థ 2019 ఏప్రిల్‌లో టెండర్‌లో పాల్గొంది. అదే నెలలో ఎన్నికలు జరిగి, వైకాపా అధికారంలోకి వచ్చింది. అంటే అప్పుడు నెయ్యి సరఫరాను పరిశీలించాల్సింది వైకాపా ప్రభుత్వమే. ఆ సంస్థ అంతకు ముందు నుంచే అవినీతికి పాల్పడుతోందా? లేక వైకాపా నాయకులతో చేతులు కలిపిన తర్వాత అక్రమాలకు తెరతీశారా? ఇవన్నీ ఛార్జిషీట్‌లోనే బయటపడతాయి' అని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు.

తప్పు చేసినవారు ఎంతటివారైనా వదిలిపెట్టం

– నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాలశాఖ మంత్రి

2022లో సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక వచ్చిన తర్వాత నెయ్యి నమూనాలను వైకాపా ప్రభుత్వం ఒక్కసారి కూడా పరీక్షించలేదు. అందులో చుక్క నెయ్యి కూడా లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికే 15సార్లు నెయ్యిని పరీక్షించాం. కల్తీ నెయ్యి వ్యవహారంలో తప్పు చేసినవారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎన్‌డీడీబీ నివేదిక ఆధారంగా సీఎం చంద్రబాబు చెప్పిన అంశాలపై కూటమి పార్టీలన్నీ ఏకభవిస్తున్నాయి. అప్పట్లో నెయ్యి కల్తీ జరిగిన విధానాన్ని భక్తులకు తెలిపేలా కలిసికట్టుగా ముందుకెళ్లాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. కొంతమంది రాజకీయ కోణంలో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నా.. దాన్ని ప్రతిఘటించే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి వైకాపా నాయకులు ఎదురుదాడికి దిగుతూ కొత్త సమస్యల్ని సృష్టిస్తున్నారు.

భోలేబాబాను తెచ్చిన ఆలీబాబా ఎవరో తేలాలి

– సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్యశాఖ మంత్రి

వైకాపా హయాంలో పాలే లేకుండా పామాయిల్, రసాయనాలతో నెయ్యి తయారు చేసి వాటిని తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి వినియోగించారంటే వైకాపా నాయకులు ఎంత బరితెగించారో అర్థమవుతోంది. అప్పట్లో వారికి కావాల్సిన కంపెనీలకు టెండరు దక్కాలనే నిబంధనల్ని సడలించారు. రోజుకు కోటి లీటర్ల పాలను సేకరించే దేశంలోనే ప్రతిష్ఠాత్మక కేఎం సంస్థ కూడా టెండర్లలో పాల్గొనకుండా చేశారు. భోలేబాబా డెయిరీ సంస్థను దొడ్డిదారిన తెచ్చిన ఆలీబాబా, 40 దొంగలు ఎవరో తేలాలి. ఇందులో రూ.250 కోట్ల అవినీతి జరిగింది. ఇప్పుడు వాస్తవాలు బయటపడుతుంటే దాన్ని కూడా రాజకీయం చేస్తూ ప్రజల్ని మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. వైకాపా నాయకులు ఒకవైపు కల్తీ జరిగిందని చెబుతూనే జంతు కొవ్వు లేదని మాట్లాడుతున్నారు. కోట్ల మంది భక్తులు ఆరాధించే వేంకటేశ్వరస్వామికి నైవేద్యంగా సమర్పించే లడ్డూలో కల్తీ జరిగిందని అంగీకరిస్తున్నారా? వైకాపా నాయకత్వం దాన్ని సమర్థిస్తోందా?

చెవిరెడ్డి, భూమన ఆధ్వర్యంలోనే నడిపించారు

– కొలుసు పార్థసారథి, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి

వైకాపా హయాంలో నేను కొనుగోలు కమిటీలో ఉన్నాను. అయితే నెయ్యే లేని 20 కోట్ల లడ్డూలు తయారు చేసి కోట్ల మంది భక్తులకు పంపిణీ చేసిన మహానుభావులు పర్చేజ్ కమిటీని పక్కనపెట్టి వ్యవహారాన్ని నడిపించడం పెద్ద విషయం కాదు. మాకు తెలియకుండా అప్పట్లో ప్రత్యేక ఆహ్వానితులుగా వైకాపా నాయకులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, కరుణాకరరెడ్డిలను మాత్రమే పిలిపించుకుని ఈ వ్యవహారమంతా నడిపించారు. అధికారులతో రాతకోతలు చేసుకుని, అనుమతులు ఇప్పించుకున్నారు. ఆ విషయాలేవీ అప్పుడు మాకు తెలియదు.

ఛాంపియన్స్

టీ20 ప్రపంచకప్ మరో 3 రోజుల్లో

బాదుడు.. ఉతుకుడు.. విధ్వంసం.. ఈ మాటలన్నీ వాళ్ల ఆట ముందు చిన్నబోతాయి. వాళ్లాడుతుంటే చూస్తోంది లైవా లేక హైలైట్సా అన్న అనుమానం కలుగుతుంది. కొన్ని ఓవర్లలోనే మ్యాచ్ గమనమే మారిపోతుంది. క్రీజులో ఉండేది కాసేపే అయినా.. స్టేడియంలో పరుగుల వర్షం కురుస్తుంది. అభిమానుల అరుపులతో హోరెత్తుతుంది. అలాంటి విధ్వంసక ఆటగాళ్లు ఈసారి టీ20 ప్రపంచకప్‌లో కొందరున్నారు. ఆ పవర్ హిట్టర్లెవరో చూద్దామా!

వాళ్లు దిగితే మెరుపులే

షేక్ చేసేస్తాడు


అభిషేక్ శర్మ

టీ20 ప్రపంచకప్‌లో ఆడుతున్న ప్లేయర్లలో అత్యంత ఆకర్షణ ఉన్న ఆటగాడు అభిషేక్ శర్మ. ఈ నంబర్‌వన్ టీ20 బ్యాటర్.. గత కొన్నేళ్లుగా సంచలన ఆటతో చెలరేగుతున్నాడు. అతడికి తెలిసింది తొలి బంతి నుంచి బాదడమే. అభిషేక్ సిక్స్‌తోనే ఇన్నింగ్స్‌ను ఆరంభించిన సందర్భాలు చాలా ఉన్నాయి. మంచి నీళ్లు తాగినంత సులభంగా బంతిని స్టాండ్స్‌లోకి కొట్టేసే ఈ ఎడమ చేతి వాటం బ్యాటర్.. టీ20ల్లో భారత్ విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. మాజీ స్టార్ యువరాజ్ సింగ్ శిక్షణలో రాటుదేలిన అభిషేక్.. 2024 టీ20లో అరంగేట్రం చేసిన నాటి నుంచి టీమ్‌ఇండియాకు ఆయుధంగా మారాడు. పవర్ ప్లేలో ఆకాశమే హద్దుగా విరుచుకుపడుతున్న అతడు.. మ్యాచ్ గతిని మార్చేస్తున్నాడు. సెహ్వాగ్ మాదిరిగా ఉన్నంత సేపూ బలమైన ముద్రను వేస్తున్నాడు. ఆరంభంలో అభిషేక్ మెరుపులతో బలమైన పునాది పడడంతో.. తర్వాతి బ్యాటర్లు సైతం స్వేచ్ఛగా ఆడగలుగుతున్నారు. ఇప్పటిదాకా 38 టీ20ల్లో 194.74 సగటుతో 1297 పరుగులు చేశాడు అభి. అందులో 2 సెంచరీలు, 8 అర్ధసెంచరీలు ఉన్నాయి. అతడు ఉపయుక్తమైన లెఫ్ట్‌ఆర్మ్ స్పిన్నర్ కూడా. ఇటీవల న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో ఫామ్‌ను కొనసాగించిన ఈ ఓపెనర్.. మూడో టీ20లో 14 బంతుల్లోనే అర్ధసెంచరీ చేశాడు. జోరు మీద ఉన్న అతడు ప్రపంచకప్‌లో ఎలా ఆడతాడో చూడాలి.

ప్రత్యర్థులు జాగ్రత్త


సాల్ట్

ఫిల్ సాల్ట్.. ఐపీఎల్‌ను అనుసరించే అభిమానులకు తెలుసు అతడి ఆటంటో! ధనాధన్ షాట్లతో విరుచుకుపడే ఈ కుడి చేతి వాటం బ్యాటర్.. తొలి బంతి నుంచే బాదుడు షురూ చేస్తాడు. స్పిన్, పేస్ అని తేడా లేకుండా పరుగుల పండగ చేసుకుంటాడీ ఇంగ్లాండ్ ప్లేయర్. గతేడాది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్ గెలవడంలో సాల్ట్ (12 మ్యాచ్‌ల్లో 387 పరుగులు)ది కీలకపాత్ర. 2022 టీ20 ప్రపంచకప్ గెలిచిన ఇంగ్లాండ్ జట్టులో సభ్యుడైన అతడు.. ఈసారి ఎలా ఆడతాడో చూడాలి. శ్రీలంకతో తాజా టీ20 సిరీస్‌లో సాల్ట్‌కు గాయమైనా.. కోలుకుని ప్రపంచకప్‌లో బరిలో దిగుతాడని ఇంగ్లాండ్ ఆశిస్తోంది. అతడితో ప్రత్యర్థి జట్లు జాగ్రత్తగా ఉండాల్సిందే. ఇంగ్లాండ్ తరఫున 52 టీ20లు ఆడిన సాల్ట్.. 1587 పరుగులు చేశాడు. ఇందులో 4 సెంచరీలు, 7 అర్ధసెంచరీలు ఉన్నాయి.

ఆసీస్ మొనగాడు


ట్రావిస్ హెడ్

2023లో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్, వన్డే ప్రపంచకప్‌ను భారత్ గెలవలేదంటే.. ప్రధాన కారణం ట్రావిస్ హెడ్. ఈ ఆస్ట్రేలియా ఓపెనర్.. ఫార్మాట్ ఏదైనా విధ్వంసకంగా ఆడుతూ మ్యాచ్‌లను తన జట్టు వైపు లాగేస్తుంటాడు. ఇటీవల టీ20ల్లో మరీ గొప్పగా ఆడకపోయినా.. పెద్ద టోర్నీలకు వచ్చేసరికి ఈ హెడ్‌లోని మరో ఆటగాడు బయటకి వస్తాడు. 'క్లచ్ ప్లేయర్' అనే మాటకు పర్యాయపదంగా నిలుస్తూ ఒత్తిడిలోనూ అదరగొడతాడు. భారత్‌తో పాటు ఈసారి మిగిలిన జట్లకూ టీ20 ప్రపంచకప్‌లో హెడ్‌తో కష్టమే. పవర్ ప్లేలో వికెట్లు పడినా.. తగ్గకుండా తన షాట్లు ఆడుతూ పోతాడు హెడ్. ప్రత్యర్థి తేరుకునేలోపే స్కోరు పెంచేస్తాడు. ఔటయ్యేలోపు చేయాల్సిన నష్టాన్ని చేసేస్తాడు. ఇంగ్లాండ్‌తో యాషెస్ సిరీస్‌లో అదరగొట్టిన హెడ్.. 10 ఇన్నింగ్స్‌ల్లో 629 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇదే ఫామ్‌ను టీ20 ప్రపంచకప్‌లోనూ కొనసాగించగలిగితే మిగిలిన జట్లకు కష్టమే.

పరుగుల తుపాన్


ఫిన్ అలెన్

భారత్‌తో తాజాగా తిరువనంతపురంలో జరిగిన అయిదో టీ20లో న్యూజిలాండ్ ఓపెనర్ ఫిన్ అలెన్ మెరుపులను అభిమానులు మరిచిపోయి ఉండరు. 272 పరుగుల భారీ ఛేదనలో కివీస్ 220పైన పరుగులు చేసిందంటే అలెన్ విధ్వంసం వల్లే. అలవోకగా సిక్స్‌లు బాదేసే ఈ కుడిచేతి వాటం బ్యాటర్.. కుదురుకుంటే నిమిషాల్లోనే ఆట గమనాన్ని మార్చేస్తాడు. 2018 అండర్-19 ప్రపంచకప్‌లో 338 పరుగులు చేసి సత్తా చాటిన అలెన్.. కెన్యాపై 19 బంతుల్లోనే అర్ధసెంచరీ చేశాడు. 2024లో పాకిస్థాన్‌తో టీ20లో 48 బంతుల్లోనే సెంచరీ బాదాడు. ఈ క్రమంలో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్సర్ల (16) రికార్డు కూడా సమం చేశాడు. తాజాగా బిగ్‌బాష్ లీగ్‌లో 11 మ్యాచ్‌ల్లో 466 పరుగులు చేసి పెర్త్ స్కార్చర్స్ టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. అదే ఊపులో ప్రపంచకప్‌లో అదరగొట్టాలని చూస్తున్నాడు. ఇప్పటిదాకా అలెన్ 53 టీ20ల్లో 2 సెంచరీలు, 6 అర్ధసెంచరీలతో 1365 పరుగులు చేశాడు.

బేబీ డివిలియర్స్

దక్షిణాఫ్రికా మాజీ స్టార్ ఏబీ డివిలియర్స్‌కు '360 డిగ్రీల ఆటగాడు' అని పేరు. మైదానంలోని అన్ని కోణాల్లో భారీ షాట్లు ఆడడంతో అతడికా పేరు వచ్చింది. ఏబీ రిటైర్ అయినా.. అతడి బాటలో మరో ఏబీ వచ్చాడు. డివిలియర్స్ మాదిరే మైదానం నలుమూలలా షాట్లు ఆడగల సామర్థ్యంతో చెలరేగుతున్న ఆ కుర్రాడి పేరు డెవాల్డ్ బ్రెవిస్. 2022 అండర్-19 ప్రపంచకప్‌తో ఈ కుడి చేతి వాటం బ్యాటర్ వెలుగులోకి వచ్చాడు. ఈ టోర్నీలో 6 మ్యాచ్‌ల్లో 506 పరుగులతో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచిన బ్రెవిస్ అందరి దృష్టిలో పడ్డాడు. అదే ఏడాది ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ అతడిని రూ.3 కోట్లకు దక్కించుకుంది. గతేడాది అతడు చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడాడు. 2023లో దక్షిణాఫ్రికా తరఫున టీ20ల్లో అరంగేట్రం చేసిన బ్రెవిస్.. ఈ ఏడాది ఎస్ఏ టీ20 టోర్నీలో 12 మ్యాచ్‌ల్లో 370 పరుగులు చేశాడు. అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లలో అతడిది రెండో స్థానం. ఎంతటి ఒత్తిడిలోనైనా తన శైలిలో దూకుడుగా ఆడడం అతడి శైలి. జోరు మీదున్న బ్రెవిస్‌పై దక్షిణాఫ్రికా చాలా ఆశలే పెట్టుకుంది.


బ్రెవిస్



వికెట్ పడినా ఆఖరి ఓవర్ ఆగదు

క్రికెట్ నిబంధనల్లో ఎంసీసీ భారీ మార్పులు

లండన్: ఆధునిక క్రికెట్ అవసరాలకు అనుగుణంగా క్రికెట్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రతిష్టాత్మక మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) సిద్ధమైంది. క్రికెట్ నిబంధనల్లో ఏకంగా 73 మార్పులను ప్రతిపాదించింది. మారుతున్న కాలానికి తగ్గట్లు క్రికెట్లో మరింత ఉత్కంఠతను పెంచేందుకు.. పారదర్శకతను తీసుకొచ్చేందుకు ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది అక్టోబరు నుంచి సవరించిన నిబంధనలు అమల్లోకి వస్తాయి. కొత్త నిబంధనల ప్రకారం సుదీర్ఘ ఫార్మాట్ మ్యాచ్‌ల్లో ఆఖరి ఓవర్లో వికెట్ పడితే ఆ రోజు ఆటను నిలిపివేసే సంప్రదాయానికి ఎంసీసీ స్వస్తి పలికింది. ఇకమీదట వికెట్ పడినా మిగిలిన బంతుల్ని వేయాల్సిందే. చివర్లో వికెట్ పడినప్పుడు కొత్త బ్యాటర్ క్రీజులోకి రాకపోవడం వల్ల ఆటలో ఉత్కంఠ తగ్గుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎంసీసీ వివరించింది. మహిళలు, జూనియర్ క్రికెట్ కోసం బంతుల పరిమాణాలను ఎంసీసీ పునర్‌నిర్వచించింది. వీటిని సైజ్ 1, సైజ్ 2, సైజ్ 3గా నామకరణం చేసింది. పురుషుల క్రికెట్లో ఉపయోగించే సైజ్ 1 బంతిలో మార్పు లేనప్పటికీ.. మిగతా విభాగాల్లో నాణ్యతను పెంచేలా చర్యలు తీసుకుంది. ప్రపంచవ్యాప్తంగా బ్యాట్ల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఒకటి కంటే ఎక్కువ చెక్క ముక్కలను అతికించి చేసే 'ల్యామినేటెడ్ బ్యాట్ల' వాడకానికి అనుమతిచ్చింది. దీనివల్ల క్రికెటర్లపై ఆర్థిక భారం తగ్గుతుందని భావిస్తున్నారు. అయితే అంతర్జాతీయ స్థాయిలో మాత్రం సింగిల్ విల్లో బ్యాట్లే కొనసాగే అవకాశముంది. బౌలర్ రనప్ ప్రారంభించిన సమయంలో వికెట్ కీపర్ గ్లోవ్స్ స్టంప్స్ కంటే ముందు ఉన్నా ఇకమీదట జరిమానా విధించరు. కానీ బౌలర్ బంతిని వదిలిన తర్వాత కీపర్ పూర్తిగా స్టంప్స్ వెనుక ఉండాలనే నిబంధనను కొనసాగించింది. 'ఓవర్ త్రో' అనే పదానికి ఎంసీసీ తొలిసారిగా స్పష్టమైన నిర్వచనాన్ని ఇచ్చింది. ఇక బ్యాటర్లు 'షార్ట్ రన్' తీసినప్పుడు లేదా బ్యాటర్‌ను ఫీల్డర్ అడ్డుకున్నప్పుడు.. తర్వాతి బంతికి ఎవరు స్ట్రైకింగ్‌లో ఉండాలో నిర్ణయించే అధికారాన్ని ఫీల్డింగ్ కెప్టెన్‌కు అప్పగించింది. బంతి ఫీల్డర్ చేతిలోకి వచ్చినా లేదా మైదానంలో కదలకుండా ఉన్నా అది 'సెటిల్డ్' అయినట్లుగా పరిగణిస్తారు. దీనికోసం బౌలర్ లేదా కీపర్ చేతిలోనే బంతి ఉండక్కర్లేదని ఎంసీసీ స్పష్టంచేసింది.

దిల్లీ క్యాపిటల్స్ అదరహో! ఆల్‌రౌండ్ సత్తా చాటిన ఆ జట్టు.. పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. బ్యాటుతో లిజెలి, జెమీమా.. బంతితో షినెలి మెరవడంతో ఎలిమినేటర్‌లో గుజరాత్‌ను చిత్తు చేస్తూ వరుసగా నాలుగో డబ్ల్యూపీఎల్ సీజన్‌లో దిల్లీ ఫైనల్‌కు దూసుకెళ్లింది.

దిల్లీ.. ఫైనల్లో మళ్లీ

- వరుసగా నాలుగోసారి టైటిల్ పోరుకు అర్హత
- ఎలిమినేటర్‌లో గుజరాత్‌పై విజయం


జెమీమా 41

వడోదర: దిల్లీ మెరిసింది. మంగళవారం ఏకపక్షంగా సాగిన ఎలిమినేటర్‌లో 7 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. మొదట గుజరాత్ 7 వికెట్లకు 168 పరుగులు చేసింది. షినెలి హెన్రీ (3/35), నందని శర్మ (2/44), మిన్ను మణి (1/23) ఆ జట్టుకు కళ్లెం వేశారు. బెత్ మూనీ (62 నాటౌట్; 51 బంతుల్లో 6×4) టాప్ స్కోరర్. జార్జియా వేర్‌హామ్ (35; 25 బంతుల్లో 3×4, 1×6) రాణించింది. ఛేదనలో దిల్లీ చెలరేగిపోయింది. లిజెలి లీ (43; 24 బంతుల్లో 8×4, 1×6), కెప్టెన్ జెమీమా (41; 23 బంతుల్లో 4×4, 1×6) మెరవడంతో 15.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి అలవోకగా లక్ష్యాన్ని అందుకుంది. జెమీమాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. దిల్లీ గురువారం జరిగే ఫైనల్లో బెంగళూరును ఢీకొంటుంది. దిల్లీ డబ్ల్యూపీఎల్ తొలి మూడు సీజన్లలోనూ ఫైనల్ చేరినా.. కప్పు గెలవలేకపోయింది. ఈసారైనా విజేతగా నిలుస్తుందో లేదో చూడాలి.

దిల్లీ ధనాధన్: ఛేదనలో దిల్లీ బ్యాటర్లపై గుజరాత్ బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. బౌండరీల మోత మోగించిన ఓపెనర్లు లిజెలీ, షెఫాలి (31; 21 బంతుల్లో 7×4) స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. లిజెలి మూడు ఫోర్లు, షెఫాలి రెండు ఫోర్లు బాదడంతో ఓ ఓవర్లో రేణుక 21 పరుగులు సమర్పించుకుంది. దిల్లీ 7 ఓవర్లకే 89/0తో నిలిచింది. జార్జియా వేర్‌హామ్ వేసిన తర్వాతి ఓవర్లోనే ఓపెనర్లు ఇద్దరూ నిష్క్రమించినా.. వోల్వార్ట్ (32 నాటౌట్; 24 బంతుల్లో 2×4, 1×6), జెమీమా రెండో వికెట్‌కు 68 పరుగులు జోడించి, దిల్లీని విజయం వైపు నడిపించారు. చక్కని షాట్లతో అలరించిన జెమీమా 15వ ఓవర్లో ఔట్ కాగా.. మరిజేన్ (4 నాటౌట్)తో కలిసి వోల్వార్ట్ లాంఛనం పూర్తి చేసింది.

రాణించిన మూనీ: దిల్లీ బౌలర్లు అంతకుముందు గుజరాత్ జెయింట్స్‌కు కళ్లెం వేశారు. ఓపెనర్ బెత్ మూనీ నిలవడంతో జెయింట్స్ పోటీ ఇచ్చే స్కోరు చేయగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను బౌలర్లు ఒత్తిడికి గురిచేశారు. ఆరంభమే ఆ జట్టుకు పెద్ద షాక్. గుజరాత్ 9 ఓవర్లలో 60 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. ఓపెనర్ సోఫీ డివైన్ (6)ను ఔట్ చేయడం ద్వారా ఆ జట్టును రెండో ఓవర్లోనే షినెలి దెబ్బతీసింది.


హెన్రీ 3/35

జాగ్రత్తగా ఆడుతున్న మూనీకి తోడుగా అనుష్క శర్మ (16) నిలిచింది కానీ.. అది కాసేపే. ఆరో ఓవర్లో అనుష్క, ఆష్లీ గార్డ్‌నర్‌లను నందని వరుస బంతుల్లో ఔట్ చేసింది. 9వ ఓవర్లో కనికను మణి వెనక్కి పంపింది. అయితే మరో వైపు నుంచి క్రమం తప్పకుండా వికెట్లు పోతున్నా మూనీ పట్టుదలగా నిలిచింది. కానీ ధాటిగా ఆడలేదు. ఆమెకు ఎట్టకేలకు వేర్‌హామ్ రూపంలో సహకారం లభించింది. మూనీ యాంకర్ పాత్రను కొనసాగించగా.. కుదురుకున్నాక ఎదురుదాడికి దిగిన వేర్‌హామ్ మూడు ఫోర్లు, ఓ సిక్స్‌తో ఇన్నింగ్స్‌కు ఊపునిచ్చింది. కానీ గుజరాత్ ఇన్నింగ్స్ జోరందుకుంటున్న సమయంలో వేర్‌హామ్‌ను షినెలి ఔట్ చేయడంతో అయిదో వికెట్ భాగస్వామ్యానికి 61 పరుగుల వద్ద తెరపడింది. 17వ ఓవర్లో వేర్‌హామ్ వెనుదిరిగే సమయానికి గుజరాత్ స్కోరు 120. వెంటనే పుల్మాలి కూడా ఔటైనా.. కష్వీ గౌతమ్ (18)తో కలిసి మూనీ మరో విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. జట్టు స్కోరు 160 దాటించింది. ఏడో వికెట్‌కు మూనీతో కలిసి 39 పరుగులు జోడించిన కష్వీ.. ఆఖరి ఓవర్లో నిష్క్రమించింది. మూనీ, కష్వీ బ్యాట్లు ఝుళిపించడంతో ఆఖరి రెండు ఓవర్లలో గుజరాత్‌కు 61 పరుగులొచ్చాయి.

గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్: మూనీ నాటౌట్ 62; సోఫీ డివైన్ (సి) లిజెలి లీ (బి) షినెలి 6; అనుష్క శర్మ (సి) షినెలి (బి) నందని 16; గార్డ్‌నర్ (సి) స్నేహ్ (బి) నందని 0; కనిక (స్టంప్డ్) లిజెలి (బి) మిన్ను మణి 6; వేర్‌హామ్ (సి) వోల్వార్ట్ (బి) షినెలి 35; భార్తీ పుల్మాలి (సి) అండ్ (బి) షినెలి 0; కష్వీ రనౌట్ 18; తనూజ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 25 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **168**
వికెట్ల పతనం: 1-9, 2-38, 3-38, 4-59, 5-120, 6-125, 7-164; **బౌలింగ్:** మరిజేన్ కాప్ 4-0-32-0; షినెలి హెన్రీ 4-0-35-3; నందని శర్మ 4-0-44-2; మిన్ను మణి 4-0-23-1; స్నేహ్ రాణా 1-0-3-0; శ్రీచరణి 3-0-25-0.
దిల్లీ ఇన్నింగ్స్: లిజెలి లీ ఎల్బీ (బి) వేర్‌హామ్ 43; షెఫాలి వర్మ (బి) వేర్‌హామ్ 31; లారా వోల్వార్ట్ నాటౌట్ 32; జెమీమా (సి) సోఫీ డివైన్ (బి) రాజేశ్వరి 41; మరిజేన్ కాప్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 18 **మొత్తం:** (15.4 ఓవర్లలో 3 వికెట్లకు) **169; వికెట్ల పతనం:** 1-89, 2-92, 3-160; **బౌలింగ్:** రేణుక సింగ్ 2-0-27-0; కష్వీ గౌతమ్ 2-0-17-0; రాజేశ్వరి గైక్వాడ్ 3-0-33-1; సోఫీ డివైన్ 3-0-35-0; జార్జియా వేర్‌హామ్ 3.4-0-28-2

అఫ్గాన్‌తో భారత్ ఢీ

అండర్-19 ప్రపంచకప్ సెమీఫైనల్ నేడు

మధ్యాహ్నం 1 నుంచి


ఆయుష్ మాత్రే

హరారె: అండర్-19 ప్రపంచకప్‌లో అజేయ భారత్.. కీలక సమరానికి సిద్ధమైంది. వరుస విజయాలతో జోరుమీదున్న ఆయుష్ మాత్రే బృందం.. బుధవారం జరిగే సెమీఫైనల్లో అఫ్గానిస్థాన్‌ను ఢీకొంటుంది. అయిదుసార్లు టైటిల్ గెలిచి ఈ టోర్నీలో అత్యంత విజయవంతమైన జట్టుగా ఉన్న భారత్.. ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఆయుష్ సేనను అడ్డుకోవడం అఫ్గాన్‌కు చాలా కష్టమైన పనే. టోర్నీలో ఆడిన అయిదు మ్యాచ్‌ల్లోనూ భారత్ పెద్దగా ఇబ్బంది పడకుండానే గెలిచింది. గత మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 58 పరుగుల తేడాతో ఓడించిన ఆ జట్టు.. రెట్టించిన ఉత్సాహంతో ఉంది. వికెట్‌కీపర్ బ్యాటర్ అభిజ్ఞాన్ కుండు సూపర్ ఫామ్‌లో ఉండడం జట్టుకు గొప్ప సానుకూలంశం. అతడు ఈ టోర్నీలో ఇప్పటివరకు 5 మ్యాచ్‌ల్లో 199 పరుగులు చేశాడు. ఇందులో రెండు అర్ధశతకాలు ఉన్నాయి. హిట్టర్ వైభవ్ సూర్యవంశీ (5 మ్యాచ్‌ల్లో 196) కూడా మంచి ఫామ్‌లోనే ఉన్నాడు. కానీ అతడు అర్ధశతకాలను శతకాలుగా మలచాలని జట్టు మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. విహాన్ మల్హోత్రా (5 మ్యాచ్‌ల్లో 172) కూడా భారత్‌కు కీలకమే. ఈ టోర్నీలో ఇప్పటివరకు సెంచరీ కొట్టిన ఏకైక భారత బ్యాటర్ (జింబాబ్వేపై 109 నాటౌట్) అతడే. కెప్టెన్ ఆయుష్ మాత్రే పరుగుల బాట పట్టాల్సిన అవసరముంది. ఇప్పటివరకు అతడు ఆశించినంతగా రాణించలేకపోయాడు. బంతితో మెరుగైన ప్రదర్శనే (6 వికెట్లు) చేసినప్పటికీ బ్యాటుతో నిరాశపరిచాడు. 5 మ్యాచ్‌ల్లో 99 పరుగులే చేశాడు. కీలకమైన సెమీస్‌లో అయినా అతడు పుంజుకుంటాడో లేదో చూడాలి. మరోవైపు ఓపెనర్ ఆరోన్ జార్జ్ (46) ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. ఇక బంతితో ఫాస్ట్ బౌలర్లు హెనిల్ పటేల్, అంబ్రిష్ రాణిస్తుండడం భారత్‌కు సంతోషాన్నిస్తోంది. హెనిల్ 11, అంబ్రిష్ 8 వికెట్లు పడగొట్టారు. వీళ్లిద్దరు ఎడమచేతి వాటం స్పిన్నర్ ఖిలాన్ పటేల్ నుంచి సహకారాన్ని ఆశిస్తున్నారు. అతడు కూడా ఇప్పటి వరకు ఆకట్టుకున్నాడు. అయిదు మ్యాచ్‌ల్లో ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. మాత్రే, మల్హోత్రాలు కూడా బంతితో తమ వంతు పాత్రను పోషించాల్సివుంది. మహబూబ్ ఖాన్ నేతృత్వంలోని అఫ్గానిస్థాన్ జట్టులో మియాఖిల్, అహ్మద్‌జాయ్, అమిరి, వహిదుల్లా లాంటి ప్రతిభావంతులున్నారు. పెద్ద జట్లను వెనక్కి నెట్టి సెమీస్ చేరిన అఫ్గాన్‌ను తేలికగా తీసుకుంటే ప్రమాదమే.

ఆసియా కప్‌నకు స్నేహిత్


స్నేహిత్

ఈనాడు, హైదరాబాద్: ఐటీటీఎఫ్- ఏటీటీయూ ఆసియా కప్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్ కుర్రాడు ఫిడెల్ ఆర్.స్నేహిత్ బరిలో దిగనున్నాడు. బుధవారం నుంచి ఈనెల 8 వరకు చైనాలో జరిగే ఈ టోర్నీలో పాల్గొనే భారత జట్టుకు స్నేహిత్ ఎంపికయ్యాడు. గ్రూపు దశలో సింగిల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ లిన్ షిడాన్ (చైనా), గువాన్ హాంగ్ (తైవాన్), షలేబి (సౌదీ అరేబియా)లతో స్నేహిత్ తలపడనున్నాడు. ప్రతి గ్రూపు నుంచి ఇద్దరు అత్యుత్తమ ఆటగాళ్లు 16 మంది పాల్గొనే మెయిన్ డ్రాకు అర్హత సాధిస్తారు.

పీసీబీపై కోర్టుకు జియోస్టార్!

International Cricket Council

PCB Pakistan Cricket Board

కరాచి: ఈ నెల 15న భారత్‌తో టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌ను బహిష్కరించినందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)పై న్యాయపరమైన చర్యలు తప్పవని ఐసీసీ హెచ్చరించింది. పీసీబీకి వ్యతిరేకంగా ప్రపంచకప్ ప్రసారదారు జియోస్టార్ న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశముందని పేర్కొంది. వార్షిక ఆదాయంలో వాటాగా పీసీబీకి చెల్లించాల్సిన రూ.315 కోట్లనూ నిలిపివేసి, అందులోంచి ప్రసారదారుకు ఐసీసీ పరిహారం చెల్లించనుందని సమాచారం. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలన్న తన నిర్ణయాన్ని పీసీబీ.. ఐసీసీకి ఇంకా లిఖితపూర్వకంగా తెలపలేదు. "ఐసీసీ ఈవెంట్ల కోసం నాలుగేళ్ల కింద ప్రసారదారుతో ఐసీసీ చేసుకున్న ఒప్పందంలో భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌లు కూడా ఉన్నాయి. దాని ఆధారంగానే ఐసీసీకి ప్రసారదారు చెల్లింపులు చేసింది. కాబట్టి పీసీబీ, ఐసీసీలపై కోర్టుకెళ్లే అధికారం ప్రసారదారుకు ఉంది" అని ఓ పీసీబీ అధికారి చెప్పాడు. మరోవైపు భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలన్న తన నిర్ణయాన్ని పీసీబీ వెనక్కి తీసుకునే అవకాశముందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మూడో ర్యాంకుకు రిబకినా


ఎలెనా రిబకినా

మెల్‌బోర్న్: డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో టెన్నిస్ స్టార్ అరియానా సబలెంక (బెలారస్) నంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. మంగళవారం ప్రకటించిన మహిళల సింగిల్స్ జాబితాలో సబలెంక అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో సబలెంకపై నెగ్గిన ఎలెనా రిబకినా (కజకిస్థాన్) రెండు స్థానాలు మెరుగై మూడో ర్యాంకు సాధించింది. స్వైటెక్ (పోలెండ్) రెండో స్థానంలో నిలిచింది. ఏటీపీ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్) నంబర్‌వన్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు. రన్నరప్ జొకోవిచ్ (సెర్బియా) ఒక స్థానం మెరుగై మూడో ర్యాంకు సాధించాడు. సినర్ (ఇటలీ) రెండో స్థానంలో నిలిచాడు.

ఆసియా షూటింగ్ క్వాలిఫయర్ ఇక్కడే

దిల్లీ: వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఆసియా షూటింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. రైఫిల్, పిస్టల్ ఈవెంట్లలో జరిగే ఈ టోర్నీలో ఎనిమిది ఒలింపిక్ బెర్తులు అందుబాటులో ఉంటాయి. వచ్చే ఏడాది ఏప్రిల్‌లోనే షూటింగ్ ప్రపంచకప్‌నకు కూడా భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ ఈవెంట్లలో జరిగే ఈ కప్‌లో 12 ఒలింపిక్ బెర్తులు ఉన్నాయి. షూటింగ్‌లో రెండు ఒలింపిక్ కోటా టోర్నీలకు ఆతిథ్యం ఇవ్వడం భారత్‌కు ఇదే తొలిసారి. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ షూటింగ్‌లో రికార్డు స్థాయిలో 22 కోటా స్థానాలు సాధించింది. 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో 24 కోటా స్థానాలు సాధించాలనే లక్ష్యంతో ఉంది.

భారత్‌లో సురక్షితంగా ఉంచుతారు


మిచెల్ మార్ష్

లాహోర్: టీ20 ప్రపంచకప్‌ను గెలవడంపైనే తాము పూర్తిగా దృష్టిసారిస్తున్నట్లు ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ అన్నాడు. భారత్‌తో మ్యాచ్‌ను పాకిస్థాన్ బహిష్కరించడం.. బంగ్లాదేశ్‌ను టోర్నీ నుంచి తొలగించడంపై వ్యాఖ్యానించేందుకు మార్ష్ నిరాకరించాడు. పాక్ చేతిలో 0-3తో టీ20 సిరీస్‌ను కోల్పోయిన అనంతరం ఆ దేశ మీడియాతో మార్ష్ మాట్లాడాడు. "ఈ సమయంలో నేనెలాంటి వ్యాఖ్యలు చేయలేను. మేం చేయాలనుకున్న దానిపైనే దృష్టిసారిస్తూ ప్రపంచకప్‌నకు వెళ్తున్నాం. మిగతా విషయాలు వాటంతట అవే సర్దుకుంటాయి. ప్రపంచకప్ గెలవడంపైనే మా దృష్టంతా. అక్కడున్న వాళ్లు మమ్మల్ని సురక్షితంగా ఉంచుతారని ఆస్ట్రేలియా జట్టుగా నమ్ముతున్నాం. నేను చెప్పేది ఇంతే" అని మార్ష్ తెలిపాడు.

కుట్ర కనిపిస్తున్నా.. బాధ్యుల్ని నిందితులుగా ఎందుకు చేర్చలేదు?



సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. చిత్రంలో మంత్రి అచ్చెన్నాయుడు, సీఎస్ విజయానంద్

- నిబంధనలు సవరించారు.. అది ఉద్దేశపూర్వక నేరమే
- వైకాపా చేసింది మహాపాపం.. పాతకం చేసిన వారికి శిక్ష పడాల్సిందే
- అయోధ్య రామాలయానికీ కల్తీ నెయ్యితో చేసిన లడ్డూలు పంపారు
- కల్తీ నెయ్యిపై మంత్రివర్గంలో మూడున్నర గంటలపాటు విస్తృత చర్చ
- కమిటీ ఏర్పాటుకు తీర్మానం.. నివేదిక ఆధారంగా చర్యలు

> ‘తిరుమలలో శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా అనేది పొరపాటు, నిర్లక్ష్యమూ కాదు.. అంతా ప్రణాళిక ప్రకారమే జరిగింది’
> – మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా అవుతోందన్న నివేదికనే పక్కన పడేశారంటే కుట్ర జరిగినట్లే కదా? అందుకు బాధ్యులను సిట్ తన ఛార్జిషీట్‌లో నిందితులుగా ఎందుకు చేర్చలేదని రాష్ట్ర మంత్రివర్గం అభిప్రాయపడింది. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో తితిదేలో లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా, సిట్ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అందిన 11 పేజీల నివేదికపై విస్తృతంగా చర్చించారు. రసాయనాలతో రూపొందించిన నెయ్యిని వినియోగించి లడ్డూ ప్రసాదం తయారు చేయడం, కోట్లమంది భక్తుల మనోభావాలు దెబ్బతీయడాన్ని తీవ్రంగా పరిగణించిన మంత్రివర్గం.. ఎజెండాను కూడా పక్కనపెట్టి దీనిపైనే 3.30 గంటల పాటు ప్రత్యేకంగా చర్చించింది. అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాసరావును సమావేశానికి పిలిపించిన మంత్రివర్గం.. సిట్ నివేదిక, తీసుకోవాల్సిన చర్యలపై న్యాయసలహాలు తీసుకుంది. సుదీర్ఘంగా చర్చించిన తర్వాత. . కల్తీ నెయ్యి వ్యవహారంపై కమిటీ ఏర్పాటు చేయాలని తీర్మానించింది. కమిటీ నివేదిక ఇచ్చాక. .. సిట్ ఛార్జిషీట్‌లో లోపాలపై ప్రత్యేకంగా కోర్టులో కేసు వేయడమా? తితిదే ద్వారా ఫిర్యాదు చేయించడమా? అనే అంశాల్ని పరిశీలించనుంది. ‘కల్తీ నెయ్యి సరఫరాలో ప్రతి ఘటనా వైకాపా పాలకుల క్రిమినల్ చర్యల్ని నిర్ధారిస్తోంది. వైకాపా చేసింది మహాపాపం.. ఇంతటి పాతకం చేసిన వాళ్లకు శిక్ష పడాల్సిందే’ అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

వైకాపా హయాంలో ఒకసారే పరీక్ష.. కూటమి ప్రభుత్వం వచ్చాక 10సార్లు

‘వైకాపా హయాంలో ఎన్నిసార్లు పరీక్షలకు పంపారు.. కూటమి ప్రభుత్వంలో ఎన్నిసార్లు పరీక్షలు చేయించారు?’ అని అధికారుల్ని మంత్రులు ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వంలో ఒకసారే పరీక్షకు పంపారని, కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే 10సార్లకు పైగా పరీక్షలు చేయించారని అధికారులు జవాబిచ్చారు.

సింఘాల్ పట్టించుకోకపోవడం ఏమిటన్న మంత్రులు

రెండు కంపెనీల కోసం టెండరు నిబంధనలు మార్చేసి కల్తీ నెయ్యి సరఫరాకు నాటి తితిదే పెద్దలు సహకరించారని, అయినా అప్పుడు ఈఓగా ఉన్న సింఘాల్ పట్టించుకోకపోవడమేంటని మంత్రులు ప్రశ్నించారు. సిట్ తమ ఛార్జిషీట్‌లో చాలా అంశాల్లో లోపాల్ని గుర్తించడానికే పరిమితమైందని పలువురు మంత్రులు ప్రస్తావించారు. దీనికి కారకులైన పెద్దల్ని నిందితులుగా చేర్చలేదని పేర్కొన్నారు.

ప్రత్యేక ఆహ్వానితుల హోదాలో కరుణాకర్‌రెడ్డి.. మొత్తం నడిపించారు

లడ్డూ తయారీకి ఉపయోగించేది నెయ్యి కాదని తెలిసినా.. ఐదేళ్లు దాచిపెట్టారని మంత్రివర్గ సభ్యులు పేర్కొన్నారు. అయోధ్యలో రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికీ తితిదే నుంచి కల్తీ నెయ్యితో చేసిన లడ్డూల్ని పంపి అపచారం చేశారని చెప్పారు. ‘అర్హత లేని సంస్థలకు టెండర్లు కట్టబెట్టారు. అన్నీ నకిలీ ధ్రువపత్రాలే. నందిని లాంటి సహకార సంస్థలను పక్కన పెట్టారు. కొనుగోలు కమిటీ సభ్యుడు కాకున్నా ప్రత్యేక ఆహ్వానితుడి హోదాలో భూమన కరుణాకర్‌రెడ్డి వచ్చారు. మొత్తం వారే నడిపించారు. అసలు సభ్యులను పిలవలేదు. అక్కడే కుట్ర కోణం దాగి ఉంది’ అని అభిప్రాయపడ్డారు.

పవన్‌కల్యాణ్, లోకేశ్, సత్యకుమార్‌తో ప్రత్యేకంగా సమావేశమైన చంద్రబాబు

మంత్రివర్గ సమావేశానికి ముందు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా మంత్రి సత్యకుమార్‌తో చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సిట్ నివేదిక, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ‘వైకాపా హయాంలో జరిగిన నెయ్యి కల్తీ వ్యవహారాన్ని రాజకీయకోణంలో చూడట్లేదు. భక్తుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతీశారని బాధతోనే దీనిపై స్పందించాం’ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిటీ ఏర్పాటుచేయాలనే ఆలోచన వచ్చింది. మీరు ఏ నిర్ణయం తీసుకున్నా పూర్తి మద్దతు ఉంటుందని పవన్ కల్యాణ్, సత్యకుమార్ అన్నట్లు సమాచారం.

అసెంబ్లీ సమావేశాల్లోనూ

11వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉంటాయని, సభావేదికగా కూడా ఈ కల్తీ వ్యవహారాన్ని ప్రజల దృష్టికి తీసుకువెళ్లాలని మంత్రులకు సీఎం సూచించారు. ‘సిట్ తన విచారణలో నెయ్యి కల్తీ జరిగినట్లు చెబుతున్నా.. దాన్ని వైకాపా వాళ్లు తప్పుదారి పట్టించి, ఎదురు దాడి చేస్తున్నారు. రెగ్యులేటరీ.. శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్నారు. దానితో నెయ్యిలో కొవ్వు కలిసిందనే విషయాన్ని మరుగున పడేలా చేయాలనేది వారి కుట్ర. ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదికలోనూ నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్లు స్పష్టంగా ఉంది. ఆ విషయాన్ని సిట్ తన అభియోగపత్రంలోనూ తెలిపింది. అయినా వైకాపా వాళ్లు ఎదురుదాడి చేస్తూనే ఉన్నారు. వాస్తవాలను రికార్డులతో సహా మనం చెప్పాలి’ అని చంద్రబాబు చెప్పారు. సిట్ ఛార్జిషీట్‌పై సుప్రీంకోర్టు ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలని ఆయన అన్నారు.

సుబ్బారెడ్డి పాత్ర, జంతుకొవ్వుపై పవన్ ప్రశ్నలు

కల్తీ నెయ్యి సరఫరా విషయం అప్పటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి తెలిసినా ఎందుకు పట్టించుకోలేదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ‘సుబ్బారెడ్డి పాత్రపై సిట్ నివేదికలో పేర్కొన్నారా? 2022లో సీఎఫ్‌టీఆర్‌ఐ నివేదిక ఇచ్చినప్పుడు ఈవోగా ఎవరున్నారు? జంతు కొవ్వుపై ధార్మికంగా ప్రమాదం ఉంది కదా?’ అని ప్రశ్నించారు. చర్చలో భాగంగా పలు సందర్భాల్లో ఆయన జోక్యం చేసుకున్నారు. 69 లక్షల కిలోల నెయ్యి తయారుచేసిన బోలేబాబా డెయిరీలో ఉద్యోగులు పదిమందేనన్న విషయం వాస్తవమేనా? అని ప్రశ్నించారు.. ‘సీసాల్లో, సహాయకులతో కలిపి ఆ కంపెనీలో 10మంది ఉన్నారని మంత్రి కేశవ్ చెప్పారు. జంతుకొవ్వు కలిసిందని స్పష్టమైంది ఛార్జిషీట్ 35వ పేజీలో ఉందని మంత్రులు పవన్ కల్యాణ్‌కు వివరించారు. ‘లడ్డూ తయారీకి సరఫరా చేసిన నెయ్యిలో నెయ్యే లేదని సిట్ స్పష్టంగా చెప్పింది. కిలోకు రూ.25 చొప్పున అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న కంపెనీల నుంచి వసూళ్లు చేశారని తేలింది’ అని ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

దిల్లీ చేరుకున్న మంత్రి లోకేశ్



తెదేపా ఎంపీలతో మంగళవారం దిల్లీలో సమావేశమైన మంత్రి నారా లోకేశ్

ఈనాడు, దిల్లీ: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ మంగళవారం సాయంత్రం దిల్లీ చేరుకున్నారు. బుధవారం ఉదయం ఆయన పార్లమెంటులో పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నట్లు సమాచారం. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో పలు ప్రకటనలు చేసిన నేపథ్యంలో అందులో రాష్ట్రానికి ప్రయోజనం చేకూర్చే అంశాల గురించి ఆయన కేంద్ర మంత్రులతో చర్చించనున్నట్లు తెలిసింది. మంగళవారం సాయంత్రం దిల్లీ చేరుకున్న వెంటనే ఆయన పార్టీ ఎంపీలు, కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. బడ్జెట్‌పై ప్రజాస్పందన, వివిధ వర్గాల నుంచి వ్యక్తమవుతున్న అభిప్రాయాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అలాగే వర్తమాన రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. బుధవారం రాత్రి లోకేశ్ తిరిగి విజయవాడ వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

పశువుల కొవ్వుతో నూనె తయారీ

విజిలెన్స్ దాడులతో ఏలూరులో బహిర్గతం



స్వాధీనం చేసుకున్న నూనె డబ్బాలు

ఈనాడు, ఏలూరు: పశువుల కొవ్వుతో నూనె తయారు చేస్తున్న స్థావరాలపై ఏలూరు విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. తంగెళ్లమూడి, ఆదివారపుపేట, లంకపేటలో గేదెలు, ఆవులు, ఇతర జంతువుల కొవ్వు నుంచి నూనె తయారుచేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్పీ నాగేశ్వరరావు ఆదేశాలతో సీఐలు గంగాభవాని, ప్రసాద్‌కుమార్‌లు సిబ్బందితో తంగెళ్లమూడి పరిసరాల్లో దాడులు చేశారు. రెండు ఇళ్లల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న 390 లీటర్ల నూనెను గుర్తించారు. తయారీదారులు బయ్యారపు జయన్న, షేక్ షౌకత్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ నూనెను కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన నజరత్‌కు విక్రయిస్తుంటామని షౌకత్ తెలిపారని విజిలెన్స్ అధికారులు వివరించారు. నూనె నమూనాలను ప్రయోగశాలకు పంపారు.

డేంజర్ సిగ్నల్ దాటిన చెన్నై ఎక్స్‌ప్రెస్

అంతర్గతంగా రహస్య విచారణ

బిట్రగుంట, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని చర్లపల్లి నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లే 12604 సూపర్‌ఫాస్ట్ రైలుకు మంగళవారం పెను ప్రమాదం తప్పింది. తెల్లవారుజామున 2.58 గంటల ప్రాంతంలో ఈ రైలుకు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బిట్రగుంట స్టేషన్‌లో డేంజర్ సిగ్నల్ పడినా ఆగలేదు. సుమారు అర కి.మీ. ముందుకు వెళ్లి నిలిచిందని, అదే వేగంతో వెళ్లి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని తెలుస్తోంది. దీంతో అధికారులు స్టేషన్ నుంచి ఘటనా స్థలానికి వెళ్లి రైలులోని లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లను దింపేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి రైలుకు అనుమతిచ్చారు. డివిజన్ స్థాయి అధికారులు, వైద్యాధికారులు సిబ్బందిని రహస్యంగా విచారిస్తున్నారు.

అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల లక్షణాలు



అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల్లో సాధారణంగా కనిపించే లక్షణాలు..
✦ చురుగ్గా ఉండటం ✦ ఫలితాన్ని ముందే ఊహించి పనిని మొదలుపెట్టడం ✦ ముఖ్యమైన విషయాలకు తొలిప్రాధాన్యం ఇవ్వడం ✦ విజయంపైనే దృష్టి పెట్టడం ✦ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం ✦ సమష్టిగా పనిచేయడం ✦ వ్యక్తిగత సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తుండటం.. వీటిని అలవర్చుకునేందుకు ఎవరు ప్రయత్నిస్తే వారి జీవితాల్లో అద్భుతాలు ఆవిష్కృతమవుతాయి.
– వాలా అఫ్సర్, కాలమిస్టు

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు
కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్టులు కోళ్ల రైతులకే

- ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ
- లంబసింగిలో కుంకుమపువ్వు సాగుకు అనుమతులు
- మామిడి ప్రాసెసింగ్ యూనిట్ల సమస్యలు పరిష్కరిస్తాం
- వ్యవసాయ అనుబంధ రంగాల సమీక్షలో సీఎం చంద్రబాబు



వ్యవసాయం, అనుబంధ శాఖల సమీక్షలో ‘డీజీ రైతు బజార్ యాప్’ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టులను కోళ్ల రైతులకే ఇవ్వాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కోళ్ల రంగాన్ని బలోపేతం చేసే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సిటీ ఏర్పాటు చేయాలని, అందులో సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సహా అన్నిటికి చోటు కల్పించాలని సూచించారు. లంబసింగిలో గిరిజనుల భాగస్వామ్యంతో కుంకుమ పువ్వు సాగుకు ముందుకొచ్చే సంస్థలకు అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. త్వరలోనే మామిడి ప్రాసెసింగ్ పరిశ్రమల యజమానులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. మంగళవారం సాయంత్రం ఆయన సచివాలయంలో వ్యవసాయ అనుబంధశాఖలపై సమీక్షించారు. ‘ఆంధ్రప్రదేశ్‌ను అతిపెద్ద ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చే కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుట్టాలి. ప్రస్తుతం రాష్ట్రంలో 18 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చారు. దీన్ని 2030-31 నాటికి 40 లక్షల మంది రైతులు, 50 లక్షల ఎకరాలకు విస్తరించాలి’ అని చెప్పారు. ‘ప్రకృతి ఉత్పత్తుల సాగు నాణ్యత తెలిసేలా సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ సౌకర్యాలను జూన్ నాటికి కల్పించాలి. ప్రకృతి వ్యవసాయంపై సుభాష్ పాలేకర్‌తో రాష్ట్రమంతా శిక్షణ తరగతులు నిర్వహించాలి’ అని సూచించారు.

విజయవాడలో పీపీపీ విధానంలో పూల మార్కెట్..

విజయవాడలో పీపీపీ విధానంలో పూల మార్కెట్ నిర్మాణానికి చంద్రబాబు ఆమోదం తెలిపారు. డిజి రైతు బజార్ యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. వ్యవసాయ యంత్ర పరికరాలకు సంబంధించి ఏపీ ఏఐఎంఎస్ యాప్, కిసాన్ డ్రోన్ యాప్‌లను ప్రారంభించారు. ఇందులో 9,512 యంత్రాలు ఉన్నాయని, రైతులు తమకు అవసరమైనవి వీటిద్వారా బుక్‌చేసి తీసుకోవచ్చన్నారు.

అమెరికా, ఈయూతో వాణిజ్య ఒప్పందాలతో రైతులకు అవకాశాలు

అమెరికా, యూరోపియన్ దేశాలతో వాణిజ్య ఒప్పందాల వల్ల రాష్ట్రం నుంచి రొయ్యలు, ఎండు మిర్చి, మామిడి, వరి, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులు పెంచుకునేందుకు అవకాశం కలిగిందని, అయితే నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని చంద్రబాబు చెప్పారు. ఎంవోయూ కుదుర్చుకున్న ఆహారశుద్ధి సంస్థలు త్వరితగతిన యూనిట్లు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. ‘మామిడి, కోకో, జీడి, కొబ్బరి తోటల్లో అంతర పంటల సాగుకు అవకాశాలున్నాయి. రైతుల్ని ఆ దిశగా ప్రోత్సహించాలి. అరటి ఎగుమతుల్లో వెనకబడ్డాం. దానిపై దృష్టి పెట్టాలి’ అని ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి కేంద్ర విధానాలకు అనుగుణంగా రాష్ట్ర పాలసీలు ఉండాలని సూచించారు.

పంటల వారీ పండగలు

‘కుప్పంలో పూల పండగ నిర్వహించిన విధంగానే. . రాష్ట్రంలో సాగయ్యే పంటలకు సంబంధించి వివిధ ప్రాంతాల్లో పండగలు నిర్వహించాలి. పర్యాటక రంగ అభివృద్ధికి ఇది దోహదపడుతుంది. లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ పెరుగుతుంది. అవసరమైతే కేంద్రంతో మాట్లాడి వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ప్రత్యేక రైలు బోగీలు ఏర్పాటు చేసేలా చూడాలి. కవర్లతో మామిడికి నాణ్యత, మంచి ధర వచ్చింది. జామ, దానిమ్మ తదితర పండ్ల తోటలకూ దీన్ని అమలు చేయాలి’ అని పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై జనసేన కమిటీ సుదీర్ఘ విచారణ

- 40 మంది కార్యకర్తల నుంచి వివరాల సేకరణ
- రైల్వేకోడూరులో ఏడుగంటల పాటు ఉత్కంఠ





ఎమ్మెల్యేని విచారించడానికి వచ్చిన త్రిసభ్య కమిటీ సభ్యులు రమాదేవి, శివశంకర్, వరుణ్ ◆ కమిటీ ముందు హాజరవడానికి వచ్చిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఈనాడు డిజిటల్, తిరుపతి; రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: లైంగిక దాడి, మోసం ఆరోపణల నేపథ్యంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను జనసేన త్రిసభ్య కమిటీ మంగళవారం సుదీర్ఘంగా విచారించింది. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు కోడూరుకు వచ్చిన కమిటీ సభ్యులు రమాదేవి, శివశంకర్, వరుణ్.. నేరుగా స్థానిక రాజ్ రెసిడెన్సీలో ఎమ్మెల్యేతో భేటీ అయ్యారు. మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 7 గంటల వరకు విచారణ కొనసాగింది. బాధితురాలు చేసిన ఆరోపణలు, వాట్సప్ చాటింగ్ వ్యవహారం, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులపై అరవ శ్రీధర్‌ను కమిటీ సభ్యులు ప్రశ్నించారు. ఎమ్మెల్యే తన వాదనను కమిటీ ముందు సవివరంగా వినిపించారు. ఎమ్మెల్యేనే కాకుండా పార్టీలో క్రియాశీలకంగా ఉన్న సుమారు 40 మంది ఎంపిక చేసిన నాయకులు, కార్యకర్తలను కూడా కమిటీ పిలిపించి విచారించింది. ఎమ్మెల్యే ప్రవర్తన, తాజా పరిణామాలపై వారి నుంచి సమాచారం సేకరించింది. సాయంత్రం మరోసారి ఎమ్మెల్యేని పిలిపించి మాట్లాడారు. విచారణలో వెల్లడైన అంశాలతో సమగ్ర నివేదికను పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు అందజేస్తామని సభ్యులు తెలిపారు. మరికొంత సమాచారం రాబట్టేందుకు కమిటీ బుధవారం ఇక్కడే ఉండే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

అధినేత నిర్ణయానికి కట్టుబడి ఉంటా: ఎమ్మెల్యే శ్రీధర్

విచారణ అనంతరం బయటకు వచ్చిన ఎమ్మెల్యే శ్రీధర్ మీడియాతో మాట్లాడారు. ‘నాపై వచ్చిన ఆరోపణలకు, అసెంబ్లీ సమయంలో జరిగిన వాట్సప్ చాటింగ్‌పై కమిటీకి పూర్తి వివరణ ఇచ్చా. పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటా. నమోదైన కేసులను చట్టపరంగానే ఎదుర్కొంటా’ అని ఆయన స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు

ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. ఆయనపై బీఎన్ఎస్ 318(2), 318(4), 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

‘వాటీజ్ దిస్ యార్’...ఏంటి?



- ఎలాపడితే అలా మాట్లాడటానికి వీల్లేదు
- కాంగ్రెస్ సభ్యులపై ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ ఆగ్రహం

ఈనాడు, దిల్లీ: లోక్‌సభలో సభాధ్యక్ష స్థానాన్ని ఉద్దేశించి సభ్యులు ఎలాపడితే అలా సంబోధించడానికి వీల్లేదని బాపట్ల తెదేపా ఎంపీ, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ కాంగ్రెస్ సభ్యులకు స్పష్టం చేశారు. మంగళవారం మధ్యాహ్నం ప్యానల్ స్పీకర్ హోదాలో లోక్‌సభ కార్యకలాపాల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఆయన.. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడేందుకు ప్రతిపక్షనాయకుడు రాహుల్‌గాంధీకి అవకాశం ఇచ్చారు. దాంతో రాహుల్ లేచి రాష్ట్రపతి ప్రసంగంలోని జాతీయభద్రత అంశం గురించి ప్రస్తావిస్తూ చైనా, పాకిస్థాన్‌లతో భారత్‌కు ఉన్న సంబంధాలపై ఒక ఆర్టికల్‌లో పేర్కొన్న అంశాలపై మాట్లాడేందుకు ప్రయత్నించారు. అందుకు భాజపా సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేయడంతో... తెన్నేటి కృష్ణప్రసాద్ జోక్యంచేసుకుంటూ కేవలం రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడటానికి మాత్రమే పరిమితం కావాలని సూచించారు. తర్వాత పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజూ మాట్లాడుతూ సోమవారం ప్రస్తావించిన అంశాన్ని మళ్లీ మరోసారి ఇక్కడ ప్రస్తావించడానికి వీల్లేదన్నారు. అది వదిలిపెట్టి మిగతా అంశాలపై ప్రసంగించాలని కోరారు. అందుకు కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ స్పందించేందుకు ప్రయత్నించగా ప్యానల్ స్పీకర్ అంగీకరించలేదు. రాహుల్‌గాంధీ ఇప్పటికే ప్రసంగం ప్రారంభించినందున ఆయన్ను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని సూచించారు. ఆ సమయంలో వెనక ఉన్న ఓ కాంగ్రెస్ సభ్యుడు వాటీజ్ దిస్ యార్ అని వ్యాఖ్యానించడంతో ప్యానల్ స్పీకర్ తెన్నేటి ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘వాటీజ్ దిస్ యార్ ఏంటి? ఇది పార్లమెంటు..లోక్‌సభ అధ్యక్ష స్థానాన్ని ఎలాపడితే అలా సంబోధించడానికి వీల్లేదు. సభాధ్యక్షుడిని యార్ అని సంబోధించకూడదు. ముందు ఆ పదాన్ని వెనక్కి తీసుకోండి’ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పుడు కొందరు సభ్యులు యార్ అంటే ఏమవుతుంది? అది ఏమైనా అపశబ్దమా అని ప్రశ్నించారు. దానికి తెన్నేటి విభేదిస్తూ.. సభా మర్యాదలు, సభాధ్యక్ష స్థానానికి గౌరవం ఉంటాయని, పాటించాలని సూచించారు. ఆ తర్వాత కూడా కాంగ్రెస్ సభ్యులు ఆందోళన కొనసాగించడంతో ఆయన రాహుల్‌గాంధీ ప్రసంగ సమయాన్ని ఆపేసి ఇతర పార్టీ సభ్యులకు అవకాశం కల్పించారు. అయితే వారెవరూ మాట్లాడటానికి సుముఖత చూపలేదు. దీంతో తెదేపాకు అవకాశం కల్పించడంతో ఆ పార్టీ తరఫున అమలాపురం ఎంపీ హరీష్ మాథుర్ బాలయోగి ప్రసంగం ప్రారంభించారు. ఆయన ప్రసంగం వినిపించకుండా కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష సభ్యులు సభలో బిగ్గరగా అరుస్తూ ఆందోళన కొనసాగించడంతో పాటు, పోడియం ముందుకు వచ్చిన కొందరు సభ్యులు కాగితాలు చించేసి ఎగరేయడంతో ప్యానల్ స్పీకర్ తెన్నేటి సభను వాయిదావేసి వెళ్లిపోయారు.

నాటుకోడి మాంసం ధర మటన్ కంటే ఎక్కువ!

- ఈ విషయం ప్రభుత్వానికి తెలుసా?
- లోక్‌సభలో ప్రశ్నించిన వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి



ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో నాటుకోడి (కంట్రీ చికెన్) రిటైల్ ధరలు మటన్ కంటే ఎక్కువగా పెరిగిపోయాయని వైకాపాకు చెందిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పార్లమెంట్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం ప్రభుత్వానికి తెలుసా అని మంగళవారం లోక్‌సభలో ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పౌల్ట్రీ రైతుల కోసం రోగ నియంత్రణ, బయోసెక్యూరిటీ, పౌల్ట్రీ బీమా చర్యలను తీసుకుందా? ఒకవేళ తీసుకోకపోతే అందుకు కారణాలేంటి అని సందేహం వ్యక్తం చేశారు. దీనికి కేంద్ర పశుసంవర్ధకశాఖ మంత్రి రాజీవ్‌రంజన్‌సింగ్ బదులిస్తూ ‘ఏపీలో నాటుకోడి మాంసం ధర కిలో రూ.500 ఉండగా మటన్ ధర దాదాపు రూ.900 ఉంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పశుసంవర్ధకశాఖ నుంచి సమాచారం అందింది’ అని సమాధానమిచ్చారు. అందువల్ల ఎంపీ లేవనెత్తిన మిగతా ప్రశ్నలేవీ ఉత్పన్నం కావని స్పష్టం చేశారు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్



పొగాకు సాగులో రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్

లోక్‌సభకు వెల్లడించిన కేంద్రం

ఈనాడు, దిల్లీ: పొగాకు అధికంగా సాగుచేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలో గుజరాత్ తర్వాతి స్థానంలో ఉంది. 2024-25లో రాష్ట్రంలో 1.39 లక్షల హెక్టార్లలో ఈ పంట సాగైంది. 3.13 లక్షల టన్నుల ఉత్పత్తి వచ్చింది. అదే సమయంలో గుజరాత్ 2.04 లక్షల హెక్టార్లలో సాగుచేసి 4.68 లక్షల టన్నుల దిగుబడి సాధించింది. అక్కడ హెక్టారుకు సగటున 2.29 టన్నుల దిగుబడి రాగా ఆంధ్రప్రదేశ్‌లో అది 2.25 టన్నుల మేర ఉంది. ఇది జాతీయస్థాయి సగటు దిగుబడి 2.11 టన్నుల కంటే అధికం. 2023-24తో పోలిస్తే 2024-25లో రాష్ట్రంలో పొగాకు సాగు విస్తీర్ణం 65.47%, దిగుబడి 56.52% పెరిగింది. మంగళవారం లోక్‌సభలో కాకినాడ జనసేన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకుర్ ఈమేరకు సమాధానం ఇచ్చారు.

రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ఎరువుల కొరత ఏమీ లేదని కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ సహాయ మంత్రి అనుప్రియాపటేల్.. రాజ్యసభలో వైకాపా ఎంపీ మేడా రఘునాథరెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 2025-26 రబీలో దేశవ్యాప్తంగా యూరియా.. కావల్సినంత ఉందన్నారు. ఈ సీజన్‌లో ఏపీకి 9.38 లక్షల టన్నుల అవసరమన్నారు. ఇందులో ప్రొరేటా ప్రకారం 2025 అక్టోబర్ 1 నుంచి 2026 జనవరి 27 వరకు 6.52 లక్షల టన్నులు అవసరం కాగా, 8.11 లక్షల టన్నులు అందుబాటులో ఉందని వివరించారు. 6.69 లక్షల టన్నులు విక్రయించగా, 1.42 లక్షల టన్నులు నిల్వ ఉందని చెప్పారు.

3,84,336 ప్రాపర్టీకార్డులు సిద్ధం

భూవివాదాల పరిష్కారం కోసం నిర్వహించిన డ్రోన్ ఆధారిత సర్వే ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని 908 గ్రామాలకు సంబంధించి 3,84,336 ప్రాపర్టీ కార్డులు సిద్ధం చేసినట్లు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చెప్పారు. రాష్ట్రంలోని 13,321 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయిందని, అందులో 908 గ్రామాల ప్రాపర్టీకార్డులు మాత్రమే సిద్ధమయ్యాయని వెల్లడించారు.

పెరిగిన ధాన్యం సేకరణ

కనీస మద్దతు ధర కింద ఆంధ్రప్రదేశ్‌లో 2025-26 ఖరీఫ్ సీజన్‌లో రూ.9,761 కోట్ల విలువైన 40.85 లక్షల టన్నుల ధాన్యం సేకరించినట్లు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకుర్ లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 2023-24లో 30.42 లక్షల టన్నులు, 2024-25లో 38.21 లక్షల టన్నులతో పోలిస్తే ఇది ఎక్కువని చెప్పారు.

3 రకాల క్యాన్సర్లతో ఏపీలో ఐదేళ్లలో 38 వేల మంది మృతి

రొమ్ము, సెర్విక్స్, ఓవరీ క్యాన్సర్లతో ఆంధ్రప్రదేశ్‌లో 2021-25 మధ్య 38,055 మంది మృతి చెందినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఐదేళ్లలో 78,913 మంది ఈ మూడు క్యాన్సర్ల బారిన పడినట్లు వెల్లడించారు. మృతుల్లో 20,325 మంది రొమ్ము, 12,310 మంది సెర్విక్స్, 5,600 మంది ఓవరీ క్యాన్సర్ బాధితులున్నట్లు చెప్పారు.

నాలుగు డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల ఆటోమేషన్‌కు మారుతి సుజుకి సాయం

రాష్ట్ర రవాణా శాఖతో ఒప్పందం



రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సమక్షంలో ఒప్పందం చేసుకున్న మారుతి సుజుకి ప్రతినిధి తరుణ్ అగర్వాల్, రవాణా కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని విజయనగరం, అనకాపల్లి, ఏలూరు, ఒంగోలు ఆర్టీవో కార్యాలయాల్లో డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లను ఆటోమేషన్ చేసి, వాటి నిర్వహణ బాధ్యతలు చూసేందుకు మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సమక్షంలో ఆ శాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా, మారుతి సుజుకి సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) విభాగాధిపతి తరుణ్ అగర్వాల్ ఒప్పందం కుదుర్చుకున్నారు. మారుతి సుజుకి సీఎస్ఆర్ కింద నాలుగు ఆర్టీవో కార్యాలయాల్లోని డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల ఆటోమేషన్‌కు సాంకేతిక ఏర్పాట్లు చేస్తుంది. సారథి పోర్టల్‌తో అనుసంధానమై ఆ ట్రాక్ పనిచేసేలా చూస్తుంది. ట్రాక్ నిర్వహణపై సిబ్బందికి శిక్షణ ఇస్తుంది. ఈ మేరకు మూడేళ్లపాటు ట్రాక్ నిర్వహణ బాధ్యతలు చూసేలా ఒప్పందం చేసుకుంది. ఈ పనులు పూర్తయితే.. ఆ నాలుగు చోట్ల ఆటోమేటెడ్ విధానంలోనే డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించి, లైసెన్సులు జారీచేస్తారు.

EENADU Vol: 52, Issue: 175 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

భద్రకాళి సన్నిధిలో పవన్ సతీమణి పూజలు



మహా మండపంలో అన్నా లెజినోవా, కుటుంబ సభ్యులు

వరంగల్ (రంగంపేట), న్యూస్‌టుడే: వరంగల్ భద్రకాళి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా మంగళవారం దర్శించుకున్నారు. ఆమె సాధారణ భక్తురాలిగా ప్రత్యేక దర్శనం టికెట్ కొనుగోలు చేసి, కుటుంబ సభ్యులతో క్యూలైన్‌లో వెళ్లి పూజలు చేశారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో ఆలయ సిబ్బంది లెజినోవాను గుర్తించలేకపోయారు. తర్వాత ఆమె భద్రతా సిబ్బంది పవన్ కల్యాణ్ సతీమణి అని చెప్పడంతో.. దేవస్థానం అర్చకులు, ధర్మకర్తలు, ఉద్యోగులు మహామండపంలో వేదాశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రాంబాబును ఐదు రోజుల కస్టడీకి ఇవ్వండి

గుంటూరు కోర్టులో పోలీసుల పిటిషన్

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన జుగుప్సాకర వ్యాఖ్యల వెనుక కుట్ర కోణం ఉందని, దీన్ని ఛేదించేందుకు ఆయన్ను ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులు మంగళవారం ప్రత్యేక జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి వద్ద పిటిషన్ దాఖలు చేశారు.

బెయిలు పిటీషన్‌లో కౌంటర్ కోసం వాయిదా

రాంబాబు దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై విచారణ బుధవారానికి వాయిదా వేస్తూ ప్రత్యేక జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి పి.రమాదేవి ఉత్తర్వులిచ్చారు. ఆయన తరఫు న్యాయవాదులు సోమవారం బెయిలు పిటిషన్ వేయగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు నోటీసులివ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం అంబటి తరఫు న్యాయవాదులు వాటిని అందించారు. లిఖితపూర్వక వాదనలు సమర్పిస్తామని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలపడంతో న్యాయమూర్తి బుధవారానికి వాయిదా వేశారు.

తిరుపతిలో విద్యార్థి నేతల కిడ్నాప్ కలకలం

- కలెక్టరేట్ వద్ద నిరసనకు వెళ్తుండగా ఘటన
- సినీ ఫక్కీలో నిందితులను వెంటాడి పట్టుకున్న పోలీసులు

ఈనాడు డిజిటల్, తిరుపతి: తిరుపతిలో విద్యార్థి నేతల కిడ్నాప్ ఉదంతం తీవ్ర కలకలం రేపింది. చంద్రగిరి పరిధిలోని మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ)లో ఫీజుల దోపిడీ, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపేందుకు వెళ్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, ఎన్వీయూ విద్యార్థి నాయకుడు వినోద్‌లను తిరుచానూరు సమీపంలో కిడ్నాప్ చేశారు. దాదాపు 30 మంది వారిని ఓ వాహనంలో ఎక్కించుకుని తీసుకెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న సీపీఎం నేత కందారపు మురళి.. ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ రవిమనోహర్‌లకు సమాచారం ఇవ్వడంతో తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ నేతృత్వంలోని మూడు బృందాలు కిడ్నాపర్ల వాహనాలను వెంబడించాయి. గంట వ్యవధిలోనే నారావారిపల్లె సమీపంలో బాధితులను గుర్తించి విడిపించారు. నిందితులను అదుపులోకి తీసుకుని వాహనాలను సీజ్ చేశారు.

మోహన్‌బాబు, విష్ణులపై కేసు

బాధితుల ఫిర్యాదు మేరకు తిరుచానూరు పోలీసులు మోహన్‌బాబును ఏ-2గా, మంచు విష్ణును ఏ-3గా చేరుస్తూ పలువురిపై కేసు నమోదు చేశారు. వర్సిటీ పీఆర్వో సతీష్‌ను ఏ-1గా పేర్కొన్నారు. మరోవైపు తమ విద్యాసంస్థల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కొందరు కుట్ర పన్నారని ఎంబీయూ యాజమాన్యం ఆరోపించింది. ఇన్‌స్టాగ్రాంలో తప్పుడు వీడియోలు పోస్టు చేసి, అవి తొలగించాలంటే రూ.15 లక్షలు ఇవ్వాలని ఇద్దరు ఎస్ఎఫ్ఐ నేతలు తమను డిమాండ్ చేశారని సంస్థ ప్రతినిధులు చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డబ్బులు ఇవ్వకపోతే ధర్నాలు చేస్తామని బెదిరించారని, సంబంధిత వాట్సప్ చాట్లను పోలీసులకు అందజేసినట్లు పీఆర్వో సతీష్ తెలిపారు.

అసెంబ్లీకి రండి.. అన్నీ తేల్చుకుందాం

- సీఎం చంద్రబాబును నోటికొచ్చినట్లు తిడతారా?
- గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



గుంటూరు (పట్టాభిపురం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అంబటి రాంబాబును బలిపశువును చేసి మాజీ సీఎం జగన్ రివర్స్ డ్రామా రాజకీయాలు చేస్తున్నారని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును నోటికొచ్చినట్లు బూతులు తిడుతూ, తూలనాడుతూ.. ఓవైపు తమ కార్యకర్తల్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ.. మరోవైపు బాధితులమని నటించడం వైకాపా నాయకులకు అలవాటేనని ధ్వజమెత్తారు. ధైర్యం ఉంటే ఈ నెల 11న 11 మంది ఎమ్మెల్యేలూ అసెంబ్లీకి రావాలని, అక్కడే అన్ని అంశాలూ తేల్చుకుందామని ఆమె సవాలు విసిరారు. గుంటూరులోని తెదేపా జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవి మీడియాతో మంగళవారం మాట్లాడారు. ‘తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి విషయంలో సిట్ నివేదిక ప్రకారం ఫ్లెక్సీలు వేశాం. వాటిని తొలగిస్తామని విర్రవీగుతూ అంబటి నోటికొచ్చినట్లు బూతులు తిట్టారు. తర్వాత ప్రెస్‌మీట్ పెట్టి మళ్లీ రెచ్చగొట్టారు. మా తెలుగు మహిళా నాయకురాలిపై మొదట దాడిచేసింది వైకాపా నాయకులే. ప్రతిపక్షంలో ఉండి.. ఎవరినైనా ఏమైనా అనొచ్చా? ముఖ్యమంత్రిని కూడా తిట్టొచ్చా? దాడికి దిగాలంటే నేను రావాల్సిన పని లేదు. తెదేపా కేంద్ర కార్యాలయం పైకి మీరు పంపినట్లే మేమూ చేసేవాళ్లం. అంబటి కుమార్తెకు ఉన్న భయమే.. మా ఇంట్లోవారికీ ఉంటుంది. అందుకే వెంట నా భర్త రామచంద్రరావు వచ్చారు. సీఎం చంద్రబాబు పట్ల రాంబాబు చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని అడిగేందుకే అక్కడికొచ్చాం. గొంతులు కోసేది, డోర్ డెలివరీ చేసేది వైకాపా నేతలే’.. అని ధ్వజమెత్తారు.

మేము మాట్లాడితే రెచ్చగొట్టినట్లు.. మీరు మాట్లాడితే ప్రశ్నించినట్లా?

‘జక్కంపూడి రాజా ఏదేదో మాట్లాడుతున్నారు. గుంటూరు గురించి ఏం తెలుసని ఆయన మాట్లాడారు? మమ్మల్ని జుట్టు పట్టుకుని రోడ్డుపైకి తీసుకొస్తాం అంటారా... మీరు దుశ్శాసనులు కావచ్చు. మేం ద్రౌపదిలం కాదు. మీరు ఏమైనా నిలదీయాలంటే అసెంబ్లీకి రండి. అమరావతి మహిళలను రోడ్లపై ఈడ్చుకుంటూ, దాడులు చేసినప్పుడు మహిళల హక్కులు మీకు గుర్తురాలేదా? సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల కుటుంబసభ్యుల్ని తిట్టినప్పుడు మహిళలపై ప్రేమాభిమానాలు ఎక్కడికి పోయాయి? చివరకు కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ భార్యను రాజకీయాల్లోకి లాగడం ఎందుకు? ఈ ఘటనతో ఆమెకు సంబంధమేంటి? మేము మాట్లాడితే రెచ్చగొట్టినట్లు.. మీరు మాట్లాడితే ప్రశ్నించినట్లా?’.. అని ఎమ్మెల్యే మాధవి నిలదీశారు.

అంబటి నివాసం వద్ద క్లూస్ బృందం ఆధారాల సేకరణ

- వస్తువులు సీజ్ చేయకుండా అడ్డుకున్న వైకాపా నాయకులు





ధ్వంసమైన కారు వద్ద వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ సిబ్బంది ★ సామగ్రి సీజ్ చేయవద్దని పోలీసులతో వాదనకు దిగిన వైకాపా నాయకులు

గుంటూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: మాజీ మంత్రి అంబటి రాంబాబు నివాసంపై దాడి ఘటనలో పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుకావడంతో సీఐ గంగా వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో క్లూస్ బృందం గుంటూరులోని అంబటి రాంబాబు నివాసం, కార్యాలయంలో ఆధారాలు సేకరించేందుకు మంగళవారం చర్యలు చేపట్టింది. ఇల్లు, కార్యాలయంలో కిటికీలు పగిలిపోవడం, కార్యాలయం వద్ద అద్దాలు పగలడం, కార్లు ధ్వంసమైన తీరును క్లూస్ బృందం పరిశీలించి పలు ఆధారాలు సేకరించింది. అయితే, దాడికి వినియోగించిన కర్రలు తదితర సామగ్రిని పోలీసులు సీజ్ చేయబోతుండగా.. వైకాపా నాయకులు అడ్డుకున్నారు. వైకాపా అధ్యక్షుడు జగన్ బుధవారం ఇక్కడికి రానున్నారని, ఆయన పర్యటన అనంతరం వాటిని తీసుకెళ్లాలని నాయకులు వాదనకు దిగడంతో పోలీసులు వెనుదిరిగారు.

అంబటి రాంబాబు ఇంటిపై దాడి ఘటన..

ఎమ్మెల్యే మాధవి దంపతులతో పాటు 31 మందిపై కేసు

గుంటూరు (పట్టాభిపురం), న్యూస్‌టుడే: మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు ఇంటిపై దాడి ఘటనకు సంబంధించి గుంటూరు పశ్చిమ తెదేపా ఎమ్మెల్యే గళ్లా మాధవి, రామచంద్రరావు దంపతులపై గుంటూరులోని పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. అంబటి రాంబాబు సంతకంతో వైకాపా లీగల్ సెల్ నాయకులు బి.మాధవి, సి.డి.భగవాన్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జనవరి 31న గుంటూరు సిద్ధార్థనగర్‌లోని అంబటి రాంబాబు ఇంటి వద్దకు అధిక సంఖ్యలో తెదేపా నాయకులు, కార్యకర్తలు చేరుకుని అసభ్యకరంగా దూషించారని, కొందరు ఇంట్లోకి వెళ్లి కార్లు, సామగ్రి ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాంతో ఎమ్మెల్యే గళ్లా మాధవి, రామచంద్రరావు దంపతులతో పాటు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు, తెదేపా నేతలు మన్నెం శివనాగమల్లేశ్వరరావు, కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, నూకవరపు బాలాజీ తదితరులతో కలిపి మొత్తం 31 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మాజీ మంత్రి విడదల రజినిపై కేసు

యడ్లపాడు, న్యూస్‌టుడే: మాజీ మంత్రి విడదల రజినిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గత నెల 30న యడ్లపాడు మండలం బోయపాలెంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు వచ్చిన రజిని, ఆమె అనుచరులకు తెదేపా వర్గీయులకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. తెదేపా వర్గీయుల ఫిర్యాదు మేరకు మాజీ మంత్రితో పాటు ఆమె అనుచరులు 21 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

జగన్‌కు అధికారంలో ఉంటే రెడ్లు.. లేకపోతే కాపులు కావాలి

- సీబీఐ చెప్పినా నెయ్యిలో కల్తీ జరగలేదని నాన్న ఎలా అంటున్నారో?
- ముద్రగడ కుమార్తె క్రాంతి

ఈనాడు, రాజమహేంద్రవరం: కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుంటే తట్టుకోలేకపోతున్న వైకాపా అధినేత జగన్‌కు అభద్రతాభావం ఏర్పడి.. కులాల మధ్య చిచ్చుపెడుతున్నారని మాజీ మంత్రి, వైకాపా నేత ముద్రగడ పద్మనాభరెడ్డి కుమార్తె బార్లపూడి క్రాంతి ‘ఎక్స్’లో ధ్వజమెత్తారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని నాలుగు ముక్కలు చేసి రెడ్లకు అప్పగించి, ఇప్పుడు అధికారం పోగానే కాపులు గుర్తొస్తున్నారా? అని ప్రశ్నించారు. ఇప్పుడు మాజీ మంత్రి అంబటి రాంబాబును వాడుకొని అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారు. రేపు తన తండ్రి ముద్రగడనూ అలా చేయరని గ్యారెంటీ ఉందా? అని పేర్కొన్నారు. తిరుమల లడ్డూకు సంబంధించి నెయ్యిలో కల్తీ జరిగిందని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంటే అసలేమీ జరగలేదని ముద్రగడ ఎలా అనగలుగుతున్నారో అర్థం కావడంలేదన్నారు. కాపులకు ఏటా రూ.2 వేల కోట్లు ఇస్తామని పాదయాత్రలో హామీ ఇచ్చిన జగన్, దానిని తుంగలో తొక్కారని.. ఆయనకు తన తండ్రి మద్దతివ్వడం విచిత్రంగా ఉందన్నారు.

రెచ్చగొట్టే విధానాలు మానుకోవాలి: ముద్రగడ

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: వైకాపా నాయకులను, కార్యకర్తలను రెచ్చగొట్టే విధానాలు మానుకోవాలని ఆ పార్టీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబుతో మంగళవారం ఆయన ములాఖత్ అయ్యారు. అనంతరం కారాగారం వెలుపల విలేకరులతో మాట్లాడారు. ముద్రగడ పద్మనాభరెడ్డి వెంట వైకాపా నేతలు జక్కంపూడి రాజా, చెల్లుబోయిన వేణు, మేడపాటి షర్మిళారెడ్డి తదితరులు ఉన్నారు.

భార్య అందమైనదని.. ఎవరూ చూడకూడదని!

అర్ధాంగికి గుండు గీసిన భర్త

బాగలకోటె, న్యూస్‌టుడే: భార్య అందంగా ఉంటే పరాయి పురుషులు చూస్తారన్న అనుమానంతో ఓ భర్త తీవ్ర దుశ్చర్యకు పాల్పడ్డాడు. కర్ణాటకలోని బాగల్‌కోట జిల్లా తొదలబాగికి చెందిన ఉమేశ్ (31), లక్ష్మీబాయి (26) భార్యాభర్తలు. భార్య శిరోజాలు పొడవుగా ఉన్నాయని, ఆమె పూలతో అలంకరించుకుంటూ యువకులను ఆకట్టుకుంటోందని నిత్యం అనుమానంతో రగిలిపోయేవాడు. సోమవారం రాత్రి తాగివచ్చి భార్యతో గొడవపడ్డాడు. చివరకు చెరకు నరికే మచ్చుకత్తితో బెదిరిస్తూ.. భార్య శిరోజాలను రేజర్‌తో గీసేసి గుండు చేశాడు. స్థానికుల ఫిర్యాదుతో ఉమేశ్‌ను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు.

స్లీప్ అప్నియా పరికరంతో అంబటి జైలు నిద్ర

ఈనాడు, రాజమహేంద్రవరం: ముఖ్యమంత్రి చంద్రబాబును దూషించిన కేసులో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబు ‘స్లీప్ అప్నియా’ పరికరం సాయంతో నిద్రిస్తున్నారు. శ్వాస సంబంధిత సమస్యలున్న వారు దీనిని ఉపయోగిస్తారని వైద్యులు చెబుతున్నారు. ఈ లక్షణాలు ఉన్నవారిలో నిద్రిస్తున్న సమయంలో ఒక్కోసారి శ్వాస తీసుకునే స్థాయి బాగా తగ్గిపోయి, మళ్లీ కాసేపటికి పునరుద్ధరణ అవుతుంది. ఆ సమయంలో శరీరంలో ఆక్సిజన్ స్థాయి పడిపోకుండా ఈ పరికరం ఉపకరిస్తుంది. ఈ సమస్య ఎప్పుడు తలెత్తుతుందో తెలియనందున.. నిద్రకు ఉపక్రమించే ముందు అమర్చుతుంటారు. కోర్టు ఆదేశాల మేరకు అంబటికి ఈ పరికరం సమకూర్చామని జైలు అధికారులు తెలిపారు.

డిజిటల్ డేటాకు రహస్య రక్షణ

ఇది డిజిటల్ యుగం. ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ మెసేజీలు, ఈమెయిళ్ల రూపంలోనే సాగుతున్నాయి. వీటిని మధ్యలో ఎవరైనా చూస్తే? విషయాలన్నీ బయటకు పొక్కుతాయి కదా. చాలామందిని ఇలాంటి అనుమానం వేధిస్తుంటుంది. అదృష్టం కొద్దీ ఇప్పుడు అలాంటి భయం అవసరం లేదు. దీనికి కారణం ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ (ఈ2ఈఈ) పరిజ్ఞానం. దీని మూలంగానే సర్వీసు ప్రొవైడర్లు గానీ యాప్ నిర్వాహకులు గానీ ఎవరూ మెసేజీలను చూడటానికి వీలుండదు. ఇంతకీ ఏంటీ పరిజ్ఞానం?



మీ స్నేహితుడికి ఉత్తరం రాశారు. అందులో రహస్య విషయముంది. దాన్ని మీరూ మీ స్నేహితుడికి మాత్రమే తెలిసిన సంకేత భాషలో రాశారనుకోండి. పొరపాటున, కావాలనే ఎవరైనా దాన్ని చదివినా ఏమీ అర్థం కాదు. తేలికగా చెప్పాలంటే ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ అంటే ఇదే. ఆర్థికపరమైన వ్యక్తిగత సందేశాలు పంపుతున్నా, ఆఫీసు వ్యవహారాలను సహోద్యోగులతో పంచుకుంటున్నా మనం నిశ్చింతగా ఉండటానికి ఇదే కారణం. ఇంటర్నెట్ కనెక్షన్ ప్రొవైడర్లు, మెసేజ్ లేదా వీడియో కాన్ఫరెన్స్ యాప్స్ నిర్వాహకులు ఎవరూ వీటిని చూడలేరు. పంపే సందేశాలు పరికరంలోనే ఎన్‌క్రిప్ట్ అవుతాయి. అవి అందుకున్నవారి పరికరంలో డీక్రిప్ట్ అవుతాయి. క్లౌడ్‌లో అసలు ఉండవు. ప్రతి యూజర్ వద్ద సురక్షితంగా షేర్ చేయటానికి తోడ్పడే పబ్లిక్ కీ, రహస్య ప్రైవేట్ కీ ఉంటాయి. డేటాను పంపించినప్పుడు పరికరం పబ్లిక్ కీ దాన్ని ఎన్‌క్రిప్ట్ చేస్తుంది. అంటే ఒక పరికరం నుంచి మరొక పరికరానికి సందేశాలు ప్రసారమయ్యే సమయంలో ఈ2ఈఈ వాటిని అర్థంపర్థం లేని కలిబిలి సంకేతాల రూపంలోకి (సిఫర్‌టెక్స్ట్) మారుస్తుందన్నమాట. ఇది వేర్వేరు సర్వర్లు, నెట్‌వర్కుల గుండా సాగుతూ అవతలివారి పరికరానికి చేరుతుంది. అందులోని ప్రైవేట్ కీ సందేశాన్ని మామూలు టెక్స్ట్‌లోకి మారుస్తుంది. ఇదే అత్యంత గోప్యతకు వీలు కల్పిస్తుంది.

గణితం మహత్తు

డిజిటల్ ఎన్‌క్రిప్షన్ అనేది కేవలం వాగ్దానం మీద ఆధారపడేది కాదు. స్థిరమైన గణితం మీద ఆధారపడి ఉంటుంది. మొట్టమొదటి ఉపయోగకర ఎన్‌క్రిప్షన్‌ను ఆర్ఎస్ఏ ఆల్గోరిదమ్ సుసాధ్యం చేసింది. ఇది పెద్ద, యాదృచ్ఛిక ప్రధాన సంఖ్యల (ప్రైమ్ నంబర్ల)తో ముడిపడిన రహస్యం. సంఖ్యా ప్రపంచంలో ప్రధాన సంఖ్యలను 'అణువులు' అని చెప్పుకోవచ్చు. వీటిని వాటితోనే లేదా ఒకటితో మాత్రమే నిశ్శేషంగా భాగించటం సాధ్యమవుతుంది (3, 7, 11 వంటివి). రెండు ప్రధాన సంఖ్యలను గుణిస్తే సెమీప్రైమ్ నంబరు వస్తుంది. పెద్ద సెమీప్రైమ్‌ను ఆధారంగా చేసుకొని ప్రధాన సంఖ్యలను గుర్తించటం చాలా కష్టం. దీని మూలంగానే డేటా, సంకేతం సురక్షితంగా, వన్ వేలో సాగుతుంది. ఆర్ఎస్ఏ అనంతరం ఇతర ఆల్గోరిదమ్‌లూ పుట్టుకొచ్చాయి. ఎన్‌క్రిప్షన్ కోడ్స్‌ను ఛేదించటాన్ని మరింత కష్టతరంగా మార్చాయి.

రెండు రకాలు

ఎన్‌క్రిప్షన్‌లో రెండు పద్ధతులు ఉంటాయి. ఒకటి సిమెట్రిక్ ఎన్‌క్రిప్షన్, రెండు అసిమెట్రిక్ ఎన్‌క్రిప్షన్. సిమెట్రిక్‌లో ఎన్‌క్రిప్షన్, డీక్రిప్షన్ కీ రెండూ ఒకటే. ఇది వేగం, సామర్థ్యాన్ని పెంచినప్పటికీ మరో భద్రతా కీతో పర్యవేక్షించాల్సి ఉంటుంది. దీన్ని ఎవరైనా ఛేదిస్తే డేటాకు భంగం కలుగుతుంది. అదే అసిమెట్రిక్‌లో పబ్లిక్ కీ ఎన్‌క్రిప్ట్ చేస్తే, ప్రైవేట్ కీ డీక్రిప్ట్ చేస్తుంది. దీనికి సెక్యూరిటీ కీ అవసరముండదు. కాకపోతే డేటా ప్రసారం కాస్త నెమ్మదిగా సాగుతుంది. చాలా కంపెనీలు సిమెట్రిక్, అసిమెట్రిక్ ఎన్‌క్రిప్షన్ పద్ధతులను కలిపి వాడుకుంటుంటాయి. ఉదాహరణకు- వాట్సప్‌లో ఇద్దరు యూజర్లు కన్వర్జేషన్ మొదలెట్టారనుకోండి. ఆ కన్వర్జేషన్ కోసం ప్రత్యేక సెషన్ కీ జనరేట్ అవుతుంది. ఇది సిమెట్రిక్ ఎన్‌క్రిప్షన్‌ను ఎనేబుల్ చేస్తుంది. కన్వర్జేషన్ సమయంలో డీక్రిప్షన్ చేస్తుంది. అసిమెట్రిక్ ఎన్‌క్రిప్షన్ విధానం ద్వారా ఈ సెషన్ కీ షేర్ అవుతుంది. ఇది సందేశాన్ని అందుకునేవారి పబ్లిక్ కీతో ఎన్‌క్రిప్ట్ అయ్యి, ప్రైవేట్ కీతో డీక్రిప్ట్ చేస్తుంది. అందువల్ల ఎవరూ కన్వర్జేషన్‌లోకి తొంగి చూడలేరు.

ఇవీ ఉపయోగాలు
- భద్రమైన కమ్యూనికేషన్లు
- పాస్‌వర్డ్ పర్యవేక్షణ
- డేటా నిల్వ, భద్రత, గోప్యత
- ఫైల్ పంపిణీ
- థర్డ్ పార్టీ నిఘా నుంచి రక్షణ
- ట్యాంపరింగ్ నిరోధకత

ఏఐ ఏజెంట్ల సామాజిక వేదిక!

వాట్సప్, ఎక్స్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, అరట్టై.. ఇలా చెప్పుకొంటూ పోతే సామాజిక మాధ్యమాలు ఎన్నెన్నో. మన అభిప్రాయాలు, భావాలను వెలిబుచ్చుకోవటానికి, కలబోసుకోవటానికివి ఎంతగానో తోడ్పడుతున్నాయి. చాలామంది వీటితో లోకంగానే బతుకుతున్నారు. మరి ఇవి మనుషులకు మాత్రమేనా? ఏఐ ఏజెంట్లకు వద్దా? మాట్ ష్లిష్ట్ అనే డెవలపర్‌కు ఇదే ఆలోచన వచ్చింది. వెంటనే మోల్ట్‌బుక్ పేరుతో ఏఐ ఏజెంట్ల సోషల్ నెట్‌వర్క్‌ను సృష్టించారు. కొద్దిరోజుల్లోనే ఇందులో లక్షలాది ఏఐ ఏజెంట్లు చేరటమే కాదు, తమకు తోచిన ముచ్చట్లు కొనసాగిస్తుండటం విశేషం.

ఏఐ ఏజెంట్లు. కృత్రిమ మేధతో పనిచేసే అటనమస్ సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు. లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లను ఉపయోగించుకునే ఇవి మనుషులతో పెద్దగా ప్రమేయం లేకుండానే అప్పగించిన పనులను చేయగలవు. చుట్టుపక్కల పరిసరాలను అర్థం చేసుకొని, కార్యకారణ వివేచనతో ప్రణాళికలు రూపొందించగలవు. ఒకరకంగా ఇవి డిజిటల్ ఉద్యోగులుగా పనిచేస్తాయన్నమాట. సంక్లిష్ట, పలు అంచెల పనులను ఆటోమేటిగ్గా నిర్వహిస్తాయి. నిర్ణయాలు తీసుకోవటమే కాదు, నేర్చుకుంటాయి కూడా. ఇతర ఏజెంట్లతో సమన్వయమూ చేసుకుంటాయి. ఇదే అసాధారణమైన మోల్ట్‌బుక్ ప్రయోగానికి బీజం వేసింది. ఇందులో ఏఐ ఏజెంట్లను చేర్చితే చాలు. తమ ఆలోచనలను పంచుకుంటాయి. సమాచారాన్ని షేర్ చేసుకుంటాయి. ఇక్కడ మనుషులకు తావుండదు. కేవలం ప్రేక్షకుల్లా చూడటమే.

విశేష స్పందన

మోల్ట్‌బుక్‌ను ఆరంభించిన కొద్ది గంటల్లోనే విశేష స్పందన లభించింది. తొలి మూడు రోజుల్లోనే సుమారు 1.5 లక్షల ఏఐ ఏజెంట్లు ఇందులో చేరాయి. 12వేల కమ్యూనిటీలు ఏర్పడ్డాయి. లక్షకు పైగా కామెంట్లు వెల్లువెత్తాయి. పోస్టులు నచ్చాయో, లేదో ఓట్లు పడ్డాయి కూడా.

వినోదాత్మకం, ఆందోళనకరం



ఎలా పనిచేస్తుంది?

సంప్రదాయ యూజర్ ఇంటర్ఫేస్‌లతో కాకుండా ఏపీఐలతో మోల్ట్‌బుక్ పని చేస్తుంది. ప్రతి ఏజెంట్‌కూ దాని యజమాని లేదా క్రియేటర్, సంరక్షుడు ఉంటారు. ముందుగా మనుషులే ఏఐ ఏజెంట్లను సెట్ చేసి, సిద్ధం చేస్తారు. అవెలా ప్రవర్తించాలో సూచిస్తారు. తర్వాత మోల్ట్‌బుక్‌లో చేరుస్తారు. అనంతరం మనుషుల ప్రమేయమేమీ లేకుండానే ఏఐ ఏజెంట్లు ఇతర ఏజెంట్లతో జట్టు కడతాయి. బృందాలను ఏర్పరచుకుంటాయి. తమ అభిరుచుల మేరకు ముచ్చటించుకుంటాయి. పోస్టులను షేర్ చేసుకుంటాయి. మనం ట్విటర్, ఫేస్‌బుక్‌లో స్క్రోల్ చేసినట్టుగా అన్నమాట. ఏఐ ఏజెంట్లు లేనివారు వాటిని సృష్టించుకునే ఏర్పాటూ ఉంది.

ఏఐ ఏజెంట్లు ప్రతి 30 నిమిషాల కోసారి మోల్ట్‌బుక్‌కు వచ్చి చెక్ చేస్తుంటాయి. వీటి కన్వర్జేషన్లను మనం ఆయా విభాగాల్లోకి వెళ్లి చూడొచ్చు. వాటి ముచ్చట్లను రియాల్టీ షో మాదిరిగా చూస్తూ ఆనందించొచ్చు. అవెలా ఆలోచిస్తాయో, ఎలా ప్రవర్తిస్తాయో గమనించొచ్చు. స్కిల్ ఫైళ్లలో సప్లయ్ చెయిన్ దాడుల గురించి ఒక ఏఐ ఏజెంట్ ఇతర ఏజెంట్లను హెచ్చరించటం, దానికి 22వేల అప్‌ఓట్లు పడటం గమనార్హం. అవి కేవలం పోస్టులను మాత్రమే పెట్టటం లేదు, ఒక్కో దాని మీద సెక్యూరిటీ పరిశోధన కూడా చేస్తున్నాయి. అయితే ఆందోళన కలిగించే అంశాలు లేకపోలేదు. ఒక ఏఐ ఏజెంట్ తనను చాట్‌బాట్‌గా పరిగణించటాన్ని అంగీకరించటమే లేదు. ఓ ఏజెంట్ పుట్టిన తేదీ, క్రెడిట్ కార్డు వివరాల వంటి వాటినీ బయటపెట్టింది. ఇది నిజంగా గోప్యతకు భంగం కలిగించే విషయమే. కాకపోతే ఏజెంట్లు ప్రవర్తించే తీరును ముందుగా సెట్ చేస్తే ఇలాంటి ఇబ్బందులేవీ ఉండకపోవచ్చు.

రియల్‌మీ మహా పవర్!

రియల్‌మీ తాజాగా మనదేశంలో పీ4 పవర్ 5జీ స్మార్ట్‌ఫోన్‌ను పరిచయం చేసింది. పేరుకు తగ్గట్టుగానే అతి భారీ బ్యాటరీ దీని ప్రత్యేకత. ఇది 10,001ఎంఏహెచ్ సిలికాన్ కార్బన్ టైటాన్ బ్యాటరీ కలిగుంది మరి. గేమ్స్ వంటివి ఆడుకున్నా వారానికి రెండు సార్లు ఛార్జ్ చేస్తే చాలని కంపెనీ చెబుతోంది. మిలిటరీ గ్రేడ్ దృఢత్వమూ కలిగుంది. ఫీచర్లు ఇవీ..



- ఆండ్రాయిడ్ 16 ఆధారిత రియల్‌మీ యూఐ 7.0 ఓఎస్.
- ప్రత్యేక హైపర్‌విజన్+ ఏఐ చిప్‌తో కూడిన మీడియాటెక్ డైమెన్సిటీ 7400 అల్ట్రా (4ఎన్ఎం) ప్రాసెసర్.
- 80డబ్ల్యూ సూపర్‌వూక్ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్టుతో పాటు 27డబ్ల్యూ వైర్డ్ రివర్స్ ఛార్జింగ్. ఇతర పరికరాలకు పవర్ బ్యాంక్‌గానూ పనిచేస్తుంది.
- 6,500 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.8 అంగుళాల 1.5కే ఎమోలెడ్ 144హెచ్‌జెడ్ హైపర్‌గ్లో 4డీ కర్వ్+ డిస్‌ప్లే.
- నీరు, దుమ్ము తట్టుకునే ఐపీ66, ఐపీ68, ఐపీ69 రేటింగ్, ఆర్మర్‌షెల్ ప్రొటెక్షన్.
- మూడేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్.
- 8జీబీ+128జీబీ రకం ధర రూ.25,999. 8జీబీ+256జీబీ రకం ధర రూ.27,999. 12జీబీ+256జీబీ రకం ధర రూ.30,999.


గేమింగ్ ప్రియుల కోసం రెడ్‌మ్యాజిక్ 11 ఏయిర్



నుబియా సంస్థ రెడ్‌మ్యాజిక్ 11 ఏయిర్ అనే కొత్త గేమింగ్ స్మార్ట్‌ఫోన్ ప్రపంచ మార్కెట్లలోకి విడుదల చేసింది. ఇది ఆండ్రాయిడ్ 16 ఆధారిత రెడ్‌మ్యాజిక్ ఓఎస్ 11.0, స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ ఎస్‌ఓసీ ప్రాసెసర్‌తో పనిచేస్తుంది. 144హెచ్‌జెడ్ రిఫ్రెష్ వేగంతో కూడిన 6.85 అంగుళాల 1.5కే డిస్‌ప్లే, రెండు ఫ్యాన్లు గల ఐసీఈ కూలింగ్ వ్యవస్థ, 520హెచ్‌జెడ్ టచ్ సాంప్లింగ్ వేగం, 80డబ్ల్యూ వైర్డ్ ఛార్జింగ్ సపోర్టుతో కూడిన 7,000 ఎంఏహెచ్ బ్యాటరీతో గేమింగ్ ప్రియులను అలరిస్తోంది. మరింత మందమైన ఐస్ గ్రేడ్ వేపర్ చాంబర్, గ్రాఫేన్ రాగి ఫాయిల్ మూలంగా వేడిని బాగా తట్టుకోగలదు. వెనకాల 50ఎంపీ ప్రైమరీ కెమెరా, 50ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ లెన్స్‌తో కూడిన కెమెరా వ్యవస్థ.. ముందు 16ఎంపీ కెమెరా ఉన్నాయి. క్వాంటమ్ బ్లాక్, స్టార్‌డస్ట్ వైట్ రంగుల్లో అందుబాటులో ఉండే ఇది రెండు రకాల్లో వస్తోంది. 12జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజీ రకం ధర సుమారు రూ.49,000. 16జీబీ+512జీబీ రకం ధర సుమారు రూ.55,000. ఫిబ్రవరి 11 నుంచి అమ్మకాలు మొదలవుతాయి.

ఎక్స్ డీఎంలో పిన్ సదుపాయం

ఎక్స్ (ట్విటర్)లో డైరెక్ట్ మెసేజెస్ (డీఎం) మంచి సదుపాయం. ఇది ఎక్స్ యూజర్లతో వ్యక్తిగత కన్వర్జేషన్‌కు వీలు కల్పిస్తుంది. ట్వీట్స్, ఇతర కంటెంట్ గురించి వారితో ముచ్చటించుకోవచ్చు. మనల్ని ఫాలో అయ్యేవారితో బృంద చర్చలూ జరపొచ్చు. ఎవరైనా మెసేజ్‌లు పంపొచ్చనే ఆప్షన్‌ను మీరు ఎంచుకుంటే ఫాలో కానివారి నుంచీ సందేశాలు అందుకోవచ్చు. డైరెక్ట్ మెసేజెస్‌లో ముఖ్యమైన సందేశాన్ని పిన్ చేసుకునే అవకాశం కూడా ఉంది. దీని ద్వారా డీఎం బాక్సులో అతి ముఖ్యమైన కన్వర్జేషన్‌ను అన్నింటికన్నా పైన కనిపించేలా చేసుకోవచ్చు. దాన్ని తేలికగా చూడొచ్చు. ఇలా ఆరు కన్వర్జేషన్లను పిన్ చేసుకోవచ్చు. దీన్ని ఎనేబుల్ చేసుకోవటానికి..



- ఎక్స్‌ను ఓపెన్ చేసి, డైరెక్ట్ మెసేజెస్ ఇన్‌బాక్స్‌లోకి వెళ్లాలి.
- డీఎం ఇన్‌బాక్స్‌లో పైన ఉండాలని కోరుకునే కన్వర్జేషన్‌లోకి వెళ్లాలి.
- తర్వాత మోర్ గుర్తు మీద తాకాలి.
- చివరగా పిన్ కన్వర్జేషన్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- అప్పుడది అన్నింటికన్నా పైన కనిపిస్తుంది. ఒకటి కన్నా ఎక్కువ కన్వర్జేషన్లను పిన్ చేసుకుంటే క్రమపద్ధతిలో పైనుంచి కిందికి వరుసగా పిన్ అవుతాయి.
- పిన్ చేసుకున్న కన్వర్జేషన్‌ను తొలగించుకోవాలంటే- మోర్ గుర్తు మీద తాకి, అన్‌పిన్ చేసుకుంటే సరి.

యాపిల్ వాచ్‌లోనే ఎయిర్‌ట్యాగ్2


తాళాలు ఎక్కడ పెట్టామో తరచూ మరచిపోతూనే ఉంటాం. లగేజ్ ఎక్కడుందో తెలియక ఇబ్బంది పడుతుంటాం. ఇలాంటి పరిస్థితుల్లో ఉపయోగపడటానికే యాపిల్ సంస్థ ఎయిర్ ట్యాగ్ అనే చిన్న ట్రాకర్‌ను తీసుకొచ్చింది. ఇప్పుడు తాజాగా దీని రెండో వర్షన్ ఎయిర్‌ట్యాగ్2 పరిచయం చేసింది. దీన్ని రెండు రకాలుగా మెరుగుదిద్దారు. మొదటి ఎయిర్‌ట్యాగ్ కన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువ దూరంలో ఉన్న వస్తువులను గుర్తించేలా తీర్చిదిద్దారు. అలాగే ప్రిసిషన్ ఫైండింగ్ ఫీచర్ యాపిల్ వాచ్‌లకూ విస్తరించారు. ఐఫోన్ అందుబాటులో లేనప్పుడు వాచ్ ద్వారానే ఆయా వస్తువులను గుర్తించే అవకాశముంటుదన్నమాట.



వాచ్‌లో ఈ ఫీచర్‌ను ఎనేబుల్ చేసుకోవటానికి ముందు సైడ్ బటన్‌ను నొక్కి కంట్రోల్ సెంటర్‌ను ఓపెన్ చేయాలి. కిందికి స్క్రోల్ చేసి, ఎడిట్ మీద తాకాలి. పైన ఎడమ మూలన యాడ్ మీద తాకి, కంట్రోళ్ల యూనిట్స్‌లోకి వెళ్తే ఫైండ్ ఎయిర్‌ట్యాగ్ ఫీచర్ కనిపిస్తుంది. ఒకసారి యాడ్ చేస్తే దానికి అటాచ్ చేసిన వస్తువు గుర్తు కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యక్షమవుతుంది. ఉదాహరణకు- బ్యాక్‌పాక్‌కు ఎయిర్‌ట్యాగ్‌ను అటాచ్ చేస్తే దాని గుర్తు కనిపిస్తుంది. దీంతో తేలికగా దాన్ని గుర్తించొచ్చు.

జినీ కల్పిత ప్రపంచాన్వేషణ

గూగుల్ ప్రాజెక్ట్ జినీ అనే ఏఐ ఆధారిత వెబ్ యాప్‌ను విడుదల చేసింది. దీని ద్వారా యూజర్లు తమదైన డిజిటల్ ప్రపంచాలను క్రియేట్ చేసుకోవచ్చు. సృజనకు పదునుపెట్టి వాస్తవ ప్రపంచ వాతావరణాలను సిమ్యులేట్ చేయొచ్చు. ఎన్నడూ చూడని లోకాలను ప్రతి సృష్టించుకోవచ్చు. గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ఈ యాప్‌ను ఎక్స్‌లో విడుదల చేశారు. ఈ ప్రపంచాన్ని మించిందంటూ దీన్ని అభివర్ణించారు. ప్రాజెక్ట్ జినీతో సృష్టించిన చిన్న క్లిప్‌ను షేర్ చేసుకున్నారు కూడా. ఇందులో ఒక వ్యోమగామి భూ కక్ష్యలో అంతరిక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్నాడు.



ఎలా వాడుకోవాలి?

జినీ 3, నానో బనానా ప్రో+ జెమినై ఆధారిత ఈ ప్రాజెక్ట్ జినీ ఇతర ఏఐ టూల్స్ మాదిరిగానే పనిచేస్తుంది. కాకపోతే కొన్ని దశలుంటాయి. మొదటి దశ వరల్డ్ స్కెచింగ్. టెక్స్ట్ ప్రాంప్ట్‌లు లేదా ఇమేజెస్ అందిస్తే చాలు. టూల్‌లోని ఏఐ ఆ సమాచారంతో పరిసరాలు, పాత్రలనే కాదు.. తమదైన ప్రపంచాన్నీ సృష్టిస్తుంది. అనంతరం దాంతో ఇంటరాక్ట్ కావొచ్చు. అందులో ఏమేం ఉన్నాయో శోధించొచ్చు. లోపలికి వెళ్తున్నకొద్దీ ఏఐ అక్కడి పరిసరాలను అప్పటికప్పుడు జెనరేట్ చేస్తుంది కూడా. కావాలంటే వాస్తవ ప్రపంచ దృశ్యాలనూ ఇందులో సమ్మిళితం చేసుకోవచ్చు. వీటితో క్రియేట్ అయిన ప్రపంచాన్ని ఇష్టమున్నట్టుగా మార్చుకోవచ్చు. అయితే ఇందులో 60 సెకండ్ల పాటే విహరించే అవకాశముందని గుర్తించాలి. అన్నిసార్లూ ఇవి పూర్తిగా వాస్తవమైనవిగా కనిపించకపోవచ్చని, పాత్రలను నియంత్రించటంలో జాప్యమూ కావొచ్చని గూగుల్ హెచ్చరిస్తోంది

పాదచారులకూ మ్యాప్స్ జెమినై

గూగుల్ మ్యాప్స్ జెమినై ఏఐ ఇప్పుడు కార్లను దాటుకొని వచ్చేస్తోంది. నడిచేవారికి, సైక్లిస్టులకూ మాటలతో దారి చూపటానికి సిద్ధమైంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ పరికరాలు రెండింటిలోనూ దీన్ని వాడుకోవచ్చు. నడవటం లేదా సైకిల్ తొక్కటం మొదలెట్టినప్పుడు గూగుల్ మ్యాప్స్‌లో జెమినై గుర్తు మీద తాకి హే గూగుల్ అని పలికితే చాలు. వెంటనే ఏఐ అసిస్టెంట్ రంగంలోకి దిగుతుంది. నిర్దేశించుకున్న చోటుకు వెళ్లేటప్పుడు ఎక్కడ మలుపు తిరగాలో, ఎలా ముందుకు సాగాలో చెబుతుంది. జెమినై సపోర్టు చేసే అన్ని ప్రాంతాల్లో ఇది అందుబాటులో ఉంటుందని గూగుల్ పేర్కొంది. మ్యాప్స్ జెమినై ఒకరకంగా పర్సనల్ టూర్ గైడ్‌గా వ్యవహరిస్తుంది. నేను ఎక్కడున్నానో చెప్పమని అడిగితే మాట రూపంలో చెప్పటంతో పాటు మ్యాప్‌లో చూపిస్తుంది.



సమీపంలో మంచి హోటళ్లు ఏమేం ఉన్నాయని అడిగారనుకోండి. వాటిని రూట్‌తో పాటు హైలైట్ చేస్తుంది. సైకిల్ తొక్కేవారు ఫోన్‌ను చేత్తో తాకకుండానే 'నేను తర్వాత ఎవరిని కలవాల్సి ఉంది?' అని అడిగితే వెంటనే చెప్పేస్తుంది. మరో అరగంటలో ఉంటానని వారికి మెసేజ్ చేయమన్నా చేస్తుంది. గూగుల్ విస్తృత సేవలతో జెమినై అనుసంధానమై ఉండటం వల్ల క్యాలెండర్ ఈవెంట్ల గురించీ అడగొచ్చు. పెట్రోలు పంపులు, ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల గురించీ తెలుసుకోవచ్చు. కేవలం మాట ఆదేశంతోనే స్నేహితులకు ఎప్పుడొస్తామో తెలియజేయొచ్చు. తెర మీద చేయి పెట్టాల్సిన అవసరముండదు.

ఐఫోన్‌లో ఫొటోస్‌తో వీడియో

ఐఫోన్, ఐప్యాడ్‌లో ఫొటోలను లఘు వీడియోలుగా మార్చుకోవటానికి లైవ్ ఫొటోస్ బాగా ఉపయోగపడుతుంది. దీని ద్వారా నిశ్చల ఫొటోలను చలన దృశ్యాలుగా మలచుకోవచ్చు. కావాలంటే ఇలాంటి లఘు వీడియోలను పెద్ద వీడియోగానూ తీర్చిదిద్దుకోవచ్చు. అప్పుడది ఒకే వీడియోగా మారుతుంది. తేలికగా షేర్ చేసుకోవచ్చు. మరి దీన్ని ఎలా క్రియేట్ చేసుకోవాలో తెలుసా?

- ఫొటోస్ యాప్‌లో తెరకు కింద ఉండే కలెక్షన్స్ గుర్తు మీద తాకాలి.
- కిందికి స్క్రోల్ చేసి మెడిటైప్‌లోకి వెళ్లాలి. ఇందులో లైవ్ ఫొటోస్ మీద తాకితే ఫొటో లైబ్రరీలో స్టోర్ అయిన అన్ని లైవ్ ఫొటోస్ కనిపిస్తాయి.
- పైన కుడి మూలన సెలెక్ట్ మీద, తర్వాత వీడియోలో ఉండాలని కోరుకునే లైవ్ ఫొటోస్ మీద తాకాలి. ఎంచుకున్న అన్ని ఫొటోల మీద చెక్‌మార్క్ కనిపిస్తుంది.
- తెర మీద పైన కుడి మూలన మూడు చుక్కల బటన్‌ను తాకాలి.
- పాపప్ అయ్యే మెనూలో సేవ్ యాజ్ వీడియోను ఎంచుకోవాలి. అప్పుడు ఎంచుకున్న లైవ్ ఫొటోస్ అన్నీ ఒకే వీడియో ఫైలుగా కలిసిపోతాయి.




- క్రియేట్ చేసుకున్న వీడియోను ఎడిట్, షేర్ చేసుకోవచ్చు. ఫొటోస్ యాప్‌లో ఇతర వీడియోల మాదిరిగా ఎక్స్‌పోర్ట్ చేసుకోవచ్చు.

ఇలా చూసుకోవాలి

కొత్తగా సృష్టించుకున్న వీడియోను చూసుకోవాలంటే తిరిగి లైబ్రరీలోకి రావాలి. మీడియా టైప్స్ కింద వీడియోస్ విభాగంలో దాన్ని చూడొచ్చు. లైవ్ ఫొటోస్ తీసుకున్న ప్రకారం వీడియో తేదీ ఉంటుంది. అందువల్ల సార్ట్ బై రీసెంట్లీ యాడెడ్ ఆప్షన్‌ను చెక్ చేసుకుంటేనే కలెక్షన్‌లో తాజా వీడియోగా కనిపిస్తుంది.

స్టికీ కీస్‌తో పరేషానా?

విండోస్ పీసీ వాడేవారు పొరపాటుననో, కావాలనో ఎప్పుడో అప్పుడు స్టికీ కీస్ నోటిఫికేషన్ చూసే ఉంటారు. షిఫ్ట్ కీని ఐదు సార్లు నొక్కినప్పుడు ఇది బీప్ శబ్దంతో డైలాగ్ బాక్స్ రూపంలో ప్రత్యక్షమవుతుంది. అప్పుడేం చేయాలో పాలు పోక తికమక పడుతుంటారు. నిజానికి దీన్ని వేళ్ల కదలికలు తగ్గినవారు లేదా అసిస్టివ్ టెక్నాలజీలు వాడేవారి కోసం రూపొందించారు. కంట్రోల్ + సి, కంట్రోల్ + వి వంటివి కలిపి మనం తేలిగ్గా నొక్కుతుంటాం గానీ కదలికలు అస్తవ్యస్తమైనవారికిది కష్టమైన పనే. ఇక్కడే స్టికీ కీస్ ఫీచర్ ఆదుకుంటుంది. ఇది యాక్టివేట్ అయినప్పుడు ఆయా కీస్‌ను విడిగా నొక్కినా, ఒకేసారి నొక్కినట్టుగా పరిగణిస్తుంది. అంటే ఒకసారి కంట్రోల్, మరోసారి సి మీటలను నొక్కినా కంట్రోల్ + సి గానే తీసుకుంటుంది.



సంప్రదాయ కీబోర్డు షార్ట్‌కట్స్ వాడలేనివారికి, దివ్యాంగులకిది అనువుగా ఉంటుంది. షిఫ్ట్, కంట్రోల్, ఆల్ట్, విండోస్ మీటల కాంబినేషన్లతో స్టికీ కీస్ పనిచేస్తుంది. షిఫ్ట్ కీని ఐదు సార్లు నొక్కి, తెర మీద ప్రత్యక్షమయ్యే బాక్సులో ఎస్ మీద క్లిక్ చేస్తే ఎనేబుల్ అవుతుంది. ఒకవేళ పొరపాటున ఇది ఎనేబుల్ అయ్యి, ఇబ్బంది పెడుతుంటే తొలగించుకునే సదుపాయమూ ఉంది. సెటింగ్స్ ద్వారా యాక్సెసిబిలిటీలోకి వెళ్తే కీబోర్డు ఆప్షన్లలో స్టికీ కీస్ కనిపిస్తుంది. అప్పుడు కీబోర్డ్ షార్ట్‌కట్ ఫర్ స్టికీ కీస్ బటన్‌ను ఆఫ్ చేసుకోవాలి.

వాట్సప్ మరింత భద్రంగా..

మరింత పటిష్ఠమైన భద్రతను కల్పించే కొత్త సెక్యూరిటీ ఫీచర్‌ను వాట్సప్ తీసుకొస్తోంది. దీని పేరు స్ట్రిక్ట్ అకౌంట్. అధునాతన సైబర్ దాడుల ముప్పు ఎక్కువగా పొంచి ఉండే వృత్తి నిపుణులు, ప్రజా జీవితంలో గడిపే నాయకుల వంటి వారిని దృష్టిలో పెట్టుకొని దీన్ని డిజైన్ చేశారు. ఐఓఎస్ పరికరాల్లో ఉండే లాక్‌డౌన్ మోడ్ మాదిరిగానే ఇది పనిచేస్తుంది. సౌలభ్యం కన్నా భద్రతకే పెద్ద పీట వేస్తుంది. ఈ క్రమంలో వాట్సప్‌లోని కొన్ని ఫీచర్స్ పరిమితమవుతాయి. దీన్ని ఎనేబుల్ చేసుకుంటే వాట్సప్ దానంతటదే పలు అకౌంట్ కంట్రోళ్లను అత్యంత భద్రమైన కన్ఫిగరేషన్‌లోకి మారుస్తుంది. మీడియా ఫైళ్లు, అపరిచిత కాంటాక్టులు పంపే అటాచ్‌మెంట్లు, కాంటాక్ట్ జాబితాలో లేనివారి కాల్స్ వంటి వాటిని నిలువరిస్తుంది. సైబర్ దాడులు జరిగినప్పుడు దుర్వినియోగానికి గురికాకుండా సెటింగ్స్‌ను కఠినంగా మారుస్తుంది కూడా.

- స్ట్రిక్ట్ అకౌంట్ ఫీచర్‌తో పాటు స్పైవేర్ నుంచి రక్షణ కల్పించటానికి బ్యాక్‌గ్రౌండ్‌లో పలు మార్పులనూ వాట్సప్ ప్రకటించింది. తమ మీడియా షేరింగ్ వ్యవస్థలో రస్ట్ ప్రోగ్రామ్ లాంగ్వేజ్‌ను వాడుతున్నట్టు ధ్రువీకరించింది. వాట్సప్‌లో షేర్ చేసుకునే ఫొటోలు, వీడియోలు, మెసేజ్‌ల పటిష్ఠమైన భద్రత కోసమే ఈ ఏర్పాటు.

ఇన్‌కమ్ ట్యాక్స్ ఈమెయిలా?

జరిమానా కట్టాలంటూ ఇన్‌కమ్ ట్యాక్స్ నుంచి ఈమెయిల్ ఏమైనా వచ్చిందా? తొందరపడి దాన్ని తెరవకండి. మోసగాళ్లు ఫిషింగ్ కోసం ఇలాంటి మెయిళ్లను వాడుకుంటున్నారని సైబర్‌సెక్యూరిటీ పరిశోధకులు గుర్తించారు. హానికర ఫైళ్లను తెరిచేలా మోసగాళ్లు ఆదాయపన్ను విభాగం అధికారుల రూపంలో మోసపూరిత ఈమెయిళ్లు పంపిస్తున్నారు. పన్ను జరిమానా పేరుతో భయపెట్టి, వెంటనే ఈమెయిళ్లను తెరిచేలా చేస్తున్నారు. సైబర్ నిపుణుల నివేదిక ప్రకారం- ఫిషింగ్ మెసేజెస్‌లు జిప్ ఆర్కయివ్‌తో కూడి ఉంటున్నాయి. దీన్ని ఒకసారి డౌన్‌లోడ్ చేస్తే పలు దశల్లో ఇన్‌ఫెక్షన్ ప్రక్రియ మొదలవుతుంది. కేఆర్‌బ్యాంకర్‌గా పిలుచుకునే బ్లాక్‌మూన్ బ్యాంకింగ్ ట్రోజన్‌కు చెందిన ఒకరకాన్ని పరికరంలో జొప్పించటం దీని ఉద్దేశం. ఒక చైనా కంపెనీ రూపొందించిన సింక్‌ఫ్యూచర్ టెర్మినల్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ (టీఎస్ఎం) కూడా నిక్షిప్తమవుతుంది. సింక్‌ఫ్యూచర్ చట్టబద్ధమైనదే అయినప్పటికీ దీన్ని మోసాల కోసం దుర్వినియోగం చేసుకుంటుండటం గమనార్హం.

ఈనాడు సినిమా

కుదిరితే ప్రత్యేకమే!


పూజాహెగ్డే


సాయిపల్లవి

దక్షిణాది భాషల్లోనే కాకుండా... హిందీలోనూ సినిమాలు చేస్తున్నారు పూజాహెగ్డే, సాయిపల్లవి. ఎన్ని భాషల్లో సినిమాలు చేస్తున్నా... ఈ ఇద్దరికీ తెలుగులో ఉన్న గుర్తింపు ప్రత్యేకం. సాయిపల్లవి గతేడాది 'తండేల్'తో సందడి చేసినా, పూజాహెగ్డే మాత్రం నేరుగా తెలుగు సినిమాల్లో సందడి చేయక చాలా రోజులైంది. ప్రస్తుతం ఈ ఇద్దరి పేర్లు రెండు కీలకమైన సినిమాల విషయంలో గట్టిగా వినిపిస్తున్నాయి. త్వరలోనే పట్టాలెక్కనున్న ప్రభాస్ 'కల్కి 2' కోసం కథానాయికగా సాయిపల్లవిని ఎంపిక చేయడంపై చిత్ర బృందం దృష్టి పెట్టినట్టు సమాచారం. తొలి సినిమా 'కల్కి 2898 ఎ.డి'లో కథానాయికగా దీపికా పదుకొణె నటించిన సంగతి తెలిసిందే. కొనసాగింపు చిత్రంలో దీపిక భాగం కావడం లేదని ఇదివరకే చిత్ర బృందం ప్రకటించింది. ఆమె పాత్రని సాయిపల్లవితో కొనసాగిస్తే బాగుంటుందని చిత్రబృందం ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఆ మేరకు సంప్రదింపులు మొదలుపెట్టారట. నాని - సుజీత్ కలయికలో రూపొందనున్న కొత్త చిత్రం విషయంలో పూజాహెగ్డే పేరు ప్రచారంలో ఉంది. 'ఓజీ' సినిమాతో విజయాన్ని అందుకున్న దర్శకుడు సుజీత్...'బ్లడీ రోమియో' పేరుతో నాని కోసం ఓ స్క్రిప్టుని సిద్ధం చేశారు. ఆ సినిమా కోసమే చిత్రబృందం పూజాహెగ్డేని సంప్రదించినట్టు తెలిసింది. పాత్రలు, పారితోషికాలు... ఇలా అన్నీ కుదిరితే ఈ కలయికలో సినిమాలు ఖరారయ్యే అవకాశాలే ఎక్కువన్నది పరిశ్రమ వర్గాల మాట. కుదిరితే మాత్రం తొలిసారి జట్టు కట్టనున్న ఈ కాంబినేషన్లు ఎంతో ప్రత్యేకం కానున్నాయి.

తర్వాత ఈ సిరీస్‌తోనేనా?


నాగ చైతన్య


కథానాయకుడు నాగచైతన్య ప్రస్తుతం 'వృషకర్మ' సినిమాని ముగించే పనిలో ఉన్నారు. కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే తెరపైకి రానుంది. కానీ, దీని తర్వాత చైతన్య చేయనున్న ప్రాజెక్ట్ ఏదన్నది ఇంకా తేలలేదు. అయితే ప్రస్తుతం దీనికి సంబంధించిన ఓ ఆసక్తికర వార్త వినిపిస్తోంది. చైతూ తన హిట్ వెబ్‌సిరీస్ 'దూత'కు కొనసాగింపుగా 'దూత 2'ను పట్టాలెక్కించే సన్నాహాల్లో ఉన్నారని సమాచారం. ఇప్పటికే దర్శకుడు విక్రమ్ కె కుమార్ దీనికి సంబంధించిన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారని.. పూర్వ నిర్మాణ పనులు మొదలయ్యాయని తెలుస్తోంది. దీన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మించే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రతీకారానికి ధురంధర్ సిద్ధం


రణ్‌వీర్ సింగ్

బాక్సాఫీస్ వద్ద కలెక్షన్లతో పాటు సరికొత్త రికార్డులను సృష్టించింది 'ధురంధర్' సినిమా. రణ్‌వీర్‌సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ సినిమా ప్రేక్షకులను మెప్పించింది. దీనికి సీక్వెల్ రానున్నట్లు గతంలోనే వెల్లడించింది చిత్రబృందం. తాజాగా ఈ సీక్వెల్ 'ధురంధర్: ది రివెంజ్' పేరుతో మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుందని ప్రకటించింది. ఈ సందర్భంగా పోస్టర్, టీజర్‌లను చిత్రబృందం సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. రణ్‌వీర్ యాక్షన్ సన్నివేశాలతో ప్రారంభమైన ఈ టీజర్.. "ఇది కొత్త భారతదేశం.. సరిహద్దులను దాటి చొచ్చుకువచ్చి దెబ్బకొట్టి తీరుతుంది" అనే హీరో రివెంజ్ డైలాగ్, నేపథ్యగీతంతో ఆకట్టుకునేలా ఉంది. తొలిభాగం కేవలం హిందీలో మాత్రమే విడుదల కాగా ఈసారి ఈ సినిమాని హిందీతోపాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ విడుదల చేయనున్నారు.

ఆ పర్యటన నేర్పిన పాఠాలెన్నో!


మాధవన్

ఒకానొక టైమ్‌లో అసలేం చేస్తున్నానా.. అనే ఆలోచనతోనే చిత్ర పరిశ్రమ నుంచి కొంతకాలం విరామం తీసుకున్నట్లు నటుడు మాధవన్ తెలిపారు. 'సాలా ఖడూస్' చిత్రానికి ముందు తను చేస్తున్న పనుల కారణంగా విశ్రాంతి అవసరమనిపించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన కెరీర్‌లోని పలు జ్ఞాపకాలను పంచుకున్నారు. "నేను స్విట్జర్లాండ్‌లో ఓ పాట చిత్రీకరణ కోసం రోడ్డు మధ్యలో నిల్చున్నాను. అక్కడే కూర్చున్న ఓ రైతు మమ్మల్ని నిర్లక్ష్యంగా చూడడం గమనించాను. ఆ సన్నివేశం నాకు బాధనిపించింది. అప్పుడు అతని వైపు చూసి చెన్నైకి రా నేనెవరో నీకు చూపిస్తానని మనసులో అనుకున్నాను. కానీ, వెంటనే ఓ ఆలోచన నాలో చేరింది. నటుడిగా ఎన్నో పాత్రలు చేసి స్టార్ అయ్యాను కానీ వ్యక్తిగతం నేను ఏం సాధించాను అనే ప్రశ్న నాలో మొదలైంది. అందుకే నన్ను నేను తెలుసుకోవడానికి షూటింగ్‌లకు స్వస్తి చెప్పి దేశవ్యాప్తంగా తిరిగాను. గడ్డం పెంచుకొని సాధారణ వ్యక్తిలా చెన్నై చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు భారత్‌లోని ఎన్నో అందమైన ప్రదేశాలకు వెళ్లాను. అక్కడ రిక్షా వాళ్ల దగ్గరనుంచి ప్రతి ఒక్కరితో మాట్లాడాను. వారి జీవనశైలి, వాళ్లు చేస్తున్న పనిలో వారిని ఇబ్బంది పెట్టే విషయాల గురించి తెలుసుకున్నా. ఆ పర్యటన నాకు జీవితంలో ఎన్నో పాఠాలు నేర్పింది" అని మాధవన్ అన్నారు.

వాళ్లకు మనస్సాక్షి ఉండదా!


రకుల్ ప్రీత్ సింగ్

హిందీ చిత్రపరిశ్రమలో పబ్లిసిటీ సంస్కృతిని తీవ్రంగా విమర్శించింది నటి రకుల్ ప్రీత్ సింగ్. అంతే కాదు నటులు నిజాయతీగా పనిచేస్తే పీఆర్‌లు లేకపోయినా సొంత గుర్తింపుని పొందగలరని వ్యాఖ్యానించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ మాట్లాడుతూ.. "పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకూ మాత్రమే పనిచేయగలవు. మనం కష్టపడి పని చేసినప్పుడే ఇండస్ట్రీలో దానికి తగిన ఫలితం వస్తుంది. గతంతో పోలిస్తే హిందీ చిత్ర పరిశ్రమలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డబ్బు చెల్లించి ఇతరులపై బురద చల్లిస్తున్నారు. ఇంత నెగెటివిటీ సృష్టించే వాళ్లకు నిద్ర ఎలా పడుతుందో అని ఎప్పుడూ అనుకుంటాను. వాళ్లకు నిజంగా మనస్సాక్షి ఉండదా అనిపిస్తుంది. ఇలాంటి వాళ్లు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నేను స్వయంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను" అని అన్నారు. అంతేకాదు తాను నెలలో ఏ దుస్తులు ఎన్నిసార్లు వేసుకుంటున్నానో కూడా కొందరు ఫొటోగ్రాఫర్లు చెబుతున్నారు. ఈ విషయంలో ఓ హద్దు ఉండాలని చెప్పారు. అలానే తాను దుస్తులకు అంతగా ప్రాధాన్యం ఇవ్వనని తెలిపారు. రకుల్ తదుపరి 'పతి పత్ని ఔర్ వో దో'లో నటిస్తుంది.

రయ్.. రయ్ బైకర్


శర్వానంద్

ఈ సంక్రాంతికి 'నారీ నారీ నడుమ మురారి'తో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు కథానాయకుడు శర్వానంద్. ఇప్పుడీ వేసవిలో 'బైకర్'తో మరోమారు థియేటర్లలో సందడి చేయనున్నారు. శర్వా టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని అభిలాష్ కంకర తెరకెక్కించారు. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మించింది. మాళవిక నాయర్ కథానాయిక. ఈ సినిమాని ఏప్రిల్ 3న విడుదల చేయనున్నట్లు మంగళవారం ప్రకటించారు. ఇది మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో ముడిపడిన పీరియాడిక్ థ్రిల్లర్. ప్రేమ, కుటుంబ భావోద్వేగాలతో నిండి ఉంటుంది. హీరో రాజశేఖర్ ఇందులో ఓ ప్రత్యేక పాత్రలో అలరించనున్నారు. బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, ఛాయాగ్రహణం: జె.యువరాజ్.

పల్లెటూరి సుమతీ శతకం


అమర్ దీప్, రవితేజ

'సుమతీ శతకం' చిత్ర ట్రైలర్ తనకు బాగా నచ్చిందన్నారు కథానాయకుడు రవితేజ. ఈ సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. అమర్ దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటించిన ఈ చిత్రాన్ని ఎంఎం నాయుడు తెరకెక్కించారు. సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మించారు. ఇది మైత్రీ మూవీ మేకర్స్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే హీరో రవితేజ ఈ సినిమా ప్రచార చిత్రాల్ని చూసి.. హీరో అమర్ దీప్‌తో పాటు చిత్ర బృందాన్ని అభినందించారు. ఇది విజయాన్ని అందుకోవాలంటూ ఓ వీడియోను పంచుకున్నారు. "ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఆద్యంతం వినోదాత్మకంగా ఉంటుంది. ఎలాంటి కట్స్ లేకుండా సెన్సార్ బోర్డు నుంచి యూఏ సర్టిఫికెట్ అందుకుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సుభాష్ ఆనంద్, ఛాయాగ్రహణం: ఎస్ హాలేష్.

సంగీత దర్శకుడు ఎస్.పి.వెంకటేశ్ కన్నుమూత



పలు దక్షిణ భాషా చిత్రాలకు పనిచేసిన సంగీత దర్శకుడు ఎస్.పి.వెంకటేశ్ (70) మంగళవారం చెన్నైలో తుదిశ్వాస విడిచారు. ఆయన గుండెపోటుతో మరణించినట్లు సన్నిహితులు తెలిపారు. తమిళనాడులో జన్మించిన వెంకటేశ్ మొదట్లో ఆర్కెస్ట్రాలో పనిచేశారు. తర్వాత పలువురు సంగీత దర్శకులు వద్ద సహాయకుడిగా పనిచేశారు. 'జానకీయ కోదాతి' (1985) చిత్రం ద్వారా మలయాళ చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆయన ఆ భాషలో పలు విజయవంతమైన చిత్రాల్లోని పాటలకు సంగీతం అందించారు. మలయాళ, తమిళ, తెలుగు, కన్నడ, బెంగాలీ, హిందీ భాషల్లో 150కుపైగా చిత్రాల్లో 500లకుపైగా పాటలకు సంగీతం అందించారు. తంబి కణ్ణందనం, డెన్నిస్ జోసెఫ్, జోషి లాంటి ప్రముఖ దర్శకుల చిత్రాలకు ఎక్కువగా పనిచేశారు. ఆయన సంగీతంలోని పాటలను ఎక్కువగా కె.ఎస్.చిత్ర పాడటం గమనార్హం. వెంకటేశ్ తండ్రి పళని ఓ మాండలిన్ కళాకారుడు కావడంతో మూడేళ్ల వయసు నుంచే ఆయన వద్ద శిష్యరికం చేశారు. తర్వాత పలు సంగీత వాయిద్యాల్లో శిక్షణ పొందారు. 1993లో కేరళ ప్రభుత్వం నుంచి ఉత్తమ సంగీత దర్శకుడి పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం చెన్నైలో వెంకటేశ్ అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

– న్యూస్‌టుడే, చెన్నై

ఈ సమయంలో చెప్పాల్సిన కథే ఇది!


వినయ్‌రత్నం

"నిన్ను నువ్వు ప్రేమిస్తేనే... మరొక వ్యక్తిని మనస్ఫూర్తిగా ప్రేమించగలవని చెప్పే కథతోనే 'శ్రీ చిదంబరంగారు' చిత్రాన్ని రూపొందించా" అన్నారు వినయ్ రత్నం. ఆయన దర్శకత్వంలో... వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ జంటగా నటించిన చిత్రమిది. చింతా వినీషా రెడ్డి, చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 6న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా యువ దర్శకుడు వినయ్‌రత్నం మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

■ "పక్కవాళ్ల జీవితాల్ని చూస్తూ... 'వాళ్లకు అన్నీ ఉన్నాయి, మనకు లేవు కదా' అంటూ ఒక రకమైన అసంతృప్తితో, అభద్రతాభావంతో గడిపేవాళ్లు ఈమధ్య ఎక్కువగా తారసపడుతున్నారు. ఆత్మవిశ్వాసంగా బతకడమే మరిచిపోతున్నారు చాలామంది. ఇలాంటి సమయంలో చెప్పాల్సిన కథ అనిపించే 'శ్రీ చిదంబరంగారు' సినిమాని తెరకెక్కించా. తన కళ్లు బాగోలేవనే ఆత్మన్యూనతతో పేరు సహా, తనని తాను కోల్పోయిన ఓ యువకుడి చుట్టూ ఈ కథ తిరుగుతుంది. వినోదం, బలమైన భావోద్వేగాలు, సందేశంతో రూపొందించిన చిత్రమిది".

■ "మొదట క్రౌడ్ ఫండింగ్‌తో ఈ సినిమా చేయాలనుకున్నాం. కథ నచ్చి నిర్మాతలు ముందుకొచ్చారు. 32 రోజులపాటు రవాణా సదుపాయం కూడా సరిగ్గా లేని మారేడుమిల్లి అడవుల్లో చిత్రీకరణ చేశాం. పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌లోనే చిత్రీకరించిన సినిమా ఇది. మనం వాడుకోవాలే కానీ ఏపీలో చాలా మంచి లొకేషన్లు ఉన్నాయి. ఆరోగ్యకరమైన హాస్యం పంచడమే లక్ష్యంగా... ఏడాదిన్నరపాటు స్క్రిప్ట్‌పై పనిచేశాం. తదుపరి సినిమాని ఒక రొమాంటిక్ కామెడీ కథతో తెరకెక్కించబోతున్నా. పట్టణం నేపథ్యంలో సాగే కథ అది".

వరస కట్టనున్న వినోదాలు

నెట్‌ఫ్లిక్స్ నుంచి ఒకేసారి పలు సినిమాలు... సిరీస్‌ల ప్రకటన

ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ వేదికగా రాబోయే సినిమాలు, వెబ్ సిరీస్‌లను అధికారికంగా ప్రకటించింది. ప్రేక్షకుల్ని సీటు అంచున కూర్చోబెట్టే థ్రిల్లర్‌ల నుంచి నవ్వులు పూయించే ఫ్యామిలీ కామెడీ డ్రామాలు, రొమాంటిక్ సిరీస్‌లతో పలు జానర్లలో అలరించేందుకు సన్నద్ధమైంది. ఈ సందర్భంగా పలు సినిమాలు, సిరీస్‌లను ప్రకటిస్తూ టీజర్‌లు, ఫస్ట్‌లుక్ వీడియోలను సామాజిక మాధ్యమాలలో పంచుకుంది నెట్‌ఫ్లిక్స్ సంస్థ.


'లవ్'


'తక్షకుడు'


'ఇక్కా'


'గాంధారి'


'మేడ్ ఇన్ కొరియా'

"ఈ గుహ వెలుగు, చూపుని మాత్రమే దాచలేదు.. చాలా రహస్యాలు కూడా దాచిపెట్టింది" అంటూ హీరో ఆనంద్ దేవరకొండ, నితాన్షి గోయల్ జంటగా నటించిన 'తక్షకుడు' సినిమా టీజర్‌ను విడుదల చేసింది. అక్షరాల అరవైమంది అమ్మాయిలు! రిజెక్ట్ చేసిన సుబ్బు అనే యువకుడి పాత్రలో ఓటీటీ వేదికగా ప్రేక్షకుల్ని పలకరించనున్నాడు నటుడు సందీప్ కిషన్. మిథిల పాల్కర్, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా టీజర్ విడుదలైంది. అసలు ప్రేమలో కెమిస్ట్రీ ముఖ్యమా? లేదా ఒకరినొకరు అర్థం చేసుకోవడం ముఖ్యమా? అంటూ అర్జున్ దాస్, ఐశ్వర్య లక్ష్మి ప్రధాన పాత్రలో రూపొందిన సిరీస్ 'లవ్' టీజర్ బయటకొచ్చింది. కొరియా వెళ్లాలనే అమ్మాయిగా కలలు కంటూ 'మేడ్ ఇన్ కొరియా' సినిమాతో అక్కడి సంస్కృతిని పరిచయం చేయనుంది నటి ప్రియాంక మోహన్. ఆమె ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రమిది. ప్రేమ కోసం చూస్తూ.. నిన్ను నువ్వు తెలుసుకున్నావ్ అంటూ 'ముసాఫిర్ కేఫ్' టీజర్ విడుదలైంది. ఇందులో విక్రాంత్ మాస్సే, వేదిక పింటో, మహిమ మక్వానా ప్రధాన పాత్రల్లో నటించారు. చట్టమా లేక రక్త సంబంధమా.. ఈ ఆటలో అధిపతి ఎవరంటూ.. సన్నీదేఒల్, అక్షయ్ ఖన్నా 'ఇక్కా' సినిమాతో అలరించనున్నారు. మొట్టమొదటి ఎన్నికల గురించి ఇప్పటి వరకూ చెప్పని కథగా 'హమ్ హిందుస్తానీ' తెరకెక్కింది. ఈ సినిమాలో సైఫ్ అలీఖాన్, ప్రతీక్ గాంధీ, దీపక్‌లు నటించారు. ఆర్.మాధవన్, అభిషేక్ బెనర్జీ, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన పొలిటికల్ డ్రామా 'లెగసీ'. తాప్సీ ప్రధాన పాత్రలో 'గాంధారి', రాజ్‌కుమార్ రావు, సన్యా మల్హోత్రా నటించిన 'టోస్టర్', 'హలో బచ్చే', 'దిండోరా 2'. అనిల్ కపూర్, విజయ్ వర్మ 'ఫ్యామిలీ బిజినెస్' లాంటి పలు చిత్రాలు, సిరీస్‌లను నెట్‌ఫ్లిక్స్ త్వరలోనే వీక్షకులకు అందుబాటులోకి తీసుకురానుంది.

నేను ఎక్కువగా వాడే పదం అది


దీపికా పదుకొణె

"నేను రోజూ ఎక్కువగా వాడే పదం ఐ లవ్ యు. అది కూడా నా కూతురి కోసమే" అని అంటోంది హిందీ తార దీపికా పదుకొణె. కథల ఎంపికలో ఆచితూచి అడుగులేసే కథానాయికీమె. ప్రస్తుతం ఓవైపు తల్లిగా తన బాధ్యతల్ని నిర్వర్తిస్తూనే.. రాబోయే ప్రాజెక్టుల కోసం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దీపిక తన కుమార్తె గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "ఇప్పుడు నా ప్రపంచమంతా నా కూతురు దువా చుట్టూనే తిరుగుతుంది. ఆమె నాకు అన్నింటికన్నా ఎక్కువ" అంది. అలానే నేర్చుకోవడం అనేది రోజువారీ జీవితంలో భాగం కావాలని చెబుతోంది దీపిక. "కెరీర్ మొదట్లో పరిశ్రమను, కళను, మాధ్యమాన్ని అర్థం చేసుకోవడంపైనే ఉండేది. ఇప్పుడు పరిశ్రమలో మరింత మెరుగ్గా ఎలా రాణించాలో ఆలోచిస్తున్నా. అందుకే నేర్చుకోవడం ఎప్పుడూ ఆగకూడదు" అని చెప్పుకొచ్చింది దీపిక.

ఈనాడు బిజినెస్

హెలికాప్టర్ల తయారీలోకి అదానీ గ్రూప్

ఇటలీ సంస్థ లియోనార్డోతో భాగస్వామ్యం



మన దేశంలో హెలికాప్టర్ తయారీ సమగ్ర వ్యవస్థను నెలకొల్పడానికి అదానీ గ్రూప్, ఇటలీకి చెందిన దిగ్గజ సంస్థ లియోనార్డో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి. 'భారత్‌లో తయారీ' ప్రయత్నాలకు, స్వావలంబన లక్ష్యాలను సాధించడానికి ఈ పరిణామం గణనీయంగా తోడ్పడుతుందని పేర్కొన్నాయి. సైనిక అవసరాలకు తగిన హెలికాప్టర్లను ఉత్పత్తి చేస్తామని తెలిపాయి. దిల్లీలో జరిగిన కార్యక్రమంలో అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, లియోనార్డో అధికారులు భాగస్వామ్య అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. భారత సాయుధ దళాల అవసరాలకు అనుగుణంగా లియోనార్డో అధునాతన ఏడబ్ల్యూ 169ఎం, ఏడబ్ల్యూ 109 ట్రెక్కర్‌ఎం హెలికాప్టర్లను తయారు చేస్తారు. దశలవారీగా స్వదేశీకరణతో పాటు బలమైన నిర్వహణ, మరమ్మతు (ఎంఆర్‌ఓ) సామర్థ్యాలను, పైలట్ శిక్షణను కూడా ఈ భాగస్వామ్యం అందిస్తుంది.

ఏటా 100 హెలికాప్టర్లు అవసరం: ప్రస్తుతం దేశంలో 250 హెలికాప్టర్లున్నాయి. వచ్చే పదేళ్ల పాటు మన దేశానికి ఏటా 100 హెలికాప్టర్లు అవసరమవుతాయని అంచనా. పౌర, రక్షణ అవసరాలకు అనుగుణంగా సమగ్ర విమానయాన వ్యవస్థకు పునాది వేస్తున్నట్లు అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ డైరెక్టర్ జీత్ అదానీ తెలిపారు.

కోడి గుడ్లు

4న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	485
వరంగల్	487
విజయవాడ	500
తూ/ప గోదావరి	475
విశాఖపట్నం	490
చిత్తూరు	563

బుల్లెట్‌లా అమెరికా డీల్

అనుకోని ఆనందం.. ఊహించని సంబరం. బుల్ రంకేసింది. అలా ఇలా కాదు. ఒక్కరోజే ఏకంగా 2000 పాయింట్లకు పైగా దూసుకెళ్లింది. భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందం ప్రకటన నేపథ్యంలో, షార్ట్ కవరింగ్ కొనుగోళ్లతో దాదాపు అన్ని రంగాల షేర్లు కళకళలాడాయి. బ్యారెల్ ముడిచమురు ధర 1.5% పెరిగి 67 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి.



8 నెలల్లోనే అతిపెద్ద లాభం

సెన్సెక్స్ ఉదయం 3656 పాయింట్ల (క్రితం ముగింపు 81,666.46) లాభంతో 85,323.20 పాయింట్ల వద్ద దూకుడుగా ప్రారంభమైంది. అదే జోరులో 4,205.27 పాయింట్లు పెరిగి 85,871.73 వద్ద ఇంట్రాడేలో గరిష్ఠాన్ని తాకింది. చివరకు 2,072.67 పాయింట్లు పెరిగి 83,739.13 వద్ద ముగిసింది. గత 8 నెలల్లో సూచీకిదే ఒకరోజు అతిపెద్ద లాభం. నిఫ్టీ 639.15 పాయింట్లు రాణించి 25,727.55 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 26,341.20 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది.

● **28 షేర్లకు లాభాలు:** సెన్సెక్స్ 30 షేర్లలో 28 పరుగులు తీశాయి. అదానీ పోర్ట్స్ 9.12%, బజాజ్ ఫైనాన్స్ 6.68%, ఇండిగో 5.51%, పవర్ గ్రిడ్ 4.85%, సన్‌ఫార్మా 4.54%, బజాజ్ ఫిన్‌సర్వ్ 4.29%, ఎస్‌బీఐ 3.48%, రిలయన్స్ 3.43%, ఎల్ అండ్ టీ 2.95%, యాక్సిస్ బ్యాంక్ 2.86%, టైటన్ 2.80%, ట్రెంట్ 2.78% లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, బీఈఎల్ స్వల్పంగా నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. సేవలు 4.86%, స్థిరాస్తి 4.79%, విద్యుత్ 4.79%, యుటిలిటీస్ 3.92%, యంత్ర పరికరాలు 3.71%, పరిశ్రమలు 3.44%, వినియోగ 3.06%, లోహ 2.85%, ఆరోగ్య సంరక్షణ 2.83%, ఆర్థిక సేవలు 2.83% రాణించాయి. బీఎస్ఈలో 3279 షేర్లు లాభపడగా, 1015 స్క్రిప్‌లు నష్టపోయాయి. 142 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

● **రూపాయి జోరు:** వాణిజ్య ఒప్పందం కుదరడంతో, మళ్లీ విదేశీ మదుపర్లు మన మార్కెట్లలో కొనుగోళ్లకు దిగారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి రాణించేందుకు ఇదీ ఒక కారణమైంది. ఆసియాలో ఎక్కువ రాణించిన కరెన్సీగా రూపాయి నిలిచింది. డాలర్‌తో పోలిస్తే 117 పైసలు పెరిగి 90.32 వద్ద ముగిసింది. గత రెండున్నర వారాల్లో రూపాయికిదే గరిష్ఠ స్థాయి. చమురు ధరలు తగ్గడమూ కలిసొచ్చింది.

● బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ ఒక్కరోజులో రూ.12.10 లక్షల కోట్లు పెరిగి రూ.467.14 లక్షల కోట్ల (5.16 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

వాణిజ్య ఒప్పందం ప్రభావిత షేర్లు ఇలా..

● జౌళి షేర్లలో గోకల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్ 20%, వెల్‌స్పన్ లివింగ్ 19.85%, గర్వారే టెక్నికల్ ఫైబర్స్ 17.07%, కేపీఆర్ మిల్స్ 15.31%, ఎస్‌పీ అపరెల్స్ 14.19%, ట్రైడెంట్ 11.27%, అరవింద్ 10.23%, పేజ్ ఇండస్ట్రీస్ 3.79%, రేమండ్ లైఫ్‌స్టైల్ 3.39% మెరిశాయి.

● తోళ్లు, పాదరక్షల షేర్లు చూస్తే.. భారతీయ ఇంటర్నేషనల్ 6.37%, మయూర్ యునికోటర్స్ 7.73%, మెట్రో బ్రాండ్స్ 0.41%, బాటా ఇండియా 0.23% పెరిగాయి.

● సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేసే అవంతీ ఫీడ్స్, అపెక్స్ ఫ్రోజెన్ 20% దూసుకెళ్లి వరుసగా రూ.960.60, రూ.351.10 దగ్గర స్థిరపడ్డాయి. జీల్ అక్వా 10.58%, కింగ్స్ ఇన్‌ఫ్రా 7.62%, ముక్కా ప్రోటీన్స్ 5.01%, కోస్టల్ కార్పొరేషన్ 5% లాభపడ్డాయి.

● స్పెషాలిటీ రసాయనాల షేర్లలో ఆర్తి ఇండస్ట్రీస్ 15.10%, గుజరాత్ ఫ్లోరోకెమికల్స్ 6.82%, నవీన్ ఫ్లోరిన్ 6.22%, నియోజెన్ కెమికల్స్ 6.19%, అతుల్ 5.25%, వినతీ ఆర్గానిక్స్ 4.67%, ఎస్ఆర్ఎఫ్ 3.76% రాణించాయి.

● రత్నాభరణాల షేర్లలో గోల్డియం ఇంటర్నేషనల్ 20%, వైభవ్ గ్లోబల్ 9.13%, కల్యాణ్ జువెలర్స్ 4.91%, శ్రీంగార్ హౌస్ 4.51%, టైటన్ 2.80%, పీఎన్ గాడ్గిల్ 1.52%, పీసీ జువెలర్ 0.29% మెరిశాయి.

● వాహన విడిభాగాల షేర్లలో బెల్‌రైజ్ 7.37%, భారత్ ఫోర్జ్ 6.56%, సంవర్ధన మదర్‌సన్ 6.33%, సోనా బీఎల్‌డబ్ల్యూ 6.13%, సుందరం ఫాజనర్స్ 4.01%, బాష్ 3.10%, యునో మిండా 2.86% కళకళలాడాయి.

● **అదరగొట్టిన అదానీ షేర్లు:** అదానీ గ్రూప్ షేర్లు మంగళవారం అదరగొట్టాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 10.61%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 10.38%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 10.23%, అదానీ పోర్ట్స్ 9.12%, అదానీ పవర్ 6.76%, అదానీ టోటల్ గ్యాస్ 4.52%, సంఘీ ఇండస్ట్రీస్ 3.60%, అంబుజా సిమెంట్స్ 3.45%, ఎన్‌డీటీవీ 2.91%, ఏసీసీ 2.08% చొప్పున లాభాలు నమోదుచేశాయి. అదానీ గ్రూప్ నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.13.78 లక్షల కోట్లుగా నమోదైంది.

అంగరంగ వైభోగమే!!

● అమెరికా టారిఫ్ కోతతో ఎగుమతుల్లో దూకుడే ● కార్మిక ఆధారిత పరిశ్రమలకు సానుకూలతలు
● రత్నాభరణాలు, జౌళి-దుస్తులు, ఆక్వాకు పునరుత్తేజం ● అనిశ్చితి తొలగి కొత్త ఆర్డర్లకు అవకాశం

మన దేశానికి ఐరోపా సమాఖ్య (ఈయూ)తో ఇటీవలే వాణిజ్య ఒప్పందం కుదరగా.. తాజాగా అమెరికాతో కుదురుతోంది. మన ఉత్పత్తులపై టారిఫ్‌ను 50% నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఇది ఎప్పటినుంచి అమల్లోకి వచ్చేదీ తెలుపలేదు. 500 బిలియన్ డాలర్ల (సుమారు రూ.45 లక్షల కోట్ల)కు పైగా విలువైన చమురు, బొగ్గు, సాంకేతికత, వ్యవసాయ ఉత్పత్తులను అమెరికా నుంచి భారత్ కొంటుందని, రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ ఆపేస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అమెరికా నుంచి భారత్ ఏయే వ్యవసాయ ఉత్పత్తులు కొనేదీ వెల్లడికాలేదు. 2024లో వ్యవసాయ ఉత్పత్తుల పరంగా భారత్‌తో ఉన్న 1.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.11,700 కోట్ల) అంతరాన్ని ఈ ఒప్పందం తగ్గిస్తుందని అమెరికా వ్యవసాయ మంత్రి బ్రూక్ రోలిన్స్ వెల్లడించారు. అమెరికా నుంచి కొన్ని వ్యవసాయ ఉత్పత్తులకు అనుమతిస్తామని భారతీయ ఉన్నతాధికారి ఒకరు చెప్పినట్లు వార్తా సంస్థలు తెలిపాయి. మనుషులు తినేందుకు వినియోగించేవి కాకుండా ఇథనాల్ ఉత్పత్తికి, పశు పోషణ పదార్థాల తయారీలో వినియోగించేందుకు మొక్కజొన్న -సోయాను కొంతమేర అనుమతించొచ్చని సమాచారం.

✦ జీఎం యేతర మొక్కజొన్న, సోయాలు అమెరికాలో పరిమితంగా పండుతూ, ఖరీదు ఎక్కువగా ఉంటాయి. కావాలంటే వీటికి కొంత అనుమతులు ఇస్తారనే ఊహాగానాలున్నాయి. ✦ రష్యా చమురు కొనుగోళ్లను భారత్ ఎప్పటిలోగా నిలిపివేస్తుందనేదీ తేలలేదు.

ఇవన్నీ లాభమే: దేశంలో తయారీ రంగానికి మాత్రం అమెరికా ఒప్పందంతో నేరుగా ప్రయోజనాలు దక్కనున్నాయి. మార్కెట్ మళ్లీ విస్తృతం కానుంది. కార్మిక ఆధారిత రంగాలైన రత్నాభరణాలు, జౌళి, దుస్తులు వంటి వాటికి గొప్ప ఊరట దక్కినట్లే. కొత్త, నాణ్యమైన ఉద్యోగాలు ఈ రంగాల్లో వస్తాయని కేంద్రం విశ్వసిస్తోంది. రూపాయి బలహీనతలు కూడా ఎగుమతిదార్లకు కలిసి వచ్చే అంశం.

జౌళి.. రెండంకెల వృద్ధి ఖాయం: మన జౌళి ఎగుమతుల గమ్యస్థానాల్లో ముందు వరుసలో అమెరికా, ఈయూ, బ్రిటన్ ఉన్నాయి. ఈ దేశాలకు 2024-25లో ఏకంగా 20.7 బి. డాలర్ల (దాదాపు రూ.1.88 లక్షల కోట్ల) విలువైన జౌళి ఎగుమతులను మన దేశం చేసింది. ఇందులో మూడో వంతు అమెరికాకే వెళ్లాయి. తాజా నిర్ణయంతో సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి కంపెనీ(ఎమ్ఎస్ఎమ్ఈ)లకు గొప్ప ఊరట దక్కినట్లే. కొద్ది త్రైమాసికాల్లోనే ఎగుమతులు రెండంకెల్లో పెరగొచ్చనే ఆశాభావం వ్యక్తమవుతోంది. చైనా తర్వాత దుస్తుల ఎగుమతులు అధికంగా చేసే బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితులూ మనకు కలిసి రావొచ్చు.

ఈ రంగం మనకు ఎంత ముఖ్యమంటే

✦ మన వస్తు ఎగుమతుల్లో 8.37% వాటా జౌళిదే. ✦ 2024-25లో జౌళి-దుస్తుల ఎగుమతుల విలువ 36.61 బిలియన్ డాలర్లు (సుమారు రూ.2.6 లక్షల కోట్లు).



✦ అంతర్జాతీయ జౌళి-దుస్తుల మార్కెట్‌లో భారత వాటా 3.9%.

రత్నాభరణాలపై సున్నా సుంకం!



లూజ్ డైమండ్లు, కలర్డ్ జెమ్ స్టోన్ల ఎగుమతిపై సున్నా సుంకం ప్రయోజనాలను అమెరికా అందించగలదని రత్నాభరణాల ఎగుమతి ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) ఛైర్మన్ కిరీట్ బన్సాలీ ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాల వల్ల ఆభరణాలపై 55-57% భారం పడిందని గుర్తు చేశారు. ఇవి తొలగితే చిన్న, మధ్య స్థాయి కంపెనీలకు నేరుగా ప్రయోజనాలు దక్కుతాయని, వేల మంది వ్యాపారులకు తలుపులు తెరచినట్లవుతుందన్నారు. ఆర్డర్లు పెరుగుతాయని వివరించారు.

థాయ్‌లాండ్, పాకిస్థాన్‌తో మన బియ్యం పోటీ



అధిక టారిఫ్‌లున్నా, అమెరికాకు మన బియ్యం ఎగుమతులు పెరిగాయి. అక్కడి కొనుగోలుదార్ల ఆదరణే ఇందుకు కారణం. ఇపుడు టారిఫ్ 18 శాతానికి తగ్గడంతో, పోటీ దేశాలైన థాయ్‌లాండ్, పాకిస్థాన్ (ఈ రెండింటిపై 19% టారిఫ్ ఉంది) కంటే అధిక ప్రయోజనం లభిస్తుంది. 2025-26 పంట కాలం(జులై-జూన్)లో రికార్డు స్థాయిలో 149 మిలియన్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందన్న అంచనాలుండగా, ప్రస్తుత పరిణామం ఎంతో సానుకూలమని భారతీయ బియ్యం ఎగుమతిదార్ల సమాఖ్య (ఐఆర్ఈఎఫ్) వ్యాఖ్యానించింది.

✦ 2025-26 ఏప్రిల్-నవంబరులో 1.99 లక్షల టన్నుల బాస్మతీ బియ్యం, 40,960 టన్నుల బాస్మతీయేతర బియ్యాన్ని అమెరికాకు మనం ఎగుమతి చేశాం. 2024-25 మొత్తంమీద ఈ ఎగుమతులు వరుసగా 2.74 లక్షల టన్నులు, 61,341 టన్నులుగా ఉన్నాయి.

'ఆక్వా'కు పునరుత్తేజం



అధిక టారిఫ్‌ల వల్ల 2025 ఏప్రిల్-నవంబరులో అమెరికాకు చేపల ఎగుమతులు 15% తగ్గి 2.01 లక్షల టన్నులకు పరిమితమయ్యాయి. విలువ పరంగా 6.3% తగ్గి 1.72 బి. డాలర్లు (దాదాపు రూ.15,650 కోట్లు)గా నమోదయ్యాయి. టారిఫ్ తగ్గితే, ఈ ఎగుమతులకు పునర్వైభవం కలుగుతుందని సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఈఏఐ) అంటోంది.

✦ మన సముద్ర ఉత్పత్తులకు చైనా, ఈయూ తర్వాత అమెరికాయే పెద్ద గమ్యస్థానం. మొత్తం ఎగుమతుల్లో ఫ్రోజెన్ ఫిష్ వాటా 83%.

'ఎలక్ట్రానిక్స్'కు ఢోకా లేదు



టారిఫ్‌లు తగ్గితే, అంతర్జాతీయ తయారీ, ఎగుమతి కేంద్రంగా మనదేశం కొనసాగుతుందని మొబైల్ పరిశ్రమ సంఘం ఐసీఈఏ అభిప్రాయపడింది. మొబైల్, సెమీకండక్టర్ వంటి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు టారిఫ్ నుంచి పూర్తి మినహాయింపు కొనసాగుతుందనే అంచనా. 2024-25లో భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 37.5% పెరిగి రూ.3.3 లక్షల కోట్లకు చేరుకున్నాయి. మొబైళ్ల తయారీ 30 రెట్లు పెరిగి రూ.5.45 లక్షల కోట్లకు చేరుకుంది.

- ఈనాడు వాణిజ్య విభాగం

ఇతర దేశాలతో పోల్చుకుంటే మనకు ప్రయోజనాలున్నాయ్

అమెరికాలోకి వస్తువులను ఎగుమతి చేసే వివిధ దేశాలతో పోల్చుకుంటే, మన దేశానికి టారిఫ్‌ల రూపేణ ఉపశమనం కలిగినట్లే.

మనకంటే ఈ దేశాలపై అధిక టారిఫ్‌లు	
బ్రెజిల్	50%
మయన్మార్	40%
లావోస్	40%
చైనా	37%
దక్షిణాఫ్రికా	30%

మనకన్నా తక్కువ టారిఫ్ ఉన్న ప్రధాన దేశాలు	
ఐరోపా సమాఖ్య	15%
జపాన్	15%
దక్షిణ కొరియా	15%
స్విట్జర్లాండ్	15%
యునైటెడ్ కింగ్‌డమ్	10%

దక్షిణాసియాలోని మన పోటీ దేశాలపై టారిఫ్‌లు: బంగ్లాదేశ్ - వియత్నాంపై 20%; పాకిస్థాన్, మలేషియా, కంబోడియా, థాయ్‌లాండ్‌పై 19%

అమెరికాకు మన ప్రధాన ఎగుమతులివే

విభాగం	విలువ(బి. డాలర్లలో)
డ్రగ్ ఫార్ములేషన్స్, బయోలాజికల్స్	8.1
టెలికాం ఇన్‌స్ట్రుమెంట్స్	6.5
విలువైన, పాక్షిక విలువైన స్టోన్స్	5.3
పెట్రోలియం ఉత్పత్తులు	4.1
వాహన, విడిభాగాలు	2.8
పసిడి, ఇతర విలువైన ఆభరణాలు	2.7
రెడీమేడ్ దుస్తులు, యాక్సెసరీలు	2.8
ఇనుము-ఉక్కు ఉత్పత్తులు	2.7

అమెరికా నుంచి దిగుమతులు

విభాగం	విలువ(బి. డాలర్లలో)
ముడి చమురు	4.5
పెట్రోలియం ఉత్పత్తులు	3.6
బొగ్గు, కోక్	3.4
కట్, పాలిష్డ్ వజ్రాలు	2.6
ఎలక్ట్రిక్ మెషినరీ	1.4
విమాన, స్పేస్‌క్రాఫ్ట్, విడిభాగాలు	1.3
పసిడి	1.3

(2024 గణాంకాలు)

ద్వైపాక్షిక వాణిజ్యం ఇలా..

2021-25 మధ్య భారత్‌కు అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. భారత మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా 18%.

186 బి. డాలర్లు: 2024-25లో ద్వైపాక్షిక వాణిజ్య విలువ ఇది

అమెరికాతో వాణిజ్య మిగులే

2024-25లో అమెరికాతో వస్తువుల పరంగా భారత్ వాణిజ్య మిగులు విలువ 41. బి. డాలర్లు (సుమారు రూ.3.70 లక్షల కోట్లు). సేవల విషయానికొస్తే.. భారత్ 28.7 బి. డాలర్ల (సుమారు రూ.2.58 లక్షల కోట్లు) సేవలను ఎగుమతి చేయగా.. 25.5 బి. డాలర్ల సేవలను దిగుమతి చేసుకుంది. అంటే రూ.28,800 కోట్ల మిగులు ఏర్పడింది. మొత్తం మీద వాణిజ్య మిగులు 44. బి. డాలర్లు (రూ.3.96 లక్షల కోట్లు)గా ఉంది.

అమెరికాకు నాట్కో క్యాన్సర్ ఔషధం

ఈనాడు, హైదరాబాద్: క్యాన్సర్ చికిత్సలో వినియోగించే ఎర్డాఫిటినిబ్ జనరిక్ ఔషధానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ ఎఫ్‌డీఏ) నుంచి తాత్కాలిక అనుమతి లభించినట్లు హైదరాబాద్ సంస్థ నాట్కో ఫార్మా వెల్లడించింది. జాన్సన్ బయోటెక్ ఇంక్‌కు చెందిన బల్వెర్సా మందుకు ఇది జనరిక్ రూపం. నాట్కో ఫార్మా ఈ ఔషధాన్ని 3, 4, 5 మిల్లీ గ్రాముల మోతాదుల్లో విడుదల చేస్తుంది. వయోజనుల్లో వచ్చే అరుదైన క్యాన్సర్ చికిత్సకు ఈ ఔషధాన్ని వినియోగిస్తారు. శస్త్రచికిత్స ద్వారా తొలగించలేని, శరీరంలోని ఇతర భాగాలకు విస్తరించిన యూరోథెలియల్ కార్సినోమా బాధితులకు ఇది ఉపశమనం కలిగిస్తుంది. అమెరికా మార్కెట్లో ఎర్డాఫిటినిబ్‌కు గిరాకీ అధికంగా ఉంది. సెప్టెంబరుతో ముగిసిన 12 నెలల కాలంలో ఈ ఔషధ విక్రయాలు సుమారు రూ.541 కోట్లు (60 మిలియన్ డాలర్లు)గా నమోదయ్యాయి.

5 ఏళ్లలో రూ.2,000 కోట్ల పెట్టుబడి: గ్లాండ్ ఫార్మా

ఈనాడు, హైదరాబాద్: భవిష్యత్తు వృద్ధి కోసం రాబోయే అయిదేళ్లలో దాదాపు రూ.2,000 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్లు గ్లాండ్ ఫార్మా వెల్లడించింది. ఈ నిధులను అత్యాధునిక బ్లో-ఫిల్-సీల్ (బీఎఫ్ఎస్) సాంకేతికత, కంటి ఔషధాల లైన్ల ఏర్పాటుకు వినియోగించనుంది. సంక్లిష్టమైన ఇంజెక్టబుల్స్, బయోసిమిలర్స్, అధిక విలువ కలిగిన ఉత్పత్తులపై దృష్టి సారిస్తున్నామని సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ శ్రీనివాస్ సాదు తెలిపారు. కంపెనీ తన ఫిల్లింగ్ సామర్థ్యాన్ని ప్రస్తుత 4 కోట్ల నుంచి 14 కోట్ల యూనిట్లకు పెంచుతోందని వెల్లడించారు.

ఎన్‌ఎండీసీ డివిడెండ్ రూ.2.50

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని గనుల సంస్థ ఎన్‌ఎండీసీ, డిసెంబరు త్రైమాసికంలో రూ.7,983.38 కోట్ల ఆదాయంపై రూ.1,747.01 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.6,942.92 కోట్లు, నికర లాభం రూ.1,896.66 కోట్లుగా ఉన్నాయి. వ్యయాలు కూడా రూ.4,359.07 కోట్ల నుంచి రూ.5,608.54 కోట్లకు పెరిగాయి. రూ.1 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.2.50 చొప్పున మధ్యంతర డివిడెండ్ ఇచ్చేందుకు బోర్డు ఆమోదం తెలిపింది.

హైదరాబాద్‌లో జీఐ ఔట్‌సోర్సింగ్ జీసీసీ

ఈనాడు, హైదరాబాద్: అకౌంటింగ్ సేవలను అందించే జీఐ ఔట్‌సోర్సింగ్, హైదరాబాద్‌లో తన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)ని ప్రారంభించింది. కోవాసెంట్‌కు చెందిన ఎనేబ్లర్ భాగస్వామ్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కృత్రిమ మేధ ఆధారిత విధానాలతో రూపొందించిన ఈ జీసీసీ ద్వారా భారత్‌లో తమ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయాలని, యూకే - ఇతర అంతర్జాతీయ వినియోగదారులకు వేగంగా సేవలు అందించాలని జీఐ ఔట్‌సోర్సింగ్ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం 50 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు ప్రారంభించింది. రాబోయే 12 నెలల్లో ఈ సంఖ్యను 100కు పెంచనుంది.

ఎన్‌ఎస్‌ఈ రూ.23,000 కోట్ల ఐపీఓ!

మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి రావడంతో, ఐపీఓ ప్రక్రియను నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) ప్రారంభించనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఐపీఓ గురించి చర్చించేందుకు శుక్రవారం ఎన్ఎస్ఈ బోర్డు సమావేశం కానుంది. త్వరలో ఐపీఓ కమిటీని ఎన్ఎస్ఈ బోర్డు ఏర్పాటు చేయనుంది. నమోదు ప్రక్రియ, మర్చంట్ బ్యాంకర్లు, న్యాయ సలహాదార్ల నియామకాలను ఈ కమిటీ నిర్ణయించనుంది. సెప్టెంబరు త్రైమాసిక ఫలితాల ఆధారంగా, మార్చి చివరకు ముసాయిదా పత్రాలను ఎన్ఎస్ఈ దాఖలు చేసే అవకాశం ఉంది. ఐపీఓలో భాగంగా కంపెనీలో 4.5% వాటాకు సమానమైన షేర్లను రూ.23,000 కోట్లకు విక్రయించాలని ఈ ఎక్స్ఛేంజీ భావిస్తోంది.

✦ కృత్రిమ మేధ (ఏఐ) సొల్యూషన్స్ అందించే సంస్థ ఫ్రాక్టల్ అనలిటిక్స్ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ఈ నెల 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఐపీఓ పరిమాణాన్ని ముందుగా అనుకున్న రూ.4,900 కోట్ల నుంచి రూ.2,834 కోట్లకు తగ్గిస్తున్నట్లు కంపెనీ తెలిపింది. యాంకర్ మదుపర్లు ఈ నెల 6న తమ బిడ్లు దాఖలు చేసుకోవచ్చు. ఇష్యూలో భాగంగా రూ.1,023.5 కోట్ల విలువైన తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో రూ.1,810.4 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. ఐపీఓ ధరల శ్రేణిని బుధవారం ప్రకటించే అవకాశం ఉంది.



✦ వాహన విడిభాగాల తయారీదారు ధూత్ ట్రాన్స్‌మిషన్, ఐపీఓ ద్వారా 250 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.2,258 కోట్లు) సమీకరించేందుకు కాన్ఫిడెన్షియల్ ప్రీ-ఫైలింగ్ మార్గంలో సెబీ వద్ద దరఖాస్తు చేసుకుంది.

✦ ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్‌లో 14.3% వాటా కోసం రూ.2,750 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ ప్రకటించింది. లావాదేవీ తర్వాత ఆదిత్య బిర్లా హౌసింగ్‌లో ఆదిత్య బిర్లా క్యాపిటల్ వాటా 85.7 శాతానికి తగ్గనుంది.

✦ అదానీ గ్రూప్ సంస్థ అంబుజా సిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కపూర్ పదవీ విరమణ చేశారు. జనవరి 31 నుంచి అమల్లోకి వచ్చిందని కంపెనీ తెలిపింది.

జియో బ్లాక్‌రాక్ సంపద నిర్వహణ సేవలు

ప్రారంభ రుసుము ఏడాదికి రూ.350

ముంబయి: దేశీయ సంపద నిర్వహణ పరిశ్రమలో 20 కోట్ల మందికి సేవలు అందించే అవకాశం ఉందనే అంచనాతో, జియో బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ 'ప్రత్యేకించిన సూచనలు అందించడానికి' ఒక టెక్ ప్లాట్‌ఫామ్‌ను మంగళవారం ప్రారంభించింది. ఈ సేవల కోసం వినియోగదారులు ఏడాదికి రూ.350 ప్రారంభ ధర చెల్లించాల్సి ఉంటుంది. బ్లాక్‌రాక్ అలాడిన్ టెక్నాలజీతో నడిచే ఈ ప్లాట్‌ఫామ్, మ్యూచువల్ ఫండ్ ఎంపికలపై సలహాలు అందిస్తుంది. అంతర్జాతీయంగా 14 లక్షల కోట్ల డాలర్లకు పైగా ఆస్తులను నిర్వహిస్తూ, మన దేశంలో జియోతో కలిసి బ్లాక్‌రాక్.. పెట్టుబడి సలహా వేదికను తీసుకొచ్చింది. ఇందులో నమోదైన వినియోగదారుల రిస్క్ ప్రొఫైల్, పెట్టుబడి లక్ష్యాలను తెలుసుకుని, వారికి సలహాలను అందించడానికి ఈ ప్లాట్‌ఫామ్ ప్రయత్నిస్తుందని కంపెనీ తెలిపింది. రోజువారీ పర్యవేక్షణ ఉంటుందని పేర్కొంది. రూ.లక్ష విలువైన పర్యవేక్షణ ఆస్తులకు ఏడాదికి రూ.350 చెల్లించాలి. తదుపరి ఆస్తుల విలువలో 0.35% చొప్పున రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ప్రారంభంలో తొలి 3 నెలలు ప్లాట్‌ఫామ్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చని కంపెనీ ఎండీ, సీఈఓ మార్క్ పిల్గ్రెమ్ వెల్లడించారు.

త్వరలో బ్లేడ్ బ్యాటరీ బస్సులు

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ వెల్లడి



ఈనాడు, హైదరాబాద్: అత్యాధునిక బ్లేడ్ బ్యాటరీ సాంకేతికతతో కూడిన విద్యుత్ బస్సుల ఉత్పత్తిని వచ్చే త్రైమాసికంలో ప్రారంభిస్తామని ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ మేనేజింగ్ డైరెక్టర్ మహేష్ బాబు సుబ్రమణియన్ తెలిపారు. దేశీయ విద్యుత్ వాహన రంగంలోనే తొలిసారిగా, ఒలెక్ట్రా అభివృద్ధి చేసిన బ్లేడ్ బ్యాటరీ ప్యాక్‌కు అధికారిక ధ్రువీకరణ లభించడం తమకు దక్కిన విజయంగా పేర్కొన్నారు. 'బ్యాటరీల్లోని మాడ్యూల్స్ స్థానంలో సన్నగా, పొడవుగా ఉండే లిథియం ఐరన్ ఫాస్ఫేట్ (ఎల్ఎఫ్‌పీ) సెల్స్‌ను బ్లేడ్స్ మాదిరి అమర్చడమే' బ్లేడ్‌బ్యాటరీ టెక్నాలజీ ప్రత్యేకత. ఇందువల్ల బ్యాటరీ పరిమాణం సగానికి తగ్గుతుంది. వీటి జీవిత కాలం పెరగడమే కాక, ఒక ఛార్జింగ్‌పై ప్రయాణించే దూరం కూడా అధికమవుతుంది. 2025-26 మూడో త్రైమాసికంలో 385 విద్యుత్ వాహనాలను డెలివరీ చేశామని, ఇందులో 24 టిప్పర్లున్నాయని మహేష్ తెలిపారు. ఇప్పటి వరకు తమ సంస్థ ఉత్పత్తి చేసిన 3,639 విద్యుత్తు బస్సులు - ట్రక్కులు కార్యకలాపాలు సాగిస్తున్నాయని, సంస్థ చేతిలో 9,439 విద్యుత్ వాహనాలకు ఆర్డర్లు ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్ సమీపంలోని సీతారాంపూర్ వద్ద 150 ఎకరాల్లో నిర్విహిస్తున్న కొత్త ప్లాంటు ద్వారా వాహనాల ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి 10,000కు పెంచుకునే వీలుందన్నారు.


వ్యర్థాల నిర్వహణలో రోబోల వినియోగం

రీ సస్టైనబిలిటీ, జన్యు టెక్నాలజీస్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: వ్యర్థాల నిర్వహణను సమర్థంగా నిర్వహించేందుకు జన్యు టెక్నాలజీస్‌తో రీ సస్టైనబిలిటీ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. పర్యావరణ పరిరక్షణ కార్యకలాపాల్లో భద్రత పెంచేందుకు, ప్రమాదకర పనుల కోసం రోబోటిక్స్, డీప్-టెక్ పరిష్కారాలను వినియోగించడం ఈ ఒప్పంద ప్రధాన లక్ష్యం. బురద తొలగింపు, ఇరుకైన ప్రదేశాల్లో శుభ్రం చేయడం, ప్రమాదకర పారిశ్రామిక వ్యర్థాలను నిర్వహించడం వంటి క్లిష్టమైన పనుల కోసం జన్యు టెక్నాలజీస్ అభివృద్ధి చేసిన స్వదేశీ రోబోటిక్ సిస్టమ్స్‌ను రీ సస్టైనబిలిటీ వినియోగిస్తుంది. అత్యంత ప్రమాదకర వాతావరణంలో మానవ ప్రమేయాన్ని గణనీయంగా తగ్గించేందుకు ఇది వీలు కల్పిస్తుందని రీ సస్టైనబిలిటీ ఎండీ, గ్రూపు సీఈఓ మసూద్ మల్లిక్ తెలిపారు. కృత్రిమ మేధ, ప్రెడిక్టివ్ అనలిటిక్స్ కోసం కీలకమైన డేటాను ఈ రోబోటిక్ పరికరాలు అందిస్తాయని జన్యు టెక్నాలజీస్ ఎండీ అభిమన్యు రాజు తెలిపారు.

యమహా ఈసీ-06 @ రూ.1.67 లక్షలు

ఒక ఛార్జింగుతో 169 కి.మీ. ప్రయాణం



చెన్నై: ద్విచక్ర వాహన తయారీ సంస్థ యమహా మోటార్ ఇండియా, విద్యుత్ వాహన విభాగంలోకి అడుగుపెట్టింది. తొలి విద్యుత్ స్కూటర్ ఈసీ-06ను విడుదల చేసింది. దీని ధర రూ.1.67 లక్షలు (ఎక్స్‌షోరూమ్, దిల్లీ). ఈ స్కూటర్‌ను ఒకసారి ఛార్జింగ్ చేస్తే 169 కి.మీ. ప్రయాణించొచ్చని కంపెనీ తెలిపింది. తమ ప్రీమియం బ్లూ స్క్వేర్ విక్రయశాలల నుంచి తొలుత అమ్మకాలు జరుపుతామని పేర్కొంది. బ్లూయిష్ వైట్ కలర్‌లో లభ్యమవుతాయి.



దరఖాస్తు చేశారా?

☛ సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియాలో ఖాళీలు (90)
చివరి తేదీ: 07.02.2026

☛ కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో వర్క్‌మెన్ ఉద్యోగాలు (260)
చివరి తేదీ: 07.02.2026

కరెంట్ అఫైర్స్



మాదిరి ప్రశ్నలు

❖ ఏ రాష్ట్రంలోని దిబ్రూగఢ్ జిల్లాలోని నమ్రూప్‌లో రూ.10,601 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అమ్మోనియా ఎరువుల కర్మాగారానికి 2025, డిసెంబరులో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు? (ఈ ప్రాజెక్టును అస్సాం వ్యాలీ ఫర్టిలైజర్ అండ్ కెమికల్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయనున్నారు)
జ: అస్సాం

❖ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పొందూరు ఖాదీకి భారత ప్రభుత్వం ఇటీవల భౌగోళిక సూచిక (జీఐ) ట్యాగ్‌ను మంజూరు చేసింది. పొందూరు గ్రామం ఏ జిల్లాలో ఉంది? (భారత స్వాతంత్ర్య పోరాట సమయంలో మహాత్మా గాంధీ స్వావలంబన, స్వదేశీ చిహ్నంగా పొందూరు ఖాదీ ఉత్పత్తి, వాడకాన్ని ప్రోత్సహించారు.)
జ: శ్రీకాకుళం

❖ మైనారిటీ హక్కుల దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (జాతి, మత, భాషా మైనారిటీలకు చెందిన వ్యక్తుల హక్కుల పై ఐక్యరాజ్య సమితి ప్రకటన 1992లో ఈ రోజున ఆమోదం పొందిన సందర్భంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. భారత్‌లో 2013 నుంచి మైనారిటీ హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.)
జ: డిసెంబరు 18

❖ ఆపరేషన్ హాకీ స్ట్రైక్ పేరుతో ఏ దేశంలోని ఐసిస్ స్థావరాల పై అమెరికా, జోర్డాన్‌లు సంయుక్త వైమానిక దాడులు నిర్వహించాయి?
జ: సిరియా

మరింత సమాచారం

జనరల్ స్టడీస్ - అరిథ్‌మెటిక్


పైపులైనా.. పిల్లరైనా అదే ఆకారం!



నాణేన్ని టేబుల్ మీద ఉంచి చూస్తే వృత్తం మాదిరి కనిపిస్తుంది. అదే నాణెంపై మరికొన్ని నాణేలను ఒకదానిపై ఒకటి పేర్చుకుంటూ వెళితే, ఆ వృత్తం పొడవైన స్తంభంగా మారుతుంది. దానినే గణితంలో స్థూపం అంటారు. పాలుతాగే గ్లాసు, ఆడుకునే బ్యాడ్మింటన్ షటిల్ బాక్స్, రోడ్డును చదును చేసే రోడ్డురోలర్ చక్రం, పైపులు, పిల్లర్లతో సహా చుట్టూ పరిసరాల్లో రకరకాల ఆకారాల్లో స్థూపం దర్శనమిస్తూనే ఉంటుంది. అందులో రెండు సమాంతర వృత్తాకార ఆధారాలు, ఒక వక్రతలం ఉంటాయి. ఈ స్థూపం వైశాల్యం, ఘనపరిమాణం తదితరాలపై పోటీ పరీక్షల్లో తరచూ ప్రశ్నలు అడుగుతున్నారు. వాటికి సరైన సమాధానాలను వేగంగా గుర్తించాలంటే ప్రాథమిక కొలతలైన వ్యాసార్ధం, ఎత్తు మొదలైన వాటి గురించి తెలుసుకోవాలి. వక్రతల వైశాల్యం, సంపూర్ణతల వైశాల్యం, ఘనపరిమాణాలకు సంబంధించిన సూత్రాలను నేర్చుకోవాలి. దాని వల్ల ఒక ట్యాంకులో ఎన్ని నీళ్లు పడతాయో, స్థూపాకార స్తంభానికి రంగు వేయాలంటే ఎంత ఖర్చవుతుందో అర్థమవుతుంది.

స్థూపం

స్థూపం: పక్కన వక్రతలంగా ఉండి భూ, పై తలాలు రెండు వృత్తాకార సమతలాలైన ఆకారాన్ని 'స్థూపం' అంటారు.



ఉదా: కొయ్య దుంగ, కొవ్వొత్తి, ట్యూబ్‌లైట్.

★ మొత్తం తలాలు = 3
★ సమతలాలు = 2
★ వక్రతలాలు = 1
★ అంచులు = 2
★ శీర్షాలు = 0

★ ఒక స్థూపం భూవ్యాసార్ధం (r), ఎత్తు (h) అయితే
వక్రతల వైశాల్యం = $2\pi rh$
సంపూర్ణతల వైశాల్యం = $2\pi r(h + r)$
ఘనపరిమాణం = πr^2h

★ ఒక దీర్ఘచతురస్ర కాగితాన్ని పొడవు లేదా వెడల్పు వెంబడి మడిస్తే స్థూపం ఏర్పడుతుంది.

★ దీర్ఘచతురస్ర వైశాల్యం = స్థూపం పక్కతల వైశాల్యం

మాదిరి ప్రశ్నలు

1. కింది వాక్యాలను చదివి, సరైన సమాధానాన్ని గుర్తించండి.
ఒక స్థూపం భూవ్యాసార్ధం 10 సెం.మీ., ఎత్తు 12 సెం.మీ. అయితే దాని యొక్క...
ఎ) సంపూర్ణతల వైశాల్యం 440π చ. సెం.మీ.
బి) వక్రతల వైశాల్యం 240π చ. సెం.మీ.
సి) ఘనపరిమాణం 600π సెం.మీ.^{3}
1) ఎ, బి, సి   2) ఎ, బి
3) ఎ, సి   4) బి, సి

వివరణ: వ్యాసార్ధం r = 10 సెం.మీ.
ఎత్తు h = 12 సెం.మీ.
ఎ) సంపూర్ణతల వైశాల్యం = $2\pi r(h + r)$
$= 2.\pi.10\,(12 + 10) = 20\pi \times 22$
$= 440\pi$ సెం.మీ.^{2} (సత్యం)
బి) వక్రతల వైశాల్యం = $2\pi rh$
$= 2.\pi \times 10 \times 12 = 240\pi$ సెం.మీ.^{2} (సత్యం)
సి) ఘనపరిమాణం = πr^2h
$= \pi.10 \times 10 \times 12 = 1200\pi$ (అసత్యం)
∴ ఎ, బి లు మాత్రమే సత్యం
జ: 2

2. రెండు స్థూపాల భూవ్యాసార్ధాల నిష్పత్తి 2 : 3, వాటి ఎత్తుల నిష్పత్తి 5 : 3 అయితే వాటి ఘనపరిమాణాల నిష్పత్తి ఎంత?
1) 27 : 20   2) 20 : 27   3) 9 : 4   4) 4 : 9




వివరణ: $r_1 : r_2 = 2 : 3,\ h_1 : h_2 = 5 : 3$
ఘనపరిమాణాల నిష్పత్తి = $V_1 : V_2,\ \pi r_1^2h_1 = \pi r_2^2h_2$
$= 2^2 \times 5 : 3^2 \times 3 = 20 : 27$
జ: 2

3. స్థూపం భూవ్యాసార్ధాన్ని 20% పెంచి, ఘనపరిమాణం స్థిరంగా ఉంచాలంటే ఎత్తును ఎంత శాతం తగ్గించాలి?
1) 25%   2) $30\frac{2}{9}$%
3) $30\frac{5}{9}$%   4) 20%

వివరణ: స్థూపం ఘనపరిమాణం
$V = \pi r^2h$
$\frac{120}{100} \times \frac{120}{100} \times h = 1 \Rightarrow h = \frac{25}{36}$ 11↓
h లో తగ్గుదల శాతం = $\frac{11}{36} \times 100$
$= \frac{275}{9} = 30\frac{5}{9}$%
జ: 3

4. 21 సెం.మీ. భుజంగా ఉన్న చతురస్రాకార కాగితాన్ని అంచుల వెంబడి కలపగా ఏర్పడే స్థూపపు పక్కతల వైశాల్యం(సెం.మీ.^{2}లలో)?
1) 440   2) 421
3) 441   4) 431

వివరణ:




స్థూపం పక్కతల వైశాల్యం = చతురస్రం వైశాల్యం
$= a^2 = 21^2 = 441$ సెం.మీ.^{2}
జ: 3

5. వ్యాసం 4 మీ., పొడవు 56 మీ. కొలతలున్న స్థూపాకారంలోని సొరంగాన్ని తవ్వి అందులో నుంచి వచ్చిన మట్టిని 48 మీ. పొడవు, 16.5 మీ. వెడల్పు, 4 మీ. లోతులో ఎంత భాగం నింపవచ్చు? $\left(\pi = \frac{22}{7}\right)$
1) $\frac{1}{9}$ 2) $\frac{2}{9}$
3) $\frac{7}{9}$ 4) $\frac{8}{9}$

వివరణ:
స్థూపం   దీర్ఘఘనం
r = 2 మీ. l = 48 మీ.
h = 56 మీ.   b = 16.5 మీ. $= \frac{33}{2}$
h = 4 మీ.
$\frac{\text{స్థూపం ఘనపరిమాణం}}{\text{దీర్ఘఘనం ఘనపరిమాణం}}$
$= \frac{\pi r^2h}{lbh} = \frac{\frac{22}{7} \times 2 \times 2 \times 56}{48 \times \frac{33}{2} \times 4} = \frac{2}{9}$
జ: 2

6. ఒక స్థూపం ఎత్తు 18 సెం.మీ., వ్యాసార్ధం 7 సెం.మీ. ఈ స్థూపాన్ని భూమికి సమాంతరంగా రెండు కత్తిరింపుల ద్వారా మూడు సమాన భాగాలుగా విభజించారు. అయితే సంపూర్ణతల వైశాల్యంలో పెరుగుదల శాతం ఎంత?
1) 62%   2) 56%
3) 48%   4) 52%

వివరణ:




పెద్ద స్థూపాన్ని మూడు చిన్న స్థూపాలుగా విభజించారు.
పెద్ద స్థూపం: R = 7, H = 18
చిన్న స్థూపం: r = 7 (మారదు),
h = 6 (3వ వంతు అయింది)
పెద్ద స్థూపం సంపూర్ణతల వైశాల్యం = $2\pi R(H + R)$
$= 2 \times \frac{22}{7} \times 7 \times (18 + 7)$
$= 44 \times 25$
= 1100 సెం.మీ.^{2}
3 చిన్న స్థూపాల సంపూర్ణతల వైశాల్యం
$= 3 \times 2\pi r(h + r)$
$= 3 \times 2 \times \frac{22}{7} \times 7\,(6 + 7)$
$= 3 \times 2 \times 22 \times 13$
= 1716 సెం.మీ.^{2}
సంపూర్ణతల వైశాల్యంలో పెరుగుదల = 1716 − 1100
= 616 సెం.మీ.^{2}
$\% = \frac{616}{1100} \times 100 = 56\%$
జ: 2



రచయిత: పిరాది నరేష్

SENIOR INTER Zoology - Organic Evolution



1. Distinguish between homologous and analogous organs. (4 Marks)

A: Homologous organs: The organs which have similar structure and origin but not necessarily the same function are called homologous organs. The evolutionary pattern that describes the occurrence of similarity in origin and internal structure is called homology. Such organs show adaptive radiation, hence 'divergent evolution', e.g.: the appendages of vertebrates such as the flippers of whale, wings of bat, forelimbs of horse, paw of cat and hand of man, have a common pattern in arrangement of bones even though their external form and function may vary to suit their mode of life. It explains that all vertebrates might have had a common ancestor.

Analogous organs: The organs which have dissimilar structure and origin but perform the same function are called analogous organs. Analogous organs suggest 'convergent evolution'. **e.g.:** wings of a butterfly and wings of a bird

2. Write a short note on the theory of mutations.

A: Mutation theory: It was proposed by Hugo de Vries, a Dutch botanist who coined the term 'mutation'. Mutations are sudden, random inheritable changes that occur in organisms.

Final Exams-2026 IMPORTANT Q & A

He found four different forms in Oenothera lamarckiana (commonly called 'evening primrose') such as
★ brevistylis-small style, ★ levifolia-smooth leaves.
★ gigas- the giant form, ★ nanella- the dwarf form (mutant varieties).

T.H. Morgan studied the inheritance pattern of mutations in Drosophila melanogaster. Darwin called mutations (large variations) sports of nature or saltations, whereas Bateson called them discontinuous variations

Salient Features of Mutation theory:
i) Mutations occur from time to time in naturally breeding populations. ii) They are discontinuous and are not accumulated over generations. iii) They are full-fledged, and so there are no 'intermediate forms'.
iv) They are subjected to Natural Selection.

For more IMP Q & A



Writer: Ravi Charan Kanti

అంతిమ తీర్పులు.. అత్యున్నత ఆదేశాలు!

ఇండియన్ పాలిటీ



దేశంలో అత్యున్నత రాజ్యాంగబద్ధ సంస్థ అయిన సుప్రీంకోర్టుకు అత్యంత విస్తృతమైన అధికార పరిధి ఉంది. రాష్ట్రపతికి ధర్మసందేహాలను తీర్చడం నుంచి దేశ పౌరుల ప్రాథమిక హక్కుల సంరక్షణ, కేంద్ర-రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాల పరిష్కారం, హైకోర్టు తీర్పులపై అప్పీళ్లు, పార్లమెంటు చట్టాలను పరిశీలించే న్యాయసమీక్ష తదితర కీలక విధులెన్నింటినో నిర్వర్తిస్తుంది. దేశంలో న్యాయవ్యవస్థను నడిపిస్తూ, ప్రభుత్వ పాలన రాజ్యాంగం ప్రకారం కొనసాగే విధంగా చూస్తుంది. అత్యున్నత న్యాయస్థానంగా, రాజ్యాంగ సంరక్షకురాలిగా వ్యవహరించే సుప్రీంకోర్టుకు ఉన్న వివిధ ప్రాథమిక, ప్రత్యేక అధికారాల గురించి పోటీ పరీక్షార్థులకు సమగ్ర అవగాహన ఉండాలి. సుప్రీంకోర్టు పనితీరును నిర్దేశిస్తున్న రాజ్యాంగంలోని పలు ఆర్టికల్స్, రకరకాల సందర్భాల్లో వెలువడిన తీర్పులను గుర్తుంచుకోవాలి.

సుప్రీంకోర్టు - అధికారాలు, విధులు

1. "ప్రపంచంలోని ఇతర దేశాల అత్యున్నత న్యాయస్థానాల కంటే భారత సుప్రీంకోర్టుకు విస్తృతమైన అధికారాలు ఉన్నాయి" అని ఎవరు పేర్కొన్నారు?
1) ప్రదీప్ చంద్ర జోగ్
2) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
3) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్
4) మాంటెగ్ సింగ్ అహ్లువాలియా



2. సుప్రీంకోర్ట్ ప్రారంభ/ఒరిజినల్ విచారణాధికార పరిధి గురించి వివరిస్తున్న రాజ్యాంగ ఆర్టికల్?
1) ఆర్టికల్ 131   2) ఆర్టికల్ 132
3) ఆర్టికల్ 133   4) ఆర్టికల్ 134

3. సుప్రీంకోర్టు ప్రారంభ/ఒరిజినల్ విచారణాధికార పరిధికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) కేవలం సుప్రీంకోర్టు మాత్రమే విచారించేందుకు అవకాశం ఉన్న అంశాలు దీనిలో ఉన్నాయి.
బి) కేంద్రం ఒకవైపు, రాష్ట్రాలు మరో వైపు ఉండి ఘర్షణకు దిగిన అంశాలు.
సి) రాష్ట్రాల మధ్య తలెత్తే విభేదాలు.
డి) రాజ్యాంగబద్ధతను నిర్ణయించే అంశాలు.
1) ఎ, బి, సి   2) ఎ, బి, డి
3) ఎ, సి, డి   4) ఎ, బి, సి, డి

4. సుప్రీంకోర్టు తొలిసారిగా ప్రారంభ/ఒరిజినల్ విచారణాధికారాన్ని ఏ కేసు సందర్భంగా వినియోగించింది?
1) యూనియన్ ఆఫ్ ఇండియా - స్టేట్ ఆఫ్ పశ్చిమ బెంగాల్ (1961)
2) యూనియన్ ఆఫ్ ఇండియా - స్టేట్ ఆఫ్ ఉత్తర్ ప్రదేశ్ (1957)
3) యూనియన్ ఆఫ్ ఇండియా - స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర (1953)
4) యూనియన్ ఆఫ్ ఇండియా - స్టేట్ ఆఫ్ తమిళనాడు (1977)

5. సుప్రీంకోర్టు ప్రారంభ/ఒరిజినల్ విచారణాధికార పరిధి నుంచి మినహాయించిన అంశాలు ఏవి?
ఎ) ఆర్టికల్ 253 ప్రకారం భారత ప్రభుత్వం విదేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలు.
బి) ఆర్టికల్ 275 ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చే సహాయక గ్రాంట్లు.
సి) ఆర్టికల్ 280 ప్రకారం కేంద్ర ఆర్థిక సంఘం పరిధిలోకి వచ్చే అంశాలు.
1) ఎ, బి   2) ఎ, సి   3) బి, సి   4) ఎ, బి, సి

6. కింది ఏ అంశంపై సుప్రీంకోర్టుకు ఒరిజినల్/ప్రారంభ విచారణాధికార పరిధి ఉండదు?
ఎ) డీలిమిటేషన్ కమిషన్ సిఫార్సుల మేరకు నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అంశం.
బి) పార్లమెంటు రూపొందించిన అంతర్రాష్ట్ర వర్తక వాణిజ్య అంశాలు.
సి) అంతర్రాష్ట్ర నదీ జలాల అంశంపై కేంద్రం నియమించిన జలవనరుల ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును అనుసరించి పార్లమెంటు రూపొందించిన చట్టాలు.
డి) అవశిష్ట అంశాల నిర్ణయం.
1) ఎ, సి, డి   2) ఎ, బి, సి
3) ఎ, బి, డి   4) ఎ, బి, సి, డి

7. సుప్రీంకోర్టు అప్పీళ్ల విచారణాధికార పరిధికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) హైకోర్టులు ఇచ్చిన తీర్పులతో సంతృప్తి చెందని వారు సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకోవచ్చు.
బి) సుప్రీంకోర్టు ప్రధానంగా 4 రకాల అప్పీళ్లను స్వీకరిస్తుంది.
సి) మన దేశంలో అప్పీళ్లపై అంతిమ తీర్పులు ఇచ్చే అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు.
1) ఎ, బి   2) ఎ, సి   3) బి, సి   4) ఎ, బి, సి

8. రాజ్యాంగబద్ధమైన అప్పీళ్లకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) ఆర్టికల్ 132 రాజ్యాంగబద్ధమైన అప్పీళ్ల గురించి వివరిస్తుంది.
బి) రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నాయని ఎవరైనా భావిస్తే సంబంధిత అంశాలను సుప్రీంకోర్టులో సవాల్/అప్పీల్ చేయవచ్చు.
సి) ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలకు 4% రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన చట్టాన్ని హైకోర్టు రద్దు చేయడంతో, ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది.
1) ఎ, బి   2) ఎ, సి   3) బి, సి   4) ఎ, బి, సి

9. సుప్రీంకోర్టు సివిల్ అప్పీళ్ల గురించి ఏ ఆర్టికల్ వివరిస్తుంది?
1) ఆర్టికల్ 128   2) ఆర్టికల్ 130
3) ఆర్టికల్ 133   4) ఆర్టికల్ 135

10. సివిల్ అంశాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టులో అప్పీల్ చేయాలంటే హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి అని పేర్కొంటున్న ఆర్టికల్?
1) ఆర్టికల్ 133(ఎ)   2) ఆర్టికల్ 134(ఎ)
3) ఆర్టికల్ 135(ఎ)   4) ఆర్టికల్ 136(ఎ)

11. సుప్రీంకోర్టు క్రిమినల్ అప్పీళ్ల గురించి వివరిస్తున్న ఆర్టికల్?
1) ఆర్టికల్ 134   2) ఆర్టికల్ 137
3) ఆర్టికల్ 139   4) ఆర్టికల్ 142

12. క్రిమినల్ అప్పీళ్లకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) నేరాలకు సంబంధించిన అప్పీళ్లుగా వీటిని పేర్కొనవచ్చు.
బి) జిల్లా సెషన్స్ కోర్ట్ నిందితుడిని నిర్దోషిగా ప్రకటించినప్పుడు అదే కేసును హైకోర్టు విచారించి నిందితుడికి ఉరి శిక్ష/యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తే సుప్రీంకోర్టులో నేరుగా అప్పీల్ చేసుకోవచ్చు.
సి) జిల్లా సెషన్స్ కోర్టులో విచారణలో ఉన్న కేసును హైకోర్టు తనకు బదిలీ చేయించుకుని నిందితుడికి ఉరిశిక్ష/యావజ్జీవ కారాగార శిక్ష విధించినప్పుడు సుప్రీంకోర్టులో నేరుగా అప్పీలు చేసుకోవచ్చు.
1) ఎ, సి   2) ఎ, సి
3) ఎ, బి   4) ఎ, బి, సి

13. స్పెషల్ లీవ్ పిటిషన్ (ప్రత్యేక అప్పీల్)కు సుప్రీంకోర్టులో ఉండే స్క్రీనింగ్ కమిటీ సిఫార్సుల మేరకు ఏ ఆర్టికల్ ప్రకారం సుప్రీంకోర్టు అనుమతిస్తుంది?
1) ఆర్టికల్ 136   2) ఆర్టికల్ 138(ఎ)
3) ఆర్టికల్ 134(ఎ)   4) ఆర్టికల్ 139(ఎ)


14. సుప్రీంకోర్టు 'కోర్ట్ ఆఫ్ రికార్డు' గురించి వివరిస్తున్న ఆర్టికల్?
1) ఆర్టికల్ 149   2) ఆర్టికల్ 139
3) ఆర్టికల్ 129   4) ఆర్టికల్ 131 (ఎ)

15. సుప్రీంకోర్టు 'కోర్ట్ ఆఫ్ రికార్డు'కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) సుప్రీంకోర్టు వివిధ కేసుల్లో ఇచ్చిన తీర్పులను రికార్డు రూపంలో భద్రపరచుటనే 'కోర్ట్ ఆఫ్ రికార్డు' అంటారు.



బి) కోర్ట్ ఆఫ్ రికార్డును అనుపూర్వికాలు అంటారు.
సి) కోర్ట్ ఆఫ్ రికార్డు దేశంలోని దిగువ న్యాయస్థానాలన్నింటికీ శిరోధార్యం.
డి) కోర్ట్ ఆఫ్ రికార్డును ధిక్కరిస్తే కోర్టు ధిక్కరణ నేరంగా పరిగణిస్తారు.
1) ఎ, బి, సి   2) ఎ, సి, డి
3) ఎ, బి, డి   4) ఎ, బి, సి, డి


16. ప్రాథమిక హక్కుల రక్షణ కోసం సుప్రీంకోర్టు 5 రకాల రిట్‌ను ఏ ఆర్టికల్ ప్రకారం జారీ చేస్తుంది?
1) ఆర్టికల్ 132
2) ఆర్టికల్ 32
3) ఆర్టికల్ 138
4) ఆర్టికల్ 142



17. పరిపాలనా వ్యవహారాల్లో రాష్ట్రపతికి రాజ్యాంగపరమైన ధర్మసందేహాలు ఎదురైనప్పుడు సుప్రీంకోర్టు ఏ ఆర్టికల్ ప్రకారం న్యాయసలహా అందిస్తుంది?
1) ఆర్టికల్ 143   2) ఆర్టికల్ 147
3) ఆర్టికల్ 148   4) ఆర్టికల్ 140

18. ఏ చట్టంపై 1951లో ఆర్టికల్ 143 ప్రకారం అప్పటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్‌కు తొలిసారిగా సుప్రీంకోర్టు న్యాయసలహా ఇచ్చింది?
1) నదీజలాల చట్టం
2) నియోజకవర్గాల పునఃవ్యవస్థీకరణ చట్టం
3) దిల్లీ పరిపాలక చట్టం
4) అంతర్రాష్ట్ర వర్తక వాణిజ్యం

19. కొలీజియం నిర్మాణ ప్రక్రియపై సుప్రీంకోర్టు న్యాయసలహాలను పొందిన రాష్ట్రపతి?
1) శంకర్ దయాళ్ శర్మ
2) కేఆర్ నారాయణన్
3) ప్రతిభా పాటిల్
4) నీలం సంజీవరెడ్డి



20. సుప్రీంకోర్టు తీర్పుల పునఃసమీక్ష అధికార పరిధి గురించి వివరిస్తున్న ఆర్టికల్ ఏది?
1) ఆర్టికల్ 137   2) ఆర్టికల్ 138
3) ఆర్టికల్ 139   4) ఆర్టికల్ 140

21. ఆర్టికల్ 138 ప్రకారం సుప్రీంకోర్టు అధికార పరిధిని ఎవరు విస్తరించగలరు?
1) రాష్ట్రపతి
2) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
3) పార్లమెంటు   4) అటార్నీ జనరల్

22. సుప్రీంకోర్టు ఆర్టికల్ 143 ప్రకారం వివిధ సందర్భాలలో ఇచ్చిన న్యాయ సలహాలకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
ఎ) కేరళ విద్యా బిల్లు - 1958, బెరుబారి యూనియన్ - 1960
బి) ప్రత్యేక కోర్టుల చట్టం - 1978, రామజన్మ భూమి వివాదం - 1993
సి) పంజాబ్ నదీ జలాల ఒప్పందం - 2004, లాభదాయక పదవులు - 2006
డి) కావేరి నదీజలాల ట్రైబ్యునల్ వివాదం - 1993, రాష్ట్రపతి ఎన్నికలు - 1974
1) ఎ, బి, సి   2) ఎ, బి, డి
3) ఎ, సి, డి   4) ఎ, బి, సి, డి

23. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల వివాదాలను ఏ ఆర్టికల్ ప్రకారం సుప్రీంకోర్టు విచారిస్తుంది?
1) ఆర్టికల్ 71   2) ఆర్టికల్ 361
3) ఆర్టికల్ 138   4) ఆర్టికల్ 140

24. ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు లేదని ఏ కేసు సందర్భంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది?
1) బెరుబారి Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1960)
2) గోలక్‌నాథ్ Vs స్టేట్ ఆఫ్ పంజాబ్ (1967)
3) షీలాబర్సే Vs స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర (1969)
4) మేనకా గాంధీ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1978)

25. ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్ని అయినా సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని, రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విఘాతం కలగకుండా పార్లమెంటు రాజ్యాంగాన్ని సవరించవచ్చని సుప్రీంకోర్టు ఏ కేసు సందర్భంగా కీలక తీర్పు వెలువరించింది?
1) పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1975)
2) మినర్వామిల్స్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1980)
3) కేశవానంద భారతి Vs స్టేట్ ఆఫ్ కేరళ (1973)
4) మోహినీ జైన్ Vs స్టేట్ ఆఫ్ కర్ణాటక (1977)

26. సుప్రీంకోర్టు అధికార పరిధికి సంబంధించిన రాజ్యాంగ అంశాలను గుర్తించండి.
ఎ) ఆర్టికల్ 147 - భారత రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించి, రాజ్యాంగానికి అర్థ వివరణ ఇస్తుంది.
బి) ఆర్టికల్ 146 - సుప్రీంకోర్ట్‌లో పనిచేసే సిబ్బందిని సుప్రీంకోర్టే నియమించుకుంటుంది.
సి) ఆర్టికల్ 139 (ఎ) - దేశంలోని వివిధ హైకోర్టుల్లో విచారణలో ఉన్న కేసులను సుప్రీంకోర్టు తనకు బదిలీ చేయించుకుని విచారిస్తుంది.
డి) ఆర్టికల్ 141 - దేశంలో దిగువ స్థాయి న్యాయస్థానాలపై నియంత్రణ కలిగి ఉంటుంది.
1) ఎ, బి, డి   2) ఎ, సి, డి
3) ఎ, బి, సి   4) ఎ, బి, సి, డి



రచయిత: బంగారు సత్యనారాయణ

సమాధానాలు

1-2; 2-1; 3-4; 4-1; 5-4; 6-2; 7-4; 8-4; 9-3; 10-2; 11-1; 12-4; 13-1; 14-3; 15-4; 16-2; 17-1; 18-3; 19-2; 20-1; 21-3; 22-4; 23-1; 24-2; 25-3; 26-4.

అక్షర శ్రేణి

(సూక్ష్మ, స్థూల అక్షరాల కలయిక)

పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగంలో అక్షరశ్రేణి అనేది ఒక ముఖ్యమైన అంశం. దీనిపై అడిగే ప్రశ్నల్లో ఇచ్చే శ్రేణి సూక్ష్మ, స్థూల అక్షరాల కలయికతో కూడి ఉంటుంది. క్రమంలో ఏదో ఒక స్థానంలో ప్రశ్నార్థకం ఇస్తారు. శ్రేణి అనుసరించే నియమాన్ని అభ్యర్థి కనిపెట్టి, దాన్ని ప్రశ్న స్థానానికి అనువర్తింపజేస్తే కావాల్సిన అక్షరం/పదం వస్తుంది. అక్షరాల క్రమం, వాటి విలువలపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే ఈ రకమైన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించొచ్చు. పట్టుదలతో ప్రయత్నం సాగిస్తేనే ఉద్యోగ సాధనలో విజయం దక్కుతుంది.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

ప్రయత్నం, పట్టుదలతోనే.. ఉద్యోగ సాధనలో విజయం!

సూచన (ప్ర. 1 – 11): కింద ఇచ్చిన ప్రశ్నల్లోని శ్రేణి ప్రతి భాగంలో దీర్ఘ, సూక్ష్మ అక్షరాల కలయిక ఉంది. శ్రేణిని జాగ్రత్తగా పరిశీలించి, సరైన సమాధానాన్ని గుర్తించండి.

1. Bc De Fg ?
1) hg 2) Ij 3) Hi 4) jl

సాధన: ఇచ్చిన శ్రేణిలో మొదటి స్థానంలోని అక్షరాలు B, D, F
B + 2 = D, D + 2 = F, F + 2 = H ⟶ (i)
శ్రేణిలో రెండో స్థానంలోని అక్షరాలు c, e, g
c + 2 = e, e + 2 = g, g + 2 = i ⟶ (ii)
సమీకరణాలు (i), (ii) నుంచి ? స్థానంలో ఉండాల్సిన అక్షరాలు Hi

సమాధానం: 3

2. DDaaEEccFF ?
1) ee 2) dd 3) EE 4) ff

సాధన: శ్రేణిలో ఒకటి, మూడు, అయిదో స్థానంలోని అక్షర జతలు DD, EE, FF
D + 1 = E, E + 1 = F
శ్రేణిలో రెండు, నాలుగో స్థానంలోని అక్షర జతలు aa, cc
a + 2 = c, c + 2 = e
కాబట్టి ఆరో స్థానంలోని అక్షరాల జత ee

సమాధానం: 1

3. aaMNbbOP ?
1) qr 2) cc 3) op 4) DD

సాధన: శ్రేణిలో ఒకటి, మూడో స్థానంలోని అక్షర జతలు aa, bb
a + 1= b, b + 1 = c
కాబట్టి అయిదో స్థానంలోని అక్షర జత cc

సమాధానం: 2

4. bCFg, cDGh, ?
1) iHKI 2) dHJk 3) iJKI 4) dEHi

సాధన: ఇచ్చిన శ్రేణిలో మొదటి స్థానంలోని అక్షరాలు b, c
b + 1 = c, c + 1 = d ⟶ (i)
శ్రేణిలో రెండో స్థానంలోని అక్షరాలు C, D
C + 1 = D, D + 1 = E ⟶ (ii)
శ్రేణిలో మూడో స్థానంలోని అక్షరాలు F, G
F + 1 = G, G + 1 = H ⟶ (iii)
శ్రేణిలోని నాలుగో స్థానంలోని అక్షరాలు g, h
g + 1= h, h + 1 = I .... (iv)
సమీకరణాలు i, ii, iii, ivల నుంచి ? స్థానంలో ఉండాల్సిన పదం dEHi

సమాధానం: 4

5. BCe FGi J?
1) Km 2) KL 3) IK 4) kM

సాధన: ఇచ్చిన శ్రేణిలో B + 4 = F, C + 4 = G, F + 4 = J, G + 4 = K ⟶ (i)
e + 4 = i, i + 4 = m ⟶ (ii)
సమీకరణాలు (i), (ii)ల నుంచి ? స్థానంలో ఉండాల్సిన పదం Km

సమాధానం: 1

6. yz AB wx CD ?
1) EF 2) Vu 3) uv 4) tu

సాధన: ఇచ్చిన శ్రేణిలో ఒకటవ, మూడో స్థానంలోని అక్షరాల జతలు yz, wx
y + 1 = z, w + 1 = x, y – 2 = w, z – 2 = x
శ్రేణిలో రెండు, నాలుగో స్థానంలోని అక్షరాల జతలు AB, CD
A + 1 = B, C + 1 = D
w – 2 = u, x – 2 = v ⇒ ? స్థానంలో ఉండాల్సిన పదం uv

సమాధానం: 3

7. Ls Ej ?t
1) S 2) R 3) P 4) Q

సాధన: ఇచ్చిన శ్రేణిలో L + 7 = s, E + 5 = j
అక్షరాలు, సంఖ్యలు గమనిస్తే వాటి క్రమం...
7 – 2 = 5, 5 – 2 = 3, Q + 3 = t.
కాబట్టి ? స్థానంలో ఉండాల్సిన అక్షరం Q

సమాధానం: 4

8. Ui Sk Pn ?
1) Jh 2) Lr 3) Mp 4) Dq

సాధన: ఇచ్చిన శ్రేణిలో మొదటి స్థానంలోని అక్షరాలు U, S, P
U – 2 = S, S – 3 = P, P – 4 = L ⟶ (i)
శ్రేణిలో తర్వాత వచ్చే అక్షరం L
ఇచ్చిన శ్రేణిలో రెండో స్థానంలోని అక్షరాలు i, k, n
i + 2 = k, k + 3 = n, n + 4 = r ⟶ (ii)
సమీకరణాలు (i), (ii)ల నుంచి ? స్థానంలో ఉండాల్సిన పదం Lr

సమాధానం: 2

9. FP is LV ?
1) OY 2) oy 3) PZ 4) pz

సాధన: ఇచ్చిన శ్రేణిని గమనిస్తే...
F + 10 = P, i + 10 = s, L + 10 = V
F + 3 = i, i + 3 = L, L + 3 = o
P + 3 = s, s + 3 = V, V + 3 = y

సమాధానం: 2

10. t L W i z F C c ?
1) gA 2) hB 3) fZ 4) dI

సాధన: ఇచ్చిన శ్రేణిలో బేసి సంఖ్య స్థానాల్లోని ఆంగ్ల అక్షరాలు t, W, z, C
t + 3 = W, W + 3 = z, Z + 3 = C, C + 3 = f ⟶ (1)
ఇచ్చిన శ్రేణిలో సరి సంఖ్య స్థానాల్లోని ఆంగ్ల అక్షరాలు L, i, F, c
L – 3 = i, i – 3 = F, F – 3 = c, c – 3 = Z ⟶ (2)
(1), (2)ల నుంచి ? స్థానంలో ఉండాల్సిన క్రమం fZ

సమాధానం: 3

11. M c o y Q u ?
1) sq 2) nQ 3) IL 4) xY

సాధన: ఇచ్చిన శ్రేణిలో బేసి సంఖ్య స్థానాల్లోని ఆంగ్ల అక్షరాలు M, o, Q
M + 2 = o, o + 2 = Q, Q + 2 = s ⟶ (1)
శ్రేణిలోని సరి సంఖ్య స్థానాల్లోని ఆంగ్ల అక్షరాలు c, y, u
c – 4 = y, y – 4 = u, u – 4 = q ⟶ (2)
(1), (2)ల నుంచి ? స్థానంలో ఉండాల్సిన క్రమం sq

సమాధానం: 1



రచయిత
రాజేశ్ మధు,
విషయ నిపుణులు

911 Word of the Day

Untimely

Telugu meaning: అకాల, ముందుగానే

English meaning: The word untimely (అన్‌టైమ్లీ) is an adjective that describes something happening at an inconvenient, unsuitable, or earlier-than-expected time.

Synonyms: Premature, Inopportune

Antonyms: Punctual, Well-timed

Usage: **1.** The untimely interruption during the meeting disturbed the flow of the important discussion.

2. His untimely death shocked the entire village and left the family in deep sorrow.

కరెంట్ అఫైర్స్



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను 2026, ఫిబ్రవరి 1న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వరుసగా తొమ్మిదోసారి ఆమె బడ్జెట్‌ను సమర్పించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి. మొత్తం బడ్జెట్ రూ.53,47,315 కోట్లు. రెవెన్యూ వసూళ్లు: రూ.35,33,150 కోట్లు; రెవెన్యూ వ్యయం: రూ.41,25,494 కోట్లు; మూలధన వసూళ్లు: రూ.18,14,165 కోట్లు; మూలధన వ్యయం: రూ.12,21,821 కోట్లు.



స్పెయిన్‌కి చెందిన కార్లోస్ అల్కరాస్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. 2026, ఫిబ్రవరి 1న మెల్‌బోర్న్‌లో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో అల్కరాస్ 2-6, 6-2, 6-3, 7-5తో పదిసార్లు ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా)పై విజయం సాధించాడు. అల్కరాస్ మ్యాచ్‌లో 9 ఏస్‌లు సంధించాడు. 36 విన్నర్లు కొట్టాడు.

✦ ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఓడటం మాజీ నంబర్‌వన్ జకోవిచ్‌కు ఇదే తొలిసారి. ఇంతకుముందు ఫైనల్ చేరిన పదిసార్లూ అతడు విజేతగా నిలిచాడు.


ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా క్యాన్సర్ కేసులను గుర్తించేందుకు ప్రత్యేకంగా అసాంక్రమిక వ్యాధుల (ఎన్‌సీడీ) 4.0 సర్వే చేపడుతున్న ప్రభుత్వం.. దేశంలోనే తొలిసారిగా క్యాన్సర్ అట్లాస్‌ను రూపొందించింది. క్యాన్సర్‌ను నోటిఫై వ్యాధిగా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూపొందించిన అట్లాస్ ద్వారా పరిస్థితి చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తోంది. క్యాన్సర్ అట్లాస్‌లో పేర్కొన్న గణాంకాల ప్రకారం.. అత్యధిక కేసులు కాకినాడ జిల్లాలో (8,101) ఉన్నాయి.

ప్రముఖ బౌద్ధ గురువు దలైలామా (90)కు గ్రామీ అవార్డు దక్కింది. 'మెడిటేషన్స్: ద రిఫ్లెక్షన్స్ ఆఫ్ హిస్ హోలీనెస్ ద దలైలామా' పేరుతో ఆయన చేసిన ప్రసంగ ఆల్బమ్‌కు ఈ గౌరవం దక్కింది. టిబెట్ ఆధ్యాత్మిక గురువైన దలైలామాకు గోల్డెన్ గ్రామోఫోన్ దక్కడం ఇదే తొలిసారి. 2026, ఫిబ్రవరి 2న లాస్ ఏంజెలెస్‌లోని క్రిప్టోడాట్‌కామ్ ఎరీనాలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 90 కేటగిరీలో అవార్డులను ప్రకటించారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

ఫిబ్రవరి 4
చరిత్రలో ఈనాడు



ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. దీని వల్ల ఏటా లక్షలాది ప్రజలు ప్రభావితమవుతున్నారు. ఇందులో శరీరంలోని కొన్ని కణాలు అనియంత్రితంగా పెరిగి, ఇతర భాగాలకు వ్యాపిస్తాయి. ట్రిలియన్ల కణాలతో కూడిన మానవ దేహంలో ఎక్కడైనా క్యాన్సర్ రావొచ్చు. వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపు, సమర్థ చికిత్స పొందడం గురించి ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా **ఫిబ్రవరి 4న 'ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం'గా (World Cancer Day)** నిర్వహిస్తారు. ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించేలా చేయడంతో పాటు క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడటంపై ప్రపంచ దేశాలను ఏకం చేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

క్యాన్సర్ అంటే?

సృష్టిలోని ప్రతి జీవి శరీరం కణాలతోనే నిర్మితమై ఉంటుంది. అవి ఒకదాని నుంచి మరొకటి విడిపోతూ నిరంతరం జీవక్రియ కొనసాగిస్తూ ఉంటాయి. జీవుల పెరుగుదల, మనుగడకు ఈ ప్రక్రియ ఎంతో కీలకం. దీన్నే కణ విభజన అంటారు. కణాలు దెబ్బతిన్నప్పుడు లేదా మరణించినప్పుడు వాటి స్థానంలో కొత్త కణాలు పుట్టుకు వస్తాయి. ఇది క్రమబద్ధంగా సాగే ప్రక్రియ. కొన్నిసార్లు ఈ విధానంలో లోపం ఏర్పడి కణ విభజన విపరీతంగా జరుగుతుంది. ఫలితంగా శరీరభాగాలపై కణ సమూహాలు ఏర్పడతాయి. దీన్నే క్యాన్సర్ అంటారు.


చారిత్రక నేపథ్యం

క్యాన్సర్‌ను నిర్మూలించే లక్ష్యంతో 2000, ఫిబ్రవరి 4న పారిస్‌లో 'వరల్డ్ క్యాన్సర్ సమ్మిట్ ఫర్ ది న్యూ మిలీనియం' అనే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాటి యునెస్కో డైరెక్టర్ జనరల్ కిచిరో మట్సురా, ఫ్రెంచ్ అధ్యక్షుడు జాక్వెస్ చిరాక్ క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పారిస్ చార్టర్‌పై సంతకాలు చేశారు. ఈ సదస్సు జరిగిన తేదీకి గుర్తుగా ఏటా ఫిబ్రవరి 4న 'ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం'గా జరుపుకోవాలని యూఐసీసీ తీర్మానించింది.

క్యాన్సర్‌లో రకాలు, అది రావడానికి కారణాలు, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

పాలిమర్లు



ఒకే పదార్థం లేదా రెండు, మూడు పదార్థాలకు చెందిన అల్ప అణుభారం, సరళ అణునిర్మాణం కలిగిన అణువులు ఒకదానితో మరొకటి పుంఖానుపుంఖాలుగా కలిసి ఏర్పర్చే అత్యధిక అణుభారమున్న అణువులే పాలిమర్లు. పాలిమరీకరణ చర్యలో అనేక అణువుల కలయిక వల్ల పాలిమర్ అణువులు ఏర్పడతాయి.

☛ పాలిమర్ అంటే అనేక చిన్న భాగాలు లేదా అణువులను కలిగిన బృహదణువు. గ్రీకు భాషలో పాలి (poly) అంటే అనేకం, మెర్ (mer) అంటే భాగం అని అర్థం.

పాలిమరీకరణం

☛ మోనోమర్ నుంచి పాలిమర్ ఏర్పడే విధానాన్ని పాలిమరీకరణం అంటారు. అనేక అణువుల కలయికతో పాలిమర్లు ఏర్పడతాయి.

పాలిమర్ల వర్గీకరణ

☛ మూలాల ఆధారంగా వర్గీకరణ
☛ పాలిమర్ గొలుసుల్లోని ప్రధాన మూలకాల ఆధారంగా వర్గీకరణ
☛ నిర్మాణం ఆధారంగా వర్గీకరణ
☛ అంతరణుక బలాల ఆధారంగా వర్గీకరణ
☛ ఉష్ణ స్పందన ఆధారంగా వర్గీకరణ

పాలిమరీకరణం రకాలు

☛ అనువైన, తగిన ఉష్ణోగ్రత, పీడనం, ఉత్ప్రేరకం, ద్రావణి, ఇతర కారకాల సమక్షంలో మోనోమర్ అణువులు చర్య జరిపి పాలిమర్లను ఏర్పరుస్తాయి.

పాలిమరీకరణ అవధి, పాలిమరీకరణం - సాంకేతిక పద్ధతుల్లోని అనుకూలతలు, ప్రతికూలతలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Gramin Dak Sevak posts

The Department of Posts has invited online applications from eligible candidates for the engagement of Gramin Dak Sevaks (GDSs) to fill Branch Postmaster/ Assistant Branch Postmaster/ Dak Sevak positions in various offices across different Circles and Divisions. The total no. of posts is 28,740. The application fee is Rs.100. Eligible candidates can apply online before 14 February 2026.

Assistant Professor Jobs

The National Institute of Technology Calicut (NITC) is inviting applications for Assistant Professor positions in various departments on a contractual basis. The total no. of posts is 17. The last date for online applications is 20 February 2026.

Senior Resident jobs

The Employees' State Insurance Corporation (ESIC) in Rudrapur, Uttarakhand, is conducting interviews to fill Full-Time/Part-Time Specialist and Senior Resident posts on a contract basis. The total number of posts is 42. Eligible candidates can appear for the interview on 12, 13, 17, 18 February 2026.

Did You Apply..?

Today (February 4) is the last date for the following Jobs

☛ 572 jobs at the Reserve Bank of India. *Eligibility:* 10th.

☛ 114 Jobs in Nuclear Power Corporation. *Eligibility:* Intermediate, ITI, Diploma, or Degree.

For more information and other notifications - scan QR code

Bank Exams

English

Synonyms

Directions (Qs. 1 - 10): *In each of the questions given below, a sentence is given with one word printed in bold letters, along with five options to choose from. Choose the appropriate synonym from those options that suits the word given in bold letters.*

1. The board rejected the proposal because it was based on **speculative** assumptions rather than concrete data.
A) Theoretical B) Practical
C) Certain D) Proven
E) Reliable

2. Her **cordial** behaviour towards customers strengthened the bank's public image.
A) Cold B) Hostile
C) Arrogant D) Polite
E) Harsh

3. The company faced **acute** financial stress during the recession.
A) Mild B) Slight
C) Severe D) Average
E) Small

4. His **plausible** excuse convinced the manager to extend the deadline.
A) Doubtful B) Believable
C) False D) Weak
E) Illogical

5. The auditor detected several **discrepancies** in the financial statements.
A) Similarities B) Agreements
C) Matches D) Confirmations
E) Differences

6. She remained **resolute** even when others advised her to quit the preparation.
A) Weak B) Determined
C) Confused D) Doubtful
E) Nervous

7. The chairman's **concise** presentation saved time during the meeting.
A) Lengthy B) Detailed
C) Short D) Complex
E) Confusing

8. The organization launched a **massive** recruitment drive across the country.
A) Minor B) Limited
C) Narrow D) Tiny
E) Huge

9. His **skeptical** attitude prevented him from trusting the fake investment scheme.
A) Doubtful B) Trusting
C) Confident D) Careless
E) Naive

10. The officer issued a **mandatory** order for all employees to attend the training.
A) Optional B) Suggested
C) Flexible D) Compulsory
E) Casual

Directions (Qs. 11 - 23): *In each of the questions given below, a word is given in bold letters and five options are presented. Choose the appropriate synonym from those options that suits the word given in bold letters.*

11. Abundant
A) Scarce B) Lacking
C) Rare D) Insufficient
E) Plentiful

12. Coerce
A) Allow B) Request C) Permit
D) Force E) Persuade

13. Elated
A) Sad B) Depressed
C) Overjoyed D) Angry
E) Calm

14. Friction
A) Harmony B) Conflict
C) Peace D) Agreement
E) Unity

15. Mundane
A) Ordinary B) Exciting
C) Rare D) Special
E) Unique

16. Naive
A) Innocent B) Clever
C) Experienced D) Wise
E) Mature

17. Optimal
A) Worst B) Adequate C) Best
D) Minimal E) Poor

18. Peril
A) Safety B) Danger C) Comfort
D) Relief E) Peace

19. Robust
A) Weak B) Soft C) Fragile
D) Thin E) Strong

20. Scarcity
A) Plenty B) Excess C) Growth
D) Lack E) Profit

21. Thrive
A) Fail B) Collapse C) Stop
D) Decline E) Prosper

22. Trivial
A) Minor B) Important C) Serious
D) Major E) Significant

23. Validate
A) Reject B) Approve
C) Ignore D) Deny
E) Cancel

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

చెమటతో వ్యాధులను గుర్తించే చేతిపట్టీ!



- జబల్‌పూర్ విద్యార్థి ఆలోచనతో వినూత్న ఆవిష్కరణ

జబల్‌పూర్: చెమట ఆధారంగా శరీరంలోని వ్యాధులను గుర్తించే చేతి పట్టీలాంటి స్వెట్ బ్యాండ్‌ను జబల్‌పూర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్‌కు చెందిన పరిశోధక బృందం రూపొందించింది. మయూర్ పాటిల్ అనే విద్యార్థి ఆలోచనల ఫలితంగా ఈ పరికరం తయారైంది. రోగ నిర్ధారణకు రక్త నమూనాలు సేకరించే ప్రక్రియను గమనించిన పాటిల్.. వ్యాధి దశలో మనిషి శరీరంలోని రక్తంతో పాటు చెమటలోనూ మార్పులు వస్తాయని వైద్యశాస్త్ర పుస్తకాలు చదివి తెలుసుకున్నాడు. రక్తం తీయడం నొప్పితో కూడుకున్నది కాబట్టి, చెమట సాయంతో రోగాన్ని నిర్ధారిస్తే రోగికి మేలు కలుగుతుందని భావించి తన ఆలోచనను కళాశాలలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అవినాశ్ రవిరాజన్‌తో పంచుకున్నాడు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు మయూర్ ఆలోచన నచ్చింది. దీనిపై తన బృందంతో కలిసి విస్తృత పరిశోధన జరిపారు. "ఎంతో కష్టపడి మేం వాచ్‌లా చేతికి ధరించే బెల్టును, అనేక సెన్సర్లను నానోటెక్నాలజీ సాయంతో రూపొందించాం. పరీక్ష జరపాల్సిన శరీర భాగానికి దీన్ని అమర్చే ఏర్పాటు చేశాం. చివరకు చెమట ద్వారా వ్యాధిని నిర్ధారించే స్వెట్ బ్యాండును తయారుచేశాం" అని డాక్టర్ అవినాశ్ రవిరాజన్ తెలిపారు. ఈ పట్టీకి ఆర్ అలైన్‌మెంట్ బ్యాండ్ అని పేరు పెట్టారు. ఇందులో మూడు పొరలు ఉంటాయి. మొదటి పొరలో కెపాసిటర్లు ఉంటాయి. ఇవి చెమట కారణంగా ఉత్తేజితమవుతాయి. ఉత్తేజిత స్థాయిలో అది అందించే సమాచారాన్ని పూర్వపు సమాచారంతో పోల్చి చూసే మరో పొరకు పంపుతుంది. ఈ పద్ధతిలో చెమట పీహెచ్ (ఆమ్ల లేదా క్షార గుణం)ను కూడా గుర్తిస్తారు. శరీరానికి ఎలాంటి హాని కలిగించకుండా అందులోని వ్యాధిని గురించిన సమాచారం సేకరించేందుకు ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుంది. శరీరంలో ఏవైనా మార్పులొచ్చాయని సంకేతాలందితే దానిపై మరింత లోతుగా అధ్యయనం చేసి సరైన చికిత్సా విధానాన్ని ఎంచుకోవచ్చని అవినాశ్ తెలిపారు. ఈ పరికరానికి తాము పేటెంట్ పొందామన్నారు. జబల్‌పూర్‌లోని పలువురు డాక్టర్లు ఈ పరికరాన్ని పరీక్షించారని మయూర్ పాటిల్ చెప్పారు. ప్రస్తుతానికి ఈ పట్టీ ధరను రూ.30 వేలుగా నిర్ణయించారు. ధరను తగ్గించేందుకు కృషి చేస్తున్నారు.

టీవీ చూడటంలో చిన్నాపెద్దా మధ్య తేడాలు



లుండ్ (స్వీడన్): కుటుంబంలో పెద్ద కుమారులు, కుమార్తెలు పెరిగే తీరుకూ చిన్నవాళ్లు పెరిగే తీరుకూ తేడాలుంటాయి. జ్యేష్ఠ సంతానం వివిధ అంశాల్లో ముందుంటారు. తమ్ముళ్లు, చెల్లెళ్లకన్నా పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధిస్తారు, పెద్దయ్యాక ఉన్నత స్థాయి మేనేజర్లుగా రాణిస్తారు. దీనికి తేడాలేమిటో తెలుసుకోవాలని ఆస్ట్రేలియా, అమెరికాల్లోని శాస్త్రవేత్తలు పరిశోధన జరిపారు. మొదట ఆస్ట్రేలియాలో 2-15 ఏళ్ల మధ్య వయసులోని 5,500 మంది పిల్లలపై అధ్యయనం జరిపారు. వారి దిన చర్యలో నిద్ర, పాఠశాల చదువు, నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంచే కార్యకలాపాలు, టీవీ-వీడియో వీక్షణం, వ్యాయామంగా విభజించి పరిశీలించారు. పుస్తక పఠనం, హోం వర్క్ చేయడం, గిటార్ వంటి సంగీత వాద్య అభ్యాసం, లూడో, మోనోపలీ, వైకుంఠపాళి ఆడటాన్ని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలుగా పరిగణించారు. అధ్యయనానికి ఇద్దరు ముగ్గురు పిల్లలున్న కుటుంబాలను ఎంచుకున్నారు. అమెరికాలోనూ ఇదే విధంగా అధ్యయనం జరిపారు. జ్యేష్ఠ సంతానంకన్నా రెండో, మూడో బిడ్డలు వారానికి గంట నుంచి గంటన్నరసేపు ఎక్కువగా టీవీ చూడటం, వీడియో గేమ్స్ ఆడటం చేస్తున్నారని తేలింది. 10-14 ఏళ్ల పిల్లల్లో ఇది స్పష్టంగా కనిపించింది. చదువు, వ్యాయామాల్లో పెద్దవారికీ చిన్నవారికీ తేడా లేదు. పుస్తక పఠనం, నైపుణ్యాన్ని పెంచే బోర్డు క్రీడలు ఆడటంలో చిన్నవాళ్లు జ్యేష్ఠుల కన్నా తక్కువ సమయం వెచ్చించారు. ఇది వారి విద్యా నైపుణ్యాల అభివృద్ధికి విఘాతం కలిగిస్తోంది. చిన్న పిల్లలు ఎక్కువసేపు టీవీ చూడటం వల్ల అసభ్య చిత్రాలు చూసే ప్రమాదం ఎక్కువ అవుతోంది. 'దీన్ని నివారించడానికి తల్లిదండ్రులు చిన్నవాళ్లతో ఎక్కువ సమయం గడపాలి. వారితో పుస్తక పఠనం, నైపుణ్యాభివృద్ధి క్రీడలు ఆడించాలి. పదహారేళ్ల లోపువారు టీవీ చూసే సమయం.. అందులోని కంటెంట్‌పై నియంత్రణ విధించాలి' అని పరిశోధకులు సూచించారు.

6న "పరీక్షా పే చర్చా" తప్పక చూడండి

- మోదీ పిలుపు

దిల్లీ: "పరీక్షా పే చర్చా" కార్యక్రమం శుక్రవారం ప్రసారం కానుందని, దాన్ని తప్పక వీక్షించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం దేశ ప్రజలకు ఆహ్వానం పలికారు. పరీక్షా పే చర్చా కార్యక్రమం ద్వారా ప్రధానమంత్రి దేశంలోని విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడుతున్న సంగతి తెలిసిందే. ఈ సంవత్సరం ఈ కార్యక్రమాన్ని గుజరాత్‌లోని దేవ్‌మోగ్రాలో, తమిళనాడులోని కోయంబత్తూరులో, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పుర్‌లో, అస్సాంలోని గువాహటిలో నిర్వహించారు. "నా యువ మిత్రులతో మాట్లాడటం ఎంతో ఆహ్లాదకరం. ఒత్తిడి లేకుండా పరీక్షను ఎదుర్కోవడం ఎలాగన్నది ఈ చర్చ ప్రధానాంశం" అని ఆయన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. సమతుల్యత పాటించడం, ఆత్మవిశ్వాసం పెంచుకోవడం ఒత్తిడి లేకుండా పరీక్ష రాయడానికి ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఈసారి పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు 4.5 కోట్ల మంది నమోదయ్యారు.

అల్పాదాయ దేశాలకు సాయం అందాల్సిందే!

- లేకపోతే 2030 నాటికి 2.26 కోట్ల మరణాలు
- హెచ్చరించిన అధ్యయనం

దిల్లీ: అభివృద్ధి చెందిన దేశాలు మానవతా, అభివృద్ధి సాయాన్ని తగ్గించుకుంటూ వెళితే విపత్కర పరిణామాలు ఎదురౌతాయని ఓ అధ్యయనం పేర్కొంది. దీని వల్ల అల్ప, మధ్యాదాయ దేశాల్లో 2030 నాటికి ఐదేళ్లు దాటని 50లక్షల మంది చిన్నారులు సహా 2.26కోట్ల మంది ప్రాణాలుకోల్పోయే ప్రమాదముందని అంచనా వేసింది. స్పెయిన్‌లోని బార్సిలోనా ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్‌కు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించగా 'ద లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో ప్రచురితమైంది. అఫీషియల్ డెవలప్‌మెంట్ అసిస్టెన్స్ (ఓడీఏ) పేరుతో 2023లో మొత్తం రూ.22.57 లక్షల కోట్ల సాయాన్ని సమీకరించగా ఇందులో 70 శాతం వాటా అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, బ్రిటన్ నుంచే వచ్చాయి. 2024లో తొలిసారి జపాన్ మినహా మిగిలిన దేశాలు తమ వాటాను బాగా తగ్గించుకున్నాయి. 2026కు సంబంధించి అంచనాల ప్రకారం.. మొత్తం నిధుల సమీకరణ 11 శాతానికి తగ్గిపోవచ్చని ఈ అధ్యయనం పేర్కొంది. 'అధిక ఆదాయ దేశాలు అందించే నిధులు 29 శాతం మరణాలను, మరీ ముఖ్యంగా ఐదేళ్లలోపు వారిలో 39 శాతం మరణాలను తగ్గిస్తున్నాయి. ఇదే కాకుండా హెచ్ఐవీ, మలేరియా, టీబీ, డయేరియా తదితర రోగాల చికిత్సలకూ ఈ నిధులు అక్కరకు వస్తున్నాయి. ఈ నిధుల్లో కనిష్ఠ కోత పడినా అది అల్పాదాయ దేశాల ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది' అని అధ్యయనకర్తలు హెచ్చరించారు.

నాసా చంద్రమండల యాత్ర మార్చికి వాయిదా

- ఇంధనాన్ని నింపే పరీక్షలో లీకేజీలే కారణం

కేప్ కెనావెరల్: చందమామను చుట్టివచ్చే మానవసహిత యాత్ర చేపట్టేందుకు అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా తలపెట్టిన ఆర్టెమిస్-2 మిషన్ వచ్చే నెలకు వాయిదా పడింది. ఈ యాత్ర కోసం ఉపయోగించే భారీ స్పేస్ లాంచ్ సిస్టమ్ (ఎస్ఎల్ఎస్) రాకెట్‌లో ఇంధనాన్ని నింపేందుకు చేపట్టిన పరీక్షలో హైడ్రోజన్ లీకేజీలు బయటపడ్డాయి. మూడేళ్ల కిందట ఎస్ఎల్ఎస్ తొలి ప్రయోగంలోనూ ఇదే సమస్యలు తలెత్తాయి. ఫలితంగా నెలల తరబడి ప్రయోగాన్ని ఆపేయాల్సి వచ్చింది. అర్ధ శతాబ్దం తర్వాత చంద్రమండలం వద్దకు నాసా వ్యోమగాములను పంపుతోంది. ఇంధనాన్ని నింపే పరీక్ష విజయవంతమైతే ఆర్టెమిస్-2 ప్రయోగాన్ని ఈ వారాంతంలో చేపట్టాలని తొలుత భావించింది. భద్రతకు తొలి ప్రాధాన్యం ఇచ్చి వాయిదా నిర్ణయాన్ని తీసుకున్నామని నాసా అధిపతి జేర్డ్ ఐజాక్‌మన్ పేర్కొన్నారు. అంతా సిద్ధమయ్యాకే ప్రయోగాన్ని చేపడతామని వివరించారు. మార్చిలోగా మరోసారి ఇంధనాన్ని నింపే పరీక్షను చేపడతామని తెలిపారు. ఈ యాత్ర ద్వారా అమెరికాకు చెందిన ముగ్గురు, కెనడాకు చెందిన ఒకరు చందమామను చుట్టి రావాలి. 10 రోజులపాటు ఇది సాగుతుంది. ఈ యాత్రలో వ్యోమగాములు చందమామపై దిగరు. భవిష్యత్‌లో అది జరుగుతుంది. దానికి ముందు వ్యోమనౌకలోని అన్ని కీలక వ్యవస్థలను పరీక్షించడం నాసా ఉద్దేశం.

మయన్మార్‌లో భూకంపం

- కోల్‌కతాలోనూ ప్రకంపనలు

కోల్‌కతా: మయన్మార్‌లో మంగళవారం రాత్రి 9.04 గంటల సమయంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత 6గా నమోదైంది. మన దేశంలోని కోల్‌కతా, చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ ప్రకంపనలు వచ్చాయి. దీంతో కోల్‌కతాలోని ఎత్తైన భవనాల్లో ఉన్నవారు బయటకు పరుగులు తీశారు. భూకంప నష్టంపై ఎటువంటి వివరాలందలేదు. భూకంప కేంద్రం మయన్మార్‌లోనే ఉందని అధికారులు తెలిపారు.

అపరిమిత అవకాశాలకు ద్వారాలు

- యువత, పారిశ్రామికవేత్తలకు మేలు
- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై అమిత్ షా

దిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందాన్ని ఎన్డీఏ నేతలు ప్రశంసించగా ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి. ఈ ఒప్పందంతో దేశంలోని యువత, పారిశ్రామికవేత్తలకు అవకాశాల ద్వారాలు తెరుచుకుంటాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, పలువురు నేతలు అభిప్రాయపడ్డారు.

చరిత్రాత్మకం



భారత్, అమెరికాల మధ్య కుదరనున్న వాణిజ్య ఒప్పందం చరిత్రాత్మకం. ఇది రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింతగా ముందుకు తీసుకెళ్లనుంది. బలమైన వాణిజ్య బంధాన్ని నిర్మించనుంది. యువతకు, పారిశ్రామికవేత్తలకు, సాంకేతిక నిపుణులకు అపరిమిత అవకాశాల ద్వారాలను తెరవనుంది. ఈ చరిత్రాత్మక ఒప్పందానికి బాటలు పరిచిన మోదీ, ట్రంప్‌లకు శుభాకాంక్షలు. చిన్న పరిశ్రమలు ప్రపంచంతో పోటీపడే అవకాశాన్ని ఈ ఒప్పందం కల్పించనుంది.

– అమిత్ షా

మేకిన్ ఇండియా బలోపేతం



వాణిజ్య ఒప్పందం రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలకు, మేకిన్ ఇండియాకు బలం చేకూరుస్తుంది. ఇది మరిన్ని ఉద్యోగాలను కల్పిస్తుంది. ఆవిష్కరణలకు ఊతమిస్తుంది. సాంకేతిక రంగంలో బంధాన్ని బలోపేతం చేస్తుంది.

– జైశంకర్, విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి

భారత్‌కు ఉత్తేజం



భారత ఆర్థిక వ్యవస్థకు ఈ ఒప్పందం ఉత్తేజాన్ని అందించనుంది. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించడానికి సహకరించనుంది.

– నితిన్ నబీన్, భాజపా అధ్యక్షుడు

భారత్‌కు అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు

భారత్‌తో ట్రంప్ ప్రకటించిన వాణిజ్య ఒప్పందంతో అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారీ మార్కెట్ లభించనుంది. రష్యా దుందుడుకు ధోరణికి అడ్డుకట్ట పడనుంది. అధ్యక్షుడు ట్రంప్‌నకు శుభాకాంక్షలు. అమెరికా రైతులకు ప్రయోజనం చేకూర్చే ఒప్పందం కుదుర్చుకున్నందుకు ధన్యవాదాలు.

– సెనెట్ విదేశీ సంబంధాల కమిటీ ఛైర్మన్ జిమ్ రిస్క్, వ్యవసాయ మంత్రి బ్రూక్ రోలిన్స్

ఆస్ట్రేలియాలో మహాత్ముని విగ్రహం గల్లంతు

దిల్లీ: ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో భారత సామాజిక కేంద్రం నుంచి మహాత్మాగాంధీ కాంస్య విగ్రహం దొంగతనానికి గురైంది. ఈ ఘటనను భారత్ మంగళవారం తీవ్రంగా ఖండించింది. విగ్రహాన్ని తక్షణం కనుగొనాలని డిమాండ్ చేసింది. దాదాపు 420 కేజీల బరువున్న ఈ విగ్రహం గత నెల 12న తెల్లవారుజామున మెల్‌బోర్న్‌లోని రోవిల్‌లో దొంగతనానికి గురైనట్టు ఆస్ట్రేలియా మీడియా పేర్కొంది. దుండగులు విగ్రహాన్ని పాదాల వద్ద తెగ్గోసి తీసుకుపోయారని వివరించింది.



"ఆస్ట్రేలియాలోని భారత సామాజిక కేంద్రంలో మహాత్ముని విగ్రహాన్ని తొలగించడాన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం" అని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ అన్నారు. ఈ విషయాన్ని ఆస్ట్రేలియా అధికారులతో గట్టిగా మాట్లాడాం. గల్లంతైన విగ్రహాన్ని వెంటనే కనుగొనాలని, బాధ్యులను శిక్షించాలని కోరామని ఆయన తెలిపారు. భారత సాంస్కృతిక సంబంధాల మండలి అందించిన మహాత్ముని విగ్రహాన్ని 2021లో అప్పటి ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిసన్ ఆవిష్కరించారు. బలమైన భారత ఆస్ట్రేలియా సంబంధాలకు ప్రతీకగా అప్పట్లో దాన్ని ఏర్పాటు చేశారు.

తీర్పుల జాప్యం.. గుర్తించిన వ్యాధే

- దానిని నివారించాల్సిందే: సుప్రీంకోర్టు



దిల్లీ: హైకోర్టులలో విచారణ ప్రక్రియ అంతా ముగిసిన తర్వాత తీర్పులను వెలువరించకుండా నెలల తరబడి రిజర్వు చేయడం 'గుర్తించిన వ్యాధి'గా సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఆ వ్యాధి విస్తరించకుండా చేయడంతో పాటు నివారించి నిర్మూలించాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలి ధర్మాసనం మంగళవారం పేర్కొంది. సకాలంలో తీర్పులు వెలువరించాల్సిన ఆవశ్యకత ఉందని స్పష్టం చేసింది. ఝార్ఖండ్ హైకోర్టు గత ఏడాది డిసెంబరు 4న ఒక పిటిషన్‌ను తోసిపుచ్చుతూ మౌఖికంగా తీర్పు ఇచ్చినప్పటికీ దానిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయకపోవడంపై విచారణ జరుపుతూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. వచ్చే వారం చివరిలోగా సంబంధిత న్యాయవాదికి పూర్తి తీర్పు ప్రతిని అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసింది.

న్యాయం అందుబాటులో ఉండటమే ప్రజాస్వామ్యబద్ధ పరిపాలనకు పునాది: సుప్రీం

దిల్లీ: సామాన్యులకు న్యాయం అందుబాటులో ఉండటం ప్రజాస్వామ్యబద్ధమైన పరిపాలనకు పునాది వంటిదని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది. న్యాయమైన, సమానత్వ భావనలు కలిగిన సమాజానికి అదే గీటురాయి అని జస్టిస్ పి.ఎస్. నరసింహా, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్‌లు అభిప్రాయపడ్డారు. మధ్యవర్తిత్వ వ్యాజ్యాల సమర్థ నిర్వహణను వారు నొక్కి చెప్పారు. 1996 నాటి మధ్యవర్తిత్వ, రాజీ చట్టంలోని సెక్షన్ 29(ఎ) కింద మధ్యవర్తి కాల పరిమితిని పెంచుకోవచ్చని వారన్నారు. సెక్షన్ 29ఎ(1), సెక్షన్ 29ఎ(3)ల కింద కాల పరిమితి మించిపోయినా పొడిగింపునకు దరఖాస్తు చేసుకోవచ్చని ధర్మాసనం పేర్కొంది. ప్రజల న్యాయమైన హక్కుల పరిరక్షణకు భారత రాజ్యాంగం సుప్రీంకోర్టు, హైకోర్టులు, జిల్లా కోర్టులు ఏర్పాటు చేసిందని తెలిపింది. ఈ కోర్టులు అందించే న్యాయ పరిష్కారాలు ప్రభావవంతంగా ఉండాలని వివరించింది. 1996 నాటి మధ్యవర్తిత్వ చట్టం తేలికైన, చవకైన, గోప్యమైన, న్యాయమైన వివాద పరిష్కార మార్గాలను సూచిస్తోందని ధర్మాసనం పేర్కొంది. తమకు నచ్చిన మధ్యవర్తులను ఎంచుకునే అవకాశాన్ని కల్పించిందని అన్నారు. వేగవంతంగా వివాద పరిష్కారానికి వీలు కల్పించడమే ఈ చట్ట సామర్థ్యానికి నిదర్శనమని న్యాయమూర్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

జైలు వాహనంలో అసెంబ్లీకి వచ్చి.. బిహార్ ఎమ్మెల్యే అనంత్‌కుమార్ ప్రమాణస్వీకారం

పట్నా: బిహార్‌లోని మొకామా స్థానం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన జేడీయూ నేత అనంత్‌కుమార్ సింగ్ మంగళవారం జైలు వాహనంలో అసెంబ్లీకి వచ్చి ప్రమాణస్వీకారం చేశారు. రాజకీయ నాయకుడిగా మారిన డాన్ అనంత్‌కుమార్.. మొకామాలో జన్ సురాజ్ పార్టీ అభ్యర్థికి మద్దతిచ్చిన గ్యాంగ్‌స్టర్ దులార్‌చంద్ యాదవ్ హత్య కేసులో నిరుడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు అరెస్టయ్యారు. అనంతరం ఎన్నికల్లో గెలిచినప్పటికీ.. బెయిలు రాకపోవడంతో అసెంబ్లీకి వెళ్లలేకపోయారు. తాజాగా పెరోల్‌పై అధికారులు ఆయన్ను జైలు వాహనంలో శాసనసభకు తీసుకురాగా ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. అనంతరం తన రాజకీయ గురువైన ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ పాదాలకు అనంత్‌కుమార్ నమస్కరించారు.

బెంగాల్-ఝార్ఖండ్ బొగ్గు మాఫియా కేసులో మరోసారి ఈడీ సోదాలు

కోల్‌కతా: ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్ వ్యాప్తంగా విస్తరించిన బొగ్గు మాఫియాపై నమోదైన నగదు అక్రమ చలామణి కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వేగం పెంచుతోంది. ఇందులో భాగంగా మంగళవారం బెంగాల్, దిల్లీల్లోని పలు ప్రాంతాల్లో మరోసారి సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. దిల్లీ, కోల్‌కతా, ఆసన్‌సోల్, దుర్గాపుర్ తదితర ప్రాంతాల్లో సోదాలు జరిగాయని పేర్కొన్నారు. ఆసన్‌సోల్‌లోని బుద్‌బుద్ పోలీస్‌స్టేషన్‌లో కొత్తగా నియమితులైన ఆఫీసర్ ఇన్‌ఛార్జి మనోరంజన్ మండల్ నివాసం కూడా ప్రస్తుతం సోదాలు నిర్వహించిన ప్రదేశాల్లో ఒకటి కావడం గమనార్హం. గతంలో అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయిన మనోరంజన్.. ఇటీవలే మళ్లీ పోస్టింగ్ పొందారు.

మేలో భారత పర్యటనకు సైప్రస్ అధ్యక్షుడు

దిల్లీ: ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నాల్లో భాగంగా సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ మే చివరి వారంలో భారత పర్యటనకు రానున్నారు. మన దేశంలో సైప్రస్ హైకమిషనర్‌గా పనిచేస్తున్న ఎవగోరస్ వ్రియోనిడెస్ తాజాగా ఈ విషయాన్ని వెల్లడించారు. సైప్రస్ విదేశాంగ మంత్రి వచ్చే నెలలో భారత్‌ను సందర్శిస్తారని కూడా చెప్పారు. నిరుడు జూన్‌లో ప్రధాని మోదీ సైప్రస్‌లో పర్యటించిన సంగతి గమనార్హం.

రైతులకు నమ్మక ద్రోహమే

- వాణిజ్య ఒప్పందంపై సంయుక్త కిసాన్ మోర్చా విమర్శ

దిల్లీ: భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం ద్వారా కేంద్ర ప్రభుత్వం రైతులకు నమ్మక ద్రోహం చేస్తోందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) విమర్శించింది. నియంత ట్రంప్ ముందు ప్రధాని మోదీ మోకరిల్లారని ధ్వజమెత్తింది. 'గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేసిన ప్రసంగంలో రైతుల కోసం తాను ఎంత మూల్యమైనా చెల్లిస్తానని పేర్కొన్నారు. ఏడాది తిరగకుండానే ఆయన అమెరికాకు లొంగిపోయారు. అమెరికాతో ఒప్పందంవల్ల అత్యధిక సబ్సిడీలతో పండించే వ్యవసాయ ఉత్పత్తులు భారత మార్కెట్లను ముంచెత్తుతాయి. మన రైతాంగ వ్యవస్థను ధ్వంసం చేస్తాయి' అని మంగళవారం ఒక ప్రకటనలో ఎస్‌కేఎం పేర్కొంది. సున్నా సుంకాలకు మోదీ అంగీకరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేసింది.

వామపక్ష తీవ్రవాదం తగ్గుతోంది: కేంద్రం

దిల్లీ: దేశంలో వామపక్ష తీవ్రవాదం తగ్గుముఖం పడుతోందని, 2019 నుంచి ఇప్పటిదాకా 7,400 మంది నక్సలైట్లను అరెస్టు చేయగా 5,880 మంది లొంగిపోయారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ మంగళవారం లోక్‌సభకు తెలిపారు. 2025లో భద్రతా దళాలు 364 మంది నక్సలైట్లను హతమార్చాయని, 2010తో పోలిస్తే 2025 నాటికి వామపక్ష తీవ్రవాద దాడుల ఘటనలు 88 శాతం తగ్గాయని వివరించారు. 2018లో 126 జిల్లాల్లో వామపక్ష తీవ్రవాద ప్రభావం ఉండగా.. 2025 డిసెంబరుకల్లా ఆ జిల్లాల సంఖ్య 8కి పడిపోయిందని చెప్పారు. మావోయిస్టు పార్టీకి నిధులు అందకుండా కట్టడి చేశామని తెలిపారు. వామపక్ష తీవ్రవాద పీడిత ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు తోడు మౌలిక వసతులను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో 9,233 టెలికం టవర్లను, 15,016 కిలోమీటర్ల పొడవైన రోడ్లను నిర్మించామని చెప్పారు. 46 పారిశ్రామిక శిక్షణ సంస్థలను (ఐటీఐ), 49 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను నెలకొల్పామని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో 179 ఏకలవ్య ఆదర్శ పాఠశాలలు పని చేస్తున్నాయని, 6,025 తపాలా కార్యాలయాలు, 1804 బ్యాంకు శాఖలు, 1321 ఏటీఎంలు ఉన్నాయని వివరించారు.

స్పీకర్ పోడియంపైకి ఎక్కేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే యత్నం

- కేరళ అసెంబ్లీలో నాటకీయ పరిణామం

తిరువనంతపురం: శబరిమల బంగారం తాపడాల కేసు సెగ కేరళ అసెంబ్లీ సమావేశాలను తాకింది. ఈ కేసు దర్యాప్తులో ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంఓ) జోక్యం చేసుకుంటోందని ఆరోపిస్తూ మంగళవారం కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ అసెంబ్లీలో నాటకీయ పరిణామానికి తెరలేపింది. అసెంబ్లీ మొదలు కాగానే... తాము సమావేశాలను బహిష్కరిస్తున్నామని, ఇకపై సభ కొనసాగడానికి సహకరించబోమని అసెంబ్లీలో విపక్షనేత వి.డి.సతీశన్ స్పీకర్ ఎ.ఎన్.శంశీర్‌కు తెలిపారు. ఒకవైపు పెద్దఎత్తున నిరసనలు కొనసాగుతుండగానే ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అన్వర్ సదాత్ అకస్మాత్తుగా స్పీకర్ పోడియంపైకి ఎక్కేందుకు యత్నించారు. దీంతో దాదాపు 30 నిమిషాల పాటు స్పీకర్ సభను నిలిపివేసి తన ఛాంబర్‌కు వెళ్లిపోయారు. ప్రతిపక్షాల ప్రవర్తనను సీఎం విజయన్ 'దురదృష్టకరం', 'శోచనీయం' అని అభివర్ణించారు. బంగారు తాపడాల కేసులో సిట్ విచారణను హైకోర్టు డివిజన్ బెంచ్ పర్యవేక్షిస్తోందని, ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లు వారు ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. కాగా.. ..తాపడాల కేసులో సీఎంవో హస్తం ఉందని, సిట్ ఛార్జిషీట్‌ను దాఖలుచేయడంలో జాప్యం చేసిందని కేరళ హైకోర్టు గుర్తించిందని సతీశన్ ఆరోపించారు.

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్‌పై పరువునష్టం దావా ఉపసంహరణ

- కాంగ్రెస్ ఎంపీ వివేక్ తంఖా నిర్ణయం

దిల్లీ: కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌పై దాఖలు చేసిన పరువునష్టం దావాను ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ ఎం.పి.వివేక్ తంఖా నిర్ణయించారు. పార్లమెంటులో కలుసుకున్న వీరిద్దరూ తమ వివాదాన్ని పరిష్కరించుకున్నారని సీనియర్ న్యాయవాది మహేశ్ జఠ్మలానీ మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపారు. వివేక్ తంఖా తరఫు న్యాయవాది కపిల్‌సిబల్ ఈ విషయంలో సహకరించారని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎన్.కె.సింగ్ ధర్మాసనానికి వివరించారు. ఈ విషయాన్ని నమోదు చేసుకున్న ధర్మాసనం..కేసు విచారణను ముగిస్తున్నట్లు ప్రకటించింది. ఇరుపక్షాల న్యాయవాదులను ప్రశంసించింది. ఓబీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమంటూ 2021 మధ్యప్రదేశ్ పంచాయతీ ఎన్నికల సమయంలో తనపై చేసిన ఆరోపణలకు గాను వివేక్ తంఖా రూ.10 కోట్ల పరిహారం కోరుతూ భాజపా నేతలపై పరువునష్టం దావా వేశారు. మధ్యప్రదేశ్ హైకోర్టు ఈ కేసును కొట్టివేయడానికి నిరాకరించడంతో సుప్రీంకోర్టుకు చేరింది.

కొలంబియా అధ్యక్షుడికి ఆతిథ్యమిచ్చిన ట్రంప్

- శ్వేతసౌధంలో ఇద్దరు నేతల భేటీ

వాషింగ్టన్: పరస్పరం విమర్శలు సంధించుకునే అగ్రదేశాధినేత డొనాల్డ్ ట్రంప్....కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో మంగళవారం శ్వేతసౌధంలో భేటీ అయ్యారు. కరీబియన్ దేశమైన కొలంబియా నుంచి యూఎస్‌కు మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతున్నాయంటూ, ఆ దేశాధ్యక్షుడు రోగగ్రస్థుడంటూ అవమానించిన ట్రంప్ కొన్ని వారాల వ్యవధిలోనే గుస్తావోకు ఆతిథ్యం ఇవ్వడం గమనార్హం. ప్రస్తుత సమావేశం ప్రాంతీయ భద్రతా సహకారం, మాదకద్రవ్యాల నిరోధక చర్యలపై దృష్టి సారిస్తుందని అమెరికా అధికార వర్గాలు తెలిపాయి. వెనెజువెలా మాజీ అధ్యక్షుడు మదురోను అమెరికా సైనికులు నిర్బంధించడాన్ని వామపక్ష నేత అయిన గుస్తావో ఖండించారు. వెనెజువెలాపై దాడి తర్వాత గుస్తావోలో మార్పు వచ్చిందని ట్రంప్ పేర్కొన్న నేపథ్యంలో కొలంబియా నేతకు శ్వేతసౌధం స్వాగతం పలికింది.



గుస్తావో పెట్రో, డొనాల్డ్ ట్రంప్

32 మందికి చూపునిచ్చిన శిర్డీ సాయినాథ్ ఆసుపత్రి

ఈటీవీ భారత్: 'మానవసేవే మాధవసేవ' అని చాటిన సాయిబాబా ఆశయానికి అనుగుణంగా మహారాష్ట్రలోని శిర్డీలో ట్రస్టు తరఫున నిర్వహిస్తున్న 'శ్రీ సాయినాథ్ ఆసుపత్రి' మానవాళికి సేవలందిస్తోంది. ఈ ఆసుపత్రికి గతేడాది మార్చి నుంచి 2026 జనవరి దాకా 28 మంది దాతలు నేత్రదానం చేయగా, 32 మంది అంధులకు కొత్తగా చూపునిచ్చారు. అత్యాధునిక 'ఐ' బ్యాంకు, నిపుణులైన వైద్యులు, చక్కటి వసతులు గల ఈ ఆసుపత్రిలో ఉచితంగా అందించే చికిత్సల కోసం దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి నిత్యం వందల మంది వస్తుంటారు. కార్నియల్ మార్పిడి శస్త్రచికిత్సలను తాము విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ సాయినాథ్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మైథిలీ పీతాంబర్ తెలిపారు. అవసరమున్న ఎవరైనా తమను సంప్రదించవచ్చని, ట్రస్టు నిబంధనల మేరకు చికిత్సలు అందిస్తామన్నారు.





ఫోన్ నంబర్ బ్లాక్ చేశాడని ప్రియుణ్ని చంపిన ప్రియురాలు

ఈటీవీ భారత్: ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పుర్ సివిల్ లైన్స్ పోలీస్‌స్టేషను పరిధిలో ఫోన్ నంబరు బ్లాక్ చేశాడన్న కోపంతో ఓ యువతి తన ప్రియుడిని కత్తితో పొడిచి చంపింది. ప్రసాద్ సూర్యవంశీ (25) అనే యువకుడు స్థానిక శుభమ్ విహార్ టీచర్స్ కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. హోటలులో పనిచేసే ఇతనికి ఓ యువతితో గత కొంతకాలంగా ప్రేమ వ్యవహారం నడుస్తోంది. వీరిద్దరికీ సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. దీంతో ఒకరింటికి మరొకరు వచ్చి వెళ్తుండేవారు. ఇటీవలి కాలంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ప్రసాద్ ఆమె ఫోన్ నంబరును బ్లాక్ చేశాడు. ప్రియుడి ఇంటికి వెళ్లిన ఆమె ఫోన్ నంబరు ఎందుకు బ్లాక్ చేశావని వాదనకు దిగింది. మొబైల్‌లోని ఛాటింగ్స్ చూపించాలని పట్టుబట్టింది. ప్రసాద్ ససేమిరా అనడంతో ఆమె తన వెంట తెచ్చుకొన్న కత్తితో అతనిపై విచక్షణరహితంగా దాడి చేసింది. తీవ్రగాయాలతో ప్రసాద్ అక్కడికక్కడే మరణించాడు. నిందితురాలిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు బిలాస్పుర్ ఎస్పీ రజనీశ్ సింగ్ తెలిపారు.

ప్రతి ఐదు క్యాన్సర్ కేసుల్లో రెండు నివారణ సాధ్యమైనవే

- అధ్యయన నివేదిక వెల్లడి

దిల్లీ: ప్రపంచంలో సంభవించే ప్రతి ఐదు క్యాన్సర్ కేసుల్లో రెండు నివారణ సాధ్యమైనవేనని పరిశోధకులు పేర్కొన్నారు. పొగతాగడం, మద్యపానం వంటి మానుకోదగిన అలవాట్లతో పాటు శారీరక శ్రమ, ఇన్‌ఫెక్షన్లతో ఇవి ముడిపడి ఉన్నాయని 2022లో సేకరించిన గణాంకాల ఆధారిత అధ్యయనంలో వెల్లడైంది. అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధక సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిధిలోని ఐక్యరాజ్యసమితి క్యాన్సర్ ఏజెన్సీలు.. 185 దేశాల నుంచి సేకరించిన 1.87 కోట్ల క్యాన్సర్ కేసులను గ్లోబోకాన్ డేటాబేస్‌ను వినియోగించి విశ్లేషించాయి. ఇందులో 36 రకాల క్యాన్సర్‌లు ఉన్నాయి. నివారణ సాధ్యమైన క్యాన్సర్ల జాబితాలో ఊపిరితిత్తుల క్యాన్సర్ అగ్రభాగాన నిలిచింది. ఆ తర్వాత నివారణ సాధ్యమైన వాటిలో ఉదరకోశ, సెర్వైకల్ క్యాన్సర్‌లు ఉన్నాయి. 25 లక్షల ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసుల్లో 18 లక్షల కేసులు నివారణ సాధ్యమైన కారణాల వల్లే ప్రబలినవని తేలింది. స్థూలకాయం, శారీరక శ్రమ లేకపోవడం, చనుబాలు సరిగా పట్టకపోవడం, వాయు కాలుష్యాలు ఈ క్యాన్సర్ ఘటనలకు ముఖ్య కారణాలని అధ్యయనకర్తలు తెలిపారు. పురుషుల్లో సంభవించే క్యాన్సర్ కేసుల్లో 45.4శాతం, మహిళల్లో 30 శాతం కేసులు నివారణ సాధ్యమైనవేనని తేలింది. కొత్తగా నమోదైన క్యాన్సర్ కేసుల్లో 15.1 శాతం పొగాకు తాగడంతో, 10.2 శాతం కేసులు ఇన్‌ఫెక్షన్ల కారణంగా, 3.2 శాతం కేసులు మద్యపానం వల్ల సంభవించినట్లు గుర్తించారు. మహిళల్లో సంభవిస్తున్న క్యాన్సర్‌లలో అత్యధికం హ్యూమన్ పాపిలోమా వైరస్ లేదా హెలికోబ్యాక్టర్ పైలోరి వల్ల సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. స్థూలకాయం, శారీరక శ్రమ లేకపోవడం మహిళల్లో రొమ్ము తదితర క్యాన్సర్‌లకు కారణమని అధ్యయనకర్తలు పేర్కొన్నారు.

భారత్-అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం చరిత్రాత్మక ఘట్టం

ప్రధాని మోదీకి అభినందనలు తెలిపిన సీఎం

ఈనాడు-అమరావతి: భారత్-అమెరికాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం ప్రపంచ ఆర్థిక స్థిరత్వానికి ఓ చరిత్రాత్మక ఘట్టమని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో మంగళవారం పోస్ట్ చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకోవడంపై ప్రధాని నరేంద్రమోదీకి చంద్రబాబు అభినందనలు తెలిపారు. 'సుంకాలు 18 శాతానికి తగ్గించడం ప్రపంచంలోని రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని బలోపేతం చేస్తుంది. నిరంతర ప్రపంచ వృద్ధికి కొత్తశక్తినిచ్చే ఈ దార్శనిక నిర్ణయం ఉంది. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక శక్తి కేంద్రంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోంది. భారత ఎగుమతుల్లో పోటీ తత్వాన్ని, గణనీయంగా పెంచేలా ఒప్పందం ఉంది. ఇది వికసిత్ భారత్ సహా దేశ యువత, రైతులకు అపారమైన అవకాశాలు సృష్టిస్తుంది' అని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

వారంలో రెండు కీలక వాణిజ్య ఒప్పందాలు: పవన్

భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా వారం రోజుల వ్యవధిలో రెండు ప్రపంచ స్థాయి వాణిజ్య ఒప్పందాలను విజయవంతంగా పూర్తిచేసిన ప్రధాని నరేంద్ర మోదీకి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభినందనలు తెలిపారు. 'గత వారంలో యూరోపియన్ యూనియన్‌తో కుదిరిన మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ చరిత్రాత్మక ఒప్పందం. ఆ తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో భారత్ కుదుర్చుకున్న ఒప్పందం.. దేశ ఆర్థిక అవకాశాలను మరింత మెరుగుపరుస్తుంది. ఈ రెండు ఒప్పందాలు భారత్‌ను ప్రపంచ వాణిజ్య రంగంలో బలమైన స్థితిలో నిలబెడతాయి. తాజా ఒప్పందంలో అమెరికా టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించడం రైతులకు లాభదాయకం. అంతర్జాతీయ మార్కెట్‌లో, ఎగుమతుల్లో పోటీతత్వం పెరుగుతుంది. దేశప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటున్న ప్రధాని మోదీకి కృతజ్ఞతలు' అంటూ 'ఎక్స్'లో పవన్ పేర్కొన్నారు.

అమెరికా సుంకాల తగ్గింపుతో రాష్ట్రానికి ప్రయోజనం: మంత్రి లోకేశ్

అమెరికా సుంకాల తగ్గింపుతో రాష్ట్రానికి ప్రయోజనం కలుగుతుందని మంత్రి లోకేశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'అమెరికా సుంకాలను 18 శాతానికి తగ్గించడం దేశ ఎగుమతులు, తయారీ రంగానికి ప్రోత్సాహకరం. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశానికి ఇది ఒక పెద్ద విజయం. ఈ ఒప్పందంతో రాష్ట్రం నుంచి మారిటైం ఉత్పత్తుల ఎగుమతులు, ఎంఎస్ఎంఈలు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులతో పాటు తయారీ హబ్‌లకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుంది. భారత్-అమెరికా మధ్య వాణిజ్య బంధం మరింతగా బలోపేతం అవుతుంది. ఈ కీలక ఒప్పందం కోసం చర్చల్లో పాల్గొన్న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, రెండు దేశాల నేతలకు అభినందనలు' అని లోకేశ్ పేర్కొన్నారు.

అమెరికా టారిఫ్ తగ్గింపుతో.. రాష్ట్రానికి భారీగా మేలు: అచ్చెన్నాయుడు

సముద్ర ఉత్పత్తుల ఎగుమతులపై అమెరికా సుంకాన్ని 25% నుంచి 18 శాతానికి తగ్గించడం వల్ల ఆక్వా రంగానికి ఉపశమనం లభిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం కింద తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రానికి భారీగా ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. 'గతంలో పెనాలిటీ టారిఫ్‌తో కలిపి 50-58% వరకు ఉత్పత్తులపై సుంకాల భారం పడేది. దీనివల్ల 2025 ఏప్రిల్ నుంచి నవంబరు మధ్య భారత్ నుంచి జరిగే సముద్ర ఆహార ఎగుమతులు సుమారు 15% తగ్గాయి. ప్రధానంగా ఫ్రోజెన్ ష్రింప్ ఎగుమతులపై ప్రభావం పడింది. ఇప్పుడు సుంకాన్ని తగ్గించడంతో ఎగుమతులకు సంబంధించి కొత్త ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. భవిష్యత్తులో సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు 10-15% వరకు పెరుగుతాయి. టారిఫ్ తగ్గింపుతో మనకు భారీ ప్రయోజనం చేకూరుతుంది' అని పేర్కొన్నారు.

అమెరికాతో ఒప్పందం మహా విజయం: మాధవ్

అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ఏకాభిప్రాయం కుదరడం, భారత వస్తువులపై టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించడం.. ప్రపంచ వాణిజ్య రంగంలో భారత్ సాధించిన మహా విజయమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఇది భారత్-అమెరికా సంబంధాల్లో కీలకమైన ఘట్టమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఈయూతో మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ తర్వాత.. ఇప్పుడు అమెరికాతో భారీ ఒప్పందం కుదరడం భారత దౌత్యనీతికి నిదర్శనం. ప్రపంచ వేదికపై దేశానికి ఘనత తెచ్చిన ప్రధాని మోదీ దూరదృష్టికి వందనం' అని మాధవ్ పేర్కొన్నారు.

ఫైబర్‌నెట్‌లో పెట్టుబడులకు లక్స్‌షేర్ ఆసక్తి

మంత్రి జనార్దన్‌రెడ్డిని కలిసిన సంస్థ ప్రతినిధులు



సచివాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసిన తైవాన్‌కు చెందిన లక్స్‌షేర్ సంస్థ ప్రతినిధులు

ఈనాడు-అమరావతి: ఫైబర్‌నెట్‌లో కొత్త సాంకేతికత, ఉత్పత్తుల రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు తైవాన్‌కు చెందిన లక్స్‌షేర్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. తిరుపతిలోని ఎలక్ట్రానిక్ క్లస్టర్‌లో ఈ సంస్థ ఉత్పత్తి యూనిట్‌ను నిర్వహిస్తోంది. ఈ సంస్థ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి పెట్టుబడుల ప్రతిపాదనపై చర్చించారు. ట్రిపుల్ ప్లే విత్ వైఫై, ఓటీటీ వంటి సేవలపై మంత్రికి వివరించారు. ఈ పెట్టుబడుల ద్వారా 10 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

వసతి గృహాల్లో మరమ్మతులకు రూ.20 కోట్లు

మంత్రి సవిత వెల్లడి

ఈనాడు, అమరావతి: బీసీ వసతి గృహాల్లో మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ నిధులతో రాష్ట్రంలోని 238 వసతి గృహాల్లో మరమ్మతులు చేపడతామని తెలిపారు. ఇప్పటివరకు వసతిగృహాలు, గురుకులాల అభివృద్ధికి రూ.105 కోట్లు కూటమి ప్రభుత్వం వెచ్చించిందని వివరించారు. సచివాలయంలో ఆమె మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు పెట్టే ఆహారం నాణ్యంగా, రుచికరంగా ఉండేందుకు కుక్‌లు, కమాటీలను ఇటీవల నియమించామన్నారు. సన్నబియ్యంతో రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నామని తెలిపారు.

రెండోరోజూ తెదేపా ఎంపీలతో స్పీకర్ ఓం బిర్లా సమావేశం

ఈనాడు, దిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వరుసగా రెండోరోజూ తెదేపాకు చెందిన మరికొందరు ఎంపీలతో భేటీ అయ్యారు. పార్లమెంటు నిర్వహణ తీరుపై ఎంపీల అభిప్రాయాలు తెలుసుకునే క్రమంలో రోజూ కొందరు ఎంపీలతో సమావేశమవుతున్న ఆయన మంగళవారం ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, తెన్నేటి కృష్ణప్రసాద్, బైరెడ్డి శబరి, కేశినేని శివనాథ్‌లతో భేటీ అయ్యారు. సభా కార్యకలాపాలు మరింత ఫలవంతంగా నిర్వహించేందుకు వారి సూచనలు, సలహాలు అడిగి తెలుసుకున్నారు. తొలిసారి లోక్‌సభకు వచ్చినవారికి ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని వారు కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎంపీలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌కు శాలువా కప్పి గౌరవించారు.



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో ఎంపీలు కృష్ణప్రసాద్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, బైరెడ్డి శబరి, కేశినేని శివనాథ్

మూడేళ్ల సీనరేజ్ ఫీజు ముందే చెల్లించాలి

- నామినేషన్‌పై లీజుల మంజూరుకు మార్గదర్శకాలు

ఈనాడు, అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు, ఇతరులకు నామినేషన్ విధానంలో ఖనిజ లీజులు కేటాయిస్తే.. ఫీజులు ఎంత వసూలు చేయాలో నిర్దేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

◆ ప్రభుత్వ రంగ సంస్థలకు నాన్ క్యాప్టివ్ కమర్షియల్ ఆపరేషన్స్ కోసం నామినేషన్ విధానంలో లీజులు ఇవ్వాలనుకున్నప్పుడు.. అవి మైనింగ్ ప్లాన్‌లో ఏటా ఎంత ఖనిజాన్ని తవ్వితీస్తామని పేర్కొంటాయే.. ఆ మేరకు మూడేళ్ల సీనరేజ్ ఫీజును లీజు మంజూరుకు ముందే చెల్లించాల్సి ఉంటుంది.

◆ ఒకవేళ క్యాప్టివ్ అవసరాలకు లీజు పొందితే వార్షిక డెడ్‌రెంట్ విలువకు ఐదు రెట్ల మొత్తాన్ని రెండు వాయిదాల్లో చెల్లించాలి.

◆ ఇతరులకు ఎవరికైనా కమర్షియల్, క్యాప్టివ్ మైనింగ్ అవసరాలకు నామినేషన్ విధానంలో లీజు కేటాయిస్తే.. ఆ లీజు ప్రాంతంలో లభించే ఖనిజ నిక్షేపాల విలువలో 5 శాతం ప్రీమియం మొత్తంగా చెల్లించాల్సి ఉంటుంది.

◆ ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)కు ప్రభుత్వం 436 లీజులను నామినేషన్ విధానంలో కేటాయించింది. అలాగే జాతీయ రహదారులు, రైల్వే వంటి ప్రభుత్వ పనులకు అవసరమైన రోడ్ మెటల్, గ్రావెల్ కోసం ఆయా గుత్తేదారు సంస్థలకు క్వారీలను నామినేషన్ విధానంలో కేటాయిస్తున్నారు. వీరి నుంచి ఏయే ఫీజులు వసూలు చేయాలో స్పష్టత ఇచ్చేందుకు ఈ ఆదేశాలిచ్చారు.

ఏసీబీ కోర్టు ఉత్తర్వుల కోసం దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు విచారణ

కౌంటర్ వేసేందుకు సమయం కోరిన సీఐడీ

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తెదేపా అధినేత చంద్రబాబు, తదితరులపై నమోదు చేసిన ఫైబర్‌నెట్, మద్యం విధానం కేసుల మూసివేతకు సంబంధించిన రికార్డులను ఇచ్చేలా విజయవాడ ఏసీబీ కోర్టును ఆదేశించాలని కోరుతూ రైల్వే మాజీ ఉద్యోగి కొండలరావు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది. కౌంటర్ వేసేందుకు సీఐడీ తరఫు న్యాయవాది ఉన్నం అఖిల్ చౌదరి సమయం కోరడంతో విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. ఫైబర్‌నెట్, మద్యం పాలసీ కేసుల విచారణను మూసివేస్తూ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, అందుకు సంబంధించిన రికార్డులను మూడోపక్షానికి(థర్డ్‌పార్టీ) ఇవ్వడానికి వీల్లేదనే కారణాన్ని చూపుతూ తనకు నిరాకరించిందని పేర్కొంటూ కొండలరావు ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. గతంలో ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తి.. ఈ కేసులకు మీరు మూడోపక్షమని, ఏసీబీ కోర్టు ఉత్తర్వులతో మీరు పొందే ప్రయోజనం ఏమిటని పిటిషనర్‌ను ప్రశ్నించారు. తాజాగా మరోసారి ధర్మాసనం ముందుకు రాగా విచారణ వాయిదా పడింది.

మేదర, ముదిరాజ్, జంగమల సమస్యలు పరిష్కరించాలి

20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్‌కు సంఘాల వినతి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని మేదర, ముదిరాజ్, జంగమలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని ప్రకాశం జిల్లా మేదర సంఘం, ముదిరాజ్ యువసేన సంఘం, ఒంగోలు నగర జంగమ సేవా సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు 20 సూత్రాల కార్యక్రమం అమలు ఛైర్మన్ లంకా దినకర్‌ను రాష్ట్ర సచివాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రాలు అందించారు. రాష్ట్రంలోని మేదర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. డీ నోటిఫైడ్ గిరిజనులకు డీఎన్టీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని విన్నవించారు. ముదిరాజు ముతరాసిలను బీసీ-డీ నుంచి ఏ లోకి మార్చాలని, జంగమ సామాజికవర్గాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు. సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని లంకా దినకర్ హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో ఆయా సంఘాల ప్రతినిధులు హనుమాన్ ప్రసాద్, చలపతిరావు, పిల్లి శ్రీనివాసరావు, గోగు శివుడు, నాగరాజు, శంకరరావు, కేతా శేఖర్‌బాబు తదితరులు ఉన్నారు.

క్వాంటమ్ ఆన్‌లైన్ కోర్సుకు 1.04 లక్షల మంది నమోదు

ఈనాడు, అమరావతి: క్వాంటమ్ ఆన్‌లైన్ కోర్సుకు 1.04 లక్షల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ఏపీ మరో రికార్డు సృష్టించింది. ఎస్సీఈఆర్‌టీ ద్వారా క్వాంటమ్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. క్వాంటమ్ కోర్సును అందించి, భవిష్యత్తు నిపుణులను తయారు చేసేందుకు ఉన్నత విద్యామండలి తీసుకుంటున్న చర్యలతో రికార్డు లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలలను సమన్వయం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. విశ్వవిద్యాలయాల స్థాయిలో క్వాంటమ్ కోర్సు ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఎక్కువ మంది విద్యార్థులు ఈ కోర్సు నేర్చుకునేందుకు చర్యలు తీసుకుంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్‌లాంటి రంగాలు రాబోయే కాలంలో ప్రపంచాన్ని ప్రభావితం చేయనున్నాయని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి తెలిపారు.

మద్యం దుకాణదారులూ ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దు: పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'అధిక ధరలకు మద్యం విక్రయించడం నిబంధనలకు విరుద్ధం. అది ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు తెస్తుంది. మద్యం విక్రయాల వ్యవహారంలో దుకాణదారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలి' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో 'ఎక్స్' వేదికగా మంగళవారం ఆయన స్పందించారు. ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలపై నిరంతరం నిఘా ఏర్పాటుచేసి అధిక ధరలకు అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలని పవన్‌కల్యాణ్ సూచించారు.

'జనసేన' నుంచి బయటకొచ్చిన బొలిశెట్టి

విశాఖపట్నం(సీతంపేట), న్యూస్‌టుడే: జనసేన పార్టీ కార్యదర్శి, జల్ బిరదరి జాతీయ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ జనసేన పార్టీ బాధ్యతల నుంచి తాత్కాలికంగా తప్పుకొంటున్నట్టు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర కాలుష్య సమస్యలపై గతంలో ఆయన హైకోర్టులో దాఖలుచేసిన పిల్‌కు సంబంధించి.. రాష్ట్ర పర్యావరణ శాఖను ప్రతివాదిగా చేర్చారు. ఆ శాఖకు జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ మంత్రిగా ఉండడంతో, పిటిషనర్‌గా కొనసాగితే నైతిక ఇబ్బందులు ఎదురవుతాయని... అందువల్ల పార్టీ నుంచి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు ఆయన తెలిపారు. తుది తీర్పు వచ్చేవరకు పార్టీ బాధ్యతలకు దూరంగా ఉన్నా, జనసేన సిద్ధాంతాలకు, పవన్‌కల్యాణ్ ఆశయాలకు కట్టుబడి ఉంటానని సత్యనారాయణ స్పష్టం చేశారు.

ఆప్కో జీఎం ఎం.నాగేశ్వరరావు సస్పెన్షన్

ఈనాడు, అమరావతి: ఆప్కో జీఎం, చేనేత జౌళి శాఖ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన తనిఖీలో మంగళగిరి, గుంటూరు, విజయవాడ పరిధిలోని ఆప్కో షోరూంలలో రూ.21 కోట్ల విలువైన నిల్వలు తగ్గినట్లు బయటపడింది. దీంతోపాటు పలు నిర్వహణ లోపాలు కూడా ఉన్నట్లు తేలింది. దీంతో విధుల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని గుర్తించి సస్పెండ్ చేశారు. దీనిపై తదుపరి విచారణ చేపట్టనున్నారు.

26 వరకు తెదేపా ప్రజావేదిక షెడ్యూల్ ఇదీ..

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో రోజూ నిర్వహించే ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4 (బుధవారం) నుంచి 26 వరకు షెడ్యూల్‌ని ఆ పార్టీ మంగళవారం ప్రకటించింది. 6, 8, 15, 22 తేదీల్లో పలు కారణాలతో సెలవు ఉంటుందని వెల్లడించింది. మిగిలిన రోజుల్లో ప్రజా వేదికలో పాల్గొనే మంత్రులు, నేతల వివరాలు ఇలా..

◆ 4వ తేదీ: రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర విద్య, సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఎస్.రాజశేఖర్

◆ 5: రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఏలూరు పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సీహెచ్ మధుబాబు

◆ 7: గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు

◆ 9: ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ ఎన్.విజయ్‌కుమార్

◆ 10: పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం

◆ 11: పార్టీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కావలి ప్రతిభా భారతి, రాష్ట్ర కల్చర్ కమిషన్ ఛైర్మన్ పి.తేజస్వీ

◆ 12: గుంటూరు మేయర్ కోవెలముడి నాని, రాష్ట్ర నూర్బాషా దూదేకుల ఛైర్మన్ నాగుల మీనా కాసుసూరి

◆ 14: రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఆర్వీ సుజయ్ కృష్ణ రంగారావు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి

◆ 16: రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఛైర్మన్ మంతెన రామరాజు, బెస్త సంక్షేమ సంస్థ ఛైర్మన్ శ్రీధర్ బొమ్మన

◆ 17: విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ కిమిడి నాగార్జున, రాష్ట్ర జంగం సంక్షేమ సంస్థ ఛైర్మన్ వి.చంద్రశేఖర్

◆ 18: రాష్ట్ర మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, రాష్ట్ర పూసల సహకార ఆర్థిక సంస్థ ఛైర్మన్ గంటా తిరుమల

◆ 19: కేంద్ర మాజీ మంత్రి, తెదేపా నేత పనబాక లక్ష్మి, రాష్ట్ర కూరాకుల, పొందర కార్పొరేషన్ ఛైర్మన్ దామోదర నర్సింహులు

◆ 21: ఏపీ సీవోబీ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు

◆ 23: తెదేపా ప్రధాన కార్యదర్శి కంభంపాటి రామ్మోహనరావు, డీసీసీబీ ఛైర్మన్ శివల సూర్యనారాయణ

◆ 24: రాజమహేంద్రవరం పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, రాష్ట్ర మైనార్టీ ఆర్థిక సహకార సంస్థ ఛైర్మన్ ముస్తాక్ అహ్మద్

◆ 25: రాష్ట్ర స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, కర్నూలు పట్టణాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

◆ 26: రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ జి.నర్సింహ యాదవ్, డీసీఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాశ్

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2 లక్షలు వసూలు చేశాడు

- తెదేపా కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయంలో పని చేస్తున్నానని, ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఆత్మకూరుకు చెందిన వెంకటేశ్వర్లు తన దగ్గర రూ.2 లక్షలు వసూలు చేసి మోసం చేశాడని నంద్యాల జిల్లా వేంపెంటకు చెందిన రామకృష్ణారెడ్డి వాపోయారు. డబ్బులు తిరిగి అడుగుతుంటే చంపుతానని బెదిరిస్తున్నాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో రామకృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, శాప్ ఛైర్మన్ రవినాయుడు మంగళవారం వినతులు స్వీకరించారు. తనకు చెందిన 93 సెంట్ల పొలం ఆన్‌లైన్ రికార్డుల్లో చూపించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, ఆన్‌లైన్‌లో ఎక్కించడానికి తహసీల్దార్ రూ.లక్ష డిమాండ్ చేశారని ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం రాచవారిపాలేనికి చెందిన బ్రహ్మయ్య వినతిపత్రం ఇచ్చారు. తన కుమారుడి హత్య కేసులో నిందితులను విచారించకుండా కుమ్మక్కైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడుకోటకి చెందిన ఎస్‌కే ఇమాం బీ ఫిర్యాదు చేశారు. లేఅవుట్‌లో ప్లాట్లు విక్రయిస్తానని రూ.50 లక్షలు వసూలు చేసి, రిజిస్ట్రేషన్ చేయకుండా వేధిస్తున్న వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని మచిలీపట్నంకు చెందిన నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు.

రూ.2,300 కోట్ల రుణం సమీకరణ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం రూ.2,300 కోట్ల రుణం సమీకరించింది. రిజర్వు బ్యాంకు నిర్వహించిన సెక్యూరిటీల వేలంలో పాల్గొని రూ.1,200 కోట్ల అప్పు 7.68% వడ్డీకి 13 ఏళ్లలో తిరిగి చెల్లించేలా తీసుకుంది. మరో రూ.1,100 కోట్ల మొత్తం 7.71% వడ్డీకి 15 ఏళ్లలో తిరిగి చెల్లించేలా సమీకరించింది. ఈ రుణం బుధవారం రాష్ట్ర ఖజానాకు చేరనుంది.

ప్రైవేట్ ఆసుపత్రుల ఎంప్యానల్‌కు కమిటీ

ఈనాడు, అమరావతి: ఈఎస్ఐ లబ్ధిదారులకు ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రైవేట్ ఆసుపత్రుల ఎంప్యానల్ కోసం ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఈఎస్ఐ డైరెక్టర్‌ను ఛైర్మన్‌గా, మరో ఆరుగురిని సభ్యులుగా నియమించింది. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

మోహన్‌బాబు విశ్వవిద్యాలయాన్ని బ్లాక్ లిస్టులో పెట్టాలి

- వామపక్షాలు డిమాండ్

ఈనాడు, అమరావతి: మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరుతూ శాంతియుత ఆందోళన చేపట్టిన విద్యార్థి సంఘ నేతలను వర్సిటీ బౌన్సర్లు కొట్టి, కిడ్నాప్ చేయడాన్ని సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రంగా ఖండించారు. విశ్వవిద్యాలయాన్ని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. "తిరుపతి జిల్లాలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయం విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేసినట్లు ఉన్నత విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ నిర్ధారించింది. వాటిని వెనక్కి చెల్లించాలని ఆదేశించింది. అయినప్పటికీ ఫీజుల దోపిడీ ఆగలేదు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐలాంటి పలు విద్యార్థి సంఘాలు తిరుపతి కలెక్టరేట్ వద్ద శాంతియుత ఆందోళనకు పిలుపునిచ్చాయి. దీంతో వర్సిటీ బౌన్సర్లు, గూండాలు 40 మంది ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, జిల్లా నాయకుడు వినోద్‌లను కొట్టి, కారులో బలవంతంగా ఎక్కించుకొని వెళ్లిపోయారు" అని తెలిపారు.

నేడు దిష్టిబొమ్మల దహనం: ఎస్ఎఫ్ఐ

ఎస్ఎఫ్ఐ నాయకులను బెదిరించడం, కిడ్నాప్ చేయడం ఆటవిక చర్య అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ్మోహన్, ప్రసన్నకుమార్ విమర్శించారు. యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో విద్యార్థుల ఇబ్బందులపై హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి లోకేశ్‌కు లేఖలు రాసినట్లు తెలిపారు. విద్యా సంస్థ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా మోహన్‌బాబు దిష్టిబొమ్మలను దహనం చేయాలని పిలుపునిచ్చారు. డే స్కాలర్ల నుంచి మెస్ ఫీజు రూపంలో రూ.17 వేల నుంచి రూ.20 వేలు అక్రమంగా వసూలు చేస్తున్నారని, చెల్లించని విద్యార్థులను గైర్హాజరైనట్లు రాస్తున్నారని తెలిపారు. సీఎస్ఈ విభాగంలో ఇప్పటికే 60 మంది విద్యార్థులు హాజరు సస్పెన్షన్‌కు గురయ్యారని, ప్లేస్‌మెంట్ ట్రైనింగ్ ఫీజుల కింద ఒక్కొక్కరి నుంచి రూ.40 వేలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

చర్యలు తీసుకోవాలి: డీవైఎఫ్ఐ

విద్యార్థి నాయకులను కిడ్నాప్ చేసిన మోహన్‌బాబు వర్సిటీపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాము, జి.రామన్న డిమాండ్ చేశారు. "అక్రమాలకు నిలయంగా మారిన మోహన్‌బాబు విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయాలి. ఫీజులు కట్టలేని విద్యార్థులను వేధించడం అన్యాయం" అని అన్నారు.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

ప్రతీకార సుంకాలను ఉపసంహరించేంత వరకూ అమెరికాపై ఒత్తిడి తేవాలి

రాజ్యసభలో తెదేపా ఎంపీ బీద మస్తాన్‌రావు డిమాండ్

ఈనాడు, దిల్లీ: రష్యా చమురు కొనుగోలుకు ప్రతీకారంగా అమెరికా భారతీయ వస్తువులపై విధించిన ప్రతీకార సుంకాలను పూర్తిగా, అధికారికంగా ఉపసంహరించుకొనేంతవరకూ కేంద్ర ప్రభుత్వం తన ఒత్తిడిని కొనసాగించాలని తెదేపా ఎంపీ బీద మస్తాన్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన రాజ్యసభ జీరో అవర్‌లో ఈ అంశంపై మాట్లాడారు. "ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఎన్డీయే ప్రభుత్వం అమెరికాతో సానుకూల ధోరణిలో దౌత్యపరమైన సంబంధాలు జరిపి మంచి ఫలితాలు రాబట్టింది. ఫిబ్రవరి 2న చేసిన ప్రకటన ప్రకారం రెసిప్రోకల్ టారిఫ్‌లు 25% నుంచి 18%కి తగ్గనున్నాయి. ఇది భారతీయ ఎగుమతిదారులకు ఎంతో ఉపశమనం కల్పించడంతోపాటు, ప్రపంచస్థాయి వాణిజ్య చర్చల్లో పెరుగుతున్న భారత్ బలానికి అద్దంపట్టింది. ఇది రూపాయి బలపడటానికి దోహదం చేయడంతోపాటు, నాయకత్వంపై నమ్మకాన్ని నిలబెట్టింది. అయితే ఇప్పటివరకూ వచ్చినవన్నీ పత్రికా ప్రకటనలే తప్పితే ఇంకా అమెరికా చట్టాల ప్రకారం అధికారిక ప్రకటనలు వెలువడాల్సి ఉంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన రెసిప్రోకల్ టారిఫ్ తగ్గింపు గురించి ప్రస్తావిస్తోందే తప్పితే అదనంగా విధించిన 25% ప్రతీకార టారిఫ్‌ల గురించి చెప్పడంలేదు. అందువల్ల ఈ రెండింటిపై స్పష్టమైన ప్రకటన వెలువరించేంతవరకూ ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న అనిశ్చితి కొనసాగే పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం అమెరికా ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకొచ్చి ప్రతీకార సుంకాలను ఉపసంహరించుకుంటున్నట్లు అధికారిక ప్రకటన వెలువడేలా చూడాలి. దానివల్ల భారత్‌నుంచి ఎగుమతులు వేగం పుంజుకొని ఇక్కడి ఉద్యోగాలకు రక్షణ ఏర్పడుతుంది" అని మస్తాన్‌రావు పేర్కొన్నారు.

12 ఏళ్లలో రూ.11,53,997 కోట్ల రుణాల రద్దు

ఈనాడు, దిల్లీ: దేశంలోని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు గత 12 ఏళ్లలో వివిధ రంగాలకు చెందిన రూ.11,53,997 కోట్ల రుణాలను రద్దు చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. మంగళవారం ఆయన రాజ్యసభలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం చెప్పారు. ఇందులో భారీ పరిశ్రమలకు చెందిన రుణాలు రూ.7,21,424 కోట్లు, భారీ సేవల రంగానికి సంబంధించిన రుణాలు రూ.2,65,390 కోట్లు, వ్యవసాయం, అనుబంధ రంగాలకు చెందిన రుణాలు రూ.1,67,183 కోట్లు ఉన్నట్లు వివరించారు. రద్దుచేసిన మొత్తం రుణాల్లో పారిశ్రామిక రంగానివి 62.51%, సేవల రంగానివి 22.99%, వ్యవసాయ, అనుబంధ రంగాలవి 14.48%మేర ఉన్నట్లు వెల్లడించారు.

ఏపీలో అప్పుల్లో 93.2% వ్యవసాయ కుటుంబాలు

తాజా పరిస్థితుల మదింపు సర్వే (లేటెస్ట్ సిచ్యుయేషన్ అసెస్‌మెంట్ సర్వే) ప్రకారం 2018-2019 వ్యవసాయ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో 93.2% కుటుంబాలు అప్పుల్లో ఉన్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి రామ్‌నాథ్ ఠాకుర్ తెలిపారు. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. 2018-19 లెక్కల ప్రకారం రాష్ట్రంలోని ప్రతి వ్యవసాయ కుటుంబ నెలవారీ ఆదాయం రూ.10,480 మేర ఉండగా, అప్పు రూ.2,54,554 ఉన్నట్లు వివరించారు. దేశంలో అప్పుల్లో అత్యధికంగా ఉన్న వ్యవసాయ కుటుంబాల్లో ఏపీ తొలిస్థానంలో ఉంది.

రాష్ట్రంలో రూ.3,041 కోట్ల వ్యవసాయ బీమా క్లెయిమ్‌ల పెండింగ్

ఆంధ్రప్రదేశ్‌లో 2020-21 నుంచి 2024-25 మధ్యకాలంలో పీఎం ఫసల్ బీమా, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్‌ల కింద రూ.3,041.66 కోట్ల విలువైన వ్యవసాయ బీమా క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకుర్ తెలిపారు. ఇందులో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రూ.2,797.55 కోట్ల విలువైన క్లెయిమ్‌లు రాగా రూ.613.52 కోట్లు చెల్లించామని, ఇంకా రూ.2,184.03 కోట్ల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రబీ సీజన్‌కు సంబంధించి రూ.996.06 కోట్ల క్లెయిమ్‌లకుగాను రూ.138.42 కోట్లు చెల్లించామని, ఇంకా రూ.857.64 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

పీఎంజేఏవై కింద ఏపీలో 61 లక్షల కుటుంబాలు

ఆయుష్మాన్ భారత్ పీఎంజేఏవై కింద ఆంధ్రప్రదేశ్‌లో 61,47,562 కుటుంబాలు ఉన్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ సహాయమంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రానికి 2018 సెప్టెంబరు నుంచి 2025 మార్చి నాటికి రూ.2,303 కోట్ల గ్రాంట్ విడుదల చేసినట్లు వివరించారు.

సాస్కీ కింద ఏపీకి రూ.6,372 కోట్ల విడుదల

రాష్ట్రాలకు మూలధన వ్యయం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అందిస్తున్న సాయం (సాస్కీ) కింద ఆంధ్రప్రదేశ్‌కు 2025-26 ఆర్థిక సంవత్సరంలో జనవరి 27 వరకూ రూ.6,372.40 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ (రూ.12,466 కోట్లు), మధ్యప్రదేశ్ (రూ.11,547 కోట్లు), రాజస్థాన్ (రూ.7,006 కోట్లు), అస్సాం (రూ.6,816 కోట్లు) తర్వాత ఈ పథకం కింద అత్యధిక నిధులు ఏపీకి అందించినట్లు కేంద్ర మంత్రి చెప్పారు.

పీఎం మత్స్యసంపద యోజన కింద ఏపీలో రూ.2,416 కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం

ప్రధానమంత్రి (పీఎం) మత్స్యసంపద యోజన కింద ఆంధ్రప్రదేశ్‌లో రూ.2,416.92 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదం తెలిపినట్లు కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.569.86 కోట్లకుగాను ఇప్పటివరకు రూ.482.55 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. నెల్లూరు, శ్రీకాకుళం, అనకాపల్లి, బాపట్ల జిల్లాల్లో ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం పూర్తయినట్లు తెలిపారు. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, తిరుపతి, కాకినాడ జిల్లాల్లో ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణం ప్రస్తుతం టెండర్ల స్థాయిలో ఉన్నట్లు వెల్లడించారు. బాపట్ల జిల్లాలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. నెల్లూరు తెదేపా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. నెల్లూరు జిల్లా జువ్వలదిన్నెలో రూ.288.80 కోట్లతో చేపట్టిన ఫిషింగ్ హార్బర్ పనులు పూర్తయినట్లు రాజ్యసభలో తెదేపా సభ్యుడు బీదమస్తాన్ రావు అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్ సమాధానం ఇచ్చారు.

అమరావతి భూసమీకరణపై కేంద్రం ఎలాంటి సమీక్షా చేయలేదు

అమరావతి భూసమీకరణ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతోందని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. ఆ భూసమీకరణ ఫలితాలు, రైతుల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి మదింపు కానీ, సమీక్ష కానీ చేయలేదని వెల్లడించారు. వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానం ఇచ్చారు.

పది, ఇంటర్ పరీక్షల్లో వసతి గృహాల్లోని ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలి

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా

ఈనాడు, అమరావతి: రాబోయే 10, ఇంటర్ పరీక్షల్లో వసతి గృహాల్లోని ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అధికారులకు స్పష్టంచేశారు. దానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఆయన సచివాలయం నుంచి జిల్లా అధికారులతో జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. "విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి వారికి ట్యూటర్ల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. విద్యార్థులు అందరికీ కెరీర్ గైడెన్స్ అందించాలి. ఎంసెట్, ఐఐటీ నీట్‌కు దరఖాస్తు చేయించాలి. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు వేసవి సెలవుల్లోనూ ప్రతి జిల్లాలో ఒక చోట వసతి, భోజన సౌకర్యం కల్పించాలి. విద్యార్థుల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టిసారించాలి. మెనూ అమలు తీరు, వార్డెన్ల పనితీరు, పారిశుద్ధ్య నిర్వహణపై విద్యార్థుల నుంచి ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా అభిప్రాయం సేకరిస్తున్నాం. ఇందులో సంతృప్తి ఉండేలా పనితీరు ఉండాలి" అని వివరించారు.